ప్రజాస్వామ్య ప్రస్థానం

అనిసెట్టి శాయికుమార్

స్వేచ్ఛాలోచన ప్రచురణ
హైదరాబాద్

ప్రజాస్వామ్య ప్రస్థానం

రచయిత: అనిసెట్టి శాయికుమార్

ముఖచిత్రం: *శ్రీలంక జాఫ్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నెలకొల్పిన ప్రజాస్వామ్యం, చట్ట సమానత్వం కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన మృతవీరుల స్మారక చిహ్నం*

ఫోటో: *ఎం.వి. ప్రసాద్, డా॥ కె. జయకుమార్*

స్వేచ్ఛాలోచన ప్రచురణ

మొదటి ముద్రణ : అక్టోబర్ 2024

ప్రతుల సంఖ్య: 500

ధర : రూ. 150/-

ప్రతులు లభ్యమయ్యే చోట్లు

1. నవోదయ బుక్ హౌస్, కాచిగూడ
2. అనిసెట్టి శాయికుమార్, వనస్థలిపురం, హైదరాబాద్. సెల్ నం. 9440770531
3. స్వేచ్ఛాలోచన ప్రచురణలు-5-229, జె.పి.ఎన్.నగర్, మియాపూర్, హైదరాబాద్-49. సెల్: 8247848044

ముద్రణ

శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్, గాంధీనగర్, హైదరాబాద్-80.
ఫోన్: 98663 81116

అంకితం

ఈ దేశంలో

ప్రజాస్వామిక భావనలకై

మానవవాద బాటలో నడిచి

అమరులైన

చరిత్రకందని మేధావులందరికీ...

- రచయిత

లోపలి పేజీల్లో...



- డా. కోనూరి జయకుమార్
ఎం.బి.బి.ఎస్., డి.ఎఫ్.ఎం., ఎఫ్.సి.జి.పి
ఇంటెల్ పబ్లిక్ స్కూల్. పేరేచర్ల. గుంటూరు
సెల్: 89784 89978

ముందు మాట

వ్యక్తికీ సమాజానికీ మధ్య ఐక్యత, ఘర్షణల నుంచి పుట్టిన ఒక వ్యవస్థ 'ప్రజాస్వామ్యం' అనే భావన. వ్యక్తిలోని 'నేను' అనే భావన స్వేచ్ఛను కోరుకొంటుంది. సమాజం ఎప్పుడూ ఆ 'నేను' అనే వ్యక్తిగత స్వాతంత్ర్యంపై నియంత్రణ కోరుకుంటుంది.

సోక్రటీస్,ప్లేటో, అరిస్టాటిల్, కాంట్ వంటి తత్త్వవేత్తలు ప్రజాస్వామ్యాన్ని కూడదన్నారంటేనే చరిత్రకెక్కని ప్రజాస్వామిక ఆలోచనలు క్రీస్తుపూర్వ సహస్రాబ్దులలో ఉండబట్టే! లేకుంటే వాళ్ళకు ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించాల్సిన అవసరమేముంది?

ఆదర్శవంతంగాఉండిన ప్రజాస్వామ్య భావన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంతో ఐరోపా ఖండంలో వేళ్లూనుకుని, ఆచరణపరంగా రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ప్రధాన స్రవంతికి వచ్చింది. ఫ్రెంచ్ విప్లవం దానికి భూమిక అయింది. అన్ని సహజ ప్రక్రియలలాగే ప్రజాస్వామ్య భావన, ఆచరణ, అష్టవంకర్లు తిరిగి ప్రస్తుతానికీ అష్టావక్రంగానే మిగిలింది.

లక్షల సంవత్సరాల మానవేతిహాసంలో ప్రజాస్వామ్య ప్రక్రియకు కొన్ని వందల సంవత్సరాల వయసే ఉంది. ఐనా, దాని పూర్వదశ కంటే లక్షల రెట్లు సంక్లిష్టత కూడా ఉంది.

మనకు ప్రజాస్వామ్యం పనికిరాదు. సైనిక పాలన కావాలనే మూర్ఖ మధ్యతరగతి పెరుగుతున్న వర్తమానంలో, ఔను, నిజమౌతోన్న మోడీ మాయాజాలపు వర్తమానంలో చెంప ఛెళ్లుమనిపిస్తూ, ప్రజాస్వామ్య చరిత్ర, వర్తమానం, భవిష్యత్తులోకి తాత్వికంగా, చారిత్రికంగా, రాజకీయంగా, శాస్త్రీయంగా విశ్లేషణ చేసిన అనిసెట్టి

శాయికుమార్ విశ్లేషణ భవిష్యత్ తరాలకు ఒక వెలుగు దివ్వె.

పిల్లవేరు నుండీ, తల్లివేరు, కాండం, కొమ్మ, పువ్వు, పండుకు దారి వేసినట్లు, శాయికుమార్, ప్రజాస్వామ్య తాత్విక పునాదులనుంచీ, భారత ప్రజాస్వామ్యం నుంచీ, నేటి తెలుగు రాష్ట్రాల పోకడల వరకూ ఆవిష్కరించారు.

కాదు! హెచ్చరించారు. మృదువైన శైలిలో కఠిన వాస్తవాల చరిత్ర చీకటిలోకి అనవసరంగా పోయి, దాన్ని పిడివాదంగా మార్చకుండా, భవిష్యత్ తరాలకు సున్నితమైన, లోతైన సందేశం ఇచ్చారు.

రాసే బాధ్యత సామాజికవేత్తగా శాయికుమార్ గారికి ఉంది. అందిపుచ్చుకుని బాగుపడే హక్కు లేదా పెడచెవిన పెట్టి నాశనమయ్యే హక్కు సమాజానిది.

పదండి ముందుకు!

నా మాట

చట్ట సమానత్వం విలసిల్లే, మానవ గౌరవాన్ని పెంచే, వివక్ష, దోపిడీ లేని ప్రజాస్వామిక వ్యవస్థకై కలలుగనే స్వాప్నికునిగా, తెలుగునాట సామాజిక మార్పుకై జరిగిన అనేక ఉద్యమ పోరాటాల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఏదో ఒకరీతిలో పాల్గొన్నవాడిగా, నా పురోగామి ఆలోచనలను సామ్యవాద ప్రియులైన మిత్రులతో పంచుకోవడం కోసం నేనీ ప్రయత్నం మొదలుపెట్టాను. అంతేకాకుండా, రాజకీయ, సామాజిక, భాషాశాస్త్రాల నిరంతర విద్యార్థిగా నేను గమనించిన మరో ముఖ్య విషయం, భాషకు, ప్రజాస్వామ్యానికి, మతానికీ ప్రజాస్వామ్యానికీ, న్యాయవ్యవస్థకు ప్రజాస్వామ్యానికి, సాయుధ విప్లవాలకు, ప్రజాస్వామ్యానికీ మానవవాదానికీ ఉన్న సంబంధాల్ని గురించిన సమగ్రమైన వివరణలు వర్తమానంలో, నాపరిధిలో ఎక్కడా కనబడలేదు. వీటిల్ని గురించి కూడా నాకు తెలిసి, తోచినంత వరకు పౌరసమాజం ముందు ఈ విషయాంశాల్ని ఉంచాలనేది మరొక ఆశయం.

వ్యక్తిగానీ, సమాజంగానీ, గతాన్ని విశ్లేషించుకొని, గతం వల్ల ఏర్పడి ఉన్న వర్తమానాన్ని పరిశీలించుకుని మెరుగైన భవిష్యత్తు రూపురేఖలు నిర్దేశించుకోవాలి. అందుకే రచనా విధానంలో ఈ పద్ధతి అవలంభించాను. అట్లానే, రాజ్యాంగపరిధిలో పాలనలో, విధానాలలో, వ్యవస్థాగత సంస్కరణలకు సంబంధించి మార్పు చేయాల్సిన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అంశాల్ని గురించిన ఆలోచనలను కూడా ఈ పుస్తకంలో పొందుపరిచాను. ఈ అంశాలపై నా ఆలోచనల బాగోగులను గురించి విశ్లేషించి ప్రజాస్వామ్య భావనలను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు చదివినవారు తమ అభిప్రాయాలు, సలహాలు పంచుకోవాలని కోరుతున్నాను.

ఇక, ఈ రచనను మెచ్చుకొని ప్రోత్సహించిన 'మానవ వికాస వేదిక' కేంద్ర కమిటీ అధ్యక్షుడు బి. సాంబశివరావు, పదమూడు నెలలపాటు స్వేచ్ఛాలోచన మాసపత్రికలో, కష్టమైనా, ఎక్కువ పేజీలు కేటాయించడమే కాకుండా, సరయిన చక్కటి ఉపశీర్షికలుంచి, పుస్తకం సాఫ్ట్‌కాపీ రూపొందించి దోహదం చేసిన స్వేచ్ఛాలోచన సహసంపాదకుడు డి.హనుమంత రావుకూ ధన్యవాదాలు. అడిగిన వెంటనే పుస్తకం పేరును కోరిన విధంగా అందంగా రాసిచ్చిన ప్రసిద్ధ (వరప్రసాద్) కార్టూనిష్టు,

పుస్తక ముఖచిత్రాన్ని రూపొందించిన అనిసెట్టి శ్రీనివాస్‌కు, వ్యాసాలు రాసే సమయంలో వివిధ అంశాల్ని గురించి నాతో చర్చిస్తూ, తన అభిప్రాయాలు పంచుకున్న మిత్రుడు డా॥ జయకుమార్‌కు, అందంగా ముద్రించిన దత్తసాయి గ్రాఫిక్స్ వీరయ్య, ప్రసాద్‌గార్లకు నా ధన్యవాదాలు.

– అనిసెట్టి శాయికుమార్,

వనస్థలిపురం. హైదరాబాద్


1.

ప్రజాస్వామ్య భావన - ఆవిర్భావం

మానవజాతి నిరవధికంగా భిన్న రూపాలలో, విభిన్న పద్ధతుల్లో స్వేచ్ఛ, దోపిడీ లేని సమానత, స్వతంత్రతల కోసం జరిపే చరిత్రే ప్రజాస్వామ్య పోరాట చరిత్ర.

చారిత్రిక నేపథ్యం

భూమిపై జీవావిర్భావం జరిగి 50 కోట్ల సంవత్సరాలయింది. జీవం అనేక మార్పులకు లోనవుతూ, భిన్న పదార్థ వ్యక్తీకరణల రూపం నుంచీ, నేటి మనిషికి ప్రాథమిక రూపంగా ఉన్న మానవరూపం దాల్చడానికి అనంత సమయం కావలసి వచ్చింది. మానవ జాతికంటే ముందు, డైనోసారస్ వంటి ఎన్నోజీవులు భూమిపై ఆధిపత్యం నెరిపేయి. ఈ అనంత కాలగమనంలో భూమిపై ఎన్నో పెను ఉపద్రవాలు సంభవించాయి, సముద్రాలు పొంగాయి. భూమి ముక్కలుగా విడిపోయి దూరంగా జరిగి భూఖండాల కొత్త రూపాలు ఏర్పడ్డాయి. భూకంపాలవంటి ఉత్పాతాల్లో లక్షలాది ప్రాణులు, వృక్షాలు భూమి పొరలకింద సమాధి అయ్యాయి. కోట్ల సంవత్సరాల జీవపరిణామ చరిత్రలో మానవునికి దగ్గరగా వున్న రూపం ఏర్పడి కేవలం ఇరవై లక్షల సంవత్సరాలు మాత్రమే గడిచాయి. అప్పటికీ మనిషి జంతుజాలంలో ఒక భాగంగానే ఉన్నాడు.



పరిణామ క్రమంలో మానవరూపానికి బొటనవేలు ఏర్పడడం మనిషి చరిత్రలో విప్లవాత్మక మార్పుకు దారితీసింది. బొటనవేలు ఏర్పడడం వల్ల పనిముట్లు, ఆయుధాలు తయారు చేసుకునే నైపుణ్యం పెరగడంతో మనుషులు క్రమంగా మిగతా జీవజాలంపై ఆధిపత్యం నెరిపి, ఆధిక్యత సంపాదించారు. ఇంతటి అనంత కాలగమనంలో మనుషులు గుహలలోంచి బయటపడి, ఇల్లు కట్టుకోవడం, పరస్పర సమాచార వినిమయం కోసం మాట్లాడడం, వ్యవసాయం చేయడం వంటి కార్య కలాపాలతో, తండాలు, జనపదాలుగా నివసించే నాగరికత పెంపొందించుకొని కేవలం సుమారుగా పదివేల సంవత్సరాలు మాత్రమే గడిచింది.

మాతృస్వామ్యం

మనుషులు గుంపులుగా తిరుగుతూ వేట ప్రధాన జీవనంగా ఉన్న రోజుల్లో ఆ సమూహానికి మహిళ నాయకత్వం వహించింది. తల్లి ద్వారా మాత్రమే ఆ తెగ లేదా గుంపులోని సభ్యులకు గుర్తింపు వుండేది. అయితే, కాలక్రమేణా వ్యవసాయం పెరగడం, ఉత్పత్తిలో శారీరక బలం అవసరం ఎక్కువ కావడంతో, పురుషాధిక్యత పెరిగింది. ఉత్పత్తికి, వినిమయానికీ ఉన్న సాముదాయిక స్వభావం పోయి, వ్యక్తిగత ఆస్తి రూపం సంతరించుకుంది. వ్యక్తిగత ఆస్తి నెలకొన్న స్థితి స్త్రీలను దాస్యంలోకి నెట్టింది. ఆస్తి సంపాదించిన మగవారు ఆ ఆస్తి తన జన్యువుల కలయిక ద్వారా పుట్టిన సంతానానికే చెందాలని కోరుకొనే స్థితివల్ల మహిళల గర్భానికి పవిత్రతను ఆపాదించడం మొదలయింది. దాంతో, స్త్రీలపై ఆంక్షలు, పురుషాధిక్యత, మానవ సమాజంలో స్థిరపడ్డాయి. ఈ అసమానతలు స్త్రీపురుషుల మధ్యనే కాకుండా, వివిధ మానవ సమూహాల మధ్య కూడా ఏర్పడ్డాయి.

వివిధ జాతులుగా, వర్ణాలుగా, వర్గాలుగా విభజితమై, వర్గాలమధ్య నిరంతరం యుద్ధాలు, పోరాటాలు చోటు చేసు కున్నాయి. వీటి ఫలితంగా సమాజంలో 'బానిసలు' అనే కొత్త వర్గం ఏర్పడింది. ఓడిన జాతుల్ని బానిసలుగా మార్చుకున్నారు.

'బలవంతులు దుర్బల జాతిని బానిసలను కావించారు
నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి'


అన్న శ్రీశ్రీ వాక్యాలు అప్పటి పరిస్థితిని చక్కగా వివరిస్తాయి. బానిసల వ్యాపారం

విస్తృతంగా ఉండేది. పారిశ్రామిక విప్లవానికి ముందు దశలో, పెద్దపెద్ద వ్యవసాయ కమతాలకు అవసరమైన శ్రమను భూస్వాములు బానిసల నుంచీ పొందేవారు. అందుకై బానిసల కొనుగోలు, అమ్మకాలు కూడ విస్తృతంగా జరిగేవి. బానిసత్వం నుంచీ విముక్తికోసం, సమానత్వం కోసం, హక్కుల కోసం, బానిసల తిరుగుబాట్లు వర్గపోరాటాల రూపంలో చరిత్ర అంతటా వ్యక్తమయ్యాయి. మానవ జాతి నిరవధికంగా భిన్న రూపాలలో, విభిన్న పద్ధతుల్లో స్వేచ్ఛ, దోపిడీ లేని సమానత్వం, స్వతంత్రతల కోసం జరిపే చరిత్రనే ప్రజాస్వామ్య పోరాట చరిత్రగా చెప్పుకోవచ్చు.

చరిత్రలో మొదటి ప్రజాస్వామ్య వ్యవస్థ

ఇప్పుడు మనం 'ప్రజాస్వామ్యం' అని చెప్పుకుంటున్న పదానికి మూలం గ్రీకు నగర రాజ్యాలలో వర్తమాన శకానికి సుమారుగా ఐదారు వందల సంవత్సరాల పూర్వం, గ్రీకు భాషలోని 'డెమోస్, క్రటస్' అనే రెండు పదాలకు కలిపి ప్రాచుర్యంలోకి వచ్చిన డెమోక్రసీ అనే పదానికి అనువాదంగా చెప్పుకోవచ్చు. ఈ మూలపదాల్లోని 'డెమోస్ అంటే 'సాధారణ జనం' అని, 'క్రేటస్' అంటే 'పాలనాధికారం' అనీ చెప్పుకోవచ్చు. వర్తమానశకపూర్వం 500 సం॥ క్రితం అక్కడి ఏథెన్స్ నగర రాజ్యంలో వయోజనులైన పౌరులు ప్రత్యక్షంగా పాలనా వ్యవహారాలలో పాల్గొనేవారనీ, అదే ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి ప్రజాస్వామ్య వ్యవస్థ అనీ చరిత్రకారులు పేర్కొన్నారు. ఇండియాలో బుద్ధుని కంటే ముందు, తర్వాత కూడా గణతంత్ర వ్యవస్థ పాదుకొని ఉందని మనం గుర్తించాలి.

అయితే అప్పటి ప్రజాస్వామ్యానికీ ఇప్పుడు మనం వాడే అర్థంలో ప్రజాస్వామ్యానికీ చాలా తేడా ఉంది. వాళ్ళ లెక్క ప్రకారం పౌరులు అంటే అక్కడ ఉ




న్న శిష్టజనం మాత్రమే. స్త్రీలు, బానిసలు, వయోజనులు కాని పిల్లలూ పౌరులుగా లెక్కలోకి వచ్చేవాళ్ళు కాదు. అందువల్ల వీళ్ళెవరికీ ఈ ప్రత్యక్ష ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకునే అవకాశం ఉండేది కాదు. ఏటా ఒకసారి ఆధిపత్యవర్గంలోనుంచీ ఐదు వందల మంది ప్రతినిధులను ఎన్నుకొని, వారి చేతికి పాలనాపగ్గాలు అప్పజెప్పేవారు. ఆ సంవత్సరమంతా కొత్త చట్టాలు చేయడం, రాజకీయ పాలనా నిర్వహణ ప్రక్రియ, నియంత్రణ వీరి పనిగా ఉండేది. ఏదైనా కొత్త చట్టం ఆమోదం పొందాలంటే, పౌరులంతా ఆ సమావేశానికి హాజరై, ఓటువేయాల్సి ఉండేది. దాన్నే చరిత్రకారులు ప్రత్యక్ష ప్రజాస్వామ్యంగా చెప్పారు. అక్కడ కూడా ఆ మాత్రం ప్రజాస్వామ్యం శాశ్వతంగా నిలవలేదు. ఇక భూగోళం మీద వివిధ సామాజిక సమూహాల్లో భిన్న రకాల రూపాలలో అనేక వర్గపోరాటాలు నిరంతరం కొనసాగుతుండేవి.

మానవ సమూహాలు ఆహారాన్వేషణ, మెరుగైన జీవనం కోసం నిరంతరం వలసలు పోతూ ఉండేవి. స్థానిక ప్రజలతో యుద్ధాలు, తీవ్రమైన మానవహననం, చంపగా మిగిలిన వారిని బానిసలుగా పట్టుకోవడం జరుగుతుండేది. క్రమంగా చిన్నచిన్న తండాల రూపం పోయి పెద్దపెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. ప్రతిదశలోనూ రాజ్యాధికార నిర్వహణలో మతం ముఖ్యపాత్ర వహించింది. ఆర్యుల రాక తర్వాత భారత ఉప ఖండంలో ఏవిధంగా మత గ్రంథాలను, చదువునూ సామాన్యులకు, స్త్రీలకూ నిషేధించారో, పాశ్చాత్య దేశాలలో కూడా అదే విధంగా మత గ్రంథాలను సామాన్య ప్రజలకు నిషేధించారు. మొత్తం వ్యవస్థలను మతాధికారులు శాసించే వారు. రాజుకూడా దీనికి అతీతుడు కాడు. అయితే, కొన్ని చోట్ల మతాధికారులకు, రాజుకూ మధ్య ఆధిపత్య పోరాటాలు నడిచాయి. ఈ నేపథ్యంలో, పదహారు, పదిహేడు శతాబ్దాలలో జరిగిన ప్రజాస్వామ్య పోరాటాలలో ప్రాచుర్యం పొందిన వాటిని ఒకసారి అవలోకిద్దాం.

మతం గుప్పిట్లో..

వీటిలో ముందుగా ప్రజాస్వామ్యానికి మూలవిరాట్టుగా పండితులు పేర్కొంటున్న బ్రిటీషు దేశంలోని పరిస్థితుల్ని అవలోకిద్దాం. ఇది పూర్వం ఇంగ్లాండ్, స్కాట్లాండ్, ఐర్లాండ్, బ్రిటన్ అనే నాలుగు రాజ్యాలుగా ఉండేది. ట్యూడర్ రాజ వంశస్తులు



పదహారో శతాబ్దం నాటికి వీటిని ఏకీకృతం చేసి, ఒకే పాలన కిందికి తెచ్చారు. పైన చెప్పుకున్నట్లుగా రాజులు ఎంత శక్తివంతులైనా, మతాధికారుల అడుగులకు మడుగులు ఒత్తాల్సిన స్థితిలోనే ఉన్నారు.

ట్యూడర్ రాజ వంశానికి చెందిన చార్లెస్ అనే రాజు క్రైస్తవ మతాధిపతి పోప్ అధికారాన్ని ధిక్కరించి, తానే దైవాంశ సంభూతునిగా ప్రకటించుకున్నాడు. తన నిరంకుశ పాలనతో క్రూరంగా పాలించడం వలన, అక్కడి కులీనులతో కూడిన జనసభ 1649లో అతన్ని ఉరితీసి చంపి, గణతంత్ర రాజ్యం స్థాపించారు. తిరిగి మళ్ళా అదే జనసభ వారు 1688లో చార్లెస్ మనుమరాలు మేరీ, ఆమె భర్త విలియంలను సింహాసనం మీద కూర్చోబెట్టారు. అయితే ఇప్పుడు వారికి పరిమిత అధికారాలు మాత్రమే ఇచ్చి, పార్లమెంటు అదుపాజ్ఞలలో పనిచేసేట్లు ఒప్పందం చేసుకున్నారు. ఈవిధంగా అధికారం రాజరికం నుంచీ పార్లమెంటుకు మారడాన్ని **రక్తరహిత విప్లవం**గా అభివర్ణించారు. ఈ పార్లమెంట్ కూడా జనాలందరికీ సంబంధించినది కాదు. కేవలం భూస్వాములు, ఆస్తి కలిగి ఉన్నవారు, పన్ను చెల్లింపుదారులవంటి కొద్దిశాతం మందికి మాత్రమే ఓటుహక్కు ఉండేది. అనేక పోరాటాల ఫలితంగా 1919లో మాత్రమే పౌరులందరికీ ఓటు హక్కు లభించింది. అప్పుడు కూడా స్త్రీలకు ఓటు హక్కు లేదు. మరిన్ని ఉద్యమాల ఆనంతరం, 1947లో మాత్రమే అక్కడ స్త్రీలకు ఓటుహక్కు వచ్చింది. అనంతరం, ప్రజాస్వామ్య ప్రక్రియలో జరిగిన మరో మైలురాయిగా, ప్రపంచంలోనే తొలిసారిగా లిఖిత రాజ్యాంగం రూపొందించుకున్న

అమెరికా స్వాతంత్ర్య పోరాటాన్ని చెప్పుకోవచ్చు.

అమెరికా విప్లవం


విస్తారమైన భూభాగం, సహజ సంపద, స్థానిక నీగ్రోల రూపంలో మానవ వనరులూ ఉన్న అమెరికాకు వలస వెళ్ళిన వారు ప్రధానంగా బ్రిటన్ దేశీయులు. బ్రిటన్ పార్లమెంటు స్థానిక వ్యాపారుల ప్రయోజనాలు రక్షిస్తూ, అమెరికాలో ఉన్న వారిమీద అధిక పన్నులు విధించేది. తమకు పార్లమెంటు లో ఏరకమైన ప్రాతినిధ్యం లేకుండా తాము పన్నులు చెల్లించడాన్ని అక్కడి వలస దారులు వ్యతిరేకించారు. దాంతో వీరికి బ్రిటన్‌తో యుద్ధాలు జరిగాయి. థామస్ జెఫర్సన్ అధ్యక్షతన ఫిలడెల్ఫియాలో సమావేశమైన పదమూడు రాష్ట్రాల ప్రతినిధులు 1776లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన విడుదలచేసి విస్తృత ప్రచారం చేశారు. అనంతరం అమెరికాలో **'ది పీపుల్'** పేరిట రాజ్యాంగాన్ని ఆమోదించి అమలు చేసుకున్నారు. అనేక దీర్ఘపోరాటాల అనంతరం కేవలం 1920లో మాత్రమే అమెరికాలో నల్లజాతి స్త్రీలతో సహా పేదలకు కూడా ఓటుహక్కు లభించింది. ప్రపంచ ప్రజాస్వామ్య గమనంలో మరో ముఖ్య ఘట్టంగా ఫ్రెంచ్ విప్లవాన్ని పేర్కొన్నారు.

ఫ్రెంచ్ విప్లవం

పద్దెనిమిదో శతాబ్దంలో ఫ్రాన్స్ లో రాజరిక వ్యవస్థ బలంగా ఉండేది. అక్కడ ప్రజలు మూడు వర్గాలుగా ఉండేవారు. మొదటి స్థాయిలో మతాధికారులు, రెండవ స్థాయిలో రాజవంశీకులు, రాజబంధువులైన కులీనులు ఉండగా మూడో స్థాయిలో పెద్ద వ్యాపారులు, వాణిజ్యవేత్తలు, న్యాయవాదులు, చేతి వృత్తుల వారు, సాధారణ కూలిజనం ఉండేవారు. వీరిలో మొదటి రెండువర్గాల వారికి మాత్రమే ఓటుహక్కు ఉండేది. మూడో స్థాయి ప్రజలపాత్ర ప్రభుత్వం విధించిన పన్నులు కట్టడం వరకే పరిమితమైనది. మొదట రెండు స్థాయిలవారు ఎటువంటి పన్నులు కట్టాల్సిన అవసరంలేదు. పదహారవ లూయీ రాజు 1789 మే 5 న పన్నులు పెంచడానికి అసెంబ్లీ సమావేశం తప్పనిసరి కావడంతో, తొలి రెండు హోదాలలో ఉన్నవారితో సమావేశం ఏర్పాటు చేశాడు. ఆ సమావేశంలో, మొదటి రెండు స్థాయిల వారు ఒక్కో వర్గానికీ మూడు వందలమంది చొప్పున కూర్చుని వుంటే, అంతకు రెట్టింపు మంది మూడోస్థాయి ప్రతినిధులు బయట నిలబడి ఉన్నారు. పన్నులు కట్టడం

మినహా, పన్నులు విధించడానికి సంబంధించి వీరికి ఎటువంటి పాత్రా లేదు. వీరు తమకు కూడా ఓటు హక్కుకావాలని నినదించినా ఏమాత్రం ఉప యోగం లేకపోయింది. దాంతో వారు ఆ సమావేశాన్ని బహిష్కరించి, బయట ఒక క్రికెట్ మైదానంలో సమావేశ మయ్యారు.

మంచు ఎక్కువ పడి, పంటలు పండక, తీవ్రమైన ద్రవ్యోల్బణం, అధిక ధరలతో సామాన్యులు ఆకలితో అల్లాడే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అక్కడి హోదాలో మూడోస్థాయిలో ఉన్న ప్రజలు 'జాకోబ్స్' అనే క్లబ్బులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్లబ్బుల్లో సమావేశమై వారు రాజకీయాల్ని చర్చించేవారు. వీరిని జాకోబియన్లని పిలిచేవారు. వారు అదే ఏడు జులై 14న సమావేశమై తమకు తామే జాతీయ అసెంబ్లీగా ప్రకటించుకున్నారు. ఈ విప్లవ పోరాటాల్లో స్త్రీలు విస్తృతంగా పాల్గొన్నారు. వివిధ నగరాల్లో దాదాపు అరవైకి పైగా మహిళా జాకోబియన్ క్లబ్బులు ఏర్పాటయ్యాయి. విప్లవం తర్వాత మహిళలు కొన్ని హక్కులు సాధించుకున్నారు. అయితే, ఫ్రాన్స్‌లో మహిళలకు ఓటుహక్కు మాత్రం 1946 దాకా రాలేదు. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పదాలు హోరెత్తి, ప్రపంచమంతటా మారుమోగాయి. పదహారవ లూయీని 1793 జనవరి 5న బహిరంగంగా ఉరితీశారు. తిరిగి 1794లో జాకోబియన్ల ప్రభుత్వం పడిపోయి, శాసనసభ, డైరెక్టరీ అనే ఐదుగురు సభ్యుల కార్యనిర్వాహకవర్గంతో గణతంత్ర రూప ప్రభుత్వం ఏర్పడింది. అనంతరకాలంలో నెపోలియన్ బోనపార్టే అధికారం చిక్కించు కోవడంతో సహా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ విప్లవ ఫలితంగా అక్కడ బానిసత్వం రద్దయింది కానీ ఆచరణలో పెట్టడానికి చాలాయేళ్లు పట్టింది.



తత్వవేత్తల రచనలు

అక్కడి విప్లవానికి దోహదం చేసిన కారకాల్లో థామస్ హాబ్స్, జాన్ లాక్, రూసో అనే సామాజిక, రాజకీయ తత్వవేత్తల రచనలు ప్రధానమైనవిగా చెప్పుకోవచ్చు. ఆధునిక ప్రపంచంలో రాజ్యాధికారానికి మూలం ఏమిటనే మౌలిక అంశాన్ని గురించి వారు తెలియ జెప్పేరు. హాబ్స్ తన 'లెవియథాన్' అనే

నాలుగు భాగాల గ్రంథంలో మానవ సహజ స్వభావాన్ని గురించి, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని గురించీ, మతం పాత్ర గురించీ చర్చించాడు. జాన్‌లాక్ 'టూ ట్రీటైజెస్ ఆన్ సివిల్ గవర్నమెంట్' అనే పుస్తకంలో– సహజ న్యాయం, సామాజిక ఒడంబడిక, మతసహనం, తిరగబడే హక్కుల్ని గురించి వివరించాడు. రూసో తన 'సోషల్ కాంట్రాక్ట్' అనే పుస్తకంలో పాలకునికి పరిపాలించే అధికారం ప్రజల సమ్మతితోనే వచ్చిందని రాశాడు. **'స్వేచ్ఛగా జన్మించిన మానవుడు అన్నిచోట్లా సంకెళ్ళతో బంధితమై వున్నాడు'** అనే మాటలతో అతని గ్రంథం ప్రారంభ మౌతుంది. హాబ్స్ వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వకపోయినా, లాక్, రూసోలు రాజ్యం, ప్రభుత్వాల కంటే మనుషుల వ్యక్తిగత స్వేచ్ఛా ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. పాలకులు దైవనిర్ణయం ప్రకారం ఉంటారని, మతాధికారుల ఆజ్ఞ జవదాటరానిదనే పాత భావనలను వీరు బద్దలు కొట్టారు. ప్రజల సమ్మతి లేకుండా రాజ్యాధికారం ఉండడానికి వీలు లేదని వ్యక్తికి పెద్దపీట వేశారు. శాంతియుత సమాజం, ఏ వివక్షా లేకుండా మానవులందరికీ చట్ట సమానత్వం, పౌరహక్కుల పరిరక్షణల ప్రాధాన్యతను వీరి సిద్ధాంతాలు భూగోళపు రంగం మీదకి తెచ్చి, ప్రపంచ మానవాళికి ఉత్తేజాన్ని కల్పించాయి. చట్టబద్ధ పాలనకు, ఆధునిక రాజ్యాంగాల నిర్మాణానికి బాటలు వేశాయి.

కల్లోలిత ప్రపంచంలో మధ్యయుగాల భూస్వామ్య దోపిడీ వ్యవస్థ ఇంకా ప్రజల మూలుగలు పీల్చే స్థితి కొనసాగుతోంది. విప్లవాలు, తిరుగుబాట్లు, వర్గపోరాటాలు, అణచివేతలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. అనంతరం పద్దెనిమిదో శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం ఒక్క కుదుపులా మానవ సామాజిక జీవనంలో పెనుమార్పులకు అంకురార్పణ చేసింది.

పురాతన కాలం నుంచీ ఆవిరిని ఉపయోగించడం ఉన్నా, పద్దెనిమిదో శతాబ్ది తొలిభాగంలో దాన్ని యంత్రాలకు అనువర్తింపజేసింది మాత్రం జేమ్స్‌వాట్ అనే ఆంగ్లేయుడు. ఆవిరి శక్తితో నడిచే పారిశ్రామిక యంత్రాలు, నౌకలు, రైళ్లు, అనంతర కాలంలో వచ్చిన వాహన అంతర్దహన యంత్రం, విద్యుదుత్పాదనలు వంటి నూతన ఆవిష్కరణలు ఉత్పత్తి విధానంలోనూ, ఆర్థిక సాంకేతికాభివృద్ధిలోనూ గుణాత్మక మార్పులకు దోహదం చేసి, 1820 నాటికి ప్రపంచంలో పెను మార్పులకు కారణమయ్యాయి. మానవ చరిత్రలో పశుపోషణ, వ్యవసాయాభివృద్ధి తర్వాత దీన్నే

ముఖ్యమైన మలుపుగా చెప్పుకోవచ్చు. ముందుగా బ్రిటన్, తర్వాత యూరప్ దేశాలలో ప్రారంభమైన ఈ పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని కమ్మేసింది. అప్పటివరకూ సాగిన చేతి ఉత్పత్తుల పద్ధతి నుంచీ, యంత్ర కర్మాగారాల ద్వారా అపరిమిత ఉత్పత్తి సాధించడంతో, ఉత్పత్తుల అమ్మకాలకు మార్కెట్‌లను అన్వేషించడంలో భాగంగా వలసలు పెరిగాయి.

కర్మాగారాల స్థాపనతో చేతి వృత్తులు కుదేలయ్యాయి. ఫ్యాక్టరీలలో పనులకోసం పెద్దఎత్తున ప్రజలు తరలడంతో, నగరీకరణ వేగవంతమైంది. జనాభా పెరుగుదలకు దోహదం చేసింది. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో ఇది పెనుమార్పులకు దారితీసింది. కార్మికులు నివసించే మురికి వాడలతో పట్టణాలు కిక్కిరిసిపోయాయి. రోజుకు 12 గంటల నుంచి 14 గంటల దాకా పని చేయాల్సి వచ్చేది. వీరిలో అధికశాతం పిల్లలు కూడా ఉన్నారు. బ్రిటన్ తర్వాత ఆలస్యంగా మొదలైనా, అమెరికాలో సైతం వేగంగా పారిశ్రామికీకరణ జరిగింది. మాక్స్ వెబర్ అనే జర్మన్ సామాజిక ఆర్థికశాస్త్రవేత్త అక్కడ పెట్టుబడిదారీ విధానం పెరగడాన్ని గురించి, 'ప్రొటెస్టెంట్ నైతిక సూత్రాలు, పెట్టుబడిదారీ చైతన్యం' (The Protestant Ethic and the Spirit of Capitalism) అనే పుస్తకంలో వివరించాడు. ఇందులో ఈయన **పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిని మార్క్స్ చెప్పిన గతితార్కిక భౌతికవాద రూపంలో కాకుండా, మతపర అంశాల్ని గురించి చర్చించి, ప్రొటెస్టంట్ నైతిక సూత్రాలు నేర్పిన అంశాల ప్రాతిపాదికన అమెరికాలో పెట్టుబడిదారీ విధానం పెరిగిందని** ఉటంకించాడు. అమెరికాలో కార్మికులు తమ హక్కులకోసం 1886 లో జరిపిన ఆందోళనలో చికాగోలోని హే మార్కెట్ వద్ద కొందరు కార్మికులు పోలీసుకాల్పుల్లో మరణించారు. ఆ సందర్భాన్ని పురస్కరించు కొని, ట్రేడ్ యూనియన్లు, సోషలిష్టు గ్రూపుల అంతర్జాతీయ సమాఖ్య 1889 నుంచి 'మేడే'ను 'కార్మిక ఉద్యమ సంకల్ప దినం'గా జరపాలని నిర్ణయించింది.

'కమ్యూనిష్టు మానిఫెస్టో'

కార్మిక ఉద్యమాలు చరిత్రగతిని మలుపు తిప్పి, రాజ్యాధికారం వైపు నడిపించడంలో భూగోళంపై విస్తృత ప్రభావాన్ని చూపింది మాత్రం 'కమ్యూనిష్టు మానిఫెస్టో' రాసిన కార్ల మార్క్స్, ఎంగెల్స్‌లు. రూసో. 'స్వేచ్ఛగా జన్మించిన మానవుడు



అన్ని చోట్లా సంకెళ్ళతో బంధితమై ఉన్నాడు' అని చెపితే, మార్క్స్ ఆ సంకెళ్లను ఎట్లా తెంచాలో కూడా చెప్పాడు. 'పోరాడండి! పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్ళు తప్ప!' అంటూ అశేష ప్రజానీకానికి పోరాటబాట చూపాడు. తత్వవేత్తలు ప్రపంచం ఎట్లా వుందీ వివరిస్తే, దాన్ని ఎట్లా మార్చాలో చారిత్రక భౌతిక వాదం, గతితార్కిక భౌతికవాదాల ద్వారా మార్క్స్ వివరించాడు. 'దాస్ కేపిటల్' అనే గ్రంథం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను ఎట్లా అర్థం చేసుకోవాలి, అదనపు విలువ అంటే ఏమిటి? అనే వివిధ రకాల ముఖ్యవిషయాలపై అవగాహన కల్పించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలు, సంక్షోభమూ దాని వినాశనానికి దారి తీస్తాయని, అనంతరం కార్మిక వర్గ నియంతృత్వానికి, సామ్యవాదానికీ, అంతిమంగా కమ్యూనిష్టు సమాజానికీ దారితీస్తుందని సూత్రీకరించాడు. ఆయన జీవితకాలంలోనే విప్లవ ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. కొద్దికాలమే మనగలిగిన పారిస్ కమ్యూన్‌ని చూడగలిగాడు.

అక్కడి నుంచీ బహిష్కరణకు గురయిన మార్క్స్ తన భార్య జెన్నీతో కలిసి లండన్ లో దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ తన రచనా వ్యాసంగం కొనసాగించాడు. నిత్యం తన ఇంటికి కార్మిక ఉద్యమకారులు వచ్చి వెళుతుండే వారు. ఆ ఇల్లు ఒక ఓపెన్ హౌస్. ఆ ఇంట్లో ఒక డబ్బాలో ఉన్న ఆహారాన్ని వచ్చినవారు ఎవరైనా తినవచ్చు లేదా తమ వద్ద ఉన్నదేమైనా ఇతరులకోసం అందులో వేయవచ్చు. ఫ్రెడరిక్ ఎంగెల్స్ గనుక కార్ల్ మార్క్స్‌ను ఆర్థికంగా ఆదుకోకపోయి ఉంటే తాను ఆకలితో మరణించి ఉండేవాడినని మార్క్స్ స్వయంగా చెప్పుకున్నాడు. ఇంతటి దుర్భర పరిస్థితుల్లోనే ఆయన శాస్త్రీయ సామ్యవాదానికి సైద్ధాంతిక స్ఫూర్తి ఐన "దాస్ కేపిటల్" అనే గ్రంథాన్నీ, 'సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్' అనే గ్రంథాన్నీ ఇంకా అనేక ఇతర రచనలనూ చేశాడు. మార్క్స్ భార్య జెన్నీ ఒక సంపన్న రాజకుటుంబానికి చెందింది. మార్క్స్ దేశబహిష్కరణకు గురై, దుర్భర దారిద్ర్యంలో, తిండిలేక పిల్లలకు పాలివ్వలేని స్థితిలో కూడా పన్నెత్తు మాటకూడా అనకుండా మార్క్స్ కు అన్ని రకాలుగా అండగా నిలిచింది. అందుకే ప్రపంచంలో నిజమైన ప్రేమకు ప్రతినిధులుగా

మార్క్స్ జెన్నీ లనూ, నిజమైన స్నేహానికి ప్రతీకలుగా మార్క్స్ ఎంగెల్స్ లనూ చెప్పుకుంటారు. దుర్భర దారిద్ర్యంతో, వైద్యానికి కూడా డబ్బుల్లేని స్థితిలో ముందు జెన్నీ తర్వాత మార్క్స్‌లు మరణించారు. ఈ వేళ అంతర్జాతీయ సందర్శకులు పోటెత్తే, మార్క్స్‌ను సమాధి చేసిన, లండన్ లోని హైగేట్ శ్మశాన వాటికవద్ద ఆయన అంత్య క్రియల సందర్భంలో పట్టుమని పదిమంది కూడా లేని పరిస్థితి. నేడు దాదాపుగా భూగోళం లోని అన్ని దేశాల్లోనూ ఎగిరే ఏకైక పతాకం ఎర్రజెండా. మార్క్స్, ఎంగెల్స్ లు వివరించిన కమ్యూనిజం తప్ప, ప్రపంచ మానవాళికి శాస్త్రీయ సామ్యవాద స్ఫూర్తినీ, సైద్ధాంతిక భూమికనూ అందించిన వేరొక సిద్ధాంతం లేదు.

రష్యా విప్లవం

మార్క్స్ మరణం తర్వాత కార్మికవర్గ నియంతృత్వానికి దారితీసే, సామ్యవాద విప్లవ ఆకాంక్షల్ని సాకారం చేసింది లెనిన్ నాయకత్వంలోని బొల్షివిక్ పార్టీ. ప్రస్తుత కేలెండర్ ప్రకారం నవంబర్ 7న బోల్షివిక్ పార్టీ నాయకుడు వ్లాదిమిర్ లెనిన్ నాయకత్వంలో విప్లవం జరిగింది. జూలియస్ కేలెండర్ ప్రకారం అక్టోబర్ 25న కాబట్టి దీన్ని 'అక్టోబర్ విప్లవం' అని పిలిచారు.

తాత్కాలిక ప్రభుత్వంలో రష్యన్ బూర్జువా పెట్టిబడిదారీ నాయకులున్నారు. లెనిన్ కార్మికులు, రైతులు, సైనికుల కౌన్సిళ్ళు పాలించే సోవియట్ల ప్రభుత్వానికి పిలుపు ఇచ్చాడు. వారి మిత్ర బృందాలు పెట్రోగ్రాడ్ లోని ప్రభుత్వ భవనాలు, ఇతర వ్యూహాత్మక స్థానాల్ని ఆక్రమించారు. తరువాత జరిగిన అంతర్యుద్ధంలో 1923లో కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటయింది. లెనిన్ ఆధ్వర్యంలో 1924లో రష్యాలో తొలి రాజ్యాంగ చట్టం ఏర్పాటయింది. ఆ రాజ్యాంగ నిర్మాణ సందర్భంగా రష్యాను ఏక కేంద్ర రాజ్యంగా రూపొందించాలని కొందరు ఆశించినా, లెనిన్ అందుకు అంగీకరించలేదు. రష్యన్ సమాఖ్య రాజ్యంగానే వుండాలని, రష్యా సమాఖ్యలోని వివిధ జాతులకు విడిపోయే హక్కుతోసహా ప్రజాస్వామ్య హక్కు ఉండాలనీ వాదించాడు. రష్యాలో కమ్యూనిష్టు పార్టీ నాయకత్వం ఏర్పడిన తరువాత, అంతర్జాతీయంగా సామ్యవాద భావనలు, సాహిత్యాన్ని ప్రపంచ ప్రజలకు అందజేయడంలోనూ, ఇతరదేశాల కమ్యూనిష్టు పార్టీలు చేసే సామ్యవాద ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలవడం లోనూ తొలిదశాబ్దాల రష్యా ప్రపంచానికి పెద్దన్నగా నిలిచింది.

ముఖ్యంగా ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సామ్యవాద భావనలతో సామ్రాజ్యవాద అమెరికాకు ధీటుగా కమ్యూనిష్టు భావాలు ప్రపంచ వ్యాపితంగా నిలబడడానికి ఎంతో దోహదం చేసింది. రష్యా తర్వాత “ఆకలిమంటల మలమలమాడే అనాథలందర్నీ తట్టిలేపి, ముఖ్యంగా శ్రామిక రైతాంగాన్ని ఎర్రసైన్యంగా మలిచి, విప్లవం విజయవంతం చేసిన చైనా గురించి చెప్పుకోవాల్సి వుంది.

చైనా విప్లవం

మావో ఆధ్వర్యంలో ఎర్రసైన్యం పన్నెండున్నర వేల కిలోమీటర్లు లాంగ్‌మార్చ్ చేసి, 1949 లో విప్లవ కమ్యూనిష్టుల ఆధ్వర్యంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, ప్రభుత్వాన్ని నెలకొల్పింది. రష్యా నమూనాకు భిన్నంగా, భూస్వామ్య సమాజంలో విప్లవాన్ని విజయవంతం చేసిన చైనా నాయకులు కొత్త ఒరవడి సృష్టించి, ప్రపంచ మానవాళికి కొత్తమార్గం చూపారు. ఆనంతరకాలంలో చైనాలో ఒక సాంస్కృతిక విప్లవం కొనసాగించారు. చైనాలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ 1989 ఏప్రియల్‌లో తీయాన్మెన్ స్క్వేర్ వద్ద అసమ్మతి గళం వినిపించిన పదిలక్షల మంది విద్యార్థులు ప్రజలమీద కాల్పులు జరిపి వేలమందిని పొట్టనబెట్టుకున్న సంఘటన ప్రపంచ ప్రజాస్వామ్య వాదులందరినీ కలచివేసింది. వర్తమానంలో చైనాలో కమ్యూనిష్టు పార్టీ అధికారంలో ఉన్నా, ఆ దేశం ఆచరణలో నియంతృత్వ పెట్టుబడిదారీ విధానాల మార్గంలో ఉన్నట్లు స్పష్టమవుతోంది.



2

ప్రజాస్వామ్య పథ నిర్దేశకులు



విప్లవ ప్రజాసైన్యంతో అంతటి మహాప్రస్థాన యాత్ర జరిపి, రెడ్ గార్డ్స్ ద్వారా సాంస్కృతిక విప్లవాన్ని కొనసాగించిన చైనా వర్తమాన స్థితికి కారణాల్ని కూడా విశ్లేషించుకోవాలి.

మావో


చైనాలోని అర్థ వలస, అర్థ భూస్వామ్య వ్యవస్థలో వ్యవసాయిక విప్లవం ద్వారా కార్మిక, కర్షక ఐక్యతతో నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసి, సామ్యవాదం వైపు పురోగమించేందుకు మావో కృషి జరిపాడు. అప్పటివరకు ఉన్న విప్లవ పోరాటాలకు ప్రధానంగా పట్టణాలు, కార్మిక వర్గమూ ముందుకు నడిపించే శక్తులుగా ఉండాలనే సిద్ధాంతాన్ని కాదని, రైతాంగం ప్రధానశక్తిగా విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్ళాడు.

ప్రజాసైన్యం ముందుగా పల్లెలను స్వాధీనం చేసుకుని, అంతిమంగా పట్టణాలను ఆక్రమించింది. అనంతరం అక్కడ జనతా ప్రజాస్వామిక నియంతృత్వం అమలు జరిపే కృషి చేశారు. దీన్నే 'నూతన ప్రజాస్వామ్యంగా అభివర్ణించారు. సామ్యవాదవ్యవస్థ స్థాపించిన తరువాత కమ్యూనిస్టు సమాజం వస్తుందని మావో కలలుకన్నాడు. అందుకై నిరంతర విప్లవాన్ని కొనసాగించడంలో భాగంగా సాంస్కృతిక విప్లవానికి పిలుపు నిచ్చాడు.

చైనాలో సాంస్కృతిక విప్లవంగా ప్రాచుర్యం పొందిన, శ్రామికవర్గ మహాసాంస్కృతిక విప్లవం 1966 నుంచీ 1976 వరకు జరిగింది. ఈ సమయంలో యువతనుంచీ మావో రెడ్‌గార్డ్స్‌ను ప్రోత్సహించాడు. పార్టీలో ఉన్న చెడుని నిర్మూలించ డానికీ, అధికార పీఠంపై ఉన్నవారితో సహా అందర్నీ విమర్శించ డానికి, సాంప్రదాయిక మతఛాందసాల్ని, మూఢవిశ్వాసాల్నీ నిర్మూలించడానికీ సాంస్కృతిక విప్లవం కృషి చేయాలని భావించారు. పాత సంస్కృతి, పురాతన భావాలు, ఆచార సాంప్రదాయాలు అలవాట్లను పూర్తిగా నిర్మూలించడమే ఈ సాంస్కృతిక విప్లవం ప్రధాన ఉద్దేశ్యం.

అందులో భాగంగా అనేక గుళ్ళూ, గోపురాలు, పురాతన మత భావాలకు ప్రాతినిధ్యం వహించే కట్టడాలు, విగ్రహాలు వంటివి ధ్వంస మయ్యాయి. పార్టీ పదవుల్లో ఉన్న వారితో సహ అనేకమంది వేధింపులకు గురయ్యారు. ఎందరినో బహిరంగ విచారణ చేసి మరణశిక్ష విధించారు. ఈసందర్భంగా రెడ్ గార్డ్స్ పేరిట మావో ప్రోత్సహించిన యువత అనేక తప్పిదాలకు పాల్పడినట్లు తేలింది. దాదాపు మావో మరణం దాకా, 1976 వరకూ జరిగిన ఈ సాంస్కృతిక విప్లవంలో ప్రధాన పాత్ర వహించిన మావో మూడో భార్య జియాంగ్ క్వింగ్‌తో సహా మరో ముగ్గుర్ని దుష్ట చతుష్టయంగా ముద్రవేసి శిక్షించారు. పాత సంస్కృతిని ధ్వంసం చేయడం ఒక్కటే చాలదు. దానికి ప్రత్యామ్నాయ సంస్కృతిని స్థాపించే విషయంలో సక్రమమైన భావనల వ్యాప్తి, నిర్మాణాత్మక కృషి జరపడం ఎంతో అవసరం. అయితే ఈ కృషి సరైన మార్గంలో రూపొందలేదు. ధ్వంస రచన ప్రధానంగా సాగిందిగానీ, ఈ సాంస్కృతిక విప్లవం ద్వారా శ్రామికవర్గ సంస్కృతిని ప్రతిస్థాపించాలనే ధ్యేయం వైపు మాత్రం సరయిన కృషి జరగలేదు. సాంస్కృతిక విప్లవం విఫలం కావడానికి ముఖ్యకారణం సరయిన ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మాణం చేయడంలో వైఫల్యంగా చెప్పుకోవచ్చు. వివిధ దేశాలలో నాస్తిక హేతువాద ఉద్యమాల్లో కూడా ప్రత్యామ్నాయసంస్కృతి లేదా ప్రజాస్వామిక సంస్కృతి నిర్మాణాన్ని గురించి సరైన చర్చ, అవగాహన, కృషి లేకపోవడం పెద్ద లోపంగా గుర్తించి, ఆ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఈనాటికీ మిగిలే ఉంది. చైనాలో ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్ శాశ్వత అధ్యక్షునిగా కొనసాగేందుకు రాజ్యాంగ సవరణ చేయడం, చైనా అంతర్జాతీయంగా విస్తరణ వాదానికి పాల్పడే చర్యలూ చూస్తుంటే, వర్తమానంలో చైనా నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నుంచీ తిరోగమనం చెందినట్లు స్పష్టమవుతోంది. ఏ దేశంలో అయినా ప్రజలు విజ్ఞానవంతులు, శక్తివంతులూ అయితే, ప్రభుత్వాధినేత సామాన్యవ్యక్తిగా ఉంటాడు. అత్యధిక ప్రజానీకాన్ని భ్రమల్లో ఉంచి, అజ్ఞానులుగా తయారు చేసే క్రమంలో నాయకుడు మాత్రమే అత్యధిక శక్తివంతుడుగానూ, ప్రజలు గొర్రెదాటు మనసత్వంతో, అభద్రతా భావంతో భయపడుతూ, నాయకుడిని భజన చేసేవారుగా ఉండే పరిస్థితి నెలకొంటుంది. ఈ అంశం వర్తమాన భారత దేశానికి కూడా వర్తిస్తుంది. గుడ్డి విశ్వాసాలు, వ్యక్తిగత ఆరాధనకు దూరంగా ఉండే విజ్ఞానవంతులు, రాజకీయచైతన్యం ఉన్న ప్రజానీకం సరయిన ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టుగొమ్మలు. ఇక ప్రజాస్వామ్య

వ్యవస్థను బలోపేతం చేయడంలో, సామ్యవాద భావాల్ని సిద్ధాంత పరంగా, ఆచారణాత్మకంగా, ముందుకు తీసుకు వెళ్ళి, మానవ జాతిని ప్రభావితం చేసిన మరికొన్ని సిద్ధాంతాలు, సిద్ధాంతకారుల్ని గురించి గుర్తు చేసుకుందాం.



జాన్ స్టూవర్ట్ మిల్
(1806 - 1873)

స్వేచ్ఛా సమానత్వాలు, శ్రేయోరాజ్య సిద్ధాంతాలకు గట్టి పునాదులు వేసినవాడు జాన్ స్టూవర్ట్ మిల్. లండన్‌లో జన్మించిన 'మిల్' గ్రీకు తత్వవేత్తలను అధ్యయనం చేశాడు. 'వెస్ట్ మినిస్టర్ రివ్యూ' అనే పత్రికకు రాజకీయ విశ్లేషణలతో కూడిన వ్యాసాలు రాసేవాడు. లండన్ రివ్యూ పత్రికకు సంపాదకునిగా పని చేశాడు. బ్రిటన్ పార్లమెంటు సభ్యునిగా కూడా పని చేశాడు. ఇతను బెంథామ్ ఉపయోగితావాదానికి కొన్ని మౌలిక మార్పులు చేసి, మానవతా సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఉపయోగితావాదం రాజకీయ మైనదనీ, దానికి ఎలాంటి నైతిక లక్ష్యాలూ లేవనే బెంథామ్ వాదనను ఖండించి, ఉపయోగితావాదాన్నీ, వ్యక్తి స్వేచ్ఛనూ సమన్వయపరచడం ద్వారా కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ముఖ్యంగా మిల్ రాసిన 'ఆన్ లిబర్టీ' అనే గ్రంథంలో ప్రధానంగా వ్యక్తి స్వేచ్ఛను గురించి వివరించాడు. రాజ్యం వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేస్తుందని మిల్ భావించాడు. ప్రతివ్యక్తీ తన శరీరం మీద, ఆలోచనలమీదా పూర్తి అధికారం కలిగి ఉంటాడనీ, దీనిపై పాలకవర్గంతో సహా రాజ్యం ఏవిధమైన జోక్యం చేసుకోకూడదన్నాడు. అధిక సంఖ్యాకుల అభిప్రాయపు చెల్లుబడిని తీవ్రంగా విమర్శించి, ఇట్లా జోక్యం చేసుకోవడంవల్ల వ్యక్తిత్వవికాసం లోపిస్తుందని, వ్యక్తి తన వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోయి సమాజానికి బానిసగా మారే ప్రమాదముందన్నాడు. ప్రజాస్వామ్యం పేరిట అమలయ్యే ప్రజాభిప్రాయం, సమిష్టివాదం, వ్యక్తిస్వేచ్ఛకు అవరోధాలని భావించాడు. సమాజంలో ఉన్న మత మౌఢ్యవాదమే నిరంకుశ పాలన, అభివృద్ధి నిరోధక పాండిత్యం, రాజ్యకార్యకలాపాల విస్తరణ వ్యక్తి స్వేచ్ఛకు ఆధునిక కాలంలో ఏర్పడ్డ అవరోధాలనీ అన్నాడు. అత్యధిక సంఖ్యాకుల నిర్ణయం పేరిట చిత్తశుద్ధితో కూడిన కొందరు వ్యక్తుల అభిప్రాయాలను తిరస్కరించడం కానీ,

అణచివేయడం కానీ జరిగితే అది ప్రజాస్వామ్యం కానేరదని అన్నాడు. మెజారిటీ అభిప్రాయాల్ని అందరిమీదా రుద్దడం సరికాదనీ, అందరి అభిప్రాయాలకూ వారి వారి జనాభానిష్పత్తిని బట్టి తగిన ప్రాతినిధ్యం లభించే వ్యవస్థ కావాలంటూ నైష్పత్తిక ప్రాతినిధ్య విధానాన్ని సూచించాడు. అంటే కేవలం మెజారిటీ అభిప్రాయాన్ని అందరి మీదా రుద్దకుండా మైనారిటీ ప్రజలకు కూడా వారి జనాభా శాతాన్ని లేదా ఓట్ల శాతాన్ని బట్టి ప్రాతినిధ్యం లభించాలి. మొత్తంమీదా ఆర్థిక, రాజకీయ సామాజిక నియంతృత్వాల నుంచి వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించాలనే భావనలకు మిల్ ఊతమిచ్చాడు. వ్యక్తి స్వాతంత్ర్యంతో బాటు స్త్రీ స్వాతంత్ర్యానికి కూడా మిల్ పెద్దపీట వేశాడు.

మిల్, తను రాసిన 'సబ్జెక్షన్ ఆఫ్ విమెన్' అనే రచనలో స్త్రీలకు అన్నిరంగాల్లోనూ పురుషుల తోబాటు సమాన హక్కులు ఉండాలని చెప్పాడు. ఎక్కువమంది పొందే అధిక సంతోషం వ్యక్తి గుణాత్మకంగా అనుభవించే సంతోషంపై ఆధారపడి ఉంటుందనీ, ఈ గుణాత్మకమైన అత్యధిక సంతోషాన్ని మహిళలందరికీ అందేట్లు చేయాలని సూచించాడు. అందుకై మహిళలలోని ప్రతిభా సామర్థ్యాలను వెలికితీసి, విద్యా ఉద్యోగ అవకాశాలను కల్పించడం ద్వారా వారి సేవలను ప్రజా ప్రయోజనాలకు, సామాజికాభివృద్ధికీ ఉపయోగించుకోవడం వల్ల సమగ్ర అభివృద్ధి సాధ్యమని భావించాడు.

ప్రారంభ దశలో సామ్యవాదాన్ని తీవ్రంగా విమర్శించిన మిల్ కాలక్రమేణా సామ్యవాద ప్రాముఖ్యతను గుర్తించాడు. వ్యక్తి స్వేచ్ఛకు సమసమాజ నిర్మాణం దోహదం చేస్తుందని, వ్యక్తిస్వేచ్ఛకు పెద్దపీటవేసే సామ్యవాదాన్ని మిల్ అభిలషించాడు.


ఆంటోనియో గ్రాంసీ (1891-1937)



కార్ల్ మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిష్టు మానిఫెస్టో రాసినపుడు, ముఖ్యంగా ఇంగ్లాండ్ వంటి పారిశ్రామిక దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధితోబాటు కార్మికవర్గం కూడా ఒక బలమైన విప్లవశక్తిగా ఎదిగి, పెట్టుబడిదారీ భూస్వామ్య వ్యవస్థను అంతం చేసి, కార్మిక వర్గ నియంతృత్వాన్ని స్థాపించడం అనివార్యంగా

జరుగుతుందని బలంగా నమ్మారు. ఇంగ్లాండ్ వంటి ఐరోపా దేశాల్లో ముందుగా విప్లవం వస్తుందని నమ్మారు. అనేకసార్లు ఆర్థిక మాంద్యాలు ఏర్పడ్డా, పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకొని నిలదొక్కుకుంది. ఇందుకు గల కారణాల్ని మార్క్స్ తరువాత అనేకమంది రాజకీయ సిద్ధాంత కర్తలు విశ్లేషణ చేసినా అవేవీ గ్రాంసీ చేసిన శాస్త్రీయ విశ్లేషణ ముందు నిలువలేవు. ఇటలీ దేశానికి చెందిన గ్రాంసీ, ఉదారవాద, పెట్టుబడి దారీ విధానం బలపడడానికి కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించడమే కాకుండా, సామ్యవాద విప్లవాన్ని విజయవంతం చేయడానికి ఎట్లా కృషి చేయాలో చెప్పడం ద్వారా మార్క్సిజాన్ని మరింత పరిపుష్టం చేశాడు. సామాజిక అంశాలలో అంతర్గతంగా ఉన్న సాంస్కృతిక అంశాలను గ్రాంసీ అధ్యయనం చేశాడు. ఆర్థిక అంశం ఒక్కటే ప్రధానం కాదనీ, సమాజంలోని భిన్న సమస్యలు, ఆస్తిత్వాలను పరిగణనలోకి తీసుకోవాలనీ చెప్పాడు. ఆ ప్రకారం విప్లవం ఒక్క ఆర్థిక అంశాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలైన సంస్కృతి, భాష వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చి, విప్లవంలో వాటి పాత్రను విశ్లేషించాడు. మన వద్ద విప్లవోద్యమాల్లో పనిచేసి, అనంతరం కుల అస్తిత్వవాదంలోకి మళ్ళి, ఆ దిశగా కృషి చేసిన గురుకుల మిత్రా, మారోజు వీరన్న, సత్యమూర్తి, ఉ.సా, బేతి శ్రీరాములు, డేనీ, మిత్రా, భూపతి నారాయణమూర్తి వంటి వారెందరిపైనో గ్రాంసీ ప్రభావం ఉన్నట్లుగా అర్థమవుతోంది. ఈ సైద్ధాంతిక నిర్మాణకృషిలో భాగంగా రాజ్యంతో సమాజాని కున్న సంబంధాల్ని విశ్లేషించిన గ్రాంసీ, పౌర సమాజం అనే కొత్త భావనను ముందుకు తెచ్చాడు.

రాజకీయ సమాజానికి భిన్నంగా పౌర సమాజానికి కీలకస్థానం కల్పించాడు. పౌర సమాజం, రాజకీయ సమాజం అనే భావనలను హెగెల్ నుంచీ తీసుకున్నాడు. హెగెల్, మార్క్స్ ఎంగెల్స్ లు పౌరసమాజాన్ని ఆర్థిక సంబంధాల క్షేత్రంగా అభివర్ణించినా, అనంతరకాలంలో తమ సిద్ధాంతాన్ని భౌతికవాదం, ఉత్పత్తి సంబంధాలు,ఉత్పత్తి శక్తులు అనే పదజాలం ఏర్పరచుకున్నాక, పౌరసమాజం అనే పదాన్ని పూర్తిగా వదిలిపెట్టారు. ఈ పదాన్ని గ్రాంసీ కొత్తగా విశ్లేషించాడు. 'రాజ్యం ప్రాథమికంగా


హెగెల్

ఆధిపత్యం నెరిపే అణచివేత స్వభావం కలిగి ఉంటుం దని, రాజ్యం అంటే పాలక రాజకీయ సమాజమ'ని అన్నాడు. ముఖ్యంగా సాంస్కృతిక ఆధిపత్యాన్ని గురించి వివరించాడు. రాజ్యం, అధికారం చెలాయించే పెట్టుబడిదారీ వ్యవస్థ, బూర్జువా వర్గమూ తమ అధికారాన్ని కొనసాగించడానికి సాంస్కృతిక వ్యవస్థలని, సంస్థల్నీ ఎట్లా ఉపయోగించుకొంటాయో వివరించాడు. మన దేశంలో ప్రస్తుత పరిస్థితి ఇందుకు నిదర్శనంగా కనబడుతోంది. అధికారాన్ని కొనసాగించడానికి సాంస్కృతిక వ్యవస్థలు, పౌరసమాజం ఇందుకు భిన్నమైనదిగా వివరించాడు. **రాజ్యాధికారంలో ప్రత్యక్ష భాగస్వామ్యం లేని సంస్థలన్నీ పౌరసమాజం కిందికి వస్తాయి**. ఇందులో భిన్నరకాల ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు వంటివి ఉంటాయి. పౌర సమాజంలో కుటుంబానికి కూడా ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ముఖ్యంగా మహిళా శ్రమశక్తి ఉంది. కార్మికశక్తికి ఉత్పత్తి రూపంలోనూ, ఆర్థిక రూపంలోనూ ఫలితం కనబడుతుంది కానీ, స్త్రీలు ఇళ్ళలో చేసేపనికి ప్రతిఫలం, ప్రత్యేక గుర్తింపు ఉండదు కాబట్టి, దీనికి ప్రాధాన్యత ఇవ్వడానికి చోటు దొరకదు. మహిళల అణచివేతను పెట్టుబడిదారీ దోపిడి నుంచీ ప్రత్యేకంగా చూడాల్సివుందని, కార్మికవర్గం ఆధిపత్యానికై జరిపే పోరాటంలో భాగంగా సమీకరించే విశాల సామాజిక శక్తుల ఏకీకరణలో మహిళా విముక్తి పోరాటం ఒక కీలక అంశంగా ఉంటుందనీ గ్రాంసీ వివరించాడు.

ఒకే తరహా సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితుల్లో ఉన్న ప్రజలను భావజాలం ఏకం చేస్తుంది. ఇట్లా ఏకమైన శక్తులు ఒక విశాల వేదిక నిర్మాణంలో భాగస్వాములై, కార్యాచరణకు పూనుకునేందుకు దోహదం చేయడమౌతుందని, వీరిలోంచి వచ్చిన మేధావి బృందం ఉమ్మడి ప్రయోజనాల సాఫల్యతకు అవసరమైన భావజాలాన్ని అందిస్తుందనీ పేర్కొన్నాడు. వీరికి గ్రామీణ రైతాంగంతో సమన్వయం ఉండాలని చెప్పాడు. ఈ క్రమం లోనే కార్మికవర్గం ఆధిపత్య పాత్ర పోషిస్తుందనీ అన్నాడు. విప్లవం విజయవంతమై కార్మిక వర్గం అధికారాన్ని చేజిక్కించుకున్నా, సోషలిష్టు వ్యవస్థ నిర్మాణ బాధ్యత ఇంకా ముందుకు తీసుకు వెళ్లాలనీ, ఇది దశలవారీగా జరిగే ప్రక్రియ అనీ అన్నాడు. అంతేకాకుండా, అమలులో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్మూలించడం కంటే, ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు ప్రవేశపెట్టడం ముఖ్యమనీ భావించాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలను విస్తరించేకొద్ది మరిన్ని వర్గాలు సామ్యవాదాన్ని కోరుకొంటాయి. విప్లవపార్టీ నాయకత్వంలో సోషలిష్టు ప్రజాస్వామ్యాన్ని


స్థాపించిన తరువాత, ప్రభుత్వ సంస్థలు, అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయడం ద్వారా క్రమంగా సమసమాజ నిర్మాణానికి పూనుకోవాలని చెప్పాడు.

బాలకార్మికునిగా మొదలైన ఆయన ప్రస్థానం జర్నలిస్టుగా, ఫాసిస్టుల పాలనలో ఖైదీగా, ఇటలీ కమ్యూనిష్టు పార్టీ ప్రధాన నాయకుడిగా, అంతర్జాతీయ సోషలిష్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన గొప్ప సిద్ధాంతవేత్తగా అంతర్జాతీయంగా ప్రశంస లందుకున్నాడు. ఇప్పుడు రాజ్యాధికారాన్ని నిరంకుశంగా వ్యక్తులపై రుద్దకూడదనే మరికొన్ని రాజకీయ వ్యవస్థలను గురించిన తాత్వికాభిప్రాయాల్ని పరిశీలిద్దాం.

అరాచకవాదం (అనార్కిజం)

మార్క్సిస్టు తాత్వికతతో ప్రభావితమైన సిద్ధాంతాలలో అరాచకవాదం (అనార్కిజం) ఒకటి. ఇంగ్లాండ్‌కు చెందిన విప్లవవాది గాడ్విన్, ఫ్రెంచ్ రచయిత ప్రౌధాన్‌ల భావాలపై ఆధారపడి రష్యన్ విప్లవవాది బకునిన్ అరాచకవాద సిద్ధాంతాన్ని మెరుగుపరిచి, దాని వ్యాప్తికోసం కృషి చేశాడు. బకునిన్, క్రోపొట్కిన్, రష్యన్ రచయిత టాల్‌స్టాయ్‌లు అరాచకవాద సమర్థకులు. రాజ్యాన్ని పూర్తిగా రద్దుచేసే లక్ష్యంతో అరాచక వాదం పని చేస్తుంది. మతసంబంధ నీతి, చర్చి అదుపాజ్ఞలు, దైవాధికారాలనుంచీ విముక్తి, పెట్టుబడిదారీ దోపిడి నుంచీ విముక్తి, రాజ్యదాస్యం నుంచీ విముక్తి దీని ధ్యేయం. అన్నిరకాల అధికార మూలాలనుంచీ వ్యక్తిస్వేచ్ఛ సాధించాలని అరాచక వాదం భావిస్తుంది. ఇది కమ్యూనిజంలోని అత్యున్నత దశ ఐన 'రాజ్యవ్యవస్థ నశించడం' అనే భావనను పోలి ఉంటుంది.

అరాచకవాదం మతాన్ని పూర్తిగా నిర్మూలించాలని భావిస్తుంది. మతం సమాజంలో



మార్పును వ్యతిరేకించి, ఉన్న యథాతథస్థితిని కొనసాగించడం ద్వారా ధనవంతులకు మాత్రమే ప్రయోజనకరంగా ఉంటుంది కాబట్టి అన్నివిధాలా చర్చి అధికారాన్ని, ప్రభావాన్నీ నామరూపాల్లేకుండా చేయాలంది. వ్యక్తిగత ఆస్తి, మత వ్యవస్థలకు మద్దతు ఇచ్చే రాజ్యం నశించినప్పుడే సమానత్వంతో కూడిన స్వేచ్ఛా సమాజం వస్తుందని నమ్ముతుంది. టాల్‌స్టాయ్ వంటి వారు శాంతియుత పద్ధతిన మార్పు తేవాలని భావించినా, మిగిలిన అరాచక వాదులు విప్లవాన్ని నమ్ముతారు. అంతకుముందు జరిగిన విప్లవాలు ఒక ప్రభుత్వాన్ని కూల్చి మరొక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అలా కాకుండా రక్తపాత విప్లవం ద్వారా అసలు ప్రభుత్వమే లేకుండా చేయాలనేది అరాచకవాదుల ఆదర్శం. ఇక, దేశ రక్షణ, అంతర్జాతీయ అంశాలు, విద్యావ్యాప్తి వంటి నిర్వర్తనలన్నీ స్వచ్ఛంద ప్రాతిపదికపై ఏర్పాటు చేసిన ప్రజా సహకార సంఘాల ద్వారా జరగాలని వీరు భావించారు.

శ్రామికసంఘ వాదం

శ్రామిక సంఘవాదం కూడా రాజ్యాన్ని వ్యతిరేకిస్తుంది. వీరి ఆశయాల ప్రకారం, వృత్తిపనివారి సంఘాల నిర్మాణంతో కూడిన సామాజిక సహకార వ్యవస్థ రాజ్యం స్థానాన్ని ఆక్రమిస్తుంది. దేశభక్తి, జాతీయత అనే భావాల్ని వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. కార్మికులు ఎక్కడ పనిచేస్తే, అదే వారిదేశం. ఆర్థిక ప్రయోజనాలు శ్రామికులనందరినీ ఏకంచేసి, ఒకే వర్గంగా రూపొందించడానికి దోహదం చేయడమవుతుందని వారు భావించారు. శ్రామిక సంఘవాదులు సమ్మె, ఇతర దౌర్జన్య పూరిత విధానాలద్వారా తమ ఆశయ సాధనకు కృషి చేయాలని భావించారు. ప్రధానంగా కార్మిక, శ్రామిక సమ్మెలను ప్రోత్సహించి, అధిక వేతనాలు, పనిగంటల తగ్గింపు వంటి ప్రయోజనాలు సాధిస్తూ, తమ ప్రాబల్యాన్ని విస్తరించుకుంటూ క్రమంగా ఉత్పత్తి సాధనాలను స్వాధీన పరచుకోవడంద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేయాలని భావించారు. శ్రామిక సంఘవాదం కూడా సామ్యవాద శాఖగా ఉన్నా, రాజ్యరహిత సమాజాన్ని కోరుకున్నారు. ఇందులో రాజ్య వ్యవస్థకు బదులు శ్రామిక సంఘాలు ఉంటాయి. పారిశ్రామిక వ్యవస్థ, ఉత్పత్తి, వీటి నియంత్రణలో ఉంటుంది. జాతీయ సేవలైన రైల్వే, తంతి తపాలా, రోడ్డురవాణా వంటివన్నీ శ్రామిక సంఘాల చేతుల్లో ఉంటాయి. అంటే, వ్యవస్థ మొత్తం ఉత్పత్తి దారుల చేతులమీదుగా నడుస్తుంది.

శ్రామికసంఘవాదానికీ, అరాచకవాదానికీ దగ్గరి సంబంధం ఉంది. రెండూ రాజ్యాన్ని నిర్మూలన చేయాలంటాయి. ఉత్పత్తి సాధనాలు కార్మికులు, రైతుల చేతుల్లోని సహకార సంఘాల ద్వారా నిర్వహించాలని కోరతాయి. తమ ఆశయ సాధనకు పార్లమెంటు రాజకీయాలను వ్యతిరేకించి, విప్లవం ద్వారానే వ్యవస్థను కూల్చి కొత్త వ్యవస్థ స్థాపించాలని విశ్వసిస్తారు.

భారతదేశంలో ప్రజాస్వామ్య పథనిర్దేశకులు



ప్రపంచాన్ని పీడన దుఃఖాలనుంచి రక్షించడానికి పుట్టిన మహోన్నత వ్యక్తి గౌతమ బుద్ధుడు. బౌద్ధం హేతుబద్ధ మతం. అది దైవాన్ని కాదని మానవుడు కేంద్రంగా ఉండే ప్రపంచాన్ని కోరింది. చరిత్రకారులు స్థిరీకరించిన ప్రకారం ప్రస్తుత బీహార్ రాష్ట్రంలోని కపిలవస్తు నగరం లుంబినీవనంలో సిద్ధార్థుడు జన్మించాడు. అతన్ని సిద్ధార్థ గౌతమునిగా పిలిచేవారు. పదహారేళ్ల వయసులో ఆయనకు వివాహమైంది. భార్య యశోధర. కొంతకాలం బయటి ప్రపంచం తెలియకుండా పెరిగిన సిద్ధార్థుడు బయటి ప్రపంచాన్ని చూడడానికి వనానికి బయలుదేరాడు. సిద్ధార్థునికి దారిలో కనబడ్డ బాహ్య ప్రపంచం లోని అనేక బాధలు, ఆకలి, కష్టాలు, చావు, తనను ఆలోచింప జేశాయి. అందుకే అతను మానవాళి ఉద్ధరణకై తన ఇరవై తొమ్మిదవ ఏట రాజ్యాన్ని, భార్యను, తన నవజాత శిశువును వదిలి జ్ఞానాన్వేషణలో పడ్డాడు.

ప్రపంచంలోని బాధలు నిర్మూలించేందుకై జరిపిన తన జ్ఞానాన్వేషణలో మునులను, జ్ఞాన సంపన్నులుగా ప్రసిద్ధిచెందిన వారిని, మహామహిమాన్వితులుగా పేరుపడ్డ వారినీ ఎందరినో దర్శించాడు. వారి డొల్లతనాన్ని తెలుసుకున్నాక కొన్నేళ్ళు పరివ్రాజకునిగా గడిపాడు. అనంతరం తపస్సు చేసి దేహాన్ని బలహీనపరుచుకున్నా వీటన్నిటివల్లా ఉపయోగం లేదని అర్థమైంది. అంతిమంగా తన అనుభవాల సారాంశాన్ని ఒక బోధి చెట్టుకింద అవలోకించు కొని ఒక కొత్త మార్గాన్ని స్థిరీకరించుకొని, లోకంపై జ్ఞానమనే వెలుగు కిరణాలు విస్తరింప జేసేందుకు

బయలుదేరాడు. తనను తాను బుద్ధునిగా ప్రకటించుకున్నాడు.

ఆనాటికే యజ్ఞయాగాదుల పేరిట జరుగుతున్న జంతు వధను నిరసించాడు. ఈ విశ్వానికి సృష్టికర్త ఎవరూ లేరని, శాశ్వత అస్తిత్వంలో ఉండే ఆత్మ అనేది లేనేలేదని, వైదిక కర్మకాండల వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని చెప్పాడు. రాజ్యావతరణను గురించి కూడా బౌద్ధ సాహిత్యంలోని 'మహా పరినిబ్బన'లో ఉంది. రాజ్యం ఏర్పాటును గురించి కూడా బౌద్ధ సాహిత్యంలో ఉంది. అందరి మేలుకోసం ప్రజలంతా "మహాసమ్మత" అనే ఒకరిని ఎన్నుకుని శాంతిభద్రతలతో సహా రాజ్య నిర్వహణ చేసినందుకు రాజుకు తమ పశుసంపద, ఫలసాయాల్లో కొంతవాటా చెల్లించేవారని రాజ్యం పుట్టుకను వివరించారు. ఈ విధంగా ఎన్నో వందల సంవత్సరాల తర్వాత రాజ్యావతరణ సిద్ధాంతాన్ని వివరించిన హాబ్స్, లాక్, రూసోల కంటే ముందుగా 'సామాజిక ఒడంబడిక సిద్ధాంతా'న్ని చెప్పింది బుద్ధుడే అని తెలుస్తుంది. పాలనా సూత్రాలు, రాజుకు ఉండాల్సిన లక్షణాలను గురించి కూడా బౌద్ధ సాహిత్యంలో ప్రజాపక్షంగా ఉండే వివరణలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు బౌద్ధం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. నాటికి అమలులో ఉన్న వర్ణరూపంలోని అసమ వర్గ సమాజాన్ని నిరసించి, మానవులంతా ఒక్కటే అని ప్రభోధించింది. ఆచరణలో బౌద్ధం ఇదే విధానాన్ని అవలంభించి, సమాజంలో బాలికలు, బలహీన వర్గాలతోసహా విద్య అందరికీ అందుబాటులో ఉండాలని చెప్పింది. బౌద్ధం అస్పృశ్యతను పారద్రోలింది. అందుకే బౌద్ధ మతం బలంగా వేళ్లూనుకుని ఉన్న శ్రీలంకలో ఈ రోజుకీ అస్పృశ్యత లేదు. రాజకీయ అధికారం జన్మహక్కుగా ఉండ కూడదని, అధికారం వారసత్వంగా కాకుండా, సామాన్య ప్రజలకు రావాలనీ చెప్పింది. రాజ్య విధులు, అధికారాలు కూడా మనకు బౌద్ధ సాహిత్యంలో లభిస్తాయి. ఐతే సమాజంలోని ఆధిపత్య వర్గాలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం ప్రజాస్వామ్య భావనలను నిర్మూలించడానికి తీవ్రంగా కృషిచేస్తాయి. ఆ భావాలు ప్రజల్లో నాటుకుపోయి, వాటిని నిర్మూలించడం సాధ్యం కాదని తెలుసుకున్నప్పుడు ఆ సిద్ధాంతాల్ని వక్రీకరించి, తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటాయి. తమకుండే ఆర్థిక బలం, అధికారం అందుకు తోడ్పడి, ప్రజలు వీరు చెప్పేదే నిజమని నమ్మేట్లు చేస్తారు. ఆ విధంగానే మహాయాన బౌద్ధం పేరిట ఆర్య వైదిక భావనలను సమాజంలో ప్రవేశపెట్టడం జరిగింది.

అసలు బౌద్ధాన్ని హీనయానం పేరిట హీనంగా చూపుతూ వైదిక భావాలు జొప్పించిన బౌద్ధం, మహాయానం పేరిట వక్రీకరించిన బౌద్ధం, వర్తమాన శకానికి సుమారుగా 250 సం॥ల క్రితం పురుడు పోసుకుంది. ఈ పదాల్ని ఖాయం చేయడం ద్వారా అసలు బౌద్ధాన్ని నమ్మేవారు కూడా దాన్ని హీనయానంగా పిలవక తప్పని స్థితికి తెచ్చారు. బౌద్ధం స్వర్గనరకాలు, దైవం ఉనికిని నమ్మదు. బుద్ధుడు గొప్ప మానవుడిగా మాత్రమే అసలు బౌద్ధులు విశ్వసిస్తారు. హీనయానం నాటి ప్రజలు మాట్లాడే 'పాళీ' భాషలో ఉండగా మహాయానం ఆర్య వైదికుల 'సంస్కృత' భాషలో ఉంది. అసలు బౌద్ధాన్ని అనంతర కాలంలో ఇంకా భ్రష్టు పట్టించి, తాంత్రిక పూజలతో కూడిన వజ్రయానం వంటి శాఖలు కూడా ఏర్పరిచారు. 'అసలు వాడికి ఒకటే నామం ఐతే, కొత్తగా వచ్చిన వాడికి ఒంటినిండా నామాలే' అన్నట్లు, బౌద్ధం అహింసను ప్రధానంగా చెప్పింది కాబట్టి, మహాయానం పేరిట తయారైన వైదిక ఆర్యులు, అప్పటివరకూ యజ్ఞ యాగాదుల పేరిట ఆవుల్ని వధించి, వాటిమాంసాన్ని నేతితో వేయించుకుని తింటూ సురాపానం చేస్తూ గడిపిన అలవాటుని వదిలివేసి, అహింసా మార్గం పట్టారు. గత శతాబ్దం తొలి అర్ధభాగం వరకూ బుద్ధుడిని కూడా దశావతారాలలో ఒకనిగా నిలిపేందుకు కేలండర్లు, చిత్రాలు ఇతరమార్గాల ద్వారా ప్రయత్నం చేశారు. ప్రపంచమంతా పాకిన బౌద్ధమత శాఖలలో కూడా ఈ విభేదాలు స్థిరీకరణ పొందాయి. మొత్తంమీద విదేశీ ఆర్యులు స్థానిక బౌద్ధాన్ని ఎల్లలు దాటించి, ఇక్కడ నామ మాత్రంగా ఉండేట్లు చేయడంలో సఫలమై, తామే స్థానికులమని ఈ దేశంలో ఉండాలంటే వారిమతాన్నే ఆచరించాలని చెప్పే స్థితికి తెచ్చారు. బౌద్ధాన్ని అణగదొక్కిన పునాదులపై, స్థానిక ప్రజానీకంపై కౌటిల్యుడు, మనువు వంటి సిద్ధాంతాలను రుద్ది, అణచివేత దోపిడీ, వర్ణ, కులవివక్షతో కూడిన రాజ్యాన్ని కొనసాగించడం జరుగుతోంది.



కౌటిల్యుడు

కుటిలత్వంతో నిండిన కౌటిల్యుని అర్థశాస్త్రం, పాలకుడు ఎట్లా నిరంకుశంగా మోసంతో పాలన చేయాలో చెప్పింది. ఈ పద్ధతిలో న్యాయం,

అన్యాయం, మంచి, చెడు వంటి అంశాలకు ఏమాత్రం తావులేదు. వర్ణవ్యవస్థను, యధాతథ స్థితిని కాపాడటం రాజు ప్రథమ కర్తవ్యంగా చెప్పాడు. చాణక్యుడిగా కూడా ప్రాచుర్యం పొందిన, ఆర్యబ్రాహ్మణాధి పత్యంకోసం అర్థశాస్త్రం రాసిన కౌటిల్యుడు విజయం సాధించడం కోసం రాజు ఏమైనా చేయవచ్చు నంటాడు. నాటి రాజుల నుంచీ నేటి ఓట్లు నొల్లుకునే ప్రజాప్రతినిధుల దాకా ఈ విధానాన్నే అనుసరిస్తున్నారు. దీన్ని 'మనుస్మృతి' పేరిట మరింత పరిపుష్టం చేశారు. మనుస్మృతి సుమారుగా వర్తమాన శకానికి రెండువందల ఏళ్ల క్రితం ప్రాచుర్యంలోకి తెచ్చినట్లుగా తెలుస్తోంది. 2,684 సంస్కృత శ్లోకాల రూపంలో ఉన్న మనుస్మృతి, రాజ్యపాలన, పౌర చట్టాలు, నేరాలకు శిక్షలు, పన్నుల విధానం, ఆస్తిపంపకాలు, రాజుకు వుండాల్సిన విధులు, లక్షణాలతో సహా, సృష్టి ప్రారంభం నుంచీ, మోక్ష ప్రాప్తం వరకూ పన్నెండు అధ్యాయాల రూపంలో వివరిస్తుంది. ఇందులో రాజ్యవ్యవస్థ, రాజును గురించి కూడా వివరించారు. బుద్ధుడు రాజ్య వ్యవస్థకు మూలం ప్రజల సమ్మతిగా అభివర్ణిస్తే, మనుస్మృతిలో మాత్రం భిన్నంగా చెప్పింది. ఆటవిక దశలో బలమున్నవాడిదే రాజ్యంగా బతుకుతున్న పాశవిక స్థితిలో, బాధలకు గురయిన ప్రజలంతా బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ప్రార్థిస్తే, అతడు అష్టదిక్పాలకులనుంచీ రేణువులను తీసి, రాజును సృష్టించాడని మనుస్మృతి ఏడవ అధ్యాయంలో వివరించారు. ఆ ప్రకారం రాజు దైవాంశ సంభూతుడు. నిరంకుశు డు. అతని నిర్ణయాల్నీ, నిర్వర్తనల్ని ఎవరూ ప్రశ్నించడానికి గానీ, ఎదురు మాట్లాడడానికిగానీ వీలు లేదు. వీటన్నిటికంటే మరింత ముఖ్యమైంది చాతుర్వర్ణ వ్యవస్థ. ఆర్య సాహిత్యపు ఋగ్వేదంలోని పురుష సూక్తంలోని పదవ మండలంలో ప్రజలను వర్గీకరించి, వాళ్ళు చేయాల్సిన వృత్తుల్ని కూడా నిర్వచించారు. మహాపురుషుడైన దేవుని తలనుంచి ఆర్య బ్రాహ్మణులు, భుజాలనుంచి క్షత్రియులు, తొడలనుంచి వ్యాపారవర్గం, కాళ్ళనుంచి శూద్రులూ పుట్టారని, వీరి పుట్టుకను బట్టే వారి వృత్తిధర్మాలు ఉంటాయనీ పేర్కొన్నారు. చదువు, దైవారాధన, సామాజిక మార్గదర్శకత్వం బ్రాహ్మణుల పనికాగా, యుద్ధాలు చేసి అధికార స్థిరీకరణ చేయడం క్షత్రియ బాధ్యత గాను, ఆర్థిక అంశాలు వ్యాపార వర్గానికీ అప్పగించారు. మిగతా వారంతా సేవకవృత్తికి అంకితం కావాలని శాసించారు. ఇందులో, నేడు ఆ భావజాలాన్ని నెత్తిన మోస్తున్న, ఆర్థిక పరిపుష్టి సాధించి, ఆధిపత్యం నెరపుతున్న శూద్రకులాలు, మిగతా వృత్తి కులాలవారు కూడా కలిసే ఉన్నారు. మనుస్మృతి

తర్వాత ప్రజల్లో ఈ భావజాల వ్యాప్తికి రామాయణ, మహా భారతం వంటి ఇతిహాసాల్ని కూడా ఉపయోగించుకున్నారు. వీరి దుర్మార్గ పూరిత చర్యలకు ఉదాహరణలుగా నరకబడ్డ ఏకలవ్యుడి బొటనవేలు, తెగిపడిన శంబుకుడి శిరస్సూ వంటి ఎన్నోగాథలు మనకు దృష్టాంతాలు గా కనబడతాయి. వీరిదృష్టిలో రాజ్యం అంటే, మతం ప్రధానంగా ఉండే నిరంకుశ పాలన. వారి వారి వర్ణాలని బట్టి వారు చేసిన నేరాలకు శిక్షలు ఉంటాయి. అగ్రవర్ణాలకు మాత్రం దొంగతనం, హత్య వంటి తీవ్ర నేరాలతోబాటు అనేక నేర చర్యలకు శిక్ష నుంచీ మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం జనాల్ని మభ్యపెట్టో, లేకపోతే భయపెట్టో 'దేశంకోసం, ధర్మంకోసం' అనిపించేవారి లక్ష్యం కూడా ఆ వ్యవస్థ పునరుద్ధరణే. ఈ సాంకేతికయుగంలో కూడా కొత్తరూపంలో చాతుర్వర్ణ వ్యవస్థను ప్రతిష్టించడమే వారి లక్ష్యమనేది, ఏమాత్రం ఇంగిత జ్ఞానంతో ఆలోచించే వారికైనా అర్థమవుతుంది. అనాదికాలం నుంచీ వీరి ఆధిపత్య పూరిత అప్రజాస్వామిక పాలనా సిద్ధాంతాలను ఎదిరించి, మానవ సమానత్వంకోసం పోరాడిన వారూ ఉన్నారు. వీరిలో చార్వాకులు, అజీవకులు, లోకాయుతులవంటి ధీరులు ఎందరో ఉన్నారు.


వీరిని గురించి ప్రసంగవశాత్తూ ఇతిహాసాలు, పురాణాల వంటి వాటిలో లభ్యమయ్యే సమాచారమే ప్రధాన ఆధారంగా ఉంది. రామాయణంలో సత్యకామ జాబాలి అనే ముని, రాముడితో మాట్లాడుతూ, "ధర్మ భావన అనేది మిగతా ప్రజల్ని నిరంకుశంగా పాలించడానికీ, వాళ్ళంతా వినయంగా ఆధిపత్యానికి కట్టుబడి ఉండ డానికీ, శాస్త్రాలలో ప్రవేశపెట్టారు" అంటాడు. అలానే శంబూకుడనే శూద్రుడు జ్ఞాన సముపార్జన చేస్తున్న నేరానికి గురువు వశిష్టుని ఆనతి ప్రకారం శిరచ్ఛేదం చేసిన సంగతికూడా రామాయణంలోనే మనకు లభ్యమౌతుంది. ఆదిశంకరుని బ్రహ్మసూత్రాల్లో, చార్వాకులు 'దేహమే ఆత్మ అని అంటారని పేర్కొన్నారు. భౌతిక చక్షురింద్రియాలే ఆత్మ అంటారని లోకాయతులలోని 'ఏకదేశులు' చెపుతారని కూడా అందులో పేర్కొన్నారు. వేదాధ్యయనానికి స్త్రీలకు, శూద్రులకూ అర్హత లేదని, ఒకవేళ ఎవరయినా వింటే సీసం కరిగించి చెవుల్లో పోసి చంపమనీ రాసుకున్నారు. బౌద్ధాన్ని స్థానికంగా దెబ్బకొట్టడంలో ఆదిశంకరుడు ప్రధాన పాత్ర పోషించాడు. మధ్వాచార్యుడు (విద్యారణ్యుడు) పదమూడవ శతాబ్దానికి చెందిన సర్వదర్శన సంగ్రహ (అన్ని తాత్విక సిద్ధాంతాల సంగ్రహం) అనే గ్రంథంలో తొలిగా చార్వాకులను గురించే ఏడుపుటలకు

పైగా వర్ణించాడు. వీరంతా ఆధిపత్య భావజాలాన్ని తిరస్కరించే ప్రజాస్వామ్యవాదులుగా మనకు అర్థమౌతోంది. దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ (భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ పురస్కారం అందుకున్న మేధావి) "లోకాయత' అనే ఏడువందల పేజీల బృహద్గ్రంథాన్ని రాశాడు. అందులో సామాన్యప్రజలు అనే పదంవాడి, రాజ్యం, మతం ఆధిపత్యాలకు వ్యతిరేకంగా వారికున్న ప్రజాస్వామ్య ఆకాంక్షలను కూడా పేర్కొన్నాడు

3

స్వాతంత్రోద్యమకాలం ప్రజాస్వామ్యం

మానవజాతి నిరవధికంగా భిన్న రూపాలలో, విభిన్న పద్ధతుల్లో స్వేచ్ఛ, దోపిడీలేని సమానత, స్వతంత్రతలకోసం జరిపే చరిత్రే ప్రజాస్వామ్య పోరాట చరిత్ర. ప్రపంచ వ్యాప్తంగా ఆ పరిణామాలను పరిశీలిస్తూ మన దేశం దగ్గరికి వచ్చాం. బుద్ధుడు, చార్వాకులు, లోకాయతుల గురించి కూడా చర్చించాం. ఆధునిక భారతంలో వివిధ సందర్భాల్లో ప్రజాస్వామ్య, మానవవాద దృక్పథాలు వివిధ వ్యక్తిత్వాల ద్వారా ఎలా పరిణామం చెందుతూ వచ్చాయో కూడా చూడాలి.



మోహన్ దాస్ కరంచంద్ గాంధీ

(02-10-1969 - 30-01-1948)

భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాలపైనే కాక, ప్రపంచ ప్రజాస్వామిక, సామాజిక ఉద్యమా లపై ప్రభావం చూపినవాడు మహాత్మా గాంధీ. గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందర్‌లో జన్మించిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ పందొమ్మిదేళ్లకే లండన్ వెళ్ళి, బారిష్టర్ చదివాడు. అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన ఒక ముస్లిం వ్యాపారి కేసు వాదించడానికి దక్షిణాఫ్రికా వెళ్ళాడు. అక్కడ నెలకొని ఉన్న జాతి వివక్ష కారణంగా బ్రిటీషు వారి చేతిలో అనేకసార్లు తీవ్ర అవమానాలకు గురయ్యాడు. దక్షిణాఫ్రికాలో తను వాదించ డానికి వెళ్ళిన కేసు ముగిసిన తర్వాత తిరిగి రావలసిన సమయంలో తెల్లవారికి మాత్రమే ఓటుహక్కు ఉండేలా తెచ్చిన చట్టానికి వ్యతిరేకంగా పౌరహక్కుల పోరాటం ప్రారంభించడంతో తన ప్రజాస్వామిక ఉద్యమప్రస్థానం ప్రారంభించాడు. అక్కడ అమలవుతున్న జాతి వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని విజయవంతంగా నడిపి ప్రపంచం దృష్టికి తేవడంలో సఫలీకృతు డయ్యాడు. భారతదేశంలో మితవాద ఉద్యమ నాయకుడిగా ఉన్న గోపాలకృష్ణ గోఖలే ఆహ్వానంపై 1914లో ఇండియా వచ్చి, స్వాతంత్ర్య పోరాట

ఉద్యమాన్ని పల్లెల వరకూ వ్యాపింపజేయడంలో బాగా కృషి చేశాడు. దేశంలోని సామాన్యుడికి ప్రాతినిధ్యం వహించేలా, ఒంటిపై చిన్న గోచీ మాత్రమే ధరించేవాడు. గాంధీపై బౌద్ధ, జైనమతాల ప్రభావం, ప్లేటో, టాల్‌స్టాయ్ రచనల ప్రభావం ఉంది.

అన్ని మత గ్రంధాలూ పఠించినా, 'ఈశ్వర్ అల్లా తేరే నాం', అన్నా, ఎప్పుడూ భగవద్గీతను చేతిలో పట్టుకు తిరుగుతుండేవాడు. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే మూడు సిద్ధాంతాల ప్రాతిపదికన తన పోరాటం నడిచింది. ఆత్మవిశ్వాసం, మత సామరస్యం, అహింసా, శాంతియుత నిరసనలతో కూడిన సత్యాగ్రహ పద్ధతి, సహాయ నిరాకరణలు ఉద్యమ రూపాలుగా, నాటి మధ్య, ఉన్నత తరగతుల వారిని, విద్యావంతులనూ పెద్ద ఎత్తున సత్యాగ్రహ ఉద్యమంలోకి ఆకర్షించాడు. **సత్యాగ్రహం అంటే, తాను బాధను భరిస్తూ, అహింస పాటిస్తూ నిరసన తెల్పడం ద్వారా ఎదుటివారిలో మార్పుకోసం చూడడం. కార్మికులు, ఉద్యోగులు, పనిమానడం, దుకాణాలు బందు పెట్టడం ద్వారా ప్రజాజీవనాన్ని స్తంభింప జేయడానికి హర్తాళ్ అని పేరు పెట్టాడు.** అట్లానే ఆహారం తినకుండా నిరసన తెలియజేసే నిరశన ఉద్యమాన్ని ఒక పోరాట రూపంగా మార్చాడు. సహాయ నిరాకరణ పద్ధతుల్లో భాగంగా పన్నులు చెల్లించకుండా ఉండడం, విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ విధానాలు ప్రచారం చేశాడు. గాంధీ సామ్యవాద దృక్పథం భిన్నమైనది.

గాంధీ కూడా చాలామంది పాశ్చాత్య ఉదారవాద సోషలిష్టుల్లా రాజ్య వ్యవస్థను సమర్థించ లేదు. రాజ్యం బలవంతాన భయాన్ని రేకెత్తించే విధానాలతో పాలిస్తుందని, అది వ్యక్తి నైతిక విలువలను గుర్తించదనీ అన్నాడు. అందువల్ల వ్యక్తి తనను తాను పాలించుకునే విధానం ఉండాలనీ, అధికార రాజకీయాల స్థానంలో సహకార రాజకీయాలు ఉండాలనీ, తద్వారా ప్రజలందరి సంక్షేమం (సర్వోదయా) సాధ్యపడుతుందని విశ్వసించాడు. ఆర్థిక అంశాలలో గాంధీ ఆలోచనలు మిగతావారికంటే భిన్నంగా ఉన్నాయి. రష్యాలో మాదిరిగా వ్యక్తిస్వాతంత్ర్యం కంటే సామూహిక సంక్షేమమే ప్రధానంగా ఉండే సమిష్టితత్వాన్ని అంగీకరించలేదు. వ్యక్తి స్వాతంత్ర్యం, స్వంత ఆస్తీ చాలా అవసరమని గాంధీ భావన. భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తమ ఆస్తికి ధర్మకర్తలుగా ఉంటూ, డబ్బంతా సమాజ శ్రేయస్సుకోసం వినియోగించాలని భావించాడు. ధనిక వర్గంలో మానసిక

పరివర్తన తెచ్చి, వారిలో సామాజిక బాధ్యత పెరిగేలా, దయ, కరుణ, ప్రేమానురాగాలు పాదుకునేలా చేయడం ద్వారా ఆదర్శ సమాజం ఏర్పాటు చేయవచ్చని భావించాడు. సమాజంలో కొత్త ఆధ్యాత్మిక నైతిక విలువలు నెలకొల్పాలని, తద్వారా సర్వమానవుల ఐకమత్యం, సౌభ్రాతృత్వం నెలకొంటాయని ఆశించాడు. అంతేకాకుండా వేతన సమానత్వ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఒక డాక్టరుకు, ఇంజనీరుకు, ఉపాధ్యాయునికీ, నౌకరుకు, పాకీ పనిచేసే వ్యక్తికీ సమానమైన జీతాలు ఇవ్వాలని ప్రతిపాదించాడు. అయితే నేటి వ్యవస్థలో వేతన వ్యత్యాసాలు కొన్ని వందల రెట్లున్నాయి. పారిశ్రామికాధిపతుల్ని పక్కన బెడితే, నాలుగైదు వేల జీతం తీసుకునేవారి నుంచీ నాలుగైదు లక్షల జీతం పొందేవారి దాకా ఉన్నారు. కనీస వేతనానికీ గరిష్ట వేతనానికీ మధ్య తేడా ఇరవై రెట్లకు మించకుండా సరిచేయమనే గత కాలపు కార్మిక వర్గ డిమాండ్ ఇప్పుడు అంతా మరిచిపోయిన విషయంగా తయారైంది.

ఈయన భారీ పరిశ్రమల స్థాపనను వ్యతిరేకించాడు. చిన్న చిన్న చేతివృత్తులు పరిశ్రమల్ని ప్రోత్సహించాలని సూచించాడు. ప్రతి ఒక్కరికీ వారి అవసరాల మేరకు వస్తువులు అందుబాటులో ఉండాలనీ, అందుకై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నాడు. అందరికీ నిత్యావసరాలు అందడం కోసం గ్రామీణ చేతి వృత్తుల్ని ప్రోత్సహించాలని చెప్పాడు. వీటిని ప్రోత్సహించినప్పుడే గ్రామీణ సమాజం బలోపేతమౌతుందని నమ్మాడు. ఈ కారణంగానే భారీ పరిశ్రమలు స్థాపించడాన్నీ, యంత్రాలతో చేసేఉ త్పత్తులనీ వ్యతిరేకించాడు. గ్రామస్వరాజ్యం కావాలంటే ప్రతిగ్రామంలోనూ స్థానిక అవసరాలయిన ఆహారం, వస్త్రాలను అక్కడే ఉత్పత్తి చేసుకోవాలని, గ్రామంలో ప్రజలకు కావలసిన మంచినీరు, మురుగునీటి పారుదల సౌకర్యం, విద్యుత్తు, ప్రాథమిక విద్య వంటి అన్ని సౌకర్యాలూ గ్రామ పంచాయితీనే చూసుకోవాలని సూచించాడు. వేగవంతంగా పెరుగుతున్న వర్తమాన సాంకేతికాభివృద్ధి, ప్రజలకు అవసరమైన అధికోత్పత్తి విధానాలపట్ల ఆనాటి పరిస్థితుల్లో ఆయనకు అవగాహన లేకపోయింది. మానవశ్రమతో చేసే ఉత్పత్తికీ, భారీ యంత్రాలతో చేసే ఉత్పత్తికీ వంద రెట్ల తేడా ఉన్న సంగతిని, ఉత్పత్తి విధానాన్ని సంకుచితపరచడం కంటే, పంపిణీ వ్యవస్థలో మార్పులు తేవడంద్వారా, వస్తుజాలం చౌకగా అందించడం ద్వారా ప్రజల అవసరాలు తీర్చవచ్చనే భావనను గుర్తించలేకపోయాడు. యాంత్రిక శక్తి వల్ల వచ్చిన అదనపు ఉత్పత్తి విలువను సమాజంలో ఎట్లా పంపిణీ చేయాలనే అంశాన్ని ఆలోచించకుండా,

అధిక శ్రమతో తక్కువ ఉత్పత్తి సాధించే వైపే తను మొగ్గు చూపాడు.

రాజకీయాల్లో ఉండేవారికి నైతిక విలువలు, ప్రజాపర ఆలోచన ఉండాలనే తన భావన ఆచరణ సాధ్యంకాని ఒక ఊహాత్మక ఆదర్శంగా మిగిలే అంశంగా అర్థమౌతుంది. ప్రపంచ వ్యాపితంగా ప్రభుత్వాలు అపరిమిత అధికారాలు చలాయిస్తూ, రాజ్య హింసకూ, అణచివేతకు పాల్పడుతున్న వర్తమాన పరిస్థితుల్లో, ప్రజలు తమ ఆందోళన వ్యక్తపరిచే ఇతర మార్గాలు లేవు. ఈ పరిస్థితుల్లో ప్రజలు, సమాజం తమ నిరసన వ్యక్తం చేయడానికి ధర్నా, హర్తాళ్, పనులు ఆపివేసి నిరసన వ్యక్తం చేయడం, నిరాహారంగా నిరశన దీక్ష చేపట్టడం వంటి మార్గాల్ని అమలులోకి తేవడంద్వారా, సాధారణ ప్రజలు కూడా పోరాటాల్లో పాల్గొనే పద్ధతులను ప్రాచుర్యంలోకి తెచ్చి మార్గదర్శనం చేశాడు. ఈనాడు ఈ విధమైన ఉద్యమాలు ప్రపంచవ్యాపితంగా ఉన్నాయి. దీనికి బాటవేసింది తానే అని చెప్పవచ్చు. గాంధీ భావనలలో ప్రపంచం నేటికీ అనుసరిస్తున్న, ప్రయోజనకరమైన అంశమిది. గాంధీ చెప్పిన ప్రజాస్వామిక వ్యవస్థకు పట్టుగొమ్మ వంటి మరో ముఖ్యమైన అంశం వికేంద్రీకరణ. ఈ వికేంద్రీకరణ గ్రామస్థాయి దాకా ఉండాలని అన్నాడు. వనరులు, అధికారం వికేంద్రీకరణ జరిగితే, దానంతట అదే సహకార భావన, సామాజిక స్థిరత ఏర్పడతాయని చెప్పాడు. వర్తమాన స్థితిగతుల్లో గ్రామాలు, జిల్లాల పరిస్థితి పక్కనబెడితే, రాష్ట్రాలకున్న అధికారాల్ని కూడా కబ్జా చేసి మునిసిపల్ సంస్థకున్న అధికారాల స్థాయికి దిగజార్చారు. భారత ఉపఖండంలోని సాంస్కృతిక భిన్నత్వాన్ని ఛిద్రం చేసి, ఒకే దేశం, ఒకే భాష, పేరిట ఆధిపత్య చర్యలకు పూనుకొంటున్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించిన గాంధీ ఏనాడూ రాజకీయ పదవులు ఆశించలేదు. తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల్లో ఎవరికీ ఏరకమైన రాజకీయ పదవులూ ఇప్పించుకోలేదు. ఆనాడు గాంధీతోబాటు ఉన్న అనేకమంది రాజకీయ నాయకులు నిస్వార్థంగా తమ జీవితపు స్వసుఖాలు, ఆస్తిపాస్తులు, త్యాగం చేసి ప్రజాపక్షంగా కృషి చేశారు. రాజకీయాల్లో గాంధీ ఆశించిన నైతిక విలువలు, నిరాడంబరత, నిస్వార్థ సేవ, సమాజానికి, ప్రజలకు ఏదో చేయాలనే తపన, ఏమాత్రం స్వలాభం లేకుండా పాటు పడడం అనేవి నేటి సమాజంలో ఊహాత్మక భావనలుగా మిగిలి పోయాయి. గాంధీ నడిపిన ఉద్యమాలతో ఏ సంబంధం లేని భూస్వాములు,

అప్పటిదాకా ప్రజల్ని పిప్పిచేసిన బ్రిటీషు అనుకూల దళారీలు చాలామంది అధికార కాంక్షతో గాంధీ బతికి ఉండగానే రాజకీయాల్లోకి రావడం తను ప్రత్యక్షంగా చూశాడు. ఇంకో ఆర్నెల్లలో తను హత్యకు గురవుతాడనగా, తన ఆశయాలకు, నమ్మకాలకు వాస్తవ రాజకీయాలు కత్తిపోట్లలా తయారయ్యాయని గుర్తించి, తీవ్రంగా చింతించాడు. వర్తమానంలో, నిన్నటిదాకా అరకొరగా జీవనం వెళ్లదీసినవాళ్ళు రాజకీయాల్లోకి వచ్చిన అనతికాలంలోనే డొల్లకంపెనీల లావాదేవీలతో, చార్టెడ్ అకౌంటెంట్ల మాయాజాలంతో వందల కోట్ల రూపాయల ఆస్తి కూడబెడు తున్నారు.

ఈవేళ ఒక్కొక్కడూ డెబ్బై ఏళ్లు దాటినా, అప్పటికే పదితరాలు తిన్నా తరగని సంపాదన ఉన్నా, జీవిత చరమాంకం లో కూడా ఇంకా ధనం కొల్లగొట్టాలనీ, దోచుకోవాలనీ తప్ప, ప్రజలకేమైనా మేలుచేద్దామనే ఆలోచన లేకుండా పోయింది. రాజకీయాల్లో నానాటికీ క్షీణిస్తున్న విలువలు, స్వార్ధచింతన, అవినీతి, లంచగొండితనం, స్వలాభం కోసం కపటంతో కూడిన వ్యక్తి ఆరాధన, ప్రజల సమిష్టి శ్రమనుంచీ ఉ త్పన్నమైన సంపదతో రాజ్యం అధీనంలో స్థాపించిన పరిశ్రమలు, సంస్థలు రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకోసం మోసపూరితంగా కారు చౌకగా అమ్ముకోవడం, నోట్లు చల్లి ఓట్లు పండించుకునే కొత్తరకం వ్యవసాయం, డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లోనై, ఓటు అమ్ముకునే ప్రజానీకం.... వంటివి బతికి ఉండి చూసినట్లయితే, వ్యక్తుల నైతిక విలువల పెంపు ద్వారా సమతా మమత నెలకొనే సమాజం ఏర్పడుతుందని భావించిన గాంధీ ఏమిచేసేవాడనేది, ప్రజాపక్షంగా ఆలోచించే నేటి బుద్ధి జీవులంతా పరిష్కార అన్వేషణలో వేసుకోవాల్సిన ప్రశ్న.

డా. బి.ఆర్. అంబేద్కర్

(14-04-1891 - 06-12-1956)



భారతరత్న భీంరావ్ రాంజీ అంబేద్కర్ ఇరవయ్యవ శతాబ్దపు ప్రజాస్వామిక వ్యవస్థలను పరిపుష్టం చేయడంలో కీలక పాత్ర వహించి, పీడిత ప్రజల పక్షాన పోరాడిన వాడు. భారతదేశ ప్రజాస్వామిక నిర్మాణానికి తాత్విక భూమిక అందించిన గొప్ప దార్శనికునిగా, మేధావిగా చరిత్రలో నిలుస్తాడు. ఆయన సాంప్రదాయిక బ్రాహ్మణ ఆధిపత్య సామాజిక వ్యవస్థను తీవ్రంగా

వ్యతిరేకించి, సమతా ప్రజాస్వామ్యానికై పూనుకున్నాడు. ఆయనతోటి నాయకులంతా రాజకీయ స్వాతంత్ర్యానికి ప్రాధాన్యత ఇస్తే, అంబేద్కర్ మాత్రం, సామాజిక స్వాతంత్ర్యానికి తొలి ప్రాధాన్యం ఇచ్చాడు. గౌతమ బుద్ధుడు, సంత్ కబీర్ దాస్, జ్యోతిరావ్ పూలేలు తనకు ఆదర్శమని చెప్పాడు. దళితులు, మహిళలు తీవ్ర అన్యాయానికీ, దోపిడీకీ గురవుతున్నారనే వాస్తవాన్ని ఎలుగెత్తి లోకానికి చాటి, జీవిత పర్యంతం వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి కృషి జరిపాడు.

మహారాష్ట్రలో నాడు అంటరానివారిగా భావించిన 'మెహర్' అనే కులంలో ఆయన పుట్టాడు. వీరు స్థానికులు. ఆర్యుల రాక తర్వాత వీరిని అస్పృశ్యులుగా మార్చారు. మెహర్ పేరు మీదనే మహారాష్ట్ర పేరు ఏర్పడిందని చెబుతారు. వీరంతా శౌర్య సాహసాలున్న యుద్ధ వీరులు. ఆంగ్లసైన్యంలో 'మెహర్ రెజిమెంట్' పేరిట ప్రత్యేక సైన్య విభాగమే ఉండేది. అంబేద్కర్ తండ్రి తాతలు కూడా సైన్యంలో పనిచేసినవారే. అయినా, వీరిపట్ల కూడా సామాజిక వివక్ష ఎంతో తీవ్రంగా ఉండేది. ఇంతటి ప్రతికూల పరిస్థితుల మధ్య, ఎన్నో అవమానాలను అధిగమించి, దాతల సహాయంతో, న్యూయార్క్ లోని కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. పట్టా పొందాడు. అక్కడి నుంచి లండన్ వెళ్ళి, అక్కడి స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ లో పట్టాలు పొంది, తర్వాత లండన్‌లో బార్ ఎట్ లా కూడా పూర్తిచేశాడు. అక్కడి బ్రిటీష్ మ్యూజియంలో ఉన్న గ్రంథాలు చదవడానికే ఎక్కువ కాలం ఉపయోగించాడు. అక్కడి పుస్తకాలలో అత్యధిక భాగం చదివిన ఇద్దరిలో ఒకవ్యక్తి కార్ల్ మార్క్స్ కాగా, రెండోవ్యక్తి అంబేద్కర్ మాత్రమే. స్వదేశానికి తిరిగివచ్చి, బరోడా సంస్థానంలో మిలటరీ కార్యదర్శిగా చేసినా, ఆ ఉద్యోగం వదిలి, ముంబైలో కళాశాలలో ఆచార్యునిగా చేరాడు. అంతటి మహామనిషి కూడా కులవివక్షను, ఛీత్కారాలనీ ఎదుర్కోక తప్పలేదు. అనంతర కాలంలో ఆయన సాంఘిక వివక్షకు, సామాజిక ఆర్థిక అసమానతలకూ వ్యతిరేకంగా దళితులు, అణగారిన వర్గాలు, స్త్రీల ప్రయోజనాల పరిరక్షణ కోసం జీవితాంతం కృషి చేశాడు. స్వాతంత్ర్య భారత దేశ తొలి న్యాయశాఖా మంత్రిగా, ఆధునిక భారతదేశ రాజ్యాంగ నిర్మాతగా సేవలందించాడు.

అవిద్య, అజ్ఞానం, హీనత్వానికి గురయి సమాజపు నేలమాళిగలలో అల్లాడే అసంఖ్యాక ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయడంకోసం మూక్ నాయక్ అనే కరపత్ర

పరంపర ప్రారంభించి, అనంతరం, 'బహిష్కృత భారత్' అనే పత్రికగా మార్చి విజయవంతంగా నడిపాడు. అంతే కాకుండా అనేక గ్రంథాలను సైతం రాశాడు. వాటిలో ముఖ్యమైనవి, "కుల నిర్మూలన"(Annihilation of caste)," "శూద్రులంటే ఎవరు?" (Who were the Shudras), "రాజ్యం, అల్పసంఖ్యాక వర్గాలు" (State and minorities), "అస్పృశ్యులంటే ఎవరు" (Who were the untouchables), "భాషాప్రయుక్త రాష్ట్రాలపై ఆలోచనలు" (Thoughts on linguistic states), "బుద్ధుడు, ధమ్మం" (Buddha and his Dhamma), "భారత మహిళల అభ్యున్నతి, పతనం" (Raise and fall of the Indian women), "బౌద్ధంపై అంబేద్కర్ ఆలోచనలు" (Dr. Ambedkar on Buddhism) అనేవి ముఖ్యమైనవి. ఇక రాజ్యాంగ రచనా సారధిగా నవభారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిది. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలకోసం ఆయన చేసిన ప్రతిపాదన నేగ్గే అవకాశమున్నా, గాంధీ ఆమరణ నిరాహార దీక్షతో అంబేద్కర్‌ను బ్లాకమెయిల్ చేసి, ఆ ప్రతిపాదన ఉప సంహరించుకునేలా చేశాడు.

ఈనాడు 'అంబేద్కర్ రాజ్యాంగం మొత్తం ఒక్కడే రాశాడా? అని అవహేళన చేసేవారు చాలామందే కనబడు తున్నారు. వాస్తవానికి భారత రాజ్యాంగంలో సాధారణ పరిపాలనా విధానాలను గురించి బ్రిటీషు చట్టాలు అనేకం ఉన్నాయి. వాటన్నిటినీ కాపీ చేసే గుమాస్తా పని ఎవరైనా చేయగలరు. కానీ దానికి మానవ హక్కులు, చట్ట సమానత్వం, అణగారిన వర్గాల ఉద్ధరణ, వంటి కీలక అంశాల్ని పొందుపరిచి ఒక ప్రజాస్వామిక రూపం ఇచ్చినవాడు మాత్రం అంబేద్కర్ ఒక్కడే. ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు ఉండడం, వాటిని న్యాయస్థానాల ద్వారా అమలు జరిపించుకునే హక్కు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, భిన్న జాతులున్న భరత ఉప ఖండంలో రాష్ట్రాలకు సరైన హక్కులకోసం సమాఖ్య వ్యవస్థ, రాజ్యం అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, బీసీలు, ఎస్సీలు, ఎస్టీ ప్రజానీకానికి వివక్షనుంచీ రక్షణ, రాజ్యం అనుసరించాల్సిన విధానాలపై ఆదేశిక సూత్రాలు వంటి ప్రజాస్వామిక హక్కులన్నీ అంబేద్కర్ ఆలోచనలలోంచీ రూపుదిద్దుకున్న అంశాలే. ఆయన లౌకిక వాదానికి ప్రాధాన్యం ఇచ్చాడు. రాజ్యం మతపర అంశాలలో జోక్యం చేసుకోగూడదని, పాలనా వ్యవస్థ ఏ మతాచారాలనీ ఏవిధంగానూ పాటించ కూడదనీ స్పష్టంగా నిర్దేశించాడు.

ఈరోజున ముఖ్యంగా దేశ జనాభాలో యాభై శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర కోటాల్లో విస్తృత ప్రజానీకం రిజర్వేషన్లు అనుభవించ డానికి ప్రధాన కారణం అంబేద్కర్ పట్టుదల, కృషి మాత్రమే అని చెప్పుకోవాలి. అన్ని కులాల్లోని పేదలతో సహా, తొంభై తొమ్మిది శాతం ప్రజానీకానికి మేలుచేసే అంశాలెన్నో ఆయన రాజ్యాంగ సభలోనూ, పార్లమెంటులోనూ ప్రవేశపెట్టినా ఆధిపత్య వర్గాల వ్యతిరేకత వల్ల వీగిపోవడం జరిగింది. రాజ్యాంగ సభలో ఆయన చిత్తు బిల్లు (డ్రాఫ్ట్) ప్రవేశపెట్టడమే కాకుండా, రాజ్యాంగ సభలోని సభ్యులందరి ప్రశ్నలకు, అభ్యంతరాలకూ సమాధానం చెప్పి అంగీకారం పొందాల్సి వుంటుంది. ఆ విధంగా రాజ్యాంగ సభలో ఆయన విఫలమైన ముఖ్య ప్రతిపాదన ఎక్కువగా ప్రచారంలోకి రాలేదు. అదే రాజ్య సామ్యవాదం. "రాజ్య సామ్యవాదం" (State socialism) లో అంబేద్కర్ ప్రవేశపెట్టిన అంశాల ప్రకారం వ్యవసాయ భూమి మొత్తం రాజ్యం స్వాధీనం చేసుకొని, ఉమ్మడి వ్యవసాయాన్ని నిర్వహించాలి. పరిశ్రమలన్నీ రాజ్యవ్యవస్థ యాజమాన్యంలో ఉండాలి. ఈ విధానం మార్క్స్ ఊహించిన కమ్యూనిష్టు వ్యవస్థకు పోలికతో కనబడుతోంది. రాజ్యాంగసభ తీవ్రంగా వ్యతిరేకించిన కారణంగా ఆయన దీన్ని రాజ్యాంగం లోని 'ప్రాథమిక హక్కుల విభాగంలో పొందుపరచడం కుదర లేదు. ఈ అంశం రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లో చేర్చి ఉంటే నేటి భారత ఉప ఖండం పరిస్థితి వేరుగా ఉండేది. **ఆర్థిక స్వాతంత్ర్యం లేని రాజకీయ స్వాతంత్ర్యం వృథా** అని ఆయన భావించాడు.

రాజకీయంగా "ఒక మనిషికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ" వుంటాయి. కానీ మన రాజకీయ ఆర్థిక వ్యవస్థ మూలంగా మన సామాజిక ఆర్థిక జీవనంలో మనం "ఒక మనిషికి ఒకే విలువ" అనే సూత్రాన్ని నిరాకరిస్తూనే ఉంటాం. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకపోతే, ఎంతో శ్రమించి నిర్మించిన ప్రజాస్వామ్య సౌధాన్ని అసమానతలు అనుభవిస్తున్న వారు ధ్వంసం (బ్లోఅప్) చేస్తారు– అని హెచ్చరించాడు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచిన 39(బి) అధికరణం ప్రకారం, దేశంలోని సహజ వనరులు, దేశసంపద ప్రజానీకపు ఉమ్మడి ఆస్తిగా పేర్కొనడం జరిగింది. కానీ, ఎనిమిది దశాబ్దాలు పూర్తి అవుతున్నా, వర్తమానంలో పరిస్థితి ఎట్లా వుందో మనం మనకళ్ళతో చూస్తూనే వున్నాం.

న్యాయశాఖామంత్రిగా ఆయన అనేక ప్రజాస్వామిక సంస్కరణలను పార్లమెంటులో పెట్టాడు. మహిళలకు ఆస్తిహక్కు, విడాకుల హక్కు, పునర్వివాహ హక్కుతో సహా అన్ని మానవ హక్కులు కల్పించేందుకు, కులం, మతం, లింగం ఆధారంగా ఉండే అన్ని వివక్షలు, అసమానతలనూ తొలగించి, సర్వ మానవులకూ సమాన హక్కులు కల్పించేందుకు కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా ఆయన 'హిందూ కోడ్ బిల్లు'ను పార్లమెంటులో ప్రవేశ పెట్టాడు. సనాతన వైదిక బ్రాహ్మలు, వారి సమర్ధకులూ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ కూడా వ్యతిరేకత వెలిబుచ్చి, బిల్లును ఉపసంహరించాల్సిందిగా కోరగా ప్రధాని నెహ్రూ అందుకు అంగీకరించలేదు. సనాతన వాదులు ఈ బిల్లుపై ఇంకా తీవ్ర వ్యతిరేకతలు రెచ్చగొట్టారు. జనసంఘ్ నాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సనాతన ధర్మాన్ని నాశనం చేస్తున్నారంటూ ఒక ప్రకటన విడుదల చేశాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)కార్యకర్తలు పెద్దపెట్టున వీధుల్లోకి వచ్చి, అంబేద్కర్, నెహ్రూలకు వ్యతిరేకంగా ఊరేగింపులు జరిపారు. నెహ్రూ కూడా మద్దతు ఇచ్చినా ఆ బిల్లును పూర్తిగా ఆమోదింప జేయడంలో విఫలమైన కారణంగా అంబేద్కర్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశాడు.

భారత ఉపఖండంలో పాకిస్తాన్ దేశం ఏర్పాటును సమర్ధించిన, ముస్లిమేతర నాయకుడు అంబేద్కర్ ఒక్కడే. ఈ విషయంలో ఎటువంటి మొహమాటం లేకుండా నిర్ద్వంద్వంగా, బహిరంగంగా తన అభిప్రాయాన్ని ప్రకటించాడు. మౌలికంగా ప్రత్యేక లక్షణాలున్న ప్రతి మతానికి, భాషాజాతికీ, సముదాయానికి తన మతం, సంస్కృతి, అస్తిత్వాలని కాపాడు కునే హక్కు, స్వయం ప్రతిపత్తి ఉండడమే అసలైన ప్రజాస్వామ్యం అని స్పష్టంగా నిలబడ్డాడు. అంతేకాకుండా ప్రధాన రాజకీయ, ఆర్థిక, సామాజిక స్రవంతి నుంచీ వెలివేతకు గురి అయిన అణచబడ్డ కులాలవారిని దోపిడీ పీడనలనుంచీ విముక్తి చేయడం కోసం, సర్వ స్వతంత్ర 'దళిత రిపబ్లిక్' ఏర్పాటుకై సమకట్టాడు. కానీ దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్లు, మత కలహాలలో వేలాదిమంది మరణించడం, కొంపాగోడూ వదులుకొని కాందిశీకులుగా మారిన హృదయ విదారక దృశ్యాల్ని చూసిన ఆయన కలత చెంది, తన మనసు మార్చు కొని 'దళితస్థాన్' డిమాండ్ ఉపసంహరించుకున్నాడు. ప్రతి భాషాజాతి తమ స్వతంత్రతను, సంస్కృతిని, తమ ప్రత్యేకతలను నిలుపుకోవడంలోనే భారతదేశపు భిన్నత్వంలో ఏకత్వాన్ని

నిలబెట్టుకోగలదనే ఆయన దార్శనికత వర్తమానంలో ఎంతో ప్రాముఖ్యతను కలిగివుంది. **భారతదేశ రాజ్యాంగపు రూపు రేఖల్ని ప్రజాస్వామ్యయుతంగా తీర్చి దిద్దడం ద్వారా ఎన్ని రకాల ఉల్లంఘనలున్నా ఇక్కడ ఈ మాత్రం ప్రజాస్వామిక వ్యవస్థ బలంగా ఉండడానికి అంబేద్కర్ కృషి మాత్రమే ప్రధానమని చెప్పడానికి ఏమాత్రం సందేహం లేదు.**


జవహర్ లాల్ నెహ్రూ

14-11-1889 - 27-05-1964

భారత ఉపఖండంలో ప్రజాస్వామిక సామ్యవాద భావనను, మిశ్రమ ఆర్థిక విధానం ద్వార కొత్తతరహా సామ్యవాదం అనే విధానాన్ని ప్రవేశపెట్టి, అందుకై కృషి చేసినవాడు నెహ్రూ. ఈయన ఒక కోటీశ్వరుల ఇంట పుట్టాడు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య అభ్యసించాడు. స్వాతంత్రోద్యమకాలంలో గాంధీజీకి కుడిభుజంగా పనిచేశాడు. భారత ఉపఖండాన్ని ముందుకు నడిపించడంలో దిశా నిర్దేశం చేసి సంపూర్ణ స్వాతంత్ర్యం, భారత రాజ్యాంగసభ, సామ్యవాదం, పంచశీల, పంచవర్ష ప్రాణాళికల ద్వారా అభివృద్ధి వంటి అంశాల్ని ప్రవేశపెట్టాడు. ఇతనిపై బెర్నాడ్ షా, బర్ట్రండ్ రస్సెల్, బుద్ధుడు, మార్క్సల ప్రభావం ఉంది. కార్ల్ మార్క్స్ చెప్పిన శాస్త్రీయ సామ్యవాదాన్ని ఆమోదించినా, కార్మిక వర్గ నియంతృత్వ భావనను మాత్రం వ్యతిరేకించాడు. కాంగ్రెస్ లోని మితవాదులతో విభేదించి, తిలక్ నాయకత్వంలోని అతివాదం వైపు మొగ్గాడు. కానీ తిలక్ మతభావనలను మాత్రం తీవ్రంగా వ్యతిరేకించాడు. స్వాతంత్ర్యోద్యమకాలంలో, తన తండ్రి అధ్యక్షతన ఏర్పడిన అఖిలపక్ష కమిటీ భారత ఉపఖండానికి పరిమిత అధికారాలతో, రాజకీయ పాలనాధికారం (dominion status) కోసం తీర్మానం చేస్తే, దాన్ని వ్యతిరేకించి, సుభాష్ చంద్రబోస్‌తో కలిసి, సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం నినదించాడు. నెహ్రూ అనేక గ్రంథాలు రాశాడు. డిస్కవరీ ఆఫ్ ఇండియా, గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ (జైల్లో ఖైదీగా ఉన్నప్పుడు కుమార్తెకు రాసిన ఉత్తరాలు) వంటి పుస్తకాలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలి.

నెహ్రూకు మతంపై విశ్వాసం లేదు. అతను సముపార్జించిన పాశ్చాత్య విజ్ఞానం, ఉదారవాద సిద్ధాంతాలు, అనుభవాలు అతడిని నాస్తికుడిగా మార్చాయి.

అందువల్లనే మత ప్రాతిపదికన బెంగాల్‌ను విభజించడానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపాడు. పేదరైతులు, చేతివృత్తులవారు, వ్యవసాయ కౌలుదార్లు, నిరుద్యోగ యువత సమస్యల పట్ల ఉద్యమాలు నడిపి వారికి



చేరువయ్యాడు. మతప్రమేయం, మత ప్రాధాన్యత లేని శాస్త్రీయ హేతువాద పంథాలో రాజ్య వ్యవస్థ ఉండాలని ఆశించాడు. నెహ్రూ జాతీయవాదాన్ని కోరుకున్నాడు. కానీ ఈయన జాతీయవాదం అఖండ భారత్ కాదు. జాతీయవాదాన్ని మతంతో ముడిపెట్టలేదు. ఆచార సాంప్రదాయాలు, సంస్కృతి, నాగరికతలను ప్రస్తావించే సందర్భంలో మతసంస్కృతిని ఎక్కడా పొగడలేదు. భారత దేశంలోని భిన్నత్వాన్ని గౌరవించినప్పుడే, భిన్న సంస్కృతుల్ని సమన్వయ పరిచినపుడే జాతీయతాభావం పెంపొందుతుందని భావించాడు. వివేకానందుడు, బిపిన్ చంద్రపాల్, అరవిందుడు తదితరులు అనుసరించిన మతపర జాతీయవాదాన్ని నెహ్రూ నిరసించాడు. నెహ్రూకు అహింసా ఉద్యమ పద్ధతుల మీద నమ్మకం ఎక్కువ. అందుకే గాంధీ మతభావాలు నచ్చకున్నా గాంధీని అనుసరించాడు. విద్యార్థిదశలో ఫేబియన్ సామ్యవాదం పై మక్కువ పెంచుకున్న నెహ్రూ ఇక్కడ ఉదారవాద సామ్యవాదాన్ని ప్రవేశపెట్టాడు. వ్యవసాయరంగంలో సహకార పద్ధతి ప్రవేశపెట్టాలని ఆశించాడు.

నెహ్రూ విధానాలను గమనించిన కొందరు అతడిని కమ్యూనిస్టుగా భావించేవారు. తన ఉద్దేశం కమ్యూనిజం చెప్పిన ఆర్థిక సామ్యవాదాన్ని ప్రజాస్వామ్యంతో మిళితం చేయడానికి కృషి చేయడం. సమాజంలో కులవ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించగలిగితే, వర్గరహిత సమాజం వస్తుందని విశ్వసించాడు. తన 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' అనే గ్రంథంలో, సమానత్వం ఉన్న సమాజంలోనే ప్రజాస్వామ్యం నిలబడుతుందని, అట్లా సమానత్వంలేని రాజ్యంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మనలేదనీ

పేర్కొన్నాడు. సామ్యవాదాన్ని నమ్ముతానని, విగ్రహారాధనపై తనకు నమ్మకం లేదని, ప్రకటించాడు. అమెరికా రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్న కాలంలో రష్యా పక్షం వహించాడు. తొలి భారతదేశ ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత రేడియోలో ప్రసంగిస్తూ, "సామాజిక నిర్మాణంలో మౌలికమైన మార్పులు తేవడం కోసం కృషిచేయాలని, అణచివేతలకు వ్యతిరేకంగా ఉండాలని, రాజకీయ అధికారాన్ని వికేంద్రీకరించాలనీ, ఇదే నిజమైన ప్రజాస్వామ్యమనీ అన్నాడు. ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని వర్గరహిత సమాజమని, సమ సమాజమనీ పేర్కొన్నాడు. తొలుత కమ్యూనిజానికి ఆకర్షితుడైన నెహ్రూ, కాలక్రమేణా దానికి దూరం జరిగాడు. వ్యక్తి స్వేచ్ఛా ప్రవృత్తిని, సృజనాత్మకతను. మార్క్సిజం అణచివేస్తుందని చెప్పాడు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛను సమర్థించాలని చెపుతూ, యుద్ధ సమయంలో తప్ప ఇతర సందర్భాల్లో రాజ్యం వ్యక్తి స్వేచ్ఛను సమర్థించాలన్నాడు. పాలనా వ్యవస్థలో అన్ని స్థాయిలలోనూ పెరుగుతున్న కేంద్రీకరణ వ్యక్తి స్వేచ్ఛకు ఆటంకమని చెబుతూనే, ఆర్థికాభివృద్ధికి అదెంతో అవసరం అన్నాడు. తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో **"ప్రణాళికా బద్ధ సమిష్టి ప్రజాస్వామ్య వాదం'** అనే భావనను ప్రవేశపెట్టిన నెహ్రూ, ఈ పద్ధతితోనే ఆర్థికకాభివృద్ధి సాధ్యమన్నాడు.

నెహ్రూ ప్రవేశపెట్టిన మిశ్రమ ఆర్థిక విధానం కాలక్రమేణా క్షీణించింది. ప్రజాధనంతో పెట్టిన భారీపరిశ్రమలు క్రమంగా పెట్టుబడి దారుల పరం అయ్యాయి తప్ప నెహ్రూ ఆశించిన ఫలితాలు రాలేదు. రాజకీయ సమానత్వమే అన్ని రకాల సమానత్వాలకు పునాదిగా భావించిన నెహ్రూ, సార్వజనీన ఓటుహక్కు ద్వారా ఒక్క రాజకీయ సమానత్వమే కాకుండా ఆర్థిక సమానత్వం కూడా సాధించవచ్చునని భావించాడు. ప్రజాస్వామ్యం అంటే క్రమశిక్షణ అని భావించిన నెహ్రూ, 'ప్రజలు తామంత తామే క్రమశిక్షణను అలవాటు చేసుకోవడమే ప్రజాస్వామ్యం' అంటూ, హింసకు తావులేని శాంతియుత పద్ధతులు, సామరస్యంతో వర్గరహిత సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చునని ఆశించాడు. రాజకీయ పక్షాలు వ్యక్తి స్వేచ్ఛను నిర్మూలిస్తాయని ఒప్పుకున్నా, సమర్థతతో పనిచేసే ప్రభుత్వాల ఏర్పాటుకు రాజకీయ పక్షాలు అవసరమని భావించాడు. ఐతే నెహ్రూ ఇప్పటి కరుడుగట్టిన రాజకీయ పార్టీల్లా ప్రతిపక్షాల్ని వైరిసమూహంగా చూడలేదు. ఉన్నత ప్రతిభావంతులు ఎక్కడ ఉన్నా, వారి సేవలను రాజ్య వ్యవస్థ కోసం ఉపయోగించుకున్నాడు. తమ పార్టీ కాకపోయినా అంబేద్కర్‌ను

రాజ్యాంగ రచనా సారథిగా ఆహ్వానించి ఆయన సేవలు ఉపయోగించుకోవడం, కేంద్ర న్యాయశాఖామంత్రి పదవి కట్టబెట్టడం, కొన్నిసార్లు సభలో తనని సమర్థించడం ద్వారా పార్టీ ప్రయోజనాలకంటే, దేశ ప్రయోజనాలకు పెద్దపీట వేశాడు. అలాగే ప్రతిపక్షంగా ఉన్న సర్వోదయ నాయకుడు జయప్రకాష్ నారాయణను కూడా మంత్రివర్గంలోకి రమ్మని ఆహ్వానించాడు.

అమెరికా రష్యాలు ప్రత్యర్థి కూటములుగా ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తున్న కాలంలో కూడా అంతర్జాతీయంగా మూడవ ప్రపంచ దేశాల రాజకీయ ఆర్థికస్వేచ్ఛకై పాటుబడ్డాడు. స్పెయిన్ లో అంతర్యుద్ధకాలంలో స్పానిష్ విప్లవకారులకు, చైనా విప్లవ కాలంలో అక్కడ విప్లవ పోరాటంలో ఉన్న కమ్యూనిస్టులకూ మద్దతు తెలిపాడు. జాతీయతా భావాన్ని ప్రాథమికంగా ఒప్పుకున్నా, తీవ్ర జాతీయవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. అగ్రరాజ్యాలను విమర్శించిన నెహ్రూ, అంతర్జాతీయ వ్యవహారాలలో అలీన విధానాన్ని ప్రవేశపెట్టాడు. దీన్ని మూడో ప్రపంచే దేశాలలో ఒక ఉద్యమంగా పెంచడానికి కృషి చేశాడు. ఈ అలీన విధానాన్ని 'నిరాసక్తత' లేదా ఎటూదూకని 'గోడమీది పిల్లివాటం'గా కొందరు అభివర్ణించారు. దీన్ని ఖండిస్తూ, 'అలీన విధానం అంటే అశక్తత లేదా చేతగానితనం కాదు. కూటమి లోని దేశానికి ఎటువంటి ముప్పు వాటిల్లినా చేతులు ముడుచుకు కూర్చోదు' అని స్పష్టంగా ప్రకటించాడు. అంతర్జాతీయ సంబంధాల్లో శాంతియుత సహజీవనం ప్రాతిపదికన పంచశీల సూత్రాలకు రూపకల్పన చేసి, 1954 లో చైనా ప్రధాని చౌఎన్ లై తో కలిసి పంచశీలను ప్రకటించాడు. ప్రజాస్వామ్యం, ఉదారవాదం, సామ్యవాద సిద్ధాంతాలలో తనకు సరికావని అనుకున్న భావాలను విమర్శించి, వీటన్నిటి సమన్వయంతో, కొత్త భారతదేశ ప్రజాస్వామిక రూపురేఖలకు పునాదులు వేశాడు. చరిత్రను రాయడమే కాక చరిత్రను నిర్మించిన నెహ్రూ మౌలికంగా పరిపూర్ణ మానవతావాదిగా పేరు పొందాడు.

4

ప్రజాస్వామ్యం - మానవవాదం

భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై ప్రధాన స్రవంతికి భిన్నంగా నూతన పంథాగా సాగిన రెండు కోణాలను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. భారతదేశంలో ప్రజాస్వామ్యం, మానవవాద దృక్పథం ఏర్పాటులో అవి పోషించిన పాత్ర చాలా కీలకమైనది. సంప్రదాయ చారిత్రక ధోరణిలో రాసే పాఠ్యపుస్తకాలు, ఇతర రచనల్లో ఈ అమూల్యమైన కోణాల్ని విస్మరించడం విచారకరం. ఆ రెండు స్రవంతులు రెండు పేర్లతో ముడిపడి ఉన్నాయి. ఒకటి యం.యన్.రాయ్, రెండు జయప్రకాశ్ నారాయణ.

మానవేంద్రనాథ్ రాయ్
(1886 - 1954)

20వ శతాబ్దపు ప్రపంచ రాజకీయ యవనికపై ప్రతిభావంతమైన కృషి చేసి, బలమైన ముద్రవేసిన గొప్ప ఆచరణశీలి, తొలితరపు కమ్యూనిస్టు విప్లవ రాజకీయవేత్త, తాత్వికుడు, ఎం.ఎన్. రాయ్. ఈయన 1886 మార్చ్ 21న బెంగాల్ లోని ఇరవై నాలుగు పరగణాల జిల్లాలో పుట్టాడు. వసంతకుమారి, దీనబంధు భట్టాచార్య ఇతని తల్లిదండ్రులు. ఈయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. అనంతరం తన పేరును 'మానవేంద్రనాథ్ రాయ్'గా మార్చు కున్నాడు. విప్లవకారునిగా రహస్య జీవితం గడిపే సమయం లోనూ, ఒకదేశం నుంచి వేరొక దేశానికి రహస్యంగా పారిపోయే సందర్భాల్లోనూ తన పేరును అనేకసార్లు అనేక రకాలుగా మార్చుకున్నాడు. తన విద్యార్థిదశలోనే బ్రిటీషు వారిని పారద్రోలే సమరశీల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. తన పద్నాలుగవ ఏట 'అనుశీలన సమితి' అనే అజ్ఞాతంగా పని చేసే విప్లవసంస్థలో చేరాడు.




బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా 1905లో జరిగిన ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. విప్లవ ఉద్యమ నిర్మాణంకోసం చిన్నవయసులోనే ప్రభుత్వ ఆస్తుల దోపిడీకి పాల్పడ్డాడు. ఆ సంస్థ నిషేధానికి గురి కావడంతో, జతిన్ ముఖర్జీ ఏర్పాటు చేసిన 'జుగంతర్' అనే సంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు.

హింసాయుత విప్లవ తిరుగుబాటు ద్వారానే దేశం స్వాతంత్ర్యం పొందడం సాధ్యమని బలంగా నమ్మాడు. ప్రపంచ యుద్ధం ప్రారంభమైన 1915లో అంగ్లేయుల పాలనను సాయుధ తిరుగుబాటు ద్వారా కూల్చడంకోసం, సహాయంకోసం జర్మనీకి వెళ్ళాడు. అక్కడి నుంచి జపాన్, చైనాదేశాలు తిరిగి శాన్‌ఫ్రాన్సిస్కో చేరాడు. అక్కడ ఈయనపై పోలీసు నిఘా ఎక్కువ కావడంతో, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చేరు కున్నాడు. అక్కడి గ్రంథా లయంలో కార్ల్ మార్క్స్ రచనలను క్షుణ్ణంగా చదివాడు. అమెరికా కూడా రెండో ప్రపంచయుద్ధంలో చేరడంతో ఈయనపై అక్కడి గూఢచారుల నిఘా ఎక్కువైంది. తనపై హిందూ జర్మనీ కుట్ర కేసు మోపి జైల్లో వేశారు. అక్కడ బెయిల్ పొంది, వెంటనే రహస్యంగా, మారుపేరుతో మెక్సికో దేశానికి చేరాడు. అక్కడి స్పానిష్ భాషను నేర్చుకొని, ఆ భాషలో స్థానికంగా ప్రథమస్థానంలో ఉన్న దిన పత్రిక "ఎల్ పుబ్లో" లో భారతదేశాన్ని గురించి అనేక వ్యాసాలు రాశాడు. మెక్సికన్ సోషలిస్ట్ పార్టీలో చేరి, తన క్రియాశీలక మేధోసంపత్తితో కొద్దికాలంలోనే ఆపార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఎదిగాడు. అప్పటికే తనకు ఉన్న కమ్యూనిస్టు భావాలకు మెక్సికోలోని 'మైకేల్ బరోడిదే' అనే ఆయన ప్రభావంతో పూర్తి మార్క్సిస్టుగా పరిణామం చెందాడు. 'సోషలిస్ట్ పార్టీ ఆఫ్ మెక్సికో' రాయ్ నాయకత్వంలో 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ మెక్సికో'గా మారింది. ఇది రష్యా బయట ఏర్పడ్డ తొలి కమ్యూనిస్ట్ పార్టీ.

ప్రపంచ విప్లవంలో భాగంగా...

సోవియట్ రష్యా ఆహ్వానం అందుకుని, 1920లో మాస్కోలో జరిగిన 'కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్' మహాసభకు మెక్సికో దేశపు ప్రతినిధిగా హాజరయ్యాడు. లెనిన్ తో కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని ప్రపంచమంతటా విస్తరించడంపై అనుసరించాల్సిన వ్యూహాల్ని గురించి చర్చలు జరిపాడు. వలస దేశాలలోని జాతీయ ఉద్యమాల్ని గురించి, ఈ ఉద్యమాల్లో బూర్జువా వర్గ ప్రజల పాత్ర గురించి, విస్తృతంగా చర్చలు నడిచాయి. ఈ అంశంపై లెనిన్ రాసిన **'థీసిస్ ఆన్ నేషనల్ అండ్ కలోనియల్**



క్వశ్చన్' అనే పుస్తకం లోని అంశాలపై లెనిన్‌తో రాయ్ విభేదించాడు. దాంతో లెనిన్ రాయ్‌ని ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని రూపొందించమని కోరాడు. ఆ కోరిక మేరకు రాయ్ ఒక ప్రత్యామ్నాయ సిద్ధాంత వ్యాసం రూపొందించాడు. దాన్ని అంగీకరించిన లెనిన్ ఆ సిద్ధాంతాన్ని 'కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్' లో కూడా ఆమోదింప జేశాడు. చైనాలో విప్లవోద్యమాన్ని గురించి రాయ్ ప్రతిపాదించిన సిద్ధాంత వ్యాసాన్ని అమలు పరిచేందుకు చైనాకు పంపారు. స్టాలిన్, కోమింటాంగ్‌తో చేసుకునే ఒప్పందాల్ని గురించి అభిప్రాయ భేదాల వలన, దాని అమలుకు రష్యా సానుకూలత చూపలేదు. వ్యావసాయికవిప్లవాన్ని ఇరుసుగా మావో 'రాయ్ సిద్ధాంతా'న్ని గెలిపించాడు. అయితే అనంతర కాలంలో వ్యావసాయిక విప్లవం విజయవంతం చేసిన మావో, రాయ్ సిద్ధాంతం సరయినదే అనే వాస్తవాన్ని ఆచరణలో రుజువు పరిచాడు.

వలస దేశాలలో విప్లవాల్ని విజయవంతం చేయడానికి రాయ్ రూపొందించిన సిద్ధాంతాన్ని అనుసరించి, భారతీయులకు విప్లవం విజయవంతం కావడానికి అనుసరించాల్సిన పద్ధతులపై శిక్షణ ఇచ్చేందుకు తాష్కెంట్‌లో **'ఇండియన్ పొలిటికల్ అండ్ మిలిటరీ స్కూల్'** పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ రాయ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారిలో– షౌకత్ ఉస్మానీ, మహమ్మద్ అలీ, ఎంపీటీ ఆచార్య, అబనీ ముఖర్జీ, వంటి అరవైమంది విప్లవకారులు ఉన్నారు. తాష్కెంట్ లోని ఇండియా హౌజ్‌లో 1920 అక్టోబర్ లో రాయ్ ఆధ్వర్యంలో 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా' స్థాపించబడింది. ఇందువల్లనే రాయ్‌ను భారత్ కమ్యూనిస్టు పార్టీ

వ్యవస్థాపకునిగా గుర్తిస్తారు. లెనిన్‌తో ఏర్పడ్డ అభిప్రాయ భేదాల వల్ల రాయ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నుంచి, రష్యా భూభాగం నుంచి కూడా బహిష్కృతుడయాడు. అక్కడి నుంచి ముందుగా బెర్లిన్ వెళ్ళి, ప్రవాసంలో ఉండగా తన **'రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ ఇన్ చైనా'** అనే గ్రంథం పూర్తి చేశాడు. చైనా వెళ్ళి, అక్కడి కమ్యూనిస్టు పార్టీ పాత్రను అధ్యయనం చేశాడు. అక్కడి నుంచీ, 'డాక్టర్ మహమ్మద్' అనే మారుపేరుతో బొంబాయి చేరుకున్నాడు.

జన్మభూమిలో...

భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చీలిక తేవడానికి విఫల ప్రయత్నం చేశాడు. ఆ సందర్భంగా, కాంగ్రెస్‌లోని మితవాదులను నిస్సహాయులు గానూ, అతివాదులను మతతత్వవాదులు గానూ అభి వర్ణించాడు. నెహ్రూతో కలిసి, కాంగ్రెస్ పార్టీ ముసాయిదాలో ప్రాథమిక హక్కులకు సంబంధించిన అంశాలు రూపొందిం చడంలో చేయూతనిచ్చాడు. ఎందరో క్రియాశీల కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాడు. **భారతదేశానికి ఒక రాతపూర్వక రాజ్యాంగం అవసరం ఉందని తొలిగా చెప్పినవాడు రాయ్.** తనపై కుట్రకేసు బనాయించడంతో, 1931 నుంచి ఆరేళ్లపాటు జైలు జీవితం అనుభవించాడు.

జైలు శిక్ష పూర్తిచేసుకొని బయటకు వచ్చిన తర్వాత, కాంగ్రెస్ పార్టీని విప్లవశక్తిగా మలచడం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరి, క్రియాశీలకంగా పని చేశాడు. జైపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభను ఉద్దేశించి ప్రసంగించాడు. ముఖ్యంగా 1940లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేశాడు. ఆ పదవికి గాంధీ మౌలానా అబుల్ కలాం పేరును ప్రతిపాదించడంతో, రాయ్ ఆ ఎన్నికలో ఓడిపోయాడు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో 'లీగ్ ఆఫ్ రాడికల్ కాంగ్రెస్ మెన్' అనే సంస్థను ఏర్పాటు చేసి, 'ఇండియా అండ్ వార్' అనే సిద్ధాంతం అమలు పరచడానికి పూనుకున్నాడు. అయితే కాంగ్రెస్ ఇందుకు ఒప్పుకోలేదు. దాంతో ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, 1946 లో 'రాడికల్ డెమోక్రటిక్ పార్టీ' స్థాపించాడు. 'స్వాతంత్ర్య భారత దేశానికి ముసాయిదా రాజ్యాంగం', 'ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రణాళిక' అనే రెండు సిద్ధాంత గ్రంథాలు ప్రకటించాడు. తన దృష్టి కోణంలో, ఆలోచనా విధానంలో తేడా రావడం వలన, **1947 వరకూ తాను మార్క్సిస్ట్‌నే అని చెప్పుకున్న**



రాయ్ తర్వాత కమ్యూనిస్టు భావాలకు దూరంగా జరిగాడు. అనంతరం, 'కమ్యూనిజాన్ని మించి' (బియాండ్ కమ్యూనిజం) పేరిట ఇరవై రెండు సిద్ధాంత వ్యాసాల్ని వెలువరించి, దాని ప్రణాళికను 'హ్యూమనిజం మానిఫెస్టో' పేరుతో వెలువరించాడు. తాను స్థాపించిన రాజకీయ పార్టీని కూడా రద్దు చేసి, మానవవాద సిద్ధాంతాల ప్రాతిపదికన ఒక ఉద్యమాన్ని ప్రారంభించాడు. అదే 'రాడికల్ హ్యూమనిజం'గా పేరు పొందింది. దీన్నే నవ్య మానవవాదంగా పిలుస్తున్నాం. ఆయన తన జీవిత చరమాంకంలో రాసిన 'మతం, కాల్పనికవాదం, విప్లవం' అనే గ్రంథంలో దీన్ని మరింత విపులీకరించాడు. ఈయన మొత్తం డెబ్బైరెండు పుస్తకాలు రాశాడు. వాటిలో అరవయ్యారు గ్రంథాలు తన జీవిత కాలంలోనే ప్రచురితమయ్యాయి. ఆయన తన అనుభవాలు, జ్ఞాపకాలపై ఇంకా రాయాలనుకున్న కోరిక తీరకుండానే, 1954 జనవరి 25వ తేదీన కన్నుమూశాడు.

రాయ్ తన జీవితంలో రాజకీయ అవగాహన, ఉద్యమ స్ఫూర్తి ఉన్న స్త్రీలనే పెళ్లి చేసుకున్నాడు. ఏవిలిన్ ట్రెండ్ అనే అమెరికా యువతిని 1916లో న్యూయార్క్ నగరంలో వివాహ మాడాడు. వీరు 1926లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత చాలా కాలంవరకు మరో అమెరికా యువతి 'ఎల్లాన్ గాట్స్ హాక్'తో కలిసి ఉన్న రాయ్ 1937 మార్చ్ 10న తన యాభయ్యవ ఏట ముప్పై మూడేళ్ళ 'ఎల్లాన్ గాట్స్ హాక్' ను వివాహమాడాడు. 1954 జనవరి 25వ తేదీన రాయ్ కన్ను మూసేవరకూ

ఆమె అతడితోనే జీవించింది. రాయ్ చనిపోయిన తర్వాత 'రాడికల్ హ్యూమనిస్ట్' పత్రికకు సహసంపాదకురాలిగా పనిచేసింది. అనేక పత్రికలలో వ్యాసాలు రాసింది. రాడికల్ హ్యూమనిష్టు సిద్ధాంత ప్రచారంలో భాగంగా అమెరికా, ఐరోపా దేశాలలో విస్తృతంగా పర్యటించింది. ఆమె యాభయ్యారేళ్ల వయసులో బెర్లిన్‌లో జరిగిన కారు ప్రమాదంలో చనిపోయింది.

రాయ్ భావాలు

రాయ్ సహజంగానే తన రచనలు, ఆచరణలో సమానత్వానికే పెద్దపీట వేశాడు. అందుకు ఉదాహరణగా తను 1922 సంవత్సరంలో 'గయ' నగరంలో జరిగిన కాంగ్రెస్ మహాసభలలో ఒక తీర్మానాన్ని చర్చకు పెట్టాడు. అందులో, **జమిందారీ వ్యవస్థ రద్దు, భూమి శిస్తు నామమాత్రం చేయడం, పరోక్ష పన్నుల రద్దు, ఆధునిక పరిశ్రమల అభివృద్ధి, సార్వజనీన సేవల జాతీయాకరణ, ఆధునిక పరిశ్రమల అభివృద్ధి, కనీస వేతనాల స్థిరీకరణ, ఉచిత నిర్బంధ విద్య, రాజకీయాలు, పాలన నుంచి మతాన్ని వేరు చేయడం** వంటి అనేక ముఖ్యాంశాలు ఉన్నాయి.

రాయ్ తత్వశాస్త్రాన్ని ఆధిభౌతికశాస్త్రం (మెటాఫిజిక్స్) నుంచి వేరు చేశాడు. ఊహాత్మక తత్వవాదాన్ని వ్యతిరేకించడమే కాకుండా, మతతత్వశాస్త్రాన్ని, మత గ్రంథాలనూ తత్వశాస్త్రంగా గుర్తించడాన్ని కూడా నిరాకరించాడు. రాయ్ చాదస్తపు మత భావనలను, మతతాత్విక అభూత కల్పనలనూ నిరసించడం తత్వశాస్త్రానికి ఒక ముందస్తు షరతుగా స్పష్టపరిచాడు. ప్రకృతి రహస్యాల్ని అన్వేషించడంలో సైన్సు మరింత లోతులకు చొచ్చుకుపోయి, సమస్యలకు, చిక్కుముడులకూ పరిష్కారాన్ని సాధిస్తుంటే, మతతత్వం మాత్రం సమస్యలకు పరిష్కారాల్ని సాంప్రదాయక మెట్టవేదాంతంలో వెతుక్కోమని చెబుతుంది అన్నాడు. రాయ్ తన నవ్య మానవవాద సిద్ధాంతాన్ని 22 పత్రాల్లో రాశాడు. సమాజంలో స్వేచ్ఛాజీవి అయిన మానవుని పాత్ర గురించి మొదటి సిద్ధాంత పత్రంలో చెబుతూ– స్వేచ్ఛ, సాంఘిక విముక్తి, ప్రగతి, ఊహాజనిత ఆదర్శాలని వివరించాడు. రెండవ పత్రంలో స్వేచ్ఛ, సత్యాన్వేషణల గురించి వివరిస్తూ, జ్ఞాన విస్తరణతోనే స్వేచ్ఛ వర్ధిల్లుతుందని అన్నాడు. మూడవ పత్రంలో స్వేచ్ఛయే మానవ లక్ష్యంగానూ, అదే మానవ ప్రగతిని నిర్ధారిస్తుందని అన్నాడు. నాల్గవ పత్రంలో మానవ స్వభావాన్ని గురించి రాశాడు. ఐదవ పత్రంలో

చరిత్రను ఆర్థిక కోణం నుంచీ విశ్లేషించాడు. కానీ, ఇది మార్క్స్ చెప్పిన చారిత్రిక భౌతిక వాదానికి భిన్నమైంది. గ్రామీణ పరిశ్రమల ప్రాతిపదికన ఉండే గాంధీ చెప్పిన ఉత్పత్తి విధానానికి సంబంధించిన సిద్ధాంతాల్ని వ్యతిరేకించాడు. ఆరోపత్రంలో సామాజిక వాతావరణంపై వ్యాఖ్యలున్నాయి. ఆలోచనకు స్వంత అస్తిత్వం, స్వయంగా నిర్దేశించుకున్న సూత్రాలూ ఉంటాయని, చారిత్రిక సంఘటనలు, ఆలోచనల పోకడల మధ్య ఏ దశలోనూ ఖచ్చితమైన కారక సంబంధాన్ని నిర్ధారించడం సాధ్యం కాదన్నాడు. ఏడవ పత్రంలో నూతన ప్రపంచ నిర్మాణాన్ని వివరించాడు. స్వేచ్ఛావిప్లవాలు సామాజిక ఆర్థిక పునర్ వ్యవస్థీకరణకు దోహదం చేస్తాయని, వాటి ఆధారంగా నూతన ప్రపంచ నిర్మాణం చేయాలని అన్నాడు. ఎనిమిదోపత్రంలో రాజ్యం, రాజకీయ వ్యవస్థ, రాజ్య నిర్మాణం గురించి, తొమ్మిదవ పత్రంలో ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణ సూత్రాలను గురించి రాశాడు. వీటిలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని గురించి, వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాతిపదికన ఉత్పత్తి ప్రణాళికను రూపొందించాలని సూచించాడు. పదోపత్రంలో రాజ్య యాజమాన్యం, ప్రణాళికా బద్ధ ఆర్థికవ్యవస్థపై విమర్శనాత్మక వ్యాసాలు రాశాడు.

పదకొండో పత్రంలో నియంతృత్వంపై రాస్తూ, ఎటువంటి నియంతృత్వ మయినా అంతిమంగా వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తుందని హెచ్చరిక చేశాడు. పన్నెండవ పత్రంలో, ప్రజల సార్వభౌమత్వంపై ఆధారపడిన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడాలని సూచించాడు. పదమూడవపత్రంలో ఉదారవాదంపై విమర్శలు చేస్తూ, కర్మ సిద్ధాంతం దోపిడీని నిరంతరం కొనసాగించడానికి దోహదపడుతుందనీ, స్వేచ్ఛ, నైతికవిలువలు మాత్రమే మానవుని హేతుబద్ధ జీవిగా రూపొందిస్తాయని అన్నాడు. సామాజిక రాజకీయ వ్యవస్థలను గురించి తన పద్నాలుగో పత్రంలో వివరించాడు. నియంతృత్వానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఒక్కటే ప్రత్యామ్నాయ వ్యవస్థ కాదని, ఆచరణలో ప్రజలందరికీ ప్రత్యక్ష భాగస్వామ్యం వుండే సమీకృత ప్రజాస్వామ్యమే దీనికి పరిష్కారమని అన్నాడు. మేధస్సే ఉత్పత్తి సాధనమని, అది అత్యంత విప్లవాత్మక సరుకును ఉత్పత్తి చేస్తుందని, మానవుడే చరిత్ర నిర్మాత అని పదిహేనవ పత్రంలో వివరించాడు. పదహారో సిద్ధాంతపత్రంలో సాంఘిక చైతన్యాన్ని, పదిహేడో పత్రంలో పురోగామి ప్రజాస్వామ్యం, అందుకు దోహదం చేసే పరిస్థితుల్ని గురించి వివరించాడు. 'స్వేచ్ఛ' అనే అంతిమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రజలకు అవసరమైన మౌలిక పరిస్థితులను గురించి పద్దెనిమిదో పత్రంలో చెప్పేడు. పందొమ్మిదో పత్రంలో పురోగామి

ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని గురించి వివరించి, ఇరవయ్యవ పత్రంలో ప్రజల చైతన్యాన్ని గురించి విశ్లేషించాడు. ఇరవయ్యోకటవ పత్రంలో నూతన ఆలోచనా పంథా గురించి, విశదీకరించాడు. పురోగామి మానవతా సిద్ధాంతాన్ని గురించి ఇరవై రెండో పత్రంలో రాశాడు. జీవపరిణామం గురించి డార్విన్ చేసిన ప్రతిపాదనలు మనిషిని దేవుడు సృష్టించాడానే నమ్మకాన్ని బద్దలు చేసి, అనేక శాస్త్రీయ ఋజువులు చూపడం మానవవాదానికి మంచి పట్టు చేకూర్చింది.



రాయ్ - మార్క్సిజం

రాయ్ కాలక్రమేణా మార్క్సిజం నుంచీ దూరం జరిగినా, కారల్ మార్క్సుని మాత్రం రాయ్ వ్యక్తిగతంగా ఆకాశానికెత్తేశాడు. **మార్క్స్ మౌలికంగా ఒక మానవవాది, స్వేచ్ఛాప్రియుడు అని కొనియాడాడు.** మార్క్స్ చెప్పిన ఆర్థికాంశాల నిర్ణాయకత్వాన్ని కాదని, మార్క్స్ భావాల నుంచీ నైతిక, వ్యక్తివాద విముక్తి సిద్ధాంతాల్ని వేరుచేసేందుకు రాయ్ ప్రయత్నించాడు. మార్క్స్ వర్గ సంఘర్షణకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చాడని, అనుభవవాదం ప్రాతిపదికన వ్యక్తి గురించి పట్టించుకోలేదనీ విమర్శించాడు. సామాజిక ప్రక్రియలో మేధోకార్యకలాపాల పాత్రను మార్క్సిజం తక్కువ చేసిందని, అందువల్ల మార్క్స్ చరిత్రను ఆర్థిక కోణం నుంచి అన్వయించిన తీరు లోపభూయిష్టమైందనీ అన్నాడు. మార్క్స్ 'వ్యక్తివాదం' అనే ఉదార సిద్ధాంతాన్ని తిరస్కరించాడనీ, చారిత్రిక పరిణామంలో మార్క్స్ వ్యక్తుల వ్యక్తిగత పాత్ర, వ్యక్తి చేసే కృషికి ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వకపోవడం లోపంగా చెప్పాడు. మార్క్సిస్టు తత్వశాస్త్రంలో వ్యక్తిగత సృజనాత్మక ఆలోచనల పాత్రను, ప్రాధాన్యతను తగ్గించివేశారన్నాడు. భావవాద, భౌతికవాద ప్రక్రియలు సమాంతరంగా చరిత్రను నిర్మిస్తాయనే కొత్త సిద్ధాంతాన్ని రాయ్ ప్రతిపాదించాడు. గతితార్కిక భౌతికవాదం ఒక్కటే సంపూర్ణమైన తత్వశాస్త్రమని చివరి వరకూ అంగీకరించాడు. వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం లేనిదే సంపూర్ణ స్వేచ్ఛకూడా లేదని కూడా రాయ్ పేర్కొన్నాడు. ఇందుకై ఒక ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలని, ఈ వ్యవస్థ వ్యాపారం కోసం కాకుండా కేవలం సామాజికుల వ్యక్తిగత

అవసరాల కోసమే ఉత్పత్తి చేయాలని సూచించాడు. సంపద, సరకులు సమానంగా పంపిణీ కావాలని భావించాడు. అలానే విప్లవ రాజకీయాలు శాస్త్రీయమైన భౌతికవాద తత్వశాస్త్రం నుంచి స్ఫూర్తి పొందాలని, ఇటువంటి శాస్త్రీయ స్పృహ లోపిస్తే, రాజకీయరంగం మతప్రచారకులు, అధికార సిఫారసులు, ఆశ్రిత పక్షపాతపు మాయగాళ్లతో నిండిపోయి, ఇటువంటి వారికి ఆధ్యాత్మిక నైతిక రాజకీయాలు ఆశ్రయంగా మారతాయని హెచ్చరించాడు.

రాడికల్ హ్యూమనిజం

రాడికల్ హ్యూమనిజం ప్రకృతి యదార్ధమని, మానవుడు కూడా ప్రకృతిలో భాగమని చెబుతుంది. **భౌతిక విశ్వమంతా కొన్ని నియమాలకు లోబడి నడుస్తుందని, శోధనకు, నిరూపణకూ నిలబడేదే సత్యమని మానవవాదం విశ్వసిస్తుంది. ఏ సంఘటనా కారణం లేకుండా సంభవించదని మానవవాదం పేర్కొంటుంది. మానవునికి అస్తిత్వం, చలనం అనే అంశాల్ని అర్థం చేసుకునే హేతుబద్దత ఉంది. భౌతికమైన మానవ మేధస్సు శక్తి అద్వితీయమైనది. మానవ మేధస్సుకున్న అద్వితీయమైన ఈ శక్తి మానవులకు హేతుబద్ధ స్వభావం కలగ జేస్తుంది.** రాయ్ దృష్టిలో మానవున్ని నిర్దేశించే సూత్రాలకు, భౌతిక శాస్త్రాలను నిర్దేశించే సూత్రాలకూ, ఈ హేతుబద్ధ ఆలోచన తప్ప తేడా లేదు. రాడికల్ హ్యూమనిజంలో వ్యక్తికి, సమాజానికీ ఉన్న తేడాను చూపిస్తూ, సమాజానికంటే వ్యక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నది. వ్యక్తికి, కష్టం, సుఖం, దుఃఖం, అన్ని అనుభూతులూ ఉంటాయని, మానవుడు తన మెదడు కణాలలో అనుభూతిని సృజించే శక్తి కలిగి ఉన్నాడు కాని, ఇటువంటిది సమాజానికి లేదు కాబట్టి, సామాజిక సుఖం, సామాజిక ఆనందం, సామాజిక దుఃఖం, వంటి వాటికి ప్రత్యేక ఉనికి లేదని, ఇవి వ్యక్తుల సుఖదుఃఖాల సమ్మేళనమేనని, అందువల్ల సమూహ, సామాజిక భావనకు విలువ లేదని, సామూహిక భావన మిథ్య కాబట్టి మనిషినే కేంద్రంగా భావించాలన్నాడు. అందువల్లనే హ్యూమనిస్టుల సిద్ధాంతంలో మనిషే అన్నిటికీ కొలబద్ద అని, మనిషినే ప్రమాణం గా భావించాలని చెబుతోంది. రాయ్ దృష్టిలో మానవునికి గమ్యం మనిషే. ఏ సంస్థ అయినా వ్యవస్థ అయినా ఈ గమ్యాన్ని చేరేందుకు మార్గం మాత్రమేననీ, నిరంతరం మనిషి పోరాడేది వ్యక్తిస్వేచ్ఛ కోసమేననీ, రాజ్యంలో, సమాజంలో సభ్యత్వం పొందేది తన వ్యక్తిస్వేచ్ఛను రక్షించుకోవడానికేనని రాయ్ సూత్రీకరించాడు. మనిషి తన స్వేచ్ఛను పరిరక్షించు కోవడానికి ఏర్పడిన ఈ సంస్థలు

మనిషిని బందీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నాడు.

రాజకీయ అంశాలపై చెబుతూ, సామ్యవాద పరిశ్రమల ఆధారంగా ప్రణాళికాబద్ధ ఆర్థికవ్యవస్థ నిర్మించ డానికి శక్తివంతమైన రాజ్య యంత్రాంగం ఉండాలన్నాడు. కార్మిక నియంతృత్వం వ్యక్తిస్వేచ్ఛను హరిస్తుంది కాబట్టి అది కూడా మంచిది కాదని చెప్పాడు. రాజకీయ ప్రజాస్వామ్యం లేనిదే ఆర్థిక ప్రజాస్వామ్యం లేనట్లేనని చెప్పాడు. మానవుడు, వ్యక్తిస్వేచ్ఛా మాత్రమే ప్రధానం కాబట్టి, రాజ్యాన్ని, సమాజాన్నీ వ్యక్తిస్వేచ్ఛ సాధించే మార్గాలుగానే చూడాలన్నాడు. అదేవిధంగా, రాయ్ సిద్ధాంతం జాతీయవాదాన్ని కూడా నిరసిస్తుంది, అది సంకుచితమైందని, ప్రపంచ మానవాళి మొత్తం సౌభ్రాతృత్వంతో మెలగాలని కోరుకొన్నాడు. రాజకీయ, భౌతికవాద తత్వశాస్త్రాల్లో గొప్ప ముద్రవేసిన మేధావిగా రాయ్ చరిత్రలో నిలిచిపోతాడు.



జయప్రకాష్ నారాయణ
(1902 - 1979)

లోక్ నాయక్ గా ప్రసిద్ధుడైన జయప్రకాష్ నారాయణ భారత ఉపఖండ రాజకీయాల్లో ఎనలేని ప్రభావం చూపిన వ్యక్తి. ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాకు, బీహార్‌లోని సారన్ జిల్లాకు మధ్య ఉన్న సితాబ్దియారా గ్రామంలో జన్మించాడు. తండ్రి చిన్నస్థాయి ప్రభుత్వ ఉద్యోగి. తల్లి గృహిణి. అయినా వారు జెపి విద్యాభ్యాసం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కళాశాల విద్యను పాట్నాలో చదివాడు. అనంతరం కస్తూరిబాయ్ అనుచరురాలు, సబర్మతి ఆశ్రమంలో ఉండే ప్రభావతీ దేవిని పెళ్లి చేసుకున్నాడు. తను ఇంకా చదవాలనే ఆకాంక్షను నెరవేర్చు కోవడానికి 1921లో అమెరికా వెళ్ళాడు. అక్కడ చిన్నా చితకా పనులు చేస్తూ, విద్యాభ్యాసం కొనసాగించాడు. హెూటల్ సర్వర్‌గా, ఫాక్టరీ కూలిగా, వ్యవసాయ కూలిగా పొట్టపోసు కోవలసి వచ్చింది. సంపన్నవంతమైన అమెరికాలో, ఒకపక్క అత్యంత వైభవోపేతమైన సంపదను, మరోపక్క దుర్భర దారిద్ర్యాన్ని చూసిన తర్వాత ఆయనలో సోషలిస్టు భావాలకు బీజాలు పడ్డాయి. అక్కడ ఉన్నకాలంలో విస్తృతంగా మార్క్స్ రచనలను

అధ్యయనం చేసి మార్క్సిస్ట్ గా మారాడు. అనంతరం ఎం.ఎన్. రాయ్ రచనల ప్రభావానికి లోనయ్యాడు.

జాతీయ కాంగ్రెస్‌లో...

అమెరికా నుంచి 1929లో భారతదేశం వచ్చిన వెంటనే నెహ్రూ ఆహ్వానం మేరకు జాతీయ కాంగ్రెస్‌లో చేరి, తక్కువ కాలంలోనే గాంధీకి ప్రియశిష్యునిగా మారాడు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా 1932లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించాడు. జైల్లో ఉన్న సాటి ఉద్యమ నాయకులు మినూ మసానీ, అచ్యుత్ పట్వర్ధన్, నానా సాహెబ్ గోరే తదితరులతో చర్చించి, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కాంగ్రెస్‌లో ఒక భాగంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామక మయ్యాడు. క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన 1942వ సం॥లో కాంగ్రెస్ సీనియర్ నాయకులంతా అరెస్టయి జైళ్ళలో ఉన్న కాలంలో రాంమనోహర్ లోహియా వంటివారితో కలిసి ఉద్యమం ఆగకుండా కొనసాగించాడు. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ పార్టీనుంచి బయటకు వచ్చి, ఆచార్య నరేంద్రదేవ్, బావన్ సింగ్ తదితరులతో కలిసి సోషలిస్టు పార్టీ స్థాపించి ప్రతిపక్ష పార్టీగా సేవలందించాడు. ఈ సందర్భంగా నెహ్రూ, 'జేపీ సేవలు దేశానికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో' ఆయన్ని కేంద్ర మంత్రివర్గంలోకి ఆహ్వానించాడు. ఈయన ఆ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. ఈ పార్టీ అనంతరకాలంలో ప్రజా సోషలిష్టు పార్టీగా పేరు మార్చుకొని, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించింది. తన రాజకీయ సామాజిక అభిప్రాయ ప్రచారానికి, వ్యక్తీకరణకూ ఆయన విస్తృతంగా రాశాడు. సామ్యవాదం ఎందుకు? ప్రజాస్వామ్య సామ్యవాదం -మన ఆదర్శం, విధానం, ఓ కొత్త సమాజమార్గంలో సామ్యవాదం, సర్వోదయ, ప్రజాస్వామ్యం- సంపూర్ణ విప్లవ దిశగా, వంటి అనేక పుస్తకాలు రాశాడు.


నెహ్రూతో జె.పి.

సంపూర్ణ విప్లవం

స్వాతంత్ర్యం తర్వాత భారత దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ బలంగా వేళ్లూనుకున్న దశలో సోషలిస్ట్ పార్టీ పరాజయం కావడంతో, 1954లో రాజకీయాల నుంచి

విరమించుకొని, వినోభాబావే ప్రారంభించిన సర్వోదయ, భూదాన్ ఉద్యమాల్లో పని చేశాడు. తన భూమి మొత్తం పేదప్రజలకు ఇచ్చి, హాజరీబాగ్‌లో ఒక ఆశ్రమాన్ని నిర్మించాడు. తిరిగి 1960 దశాబ్దపు చివరిలో ఒక ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ఈ ఉద్యమ కాలంలోనే శాంతియుత సంపూర్ణ విప్లవానికి పిలుపు ఇచ్చాడు. పాట్నాలో 1974లో జరిగిన సభలో జేపి సంపూర్ణ విప్లవాన్ని ప్రకటించాడు. సంపూర్ణ విప్లవ కార్యక్రమం ప్రకారం శాసనసభలని వెంటనే రద్దు చేయాలి. పన్నుల చెల్లింపు నిలుపుదలచేసి, ఒక సంవత్సరం పాటు పాఠశాలలు, కళాశాలలూ మూసివేయాలి. ప్రజా సంఘాలు ఏర్పాటు చేసి, వాటిద్వారా ప్రజల అవసరాలు తీర్చాలి. ప్రజాసమస్యల పరిష్కారంతోబాటు వ్యక్తుల్లో నైతిక విలువల పెంపుకు కూడా కృషి చేయాలని పిలుపు ఇచ్చాడు. సంపూర్ణ విప్లవం ద్వారా ప్రభుత్వ పాలనను స్తంభింపజేసి, గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించవచ్చని, ఈ కార్యక్రమం అన్ని రంగాలలోనూ విప్లవాత్మక మార్పులు తెస్తుందని జేపి ఆశించాడు.

ఎమర్జెన్సీ కాలంలో...

అనంతరం ఎమర్జెన్సీ కాలంలో భారత రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాడు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఆరోపణలపై విచారించిన అలహాబాద్ హైకోర్టు, పార్లమెంటు సభ్యురాలిగా ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. తీర్పు వచ్చిన రోజే, ఇందిరాగాంధీ వెంటనే రాజీనామా చేయాలని జేపి డిమాండ్ చేశాడు. ఆమె ఇచ్చే చట్టవిరుద్ధమైన ఉత్తర్వులు పాటించాల్సిన అవసరం లేదని సైన్యానికి, పోలీసులకు సూచించాడు. ఈవిధంగా రాజ్య యంత్రాంగానికి పిలుపునివ్వడం తీవ్ర సంచలనానికి కారణమైంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిగా వేరొకరిని ఎన్నుకోడానికి వీలుగా, అలహాబాద్ హైకోర్ట్ ఇందిరాగాంధీ రాజీనామా చేయడానికి కొద్ది సమయం ఇచ్చింది. ఈ వ్యవధిలో ఇందిరాగాంధీ 1975 జున్ 25న అర్థరాత్రి, దేశంలో అత్యవసర పరిస్థితి విధించి, కాంగ్రెస్ పార్టీలోని అసమ్మతి వాదులతో సహా జేపీని జైల్లో ఉంచారు. ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగినపుడల్లా జేపి గళమెత్తాడు. బీహార్ వరదల సందర్భంగా పెరోల్‌పై విడుదల చేయాలని కోరినా ప్రభుత్వం తిరస్క రించింది. జైల్లో జెపి ఆరోగ్యం క్షీణించడంతో, 1976 నవంబర్‌లో తనను జైలు నుంచి విడుదల చేశారు.

ఇందిరా గాంధీ 1977 జనవరి 18న అత్యవసర పరిస్థితి ఎత్తివేసి, ఎన్నికలు ప్రకటించింది. ఎన్నికలలో ఇందిరాగాంధీని ఎదుర్కోవడం కోసం దేశంలోని వివిధ పక్షాల కలయికతో, జనతా పార్టీ రూపు దిద్దుకుంది. ఈ సందర్భంగా నేటి బీజేపీకి పూర్వరూపంగా ఉన్న జనసంఘ్ పార్టీ కూడా జనతాపార్టీలో భాగస్వామ్యం కోరింది. జేపి అందుకు అంగీకరించక పోవడంతో, తన మతవాసనలు, ఆర్ఎస్ఎస్ తో సంబంధాలు వదులు కుంటానని జేపికి మాటయిచ్చి జనతా కూటమిలో చేరింది. అయితే ఆ మాట నిలుపుకోకుండా జనసంఘ్ తనను మోసం చేసిందని అనంతరకాలంలో జేపి అనేకసార్లు బాధపడ్డాడు. జేపి నాయకత్వంలోని జనతాపార్టీ 1977లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించింది. ఆ విధంగా భారత ఉపఖండం చరిత్రలోనే తొలిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడేందుకు జేపి నేతృత్వం వహించాడు. మురార్జీ దేశాయ్ ప్రధానమంత్రి అయ్యాడు. తర్వాత రెండేళ్లకే జనతా ప్రభుత్వం అంతర్గత కలహాలతో కూలిపోయింది. మురార్జీ దేశాయ్, చరణ్ సింగ్ వర్గాలుగా చీలింది. ఇందిరాగాంధీని కొద్దికాలం జైల్లో ఉంచడంతో ఆమెపై సానుభూతి పెరిగి, 1980లో ఆమె తిరిగి కేంద్రంలో అధికారం చేజిక్కించుకుంది. జనతా పార్టీలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్నవాటిలో జనసంఘ్ పార్టీకి చెందినవారు భారతీయ జనతాపార్టీగా, భారతీయ లోక్ దళ్ పార్టీకి చెందినవారు లోక్‌దళ్ పార్టీగా చీలిపోయారు. మిగిలినవారు జనతా పార్టీగా కొనసాగినా ముక్కలు చెక్కలై ఉనికిలో లేకుండా పోయారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకోసం పోరాడిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ 1979లో మరణించాడు. ఈయన సేవలకుగానూ 1965లో మెగసెసే అవార్డు లభించింది. తన మరణానంతరం 1998లో భారతదేశంలో అతిన్నత పురస్కారమైన 'భారతరత్న'తో గౌరవించారు.

జెపి భావాలు – భావనలు



జయప్రకాష్ నారాయణ తన జీవితకాలం లోని వివిధ దశలలో, మారుతున్న పరిస్థితులకు ప్రభావితమౌతూ, వివిధ రాజకీయ భావజాలాలకు ప్రాతినిధ్యం వహించాడు. అయితే, ఆయన రాజకీయ భావజాల

మంతా, మనిషి, మనోవైజ్ఞానిక రీతులు, వైఖరులలో రావలసిన మార్పుల ఆధారం గానే ఉంది. ఆయన ఉద్దేశంలో **కుటుంబం ప్రథమ సామాజిక సంస్థ కాగా, గ్రామసభ ప్రథమ రాజకీయ విభాగం. జన్మతా మంచి స్వభావం కలిగి ఉన్న మనిషిని, సమాజంలోని భౌతిక రాజకీయ పరిస్థితులు స్వార్థజీవిగా మారుస్తున్నాయని అన్నాడు. ఈ కారణం చేతే, సమాజంలోని భౌతిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో పరిపూర్ణ మార్పును తీసుకురావాలని చెప్పాడు. వ్యవస్థలో సంపూర్ణ సామాజిక పరివర్తనను కోరాడు. ఆయన రాజకీయాల్లో పార్టీతత్వాన్ని, కులరాజకీయాలను నిరసించి, స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని భావించాడు. సాంస్కృతిక రంగంలో సనాతన మూఢ విశ్వాసాలను, విధేయతలను వదులుకోవడం, మనిషిని సంకుచిత మనస్కునిగా చేసే సాంఘిక ఆచారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలను విడనాడి, హేతుబద్ధంగా ఆలోచించడం నేర్చుకోవాలని** సూచించాడు.

రాజకీయ వ్యవస్థ పునర్నిర్మాణానికి సంబంధించి, వ్యక్తిగత ఆచరణతో కూడిన ఉదారవాద విధానాన్ని అవలంభించాడు. సమన్యాయ సూత్రం, చట్టసమానత్వ సూత్రాలపై ఆధారపడి, సామాజిక విలువలతో కూడిన వ్యవస్థ ఏర్పడాలని భావించాడు. అందుకై సమాజంలోని వ్యక్తులు సత్యం, అహింసలపై నమ్మకం, మానవ సమానత్వం మీద విశ్వాసం, సహకార భావన, స్వప్రయోజనాలకంటే దేశ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, ఎదుటి వారి భావాలు గౌరవించడం వంటి లక్షణాలు కలిగి ఉండాలని చెప్పాడు. సర్వోదయ ఉద్యమం, భూదాన ఉద్యమాల్లో కృషి చేశాడు. వీటిని గాంధీమార్కు కమ్యూనిజం అని కూడా పేర్కొన్నాడు.

జేపికి కమ్యూనిస్టు సిద్ధాంతం మీద తొలినాళ్ళలోగురి ఉన్నా, అనంతర కాలంలో అందులోని లోపాల్ని గుర్తించినట్లు చెప్పుకొచ్చాడు. యుగోస్లేవియాలో 1953లో జరిగిన 'ఆసియన్ సోషలిస్టు' సమావేశంలో రష్యా ఏకపక్ష నియంతృత్వ విధానాల్ని విమర్శించాడు. జేపి యుగోస్లేవియా సామ్యవాదంలో ప్రగతిశీల భావాలున్నాయని భావించాడు. జేపి ఉద్దేశ్యంలో సామ్యవాదం వ్యక్తులు ఆచరించలేని సిద్ధాంతం కాదు. ఇది వ్యక్తిగత ప్రణాళికగా మాత్రమే కాకుండా, ఆర్థిక, రాజకీయ సామాజిక జీవనాన్ని సంపూర్ణంగా మార్చే సత్తా కలిగిన పరిణతి చెందిన భావజాలం. అయితే దీని సాధనకు మార్క్సిజంలో చోటు చేసుకునే హింసను నిరసించాడు. **సామాజిక ఆర్థిక స్థితిగతులను మార్చడానికి చేసే ప్రయత్నంలో హింసకు,**

బలప్రయోగానికీ తావుండకూడదని భావించాడు. కేవలం పరివర్తన ద్వారానే సాధించాలని ఆశించాడు.

ప్రణాళికా బద్ధమైన ఒక నూతన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం జరగాలని జేపి సూచించాడు. ఇందులో పోటీకి, వ్యాపార దోపిడీకి స్థానం లేదు. ప్రజలందరి సమిష్టి అవసరాలకోసం ఉత్పత్తి జరుగుతుంది. నూతనవ్యవస్థలో భూపంపిణీ జరిపి యాజమాన్య హక్కులు కల్పించడం జరుగుతుంది. గ్రామీణ ఉత్పత్తులకు, పారిశ్రామిక ఉత్పత్తులకూ సమాన ప్రాధాన్యం కల్పిస్తారు. ఈ నూతన ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికలను గ్రామీణ, జిల్లా, దేశస్థాయి వరకూ అంచలంచలుగా విస్తరించి నిర్వర్తిస్తారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను సమర్థించినా, ఇప్పుడున్న పార్టీల పద్ధతిని రద్దు చేయాలన్నాడు. వర్తమానంలో అమలవుతున్న ఎన్నికల విధానాన్ని కూడా నిరసించాడు. పరోక్ష ఎన్నికల విధానం కావాలని సూచించాడు. ప్రస్తుతమున్న పార్లమెంటరీ వ్యవస్థలో ఓటు వేసే హక్కు ఉన్న వాళ్ళలో సగం మంది మాత్రమే వేసే ఓట్లు భిన్న అభ్యర్థుల మధ్య చీలగా వారిలో ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని అందలమెక్కించే పద్ధతి వలన మైనారిటీ పాలన మాత్రమే ఉంటున్నదని చెబుతూ ఇపుడున్న విపరీతమైన ఎన్నికల ఖర్చు సామాన్యుడు ఎన్నికల్లో నిలబడే అవకాశం లేకుండా చేస్తున్నదని, అంతే కాకుండా ఓటు వేస్తున్న వారు కూడా అనేక ఒత్తిళ్లకు, ప్రలోభాలకూ లొంగి ఓట్లు వేస్తుండడం వల్ల అది సరయిన ప్రాతినిధ్యం కాదని అన్నాడు. పార్టీ రహిత ప్రజాస్వామ్యం వీటికి పరిష్కారాన్ని చూపుతుందని భావించాడు. ఎన్నికల వ్యవస్థ వర్తమానంలో ఉన్నట్లు కాకుండా, గ్రామస్థాయి రాజకీయ విభాగం పునాదిగా, పైస్థాయికి వెళ్ళేసరికీ అంచలంచలుగా, పిరమిడ్ ఆకారంలో విస్తరించే రాజకీయ అధికార వ్యవస్థ నిర్మాణాన్ని సూచించాడు. ఈ విధానంలో పైస్థాయికి వెళ్ళేకొలది, అధికారాలు, విధులు సన్నగిల్లుతుంటాయి. ఈ విధంగా ఎన్నికలు లేకుండా జిల్లా స్థాయి వరకూ వ్యవస్థలను నిర్మించవచ్చని, ఆ పైస్థాయి ఎన్నికలు పార్టీరహితంగా భాగస్వామ్య ప్రజాస్వామ్యంగా ఉండాలని సూచించాడు.

5

ఒడిదుడుకల ప్రజాస్వామ్యం


భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై బలమైన ముద్రవేసిన వారిలో రామ్ మనోహర్ లోహియా, ఇందిరా గాంధీలను ప్రత్యేకంగా పేర్కొనాలి. వారి కాలంలో జరిగిన రాజకీయ పెనుమార్పులు ఆ తర్వాతి తరాలకు కనువిప్పుగా నిలిచాయి. వారి గురించి తెలుసుకోవడమంటే, ఆ కాలంలో జరిగిన ప్రజాస్వామ్య పరిణామాలను పరిశీలించడమే.



రాంమనోహర్ లోహియా
(1910-1967)

స్వాతంత్రోద్యమ కాలంలో, అనంతరం కూడా భారత ఉపఖండంలో సామ్యవాదం కోసం కృషి చేసిన వారిలో రాంమనోహర్ లోహియా ఒకడు. ఆచార్య నరేంద్రదేవ్ ప్రభావానికి లోనైన ఈయన గొప్ప మానవవాది. సామ్యవాద ప్రచారకుడు. ఉత్తరప్రదేశ్‌లోని అక్బర్‌పూర్‌లో లోహియా జన్మించాడు. బనారస్, కలకత్తాల్లో విద్య పూర్తి చేసుకుని బెర్లిన్‌లో డాక్టరేట్ పూర్తి చేశాడు. స్వదేశం తిరిగివచ్చి భారత జాతీయ కాంగ్రెస్‌లోచేరి, ప్రధాన నాయకుల్లో ఒకడుగా ఎదిగాడు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకడు. అనంతరం ప్రజాసోషలిష్టు పార్టీ స్థాపకుల్లోకూడా ఒకడుగా ఉన్నాడు. ఆ తర్వాత ఆ పార్టీ నుంచి చీలి, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా స్థాపించాడు. యుద్ధవ్యతిరేక ప్రసంగాలు చేసిన కారణంగా 1940 జూన్‌లో బ్రిటీష్ ప్రభుత్వం లోహియాకు రెండేళ్ళు జైలు శిక్ష విధించింది. లోక్‌సభకు 1962లో జరిగిన ఎన్నికలలో ఫుల్పూర్ నియోజకవర్గం నుంచి జవహర్‌లాల్ నెహ్రూపై పోటీ చేసి, ఓడిపోయాడు. తర్వాతి సం॥రం ఫరూఖాబాద్ లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలో గెలిచి, లోక్‌సభ సభ్యుడయాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర వహించాడు. తిరిగి 1967 సాధారణ ఎన్నికల్లో 'కన్నవుజు' నియోజకవర్గం నుంచీ లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన కొద్దికాలానికే మరణించాడు.

లోహియా అనేక అంశాలపై విస్తృతంగా రాశాడు. ఈయన రచనలన్నిటినీ 'కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ లోహియా' పేరిట ప్రముఖ సోషలిస్ట్ రచయిత డా॥ మాస్త్రం కపూర్ సంపాదకత్వంలో న్యూఢిల్లీలోని అనామికా ప్రచురణ సంస్థ తొమ్మిది సంపుటాలుగా ప్రచురించింది. కర్ణాటక ప్రభుత్వం రాం మనోహర్ లోహియా రచనలను ఆరు సంపుటాలుగా అనువదించి, తక్కువ ధరకు అందజేసింది. **'గాంధీ, మార్క్స్, సోషలిజం'** అనే గొప్ప పుస్తకంతోబాటు భారతీయ కులవ్యవస్థపై రాసిన పుస్తకం ఎంతో లోతైన అధ్యయనానికి నిదర్శనంగా నిలుస్తుంది. కులవ్యవస్థపై రాసిన పుస్తకం అనువాదాన్ని తెలుగు అకాడమీ కూడా ప్రచురించింది. ఈయన కులవ్యవస్థలోని అసమానతలు నిర్మూలించాలని కోరాడు. మానవ సమానత్వాన్ని తీవ్రంగా వాంఛించాడు. ముఖ్యంగా బీసీ కులాల రాజకీయ ఎదుగుదలకు లోహియా చేసిన కృషి అపారం. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో 1967 నాటికి బీసీలు రాజకీయ అధికారంలోకి రావడానికి లోహియా కృషి ఎంతో వుంది. చేతివృత్తి కులాల అభ్యున్నతికి, గ్రామీణ ప్రజల పురోగతికీ అనుసరించాల్సిన విధానాలపట్ల మార్క్స్, లెనిన్, స్టాలిన్, అంబేద్కర్, నెహ్రూ వంటివారు భారీ పారిశ్రామిక విస్తరణను ప్రోత్సహించారు. లోహియా వారి దృక్పథాలకు భిన్నమైన ఆలోచన చేశాడు. ఆ పారిశ్రామిక విధానం, ఎక్కువ జనాభా ఉన్న ఆసియా దేశాలలో పనికిరాదని, ఈ దేశాలలో మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రజల నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉత్పత్తి శక్తులుగా తీర్చిదిద్దాలని కోరాడు. సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయించాలని, పేద ప్రజలకు సబ్సిడీ ధరలకు కూడు, గుడ్డ, నీడా అందించాలని ఆనాడే ప్రతిపాదించాడు. మావో, గాంధీల ఆలోచనా విధానం లోహియా భావాలకు చాలా సారూప్యత కనబడుతుంది. ఈయన భావాల్ని తొలిసారిగా జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు పరచడం ప్రారంభించారు. ఒక రూపాయికే స్నానపు సబ్బులు అందించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అది అమలైంది. తర్వాత చౌకధరలకే బియ్యం, పప్పు, ఉప్పు, జనతా చీరలు, జనతా ధోవతుల వంటివి కూడా అందించారు. అనంతర కాలంలో ఓట్లు పొందడానికి దీన్ని ఒక మార్గంగా ఎంచుకున్న ప్రభుత్వాలు వివిధ రకాల వికృత రూపాలలో నేడు కూడా



అమలు చేయడం మనకు కనబడుతోంది.

సమానత్వం భౌతికమైనదిగా, మానసికమైందిగా వుంటుంది అన్నాడు లోహియా. సమానత్వం ఆంతరంగికం గాను, బాహ్యంగానూ కూడా ఉంటుందనేది ఆయన ఉద్దేశం. అనేకమంది తన సమకాలీన సోషలిస్టులు ప్రస్తుత వ్యవస్థను హింసాత్మక పద్ధతుల్లో తప్ప కూలదోయడం సాధ్యం కాదని భావిస్తుండగా లోహియా మాత్రం రాజకీయాలలో హింసకు తావుండకూడదని భావించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను, దానివల్ల వచ్చిన చెడ్డ పరిణామాల్ని లోహియా కఠినంగా విమర్శించాడు. లోహియా, కారల్ మార్క్స్, గాంధీ సిద్ధాంతాలు రెండిటిపట్లా ఆకర్షితుడై, వాటి ప్రభావంలో పడినప్పటికీ, ఈ రెండు సిద్ధాంతాలలో దేనిపట్లా సంపూర్ణ ఆమోదం చూపలేదు. మార్క్స్ చెప్పిన వర్గ పోరాట సిద్ధాంతాన్ని పూర్తి స్థాయిలో ఆమోదించ లేదు.

"ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని సాధించేక్రమంలో, కమ్యూనిజం కేంద్రీకృత రాజకీయపార్టీని, అధికారాలు కొద్దిమంది చేతిలో ఉండే రాజకీయ వ్యవస్థనూ సృష్టిస్తుంది. వర్గరహిత సమాజం కోసం కృషి జరిగే క్రమంలో పార్టీకీ, రాజ్యవ్యవస్థకూ తేడా లేకుండాపోతుంది. ఈ రకమైన నియంతృత్వ విధానానికి కమ్యూనిజం సిద్ధాంతం నైతిక మద్దతు చేకూరుస్తూ ఉండడంతో, అది నిరంకుశ కేంద్రీకరణకు దారితీస్తుంది. అందువల్ల అధికార వికేంద్రీకరణే ముఖ్యమ"ని లోహియా భావించాడు. లోహియా దృష్టిలో **పెట్టుబడిదారీ వాదం, సామ్రాజ్యవాదం పుట్టుక, అభివృద్ధి కవల పిల్లల్లాంటివి. ఈ రెండూ ఒకే కాలంలో జన్మించి, పరస్పరాభివృద్ధికి దోహదపడ్డాయి. అంతేకాని, ఈ రెండూ పెట్టుబడిదారీ విధానంలోని విభిన్న దశలను సూచించవు.** దీనినే ఇంగ్లిష్‌లో లోహియా **"ది ట్విన్ ఆరిజిన్ ఆఫ్ కాపిటలిజం అండ్ ఇంపీరియలిజం"** అని నామకరణం చేశాడు. వికేంద్రీకరణ అన్ని స్థాయిలలోనూ జరగాలనీ, అదే నిజమైన ప్రజాస్వామ్యమనీ ఉద్ఘాటించాడు.

ఇందిరాగాంధీ
(1917-1984)

ఆధునిక భారతదేశ చరిత్రలో, రాజ్యాంగ చరిత్రలో ఇందిరాగాంధీ చూపినంత ప్రభావం వేరెవ్వరూ చూపలేదు. ఆమె 1966 నుంచీ 1977 వరకు, తిరిగి 1980 నుంచీ 1984లో హత్యకు గురయ్యే వరకు దేశ ప్రధానిగా పనిచేశారు. ఇందిరా ప్రియదర్శిని 1917 నవంబర్ 19న జవహర్ నెహ్రూ, కమలా నెహ్రూల

ఏకైక సంతానంగా జన్మించింది. ఈమె తాత మోతీలాల్ నెహ్రూ ప్రముఖ న్యాయవాది. అతి సంపన్న కుటుంబం వారిది. పంజాబ్ లోని జలియన్ వాలాబాగ్ లో బ్రిటీష్ జనరల్ డయ్యర్ సాగించిన మారణకాండలో వేలమంది భారతీయులు మరణించారు. ఈ సంఘటన మోతీలాల్ హృదయాన్ని గాయపరచింది. వెంటనే ఆయన తన న్యాయవాదవృత్తిని వదిలి ఖద్దరు ధరించి, తన ఇంట్లో వున్న విదేశీ వస్తువులన్నీ దగ్ధం చేశాడు. ఆ సమయంలో మహాత్మాగాంధీ వారి ఇంటికి వచ్చారు. గాంధీ ప్రభావంతో, ఇందిరాగాంధీ తల్లిదండ్రులు ఇద్దరూ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొనేవారు. వారి ఇల్లు ఎప్పుడూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేవారితో నిండి ఉండేది. ఇంటి వాతావరణం ఆమెను ప్రభావితం చేసింది. బాల్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనేవారికి సహాయం చేసేందుకు గానూ 'వానరసేన' పేరిట పిల్లలతో ఒక దళం ఏర్పాటు చేసి, లేఖలు చేరవేయడం, జెండాలు తయారు చేయడం వంటి కార్యక్రమాలు చేసేది. తరచుగా జైలు జీవితం గడపడంవల్ల ఆమె తల్లి కమలాదేవి ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను స్విట్జర్లాండ్లో వైద్య చికిత్స కోసం తీసుకు వెళ్ళారు. అక్కడ ఆమె తల్లి కమల మృతిచెందింది. నెహ్రూ తరచుగా జైలు జీవితం గడపాల్సి వస్తుండడంతో, ఆమె లండన్‌లో చదివేందుకు ఏర్పాటు చేశాడు. ఆమె అక్కడి ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో చదివింది. నెహ్రూ ఇందిరకు లోకజ్ఞానం నేర్పాల్సిన వయసులో జైల్లో ఉండడంతో, అక్కడినుంచే ఆమెకు ఉత్తరాల ద్వారా జ్ఞానం పంచేవాడు. అవే 'లెటర్స్ టు హిజ్ డాటర్', 'ప్రపంచ చరిత్రపై విహంగ వీక్షణం' (గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ) పేరిట ప్రఖ్యాతి చెందాయి. మానవ చరిత్ర అధ్యయనానికి చక్కని వనరుగా, నేటికీ పాఠకాదరణ పొందుతున్నాయి. లండన్ లో చదివేటప్పుడే ఆమెకు



స్వదేశంలో తన కుటుంబంతో పరిచయమున్న ఫిరోజ్‌తో స్నేహం ఏర్పడింది. వారిరువురూ వివాహం చేసుకోవాలని నిశ్చయించు కున్నారు. నెహ్రూ కుటుంబీకులు కశ్మీర్ బ్రాహ్మలుకాగా ఫిరోజ్ పర్షియ నుంచి వలసవచ్చిన పార్సీలు కావడం వల్ల నెహ్రూ కుటుంబీకులు అభ్యంతరం



తెల్పడంతో గాంధీ ఇరు కుటుంబాలనీ ఒప్పించి వారి పెళ్లి జరిపించాడు. ఆ విధంగా ఇందిర కుటుంబానికి గాంధీ అనే పదం చేరింది

క్విట్ ఇండియా ఉద్యమకాలంలో ఆమె తొలిసారి జైలుకు వెళ్ళింది. జైలులోనే రాజీవ్‌గాంధీ జన్మించాడు. ఆమె దేశంకోసం పూర్తికాలం పనిచేయాలని నిశ్చయించింది. ఫిరోజ్ నేషనల్ హెరాల్డ్ పత్రికా సంపాదకునిగా లక్నోలో పనిచేస్తూ ఉండడంతో, ఇందిర భర్తతోబాటు లక్నో వెళ్ళింది. అక్కడే రెండో కొడుకు సంజయ్ గాంధీ పుట్టాడు. అనంతరకాలంలో భర్తతో విభేధాలు రావడంతో తండ్రి నెహ్రూ వద్దకు ఢిల్లీ చేరింది. అక్కడ కుమార్తెగా కాకుండా ఆయనకు కార్యదర్శిగా పనిచేసింది. నెహ్రూ చివరి దశలో పాలనా వ్యవహారాలన్నీ ఆమే చూసేది. తన భర్త రాయ్ బరేలీ నియోజక వర్గం నుంచి తండ్రిపై పార్లమెంటు సభ్యత్వానికి పోటీ చేసినపుడు ఆమె తన భర్తకు వ్యతిరేకంగా, తండ్రి నెహ్రూ తరపు ప్రచారం చేసి గెలిపించింది. అనంతరం పాత్రికేయుడైన ఫిరోజ్ గాంధీ నెహ్రూకు వ్యతిరేకంగా పని చేశాడు. ముఖ్యంగా బీమా కుంభకోణాన్ని బయటపెట్టడంతో నెహ్రూ మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా ఉన్న టి.టి. కృష్ణమాచారి రాజీనామా చేయాల్సి వచ్చింది. నెహ్రూ 1964 మే 24వ తేదీన మరణించాడు.

నెహ్రూ మరణానంతరం 1964లో ప్రధానమంత్రి పదవి చేపట్టిన లాల్ బహదూర్ శాస్త్రి 1966 జనవరి 10న రష్యాలోని తాష్కెంట్‌లో గుండెపోటుతో మరణించాడు. వెంటనే గుల్జారీలాల్ నందాను తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రధానమంత్రి పదవికోసం అంతర్గతంగా కుమ్ములాటలు మొదలయ్యాయి. చాలామంది ప్రత్యర్థులున్నా, మురార్జీ దేశాయ్ ఆమెకు ప్రధాన ప్రత్యర్థిగా నిలిచాడు. అక్కడ జరిగిన పోటీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామరాజ్ మద్దతుతో గెలిచి, భారతదేశపు తొలి మహిళా ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసింది. ఆమె స్త్రీ కావడం వల్ల, రాజకీయాల్లో చురుకుగా ఉండ లేదని, ఆమెను అడ్డుపెట్టుకొని పెత్తనం చెలాయించవచ్చని కొందరు భావించారు.

మొరార్జీదేశాయ్, లోహియాలు ఆమెను మూగబొమ్మ (గుంగీ గుడియా)గా అభివర్ణించారు. కానీ, అనంతర కాలంలో ఆమె మిగతావారి అంచనాలను వమ్ము చేస్తూ, తన సమర్ధతను అనేక విధాలుగా నిరూపించుకుంది. ముఖ్యంగా కలవడానికి ప్రధానమంత్రి కార్యాలయానికి వచ్చినవారిని స్వయంగా కలిసి, వారికి సహాయం చేయడం చాలా శ్రమతో కూడుకున్న పని అయినా ఆమె ఆ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించేది. ఆమె పాలనలో ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంది. 'ఇందిరాయే ఇండియా – ఇండియాయే ఇందిరా' అనే పేరు తెచ్చుకుంది.

వాటిలో ప్రైవేటు బ్యాంకులన్నీ కేవలం లాభాపేక్షతో పనిచేస్తూ, సామాజిక సంక్షేమ లక్ష్యాల్ని విస్మరిస్తున్న కారణంగా, 1969సం॥ జులై నెలలో బ్యాంకుల్ని జాతీయం చేయడం, 1971లో రాజభరణాలు రద్దు చేయడం వంటి సంచలన నిర్ణయాలు తీసుకుంది. పార్టీలో అంతర్గత చీలికలవల్ల కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోయింది. కాంగ్రెస్ ఎన్నికల గుర్తు కూడా ఆమెకు దక్కలేదు. అప్పుడు ఆవు, దూడ గుర్తు కేటాయించారు. పార్టీలో మెజారిటీ లేకపోయినా కమ్యూనిష్టు పార్టీలు, ఇతర చిన్నచిన్న పార్టీల అండతో నెగ్గుకు వచ్చింది. ఆమె వ్యతిరేకులంతా, 'ఇందిరా హటావో' నినాదం ఇస్తే, ఈమె 'గరీబీ హటావో' అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది. నాడు రాష్ట్రపతిగా ఉన్న జాకీర్ హుస్సేన్ మరణంతో రాష్ట్రపతి ఎన్నిక జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ ఆ పదవికి 'నీలం సంజీవరెడ్డి'ని ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఆత్మ ప్రబోధానుసారం ఓట్లు వేయమని ప్రచారం చేసి, తాను నిలబెట్టిన వి.వి.గిరిని రాష్ట్రపతిగా గెలిపించడంతో ఆమె ప్రతిభకు లోకం నివ్వెరపోయింది. అనంతరం రాజ భరణాల రద్దు బిల్లు వీగిపోవడంతో ఇందిరాగాంధీ ప్రధాని పదవికి రాజీనామా చేశారు. దాంతో దేశంలో మొదటిసారిగా మధ్యంతర ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఎన్నికల సందర్భంగా ఆమె 'గరీబీ హతావో' నినాదంతో నలభైమూడు రోజులపాటు దేశమంతా అవిశ్రాంతంగా తిరిగింది. ఆరువేలమైళ్ళు తిరిగి, 300 సభల్లో మాట్లాడి జనాలకు చేరువయింది. అత్యధిక మెజారిటీతో గెలిచి మూడోసారి ప్రధాని పదవి చేపట్టింది. ఆ సమయంలోనే ఇందిరాగాంధీ సంకల్పంతో బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పడింది.

తూర్పు పాకిస్తాన్‌లో పశ్చిమ పాకిస్తాన్ (నేటి పాక్) బలగాలు హింసకు దిగిన పరిస్థితుల్లో, తూర్పు పాకిస్తాన్‌లో 1970 నుంచీ 'ముక్తివాహిని' పేరిట

స్వంతపాలన ఏర్పాటు చేసుకునేందుకు పోరాటం సాగించారు. అక్కడి పరిస్థితులకు వెరచి, అనేకమంది ప్రజలు భారతదేశంలోకి ప్రవేశించడం మొదలైంది. ఈ పరిస్థితుల్లో, అంతర్జాతీయ ఒత్తిడిలను కూడా లెక్కచేయకుండా, సాహసోపేతంగా నేరుగా సైన్యాన్ని దింపి, తూర్పు పాకిస్తాన్ విముక్తికి కారణమైంది. అదే నేటి బంగ్లాదేశ్. తర్వాత 1974లో రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారిలో విజయవంతంగా అణుపరీక్ష జరిపి, భారతదేశ శక్తి సామర్థ్యాల్ని ప్రపంచానికి చూపింది. ఈ చర్య అమెరికాకు కంటగింపుగా మారినా ఆమె లెక్క చేయలేదు. ఈ చారిత్రిక ఘటన గురించి, లోక్‌సభలో దేశ త్రివిధ దళాల్ని ప్రశంసించి, ఈ విజయం దేశ ప్రజలందరిదీ అన్నప్పుడు ప్రతిపక్ష సభ్యులతోసహా అందరూ లేచి చప్పట్లు కొట్టడంతో ఆమె కీర్తి నింగికి ఎగసింది. ఒకపక్క దేశంలో పేదరిక నిర్మూలన పథకాలకై కృషి చేస్తుండగానే ఆమెకు మరోసారి పదవీగండం ఏర్పడింది.

అమేథీ లోక్‌సభకు 1971లో జరిగిన ఎన్నికలలో ఆమెపై పోటీచేసి ఓడిపోయిన 'రాజ్ నారాయణ' అనే వ్యక్తి ఆమె ఎన్నికలలో అక్రమాలకు పాల్పడడం వల్ల ఆమె ఎన్నికను రద్దుచేయాల్సిందిగా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీనిపై అలహాబాదు ఉన్నతన్యాయస్థానం ఆమె ఎన్నిక చెల్లదని, మరో ఆరేళ్లదాకా ఆమె ఎన్నికలలో నిలబడడానికి అనర్హురాలనీ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుకు కొద్దిరోజులు ముందుగా కొన్ని ఆందోళనలు జరిగాయి. అహ్మదాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఫీజుల పెంపు, మెస్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా ధర్నా చేశారు. మురార్జీ దేశాయ్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఉద్యమానికి మద్దతు తెలిపి, ఆమరణ నిరాహారదీక్షకు కూర్చున్నాడు. ఈ ఉద్యమం తీవ్రతరం కావడంతో ఇందిరా గాంధీ గుజరాత్ ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించింది. బీహార్‌లోని పాట్నా విశ్వ విద్యాలయానికి చెందిన విద్యార్థులు కూడా 1974 మార్చి నెలలో సమ్మెలోకి దిగారు. జయప్రకాష్ నారాయణ ఈ ఉద్యమానికి మద్దతు ఇచ్చి, ఒక పెద్ద ఊరేగింపు తీసి ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని తొలగించ డానికి ప్రజలంతా సంపూర్ణ విప్లవానికి తయారు కావాలని పిలుపు ఇచ్చాడు. మరోవైపు సోషలిష్టు పార్టీ నాయకుడు, 'జార్జ్ ఫెర్నాండెజ్' రైల్వేల దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చాడు. దేశంలో ప్రధాన ప్రయాణ సాధనంగా ఉన్న రైళ్లు 1974 మే నెల నడవక పోవడంతో, రవాణా, ప్రయాణ సౌకర్యాలు దెబ్బతిన్నాయి. ఇటువంటి కల్లోల పరిస్థితుల్లో

ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు రావడంతో, జయప్రకాష్ నారాయణ, మొరార్జీదేశాయ్ తదితర నాయకులు, 'ఇందిర వెంటనే ప్రధాని పదవి నుండి దిగి పోవాల'ని 1975 జూన్ 25న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు, సైన్యం, అధికార యంత్రాంగం,ఉద్యోగులు ఇందిరాగాంధీ ఆదేశాలు పాటించనవసరంలేదని, తిరుగుబాటు చేయమని పిలుపు ఇచ్చారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో, ఇందిరాగాంధీ నిర్ణయం మేరకు 1975 జూన్ 25 అర్ధరాత్రి దేశాధ్యక్షుడు ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ దేశంలో అంతర్గత అత్యవసర పరిస్థితి ప్రకటించాడు. అత్యవసర పరిస్థితి ప్రకటన గురించి మర్నాటి ఉదయం దాకా కేంద్ర మంత్రివర్గ సహచరులకు కూడా ఏమాత్రం తెలియనివ్వకుండా అత్యంత గోప్యంగా ఉంచారు. ఇది ఆమె సమర్థతకు, యంత్రాంగం మొత్తంపై ఆమె సాధించిన నియంత్రణా శక్తికీ నిదర్శనంగా ఉంది. అంతకుముందే ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించినా వినకుండా ఆమోదించిన 'అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం' (మీసా) తెచ్చింది. దాన్ని ఉప యోగించి, అర్ధరాత్రి మురార్జీ దేశాయ్, జయప్రకాష్ నారాయణ, మార్క్సిష్టు కమ్యూనిష్టు నాయకులు జ్యోతిబసు, అచ్యుతానందన్, జనసంఘ్ నాయకులు వాజ్‌పాయ్, అద్వానీ వంటివారిని, సొంతపార్టీలో అసమ్మతిగళం వినిపించిన వారితో సహా వ్యతిరేకులందర్నీ ఖైదు చేశారు. అత్యవసర పరిస్థితి కాలంలో సుమారుగా లక్షమందికి పైగా రాజకీయ కార్యకర్తలు, రచయితలు, మేధావులు, కళాకారులంతా జైలుపాలయ్యారు. పౌరుల ప్రాథమిక హక్కులు రద్దయ్యాయి. మానవహక్కులకు తావు లేకుండా పోయింది. అన్ని పత్రికలూ ప్రభుత్వ అధికారులు ఆమోదించిన వార్తలతోనే ప్రచురించాల్సి వచ్చేది. విదేశీ పాత్రికేయుల్ని దేశం నుంచి బహిష్కరించారు. ఈ కాలంలో రైళ్లు సమయానికి నడిచాయి. ఉద్యోగులు సమయానికి కార్యాలయాలకు వచ్చేవారు. వారిలో అవినీతి, లంచగొండి తనం మాయమైంది. స్త్రీలపై అత్యాచారాలు, ఇతర నేరాలూ గణనీయంగా తగ్గాయి. వెట్టిచాకిరి రద్దయింది.



ఈ అత్యవసర పరిస్థితి ఇరవయ్యొక్క నెలలపాటు కొనసాగింది. ఈ కాలంలో ఇందిరాగాంధీ, వ్యవసాయ పారిశ్రామిక ఉత్పత్తులు పెంచడానికి, నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత నిర్మూలన వంటి 20 సూత్రాల

ఆర్థిక కార్యక్రమం ప్రవేశపెట్టింది. దీనికి అదనంగా ఆమె కుమారుడు సంజయ్ గాంధీ అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, చెట్ల పెంపకం, కుల నిర్మూలన, వరకట్న నిర్మూలన అనే 5 సూత్రాల పథకం రూపొందించాడు. ఇవన్నీ కలిపి 25 సూత్రాల పథకంగా మారాయి. కేంద్ర రాష్ట్ర చట్టసభల ఎన్నికలు వాయిదా వేశారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల్ని రద్దుచేసి, రాష్ట్రపతి పాలన విధించారు. రాజ్యాంగ పరంగా కేశవానంద భారతి కేసులో, పార్లమెంటుకు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం లేదన్న తీర్పును అధిగమించేందుకు రాజ్యాంగ సవరణ చేసి తనకు నిరంకుశ అధికారాలు కట్టబెట్టుకోవడం జరిగింది. 42వ రాజ్యాంగ సవరణద్వారా ఆస్తిహక్కు రద్దుతోబాటు, రాజ్యాంగ ప్రవేశికలో "సామ్యవాద, లౌకిక" అనే పదాల్ని చేర్చారు. కొత్తగా పౌరులు అనుసరించాలిన విధులు చేరాయి.

కార్మిక హక్కులు పూర్తి అణచివేతకు గురయ్యాయి. జీతాల పెంపుదల నిలిపి వేశారు. సమ్మెల్ని పూర్తిగా నిషేధించారు. పనిగంటలు పెంచారు. వారానికి ఏడు రోజులు పని పెట్టారు. అనేక సమ్మెల్ని ఉక్కు పాదంతో అణిచివేశారు. జనవరి 1976న కమ్యూనిష్టుల నాయకత్వం లోని ఏ.ఐ.టి. యు.సి. బోనస్ రద్దుకు నిరసనగా ఒకరోజు సమ్మె తలపెట్టిన సందర్భంగా ముప్పై, నలబై వేలమంది కార్మికుల్ని జైళ్ళలో తోశారు. అదేవిధంగా బెంగుళూరు కేంద్రంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థ 'ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీ'కి చెందిన ఎనిమిది వేలమంది కార్మికులు ఒప్పందం ప్రకారం తమకు ఇవ్వడానికి అంగీకరించిన ఇరవై శాతం బోనస్‌ను ఎనిమిది శాతానికి తగ్గిస్తూ యాజమాన్యం తీసుకున్నందుకు నిరసనగా, శాంతియుతంగా నేలపై కూర్చుని ధర్నా చేస్తే, వారిపై లాఠీచార్జ్ జరిపి వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. దేశవ్యాపితంగా ఇటువంటి సంఘటనలు ఎన్నోవున్నా వాటిని ప్రచురించే వీలులేకుండా పత్రికలపై నియంత్రణ విధించారు. ఏమాత్రం నిరసన తెలిపినా తీవ్ర అణచివేతకు గురి చేశారు.

ఇక బొగ్గుగనుల్ని నిరంతరాయంగా వారానికి ఏడురోజులు నడిపించాలని హుకుం జారీ


జార్జ్ ఫెర్నాండెజ్

అయింది. కార్మికులంతా రక్షణ చర్యలు కరువైన దుర్భర పరిస్థితుల్లో పనిచేయాల్సి వచ్చినా వారి గోడు పట్టించుకునేవారే లేకుండా పోయారు. ఈ రకమైన ప్రమాదకర పరిస్థితులు వందలు, వేలసంఖ్యలో కార్మికులు మరణించడానికి కారణమయ్యాయి. 1975 డిసెంబర్ 7న ధన్‌బాద్ వద్ద జరిగిన బొగ్గుగని ప్రమాదంలో వరదలా నీటి ప్రవాహం వెల్లువెత్తడంతో, ఒకేసారి రెండువందల ఇరవైమందికి పైగా కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇటువంటి ప్రమాదాలు చాలానే జరిగినట్లు తెలుస్తోంది.

జనాభా నియంత్రణలో భాగంగా లక్షలాదిమంది మగవారికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరిగాయి. వేలమంది పెళ్ళికాని యువకులకు కూడా బలవంతాన కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరిపినట్లు ఆరోపణలు వచ్చాయి. యువజనుల సంగతి అటుంచితే డెబ్బై ఎనభై ఏళ్ల ముసలీ మూతకా దగ్గర్నుంచి ముక్కుపచ్చలారని చిన్నపిల్లలకు కూడా కు.ని. శస్త్రచికిత్సలు చేసిన సంఘటనలు అనేకం తర్వాతి కాలంలో వెలుగులోకి వచ్చాయి. ఇక సంజయ్‌గాంధీ ఆధ్వర్యంలో ఢిల్లీని సుందరనగరంగా తీర్చిదిద్దేందుకు పూను కున్నాడు. సంజయ్ ఇచ్చిన అపరిమిత అధికారంతో ఢిల్లీ అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు జగ్మోహన్ మల్హోత్రా అనేక ఆవాసాల్ని కూల్చివేశాడు. నిరుపేదలు నివసించే అనేక మురికివాడలతో సహా కూల్చివేశారు. ఫలితంగా ఢిల్లీలో షుమారుగా ఏడు లక్షల మంది ప్రజలు రోడ్డున పడ్డట్టు లెక్కలు తెలుపుతున్నాయి.

అత్యవసర పరిస్థితి కాలంలో జరిగిన ఆర్థిక సంస్కరణలు ఉన్నత మధ్య తరగతి వారికి, పారిశ్రామిక వేత్తలకు మాత్రమే ఎక్కువ ఉపయోగ పడ్డాయని కొందరు ఆర్థిక వేత్తలు వివరించారు. పెట్టుబడుల విధానం సరళీకరణ, పారిశ్రామిక కార్మికులకు కార్మిక సంఘాలకూ కొత్త పథకాలు ప్రవేశపెట్టడం, ఆదాయపు పన్ను మినహాయింపు, సంపదపన్ను ఎనిమిది నుంచి రెండున్నర శాతానికి తగ్గించడం, రవాణాకు జాతీయ పర్మిట్ ప్రవేశపెట్టడం వంటివి ఇందుకు దోహదం చేశాయి.

ఇటువంటి పరిస్థితుల్లో ఆమె పాలనకు వ్యతిరేకత పెల్లుబికింది. అంతరంగికులు కూడా అత్యవసర పరిస్థితి ఉపసంహరించక పోతే తీవ్ర పరిణామాలు ఎదురు కావచ్చని విన్నవించారు. ముందుగా రాజకీయ ఖైదీలు అందర్నీ విడుదల చేసి, 1977 మార్చి 19న ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికలలో ఘోరపరాజయం చవిచూసి, ఓటమి నెదుర్కొంది. తర్వాత ఆమెను కొన్ని కేసుల్లో ఇరికించి జైలుకు

పంపారు. ఈ చర్య ప్రజల్లో ఆమెపట్ల సానుభూతిని పెంచింది. ఆమె ఏమాత్రం అధైర్య పడలేదు. న్యాయస్థానం ఆమెపై కేసుల్ని కొట్టివేయడంతో బయటకు వచ్చి ప్రజల్లో తిరిగింది. భిన్న రాజకీయ దృక్పధాలున్న వారితో ఏర్పడ్డ జనతాపార్టీ ఎక్కువకాలం మనలేక పోయింది. అనంతరం 1980లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో, లోక్‌సభలోని 529 స్థానాలకు గానూ 351 స్థానాలు గెలిచి, అధికారం చేపట్టింది. సిక్కుమత నాయకుడు సంత్ జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేను తొలుత ప్రోత్సహించిన ఇందిరాగాంధీ, అనంతర పరిణామాల్లో 'ఆపరేషన్' బ్లూస్టార్' పేరిట అతన్ని చంపడానికి సిక్కుల పవిత్ర దేవాలయం స్వర్ణమందిరంలోకి సైన్యాన్ని పంపి అతని అనుచరులతో సహా కాల్చి చంపించింది. తమ పవిత్ర దేవాలయంలోకి సైన్యాన్ని పంపటం సిక్కుల మనోభావాల్ని దెబ్బతీసింది. ఫలితంగా ఆమెకు అంగరక్షకులుగా ఉన్న సిక్కులే ఆమెను 1984 అక్టోబర్ 31 ఉదయం కాల్చి చంపారు.

కాంగ్రెస్ పాలనలో ప్రవేశపెట్టిన భూసంస్కరణలు పూర్తిగా విఫలం కావడం, ద్రవ్యోల్బణం, చమురు సంక్షోభం, ఆహార కొరత, అన్నిచోట్ల ఆహారానికి క్యూలు, ఆశ్రితులకే పర్మిట్లు ఇచ్చే సంస్కృతి పెరిగిపోయాయి. పేదలు మరింత పేదలయ్యే స్థితి నెలకొంది. యువతలో నిరుద్యోగం తీవ్ర నిరాశ, ఆగ్రహాల్ని పెంచింది. ఇవన్నీ సాయుధ విప్లవ పోరాట ఉద్యమాలు పురుడు పోసుకోవడానికి దోహదంచేశాయి.





6

ప్రజాస్వామ్య భారతంలో సాయుధ పోరాటాలు

కాంగ్రెస్ పాలనలో నెలకొన్న దారుణమైన పరిస్థితులకు ముఖ్యంగా గ్రామీణ పేదలు, గిరిజన వర్గాలూ ఇంకా ఎక్కువగా పీడనకు, అణచివేతకూ గురయ్యారు. భూసంస్కరణలు ఒక బూటకపు ప్రహసనంగా మిగిలాయి. ముందుగానే ప్రకటించడం వల్ల భూస్వాములకు కావలసినంత వెసులుబాటు దొరకడంతో భూమిని విభజించి, బినామీల పేరిట అనేక విధాలా సర్దుబాటు చేసుకుని, తొంభై శాతం భూమిని పోకుండా కాపాడుకోగలిగారు. గతంలో రాజులకు, జమీందార్లకు ఏజంట్లుగా ఉన్న భూస్వాములు ఖద్దరు ధరించి, గాంధీ టోపీ పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులుగా అధికార పదవులు చేపట్టి, తమ దోపిడీపాలనను యధాతథంగా కొనసాగించసాగారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం

నక్సల్బరి ఉద్యమానికి తెలంగాణ సాయుధ విప్లవ రైతాంగ పోరాటం ప్రేరణగా అనేకమంది విప్లవకారులు భిన్న సందర్భాలలో వెల్లడించారు. తొలితరం నక్సల్బరీ ఉద్యమానికి మద్దతుగా పని చేసిన అనేకమంది నాయకులు తెలంగాణ సాయుధ పోరాటంలో కాకలు తీరినవారే కావడం గమనించాల్సిన అంశం. తెలంగాణలో ఏడవ నైజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్, అతని పనుపున ప్రజలపై మారణకాండ సాగించిన రజాకార్ల గుంపు, గ్రామీణ ప్రాంతాల్లో రజాకార్లకు అన్నీ సమకూర్చి, ప్రజలపై పాశవిక దాడులకు పాల్పడ్డ హిందూ భూస్వాములు, దొరలకు



వ్యతిరేకంగా కులమత బేధాలు మాత్రమే కాకుండా ఆడామగా తేడా కూడా లేకుండా 1946 నుంచీ 1951 వరకూ వీరోచితంగా పోరాడారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతసమూహాలనుంచీ వచ్చిన అనేకమంది ఈ పోరాటంలో వీరోచితంగా ప్రాణాలు

అర్పించారు. వెట్టిచాకిరీ నుంచీ, అయినదానికీ కానిదానికీ దొరలకు దండగలు కట్టాడాన్నుంచీ, స్త్రీలపై జరిగే లైంగిక దాడులనుంచీ కాపాడు కోవడానికి సకలజనులూ పోరాటంలో పాల్గొన్నారు. మహిళాదళాలు సైతం బారు తుపాకులను పేల్చడంలో శిక్షణ పొంది, మగవారితో సమానంగా వీరోచితంగా పోరాడారు. భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం ఆంధ్రమహాసభ రూపంలో


చాకలి ఐలమ్మ

మొదలై, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం జరిగింది. కానీ ఈనాడు చరిత్రను వక్రీకరించి, దాన్ని ఒక మతాల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నది.

దొడ్డి కొమురయ్య బలిదానంతో మొదలై, సాయుధ పోరాటం ద్వారా భూస్వాములను గడీలనుంచీ పారద్రోలి, నాలుగు వేల గ్రామాలను విముక్తం చేసింది. పది లక్షల ఎకరాలకు పైగా దున్నేవానికి భూమిని పంచారు. ఈ పోరాటంలో దాదాపు ఐదువేలమందికి పైగా కమ్యూనిష్టు కార్యకర్తలు, ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. ఇది మట్టి మనుషుల ఉద్యమం. ఇందులో ప్రధానంగా శ్రామికులు, దళితులు వృత్తి కులాలవారే ప్రధాన భాగస్వాములు. తెలంగాణలో భూస్వామ్య, రజాకార్ల, రాజరికాన్ని అంతమొందించడం పూర్తవుతున్న దశలో కాంగ్రెస్ ప్రభుత్వం సైనిక చర్య జరిపి, నిజాం నుంచీ రాజ్యాన్ని హస్తగతం చేసుకుంది. భూస్వాములు ప్రజలకు పంచిన భూమిని మిలిటరీ అండతో తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉద్యమకాలంలో వీరోచిత పోరాటానికి నాయకత్వం వహించిన చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మగ్ధుం మొహియుద్దీన్, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం, హాసన్ నాసిర్ వంటి వారెందరో ఉన్నారు. వీరిలో పార్టీ నాయకత్వంలో ఉన్నవారు సాయుధ పోరాటం విరమించాలని నిర్ణయించారు. వీరి తప్పుడు నిర్ణయం ఫలితంగా ఉద్యమ ఫలాలు ప్రజల నోళ్లనుంచీ జారి పోయాయని కార్యకర్తలు అనేకమంది భావించారు. ఆ ఏడాదే కమ్యూనిష్టు పార్టీలో విభేదాలతో చీలిక ఏర్పడింది. సాయుధ పోరాటాన్ని కొనసాగించాలనే

వారు నాయకత్వంతో తీవ్రంగా విభేదించారు. నిన్నటి వరకూ రజాకార్లకు అన్నీ సమకూర్చి, నిజాంరాజుకు గులాములుగా పనిచేసిన దొరలంతా తిరిగి గడీల్లో చేరి, ఖద్దరు ధరించి కాంగ్రెస్ టోపీ పెట్టుకుని ఎమ్మెల్యేలుగా గెలిచి, కొత్తరూపంలో తమ ఆధిక్యాన్నీ, పాలననూ కొనసాగించడం మొదలు పెట్టారు. దాశరథి రంగాచార్య తెలంగాణ ఉద్యమం విరమణ వరకూ ఉన్న పరిస్థితులను 'జనపథం' అనే నవలలోనూ, సాయుధపోరాట విరమణ అనంతర పరిణామాల్ని 'మోదుగుపూలు' అనే నవలలోనూ చక్కగా చిత్రీకరించాడు.

కాంగ్రెస్ పాలన ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచాక కూడా దేశంలోని పేద, వెనుకబడిన ప్రాంతాల్లో విపరీతమైన వడ్డీ రేట్లు, కౌలు రేట్లు, వెట్టి చాకిరీ మరింతగా పెరిగింది. భూమిలేని నిరుపేదలు భూస్వాముల పొలాల్లో పనిచేసి ఇచ్చినంత తీసుకోవడం తప్ప, నోరు తెరిచే వీలులేదు. చిన్నకారు రైతులు ఏదో ఒక అవసరానికి భూస్వామివద్ద అప్పు తీసుకొని, వాళ్లువేసే చక్రవడ్డీ కట్టలేక, ఆ అప్పు తీర్చడానికి మళ్ళా అప్పుచేసి, అంతిమంగా తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని భూస్వామికి రాసి ఇవ్వక తప్పని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఫలితంగా పేదవాడు మరింత పేదగా, ధనికుడు మరింత ధనవంతునిగా మారారు. అధికారికంగా ప్రకటించిన 1971 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అరవై శాతం మందికి సెంటు భూమిలేదు. ముప్పాతికవంతు భూమి కేవలం నాలుగు శాతం మంది చేతిలో కేంద్రీకృతమై ఉంది. ఈ భూస్వాములు తమభూమిని కౌలుకు ఇచ్చేవాళ్ళు. కౌలు రైతులైన దళితులు, సేవాకులాలవాళ్ళు, గిరిజనులు ఎవరూ స్వంత భూమి కలిగి ఉండడానికి వీలులేదు. రాజ్య యంత్రాంగమంతా ప్రజాస్వామ్య విధానానికి భిన్నంగా, అలవాటుపడ్డ పాతపద్ధతి ప్రకారం భూస్వాముల కొమ్ముకాస్తుండేది. పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లాలోని నక్సల్‌బరి, ఫన్సిద్వా, పసకిమా అనే మూడు ప్రాంతాలు మూడువేల మైళ్ళ విస్తీర్ణంతో ప్రధానంగా గిరిజనులు నివసించే ప్రాంతాలుగా ఉండేవి. ఎక్కువమంది సంతాల్ గిరిజనులు. అక్కడ అమలయ్యే అధియార్ పద్ధతి ప్రకారం జోతేదార్లు (పెద్ద భూస్వాములు) గిరిజనులకు భూముల్ని కౌలుకు ఇచ్చేవారు. వారికి ఎడ్లు, నాగళ్ళు, విత్తనాలు అందించి, వచ్చిన పంటలో కౌలుచేసిన కుటుంబానికి తిండిగింజలకు సరిపోయినంత కూడా మిగల్చకుండా పంట మొత్తం స్వాధీనం చేసుకునేవారు. ఏమాత్రం వివాదం వచ్చినా, 'ఇదేమి అన్యాయ'మని ప్రశ్నించినా

వారికి పొలంలో ప్రవేశం లేకుండా చేసి భౌతిక దాడులకు పాల్పడడం జరుగుతుండేది. గిరిజనులు ఎన్నో తరాలుగా సాగు చేసుకుంటున్న భూమిపై కూడా వారికి హక్కు ఉండేది కాదు. 'బిగుల్ కిషన్' అనే గిరిజన రైతును భూస్వామి అన్యాయంగా భూమినుంచి వెల్లగొట్టాడు. అతను న్యాయస్థానానికి వెళ్ళి భూమిపై హక్కు సాధించుకున్నాడు. ఇందుకు కోపించిన భూస్వామి అతనిపై తన అనుచరులతో దాడిచేసి, తీవ్రంగా గాయపరిచాడు. అప్పటి వాతావరణం నిప్పు అంటితే పేలే బాంబులా ఉంది.

భూమి-భుక్తి-విముక్తికై నెత్తురు మండించిన నక్సలైట్ ఉద్యమం

చీలిన కమ్యూనిష్టు పార్టీలో సిపిఎం పార్టీలో పనిచేస్తున్న చారు మజుందార్, సిద్ధాంతపరంగా మార్క్సిష్టు పార్టీ నాయకత్వంతో విభేదించేవాడు. దేశంలో విప్లవ పరిస్థితులు ఏర్పడే వరకూ విప్లవాన్ని వాయిదా వేయాలని తీర్మానించిన మార్క్సిష్టు పార్టీ అభిప్రాయాలను విమర్శిస్తూ, లెనిన్, మావో ఆలోచనా విధానాల



ఆధారంగా ఎనిమిది సైద్ధాంతిక వ్యాసాలు రాశాడు. అంతేకాకుండా ఆ ప్రాంతంలోని ముఖ్యనాయకులు జుగల్ సంతాల్, కనూ సన్యాల్, తదితరులంతా కలిసి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వందలాది గిరిజన సంఘాలు ఏర్పాటు చేశారు. వీటిలో వేలాదిమంది గిరిజన రైతులు సభ్యులుగా చేరారు. వీరంతా విల్లంబులు, బరిసెలవంటి సాంప్రదాయిక ఆయుధాలు ధరించి రైతు సంఘాల పేరిట సంఘటితమయ్యారు. వీరిలో ఇరవైవేలమంది పూర్తికాలపు కార్యకర్తలుగా నమోదయ్యారు. సాయుధ గ్రామరక్షక దళాలుగా పరివర్తన చెందారు. పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి, 1967 ఏప్రియల్ 13న చారు మజుందార్ ఒక కీలక ఉపన్యాసం చేశాడు. ఆ సమావేశంలో పేద, మధ్య తరగతి రైతులపట్ల పార్టీ వైఖరి ఎట్లా ఉండాలనేదీ స్పష్టం చేశాడు. మనం ఎవరివైపు ఉన్నామనేదీ స్పష్టమైన అవగాహనతో ఉండాలి. మనం ఎల్లప్పుడూ భూమిలేని పేదరైతుల పక్షాన మాత్రమే నిలబడాలి. భూమిలేని నిరుపేదలకు, మధ్య తరగతి రైతాంగానికీ ఘర్షణ ఏర్పడ్డపుడు మనం తప్పనిసరిగా పేద రైతులకు

అండగా నిలబడి వారి తరపున పోరాడాలి. పెద్ద భూస్వాములకు, మధ్యతరగతి రైతాంగానికీ మధ్య ఘర్షణ ఎర్పడినప్పుడు మాత్రం మధ్య తరగతి రైతాంగానికి మద్దతు ఇవ్వాలి. మనం నిరంతరం ధనిక భూస్వాములతో పోరాటం చేయకపోతే నిరుపేద రైతాంగపు నాయకత్వాన్ని ఏర్పరచలేమని, ఇలా జరిగితే తప్ప మధ్యతరగతి రైతాంగం మనతో కలవరని చెప్పాడు. ఇక నక్సల్బరీ నిప్పురవ్వ అంటుకుని ఎర్రని మంటల జ్వాలలై నిప్పులు విరజిమ్మడం మొదలైంది.

రైతు సంఘం కార్యకర్తలు భూస్వాముల భవంతులపై దాడి చేసి, తప్పుడు పద్ధతుల్లో తయారు చేసిన ఋణపత్రాల్ని, తాకట్టు హామీ పత్రాల్నీ కాల్చివేశారు. రుణాలు రద్దుచేసి, రైతాంగానికి భూములు కేటాయించారు. క్రూరంగా ప్రవర్తించిన ధనిక భూస్వాములకు మరణశిక్ష విధించి, వారివద్ద ఉన్న తుపాకులు గుంజుకున్నారు. ఆ సంవత్సరం అనేక ప్రాంతాల్ని తమ అధీనంలోకి తీసుకొని విముక్తి ప్రాంతాలుగా ప్రకటించి, గ్రామాల్లో సమాంతర పాలన ప్రారంభించారు.

పరిస్థితి చేయిదాటి పోతున్నదని గ్రహించిన ప్రభుత్వం, మార్క్సిష్టు పార్టీకి చెందిన భూసంస్కరణల శాఖా మంత్రి హరేకృష్ణ కొనార్‌ను సిలిగురికి పంపింది. అతను పార్టీలోని అసమ్మతి నాయకులను కలిసి చర్చించాడు. చట్టవ్యతిరేక చర్యల్ని వెంటనే ఆపివేయాలని, రైతులంతా ప్రభుత్వ ఆధీనంలోని భూమిని పంచాల్సిందిగా విజ్ఞప్తులు ఇవ్వాలనీ, కనూ సన్యాల్, జుగల్ సంతాల్ తోసహ అందరూ లొంగి పోవాలనీ సూచించాడు. ఇందుకు కొందరు అంగీకరించినా, సిపిఎంలో తిరుగుబాటు దారులుగా ఉన్న నాయకులు మాత్రం దీన్ని రెండోమాట లేకుండా తిరస్కరించారు. అదే పాత వలస చట్టాల పరిధిలో, భూస్వామ్య వర్గాల ప్రయోజనాల్ని కాపాడే అదే రాజ్య యంత్రాంగంతో భూసంస్కరణలు చేయడం జరగని పనిగా వారు భావించారు. మంత్రి హరేకృష్ణ కొనార్ కలకత్తా తిరిగి వెళ్ళగానే భూసంస్కరణలు చేపడతామని తాను చెప్పిన మాటలు తప్పి, అక్కడ సాయుధ పోలీసుబలగాలను దించాడు. భూస్వాములు ఇంకా గ్రామాల్లోనే ఉన్నందున, వారు పోలీసులకు దారిచూపి ప్రజల్ని విచక్షణా రహితంగా హత్యలు చేయిస్తారు కాబట్టి, ముందుగా భూస్వాముల్ని చంపడంద్వారా వారు భయంతో పారిపోయేలా చేయాలని చారుమజుందార్ చెప్పాడు. ఈ దశలో పోలీసులమీద దాడి మొదలు పెట్టాలని, దానివల్ల మాత్రమే వారు భయపడి దాడులకు తెగబడకుండా జాగ్రత్త పడతారని చెప్పాడు.

కొందరు పోలీసులు గాలింపు చర్యలకు వెళ్ళినపుడు, 1967 మే 23వ తేదీన జరిగిన గిరిజనుల ప్రతిఘటన దాడిలో 'సోనమ్ వాంగ్ది' అనే పోలీసు అధికారి మరణించాడు. ఇందుకు ప్రతీకారంగా రెండోరోజు మే 25న పెద్ద సంఖ్యలో దాడికి దిగబడ్డ పోలీసులు నక్సల్‌బరి గ్రామంలోకి ప్రవేశించారు. మగవాళ్ళు ఎవరూ కనబడకపోవడంతో, ఒక గోడచాటునుంచీ విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఇద్దరు పసిపిల్లలతో సహా ఎనిమిదిమంది మహిళల్ని కాల్చిచంపారు. ఈ దాడి తర్వాత ప్రతిఘటన మరింత పెరిగింది. అనేకమంది గిరిజనుల్ని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తే, వారు తమ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసమే పోరాటం చేస్తున్నామని ధైర్యంగా జవాబిచ్చారు. మరో నాలుగురోజుల తర్వాత సిపిఎం బెంగాల్ శాఖ కంటితుడుపు చర్యగా ఈ పోలీసు దాడుల్ని ఖండించింది. ఈ ఉద్యమం త్వరలోనే బెంగాల్ లోని కళాశాల విద్యార్థులకు పాకింది. అధికార సిపిఎం పార్టీ ఉద్యమానికి మద్దతు ఇస్తున్న ప్రెసిడెన్సియల్ కాలేజీ విద్యార్థులతో సహా అనేకమందిని బహిష్కరించింది. వెనువెంటనే వారంతా కలకత్తాలోని రామ్మోహన్ గ్రంథాలయ సమావేశ మందిరంలో పెద్ద సంఖ్యలో కలిసి, 'నక్సల్బరి రైతాంగ పోరాట సహాయక సంఘం' ఏర్పాటు చేశారు. వీరంతా 1967 జూన్ 27న బెంగాల్ అసెంబ్లీ ముందు మహాధర్నా నిర్వహించారు. ఈ సమయంలో కేంద్ర హోమ్‌శాఖ పెద్ద ఎత్తున ఉద్యమాన్ని అణచడానికి పూనుకుంది. ఈ స్థితిలో కొత్తగా కమ్యూనిష్టు విప్లవకారుల అఖిలభారత సమన్వయ సంఘం ఏర్పాటయింది. అప్పటికి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న పాత్రికేయుడు సమంతా బెనర్జీ తను రాసిన 'ఇన్ ది వేక్ ఆఫ్ నక్సల్బరీ' (తెలుగులో నక్సల్బరీ వెలుగులో.. పేరిట కృష్ణమూర్తి అనువదించాడు.) ఈ ఉద్యమ ప్రస్థానాన్ని అక్షరీకరించాడు.

ఈ ఉద్యమం అనతికాలంలోనే దేశవ్యాపితంగా వ్యాపించింది. నాటికి సిపిఎం పార్టీలో ఉన్నవారు, ఇదే పంథాలో పనిచేస్తున్నవారు, అనేకమంది నక్సల్‌బరీ మార్గమే మా మార్గం అని నినదించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మించిన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం అనే ఇద్దరు ఉపా ధ్యాయులు సిపిఎం పార్టీ సభ్యులు. నక్సల్బరీ ఉద్యమానికి సమాంతరంగా వీరు ఉద్దానంలో గిరిజనుల్ని ఏకంచేసి, పోరాటాలు నిర్వహించారు. వీరు ప్రజల్లో ఎట్లా ఆత్మవిశ్వాసం కలిగించారో తెలియజెప్పడానికి ఒక ఉదాహరణ



పంచాది నిర్మల, పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటాపు సత్యం

చెపుతారు.

ఉద్దానంలోని ఒక ప్రాంతంలో చెట్టుకింద గిరిజనులు వేసిన నులకమంచంపై కూర్చుని వెంపటాపు సత్యం వారికి రాజకీయాలు బోధిస్తున్నాడు. ఇంతలో స్థానిక భూస్వామి నలుగురు బోయీలు మోస్తుండగా పల్లకీ ఎక్కి అటుగా వచ్చాడు. భూస్వామి వస్తున్నాడంటే అక్కడి గిరిజనులు చెప్పులు వదిలి, కండువా చంకన పెట్టుకుని, చేతులు జోడించి, ఒంగి నిలబడాలి. చుట్టూ ఉన్న గిరిజనులు అలాగే చేసి, సత్యం వంక చూస్తూ, అతనికి ఏమౌతుందోనని భయంగా కనబడ్డారు. తనను చూసి కనీసం లేవకుండా మంచంమీద కాలుమీద కాలేసుకు కూర్చుని చుట్ట తాగుతున్న సత్యాన్ని చూసి అవమానపడి, కోపంతో మండిపడుతూ పల్లకీ దిగి సత్యం దగ్గరకు వచ్చాడు. వచ్చీ రాగానే సత్యం ఆ భూస్వామి నడ్డిమీద ఎగిరి తన్నేడు. అతను బొక్కబోర్లా పడ్డాడు. భూస్వామి పాలేర్లు ముందుకురాగా చుట్టూ ఉన్న గిరిజనులు సత్యానికి రక్షణగా ముందుకు వచ్చారు. మండుతున్న కళ్ళతో తమవైపు చూస్తున్న సత్యం ముఖం చూడగానే కొండబారిడి భూస్వామి జీతగాళ్లు వెనక్కుతగ్గారు. కాళ్ళ దగ్గర పడి ఉన్న భూస్వామి చేత క్షమాపణ చెప్పించి, బుద్ధిగా నడుచుకోమని హెచ్చరించి వదిలిపెట్టాడు. దీంతో గిరిజనుల్లో ఆత్మవిశ్వాసం చైతన్యం పెరిగి, సత్యం నాయకత్వం మీద గురి ఏర్పడింది. దాంతో పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమంపట్ల ఆకర్షితులయ్యారు. మొదెంఖల్ అనేచోట 1967 అక్టోబర్ 31న గిరిజన రైతాంగ కమ్యూనిష్టుపార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. అన్ని ప్రాంతాలనుంచీ ఆ సభకు వేలాదిగా గిరిజనులు తరలి రాసాగారు. తమ ప్రాబల్యానికి దెబ్బకొట్టే గిరిజన చైతన్యాన్ని చూసి సహించలేని భూస్వాములు వారిపై దాడికి దిగారు. భూస్వాముల గూండాల్ని

ఎదుర్కొని వీరోచితంగా పోరాడిన గిరిజన వీరులు కొరన్న, మంగన్నలు కాల్పుల్లో మరణించారు. ఈ సభలో వర్గశత్రువులైన భూస్వాముల్ని హతమార్చాలని ప్రజలంతా కోపోద్రేకంతో అట్టుడికారు. వీరి మరణంతో అక్కడ విప్లవం బద్దలైంది.

ఆదిభట్ల కైలాసం, చౌదరి తేజేశ్వరరావు, వసంతాడ రామలింగాచారి, పైలా వాసుదేవరావు, పాంచాది కృష్ణమూర్తి, ఆయన భార్య పంచాది నిర్మల, తదితరులు ఇక్కడి ఉద్యమ నాయకులు. వీరు కొత్తగా ఏర్పడ్డ కమ్యూనిష్టు విప్లవకారుల అఖిలభారత సమన్వయ సంఘంలో చేరారు. మైదాన ప్రాంతాలకు కూడా పెద్దఎత్తున ఉద్యమం వ్యాపించింది. బొడ్డపాడు గ్రామంలో గుడి పూజారిగా పనిచేసే సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ చినబాబు, దున్న అంకమ్మ, ఇంకా అనేకమందితో కలిసి ఉద్యమ స్ఫూర్తిని రగిలించేలా, పాటలు, ప్రదర్శనలతో జనాన్ని ఆకర్షించేవారు. ఈ ప్రదర్శనల్లో చినబాబు అనే పద్నాలుగేళ్ల బాలుడు ఆడవేషం వేసి జనాల్ని మెప్పించే వాడు. అనంతర కాలంలో, ఎంతో చలాకీగా అందరికీ తలలో నాలుకలా మెలిగిన ముక్కుపచ్చలారని ఆ చిన్నారిని బూటకపు ఎన్కౌంటర్‌లో చంపారు. వీరు ముఖ్యంగా 'జముకు' అనే వాయిద్యంతో జముకుల కథ ద్వారా ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసేవారు. *'ఆకలి మంటల కడుపులు కాలే అనాథలంతా లేవండోయ్!'* అంటూ కరువు దాడులు నిర్వహించి, వందలు వేలసంఖ్యలో కదిలిన జనసమూహాలు భూస్వాముల గరిశల్లోని ధాన్యాన్ని పంచుకున్నారు. ప్రజాకంటకులుగా ఉన్న భూస్వాముల్ని హతమార్చారు. ఋణపత్రాలు, తాకట్టు పత్రాలు మంటల్లో కాల్చివేశారు. పోడు భూములు స్వాధీనం చేసుకుని గిరిజన రైతాంగానికి పంచారు. చైనా ప్రభుత్వపు రేడియో పీకింగ్, 'మావో చూపిన దారిలో సాయుధ విప్లవపోరాటం తొలి పంజా విసిరిందనీ, నక్సల్బరీ వసంతమేఘం గర్జించిందనీ వ్యాఖ్యానించింది.

ఎన్ని చీలికలు, సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ భారత ఉపఖండం మొత్తం అనేక ప్రాంతాలకు విస్తరించిన ఈ ఉద్యమంలో విప్లవకారులంతా ఆమోదించే ప్రధాన సూత్రాలు కొన్ని ఉన్నాయి. ఆంగ్లేయులు దేశాన్ని విడిచి వెళ్ళినపుడు జరిగింది అధికార మార్పిడి మాత్రమేనని, దోపిడీ, పీడన, ఆకలి, కన్నీళ్ళు లేని ఆర్థిక స్వాతంత్ర్యమున్న నూతన ప్రజాస్వామ్యాన్ని విప్లవ పోరాటం ద్వారానే సాధించుకోవాలనీ భావించారు. భారతదేశాన్ని, అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశంగా సూత్రీకరించారు. దున్నేవానికే భూమి ప్రాతిపదికన, వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగే విప్లవం

దీర్ఘకాల ప్రాతిపదికన కొనసాగించడం జరుగుతుంది. గెరిల్లా పోరాట పద్ధతిలో జరిపే సాయుధ పోరాటం ద్వారానే ఇది సాధ్యమౌ తుంది. ఇది భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేకరూపంలో ఉంటుంది. చైనా తరహాలో మావో నడిపిన విధంగా, మార్క్సిజం, లెనినిజం, మావోయిజపు సైద్ధాంతిక వెలుగులో ఉద్యమ నిర్మాణం జరగాలి. ముందుగా గ్రామీణ ప్రాంతాల్ని విముక్తం చేసి, అంతిమంగా పట్నాలను చుట్టుముట్టి రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే దిశగా పయనించాలనేది ప్రధాన సిద్ధాంతం.

ప్రభుత్వం పాశవిక అణచివేతకు సిద్ధమైంది. ఆంధ్రా పోలీసులు పాంచాది కృష్ణమూర్తి, నిర్మల తదితరులను ఎన్కౌంటర్లో కాల్చి చంపారు. ఈ సమయానికి పశ్చిమ బెంగాల్ లోని దేబ్రా గోపీవల్లభపూర్, బీహార్‌లోని మూసల్, ఉత్తరప్రదేశ్ లోని లఖింపూర్ ఖేరీ, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, కొన్ని ఇతర ప్రాంతాల్లో సాయుధ పోరాటం ఉవ్వెత్తున సాగుతున్న పరిస్థితులున్నాయి

సిపిఐ (ఎం.ఎల్.)

ఈ పరిస్థితుల్లో 1968 మే 14న తమిళనాడు, కేరళ, యూపీ, బీహార్, కర్ణాటక ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరై, అఖిలభారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ సంఘం ఏర్పాటు చేశారు. ఇది ఎన్నికలను బహిష్కరించాలని పిలుపు ఇచ్చింది. నాటి ఆంధ్రప్రదేశ్ నుంచీ ఆ సమావేశానికి హాజరైన ప్రతినిధుల్లో, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్యలు విభేదించి, ఆంధ్రా విప్లవకారుల సమన్వయసంఘం ఏర్పాటు చేశారు. అనంతరం లెనిన్ జయంతి సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్.) పార్టీ ఆవిర్భవించింది. ఈ పార్టీ ఏర్పాటు ప్రకటన 1968 మే ఒకటో తేదీన కలకత్తాలోని షాహీద్ మైదానంలో ఏర్పాటైన భారీ బహిరంగ సభలో జరిగింది. ఈ సమావేశాన్ని భగ్నం చేయడానికి సిపిఎం పెద్దఎత్తున కార్యకర్తల్ని రంగంలోకి దించడంతో ఇరువర్గాలకీ మధ్య జరిగిన సాయుధ సంఘర్షణలో షహీద్ మైదానం రక్తంతో తడిసిపోయింది. తర్వాత నాటి ఉమ్మడి గుంటూరు జిల్లా పల్నాడులోని సురక్షిత ప్రదేశమైన గుత్తికొండ బిలంలో చారుమజుందార్ హాజరైన రహస్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పాంచాది కృష్ణమూర్తి, చౌదరి తేజేశ్వరరావు, మామిడి

అప్పలసూరి వంటి ప్రముఖ నాయకులు హాజరై ఉద్యమ స్వరూప స్వభావాలకు రూపకల్పన చేశారు. ఆ నాటికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతూ వుంది. సిపిఐ, సిపిఎం పార్టీలు సమైక్య రాష్ట్రానికి మద్దతు తెలుపుతుండగా ఈ విప్లవ కారులు మాత్రం ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. విప్లవకారుల్ని జైళ్ళలోకుక్కి ఉద్యమాన్ని అణచి వేయడానికి ప్రభుత్వం సత్యం, కైలాసం, పాణిగ్రాహి వంటివారితో సహా నూట ఇరవై మందిపై పార్వతీపురం కుట్ర కేసు పెట్టింది. పెద్ద సైజులో దాదాపు పదికిలోలు తూగే ఆ కుట్రకేసు నేరారోపణ పత్రం (చార్జ్ షీట్) వీరనారాయణ అనే పోలీసు అధికారి సంతకం ముద్ర (ఫాసిమల్)తో ఉంది. వాటిలో పోలీసులు విప్లవకారుల దినచర్యతో సహా తమకు దొరికిన ఏ చిన్న ఆధారాన్నీ వదలకుండా నమోదు చేశారు. శ్రీకాకుళ ఉద్యమ ప్రథమ ఘట్టాన్ని వివరంగా నమోదుచేసే గ్రంథం రాయడానికి ఎవరైనా పూనుకుంటే, ఈ నేరారోపణ పత్రం ప్రధాన ముడిసరుకుగా ఉపయోగపడుతుంది. ఉద్యమ నాయకులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలను అరెస్ట్ చేసి, కురుపాం సమీపంలోని రంగమటియ కొండలలో ఎన్కౌంటర్ చేసి చంపారు. వారి అంతిమ యాత్రలో పాల్గొన్న వేలాదిమంది ప్రజలు కన్నీళ్లతో నివాళులర్పించారు.

డా॥ చాగంటి భాస్కరరావు వంటి ఎందరో మేధావులు, విద్యార్థులు, ఉద్యమంలో ప్రాణాలర్పించారు. వీరిలో చాలామంది ఎంతో సుఖంగా బ్రతికే జీవనాన్ని, ఉన్న ఆస్తిపాస్తులనీ వదిలి త్యాగపూరితంగా అశేష జనసామాన్యపు హక్కులకోసం, నూతన ప్రజాస్వామిక విప్లవంకోసం తమ ప్రాణాలు ధారపోశారు. మైదాన ప్రాంతాలు, పట్నాలలో కూడా చెదురుమదురుగా వర్గశత్రునిర్మూలన పేరిట కొన్ని ఘటనలు జరిగాయి. ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి సమయంలో వేలాదిగా విప్లవోద్యమ కార్యకర్తలు, సానుభూతి పరులు, శ్రీశ్రీ, నగ్నముని వంటి వారితో సహా, విప్లవ రచయితలు మేధావులు జైలుపాలయ్యారు. వందలాది మందిని పోలీసులు, పారామిలిటరీ బలగాలూ ఎన్కౌంటర్ చేసి చంపారు.

పీపుల్స్‌వార్

ఉద్యమం కొంతవరకూ స్తబ్దతకు గురయి, క్రమంగా తెలంగాణలో ఉధృతంగా ఎగసిపడింది. విప్లవకారుల్లో అధిక భాగం 1974 నుంచీ 1980 వరకూ

వరకు 'సీపీఐ (ఎం.ఎల్.) సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ' పేరుతో కొనసాగి 1980 ఏప్రిల్‌లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌గా రూపాంతరం చెందడంతో ఉద్యమం ఒక కొత్తమలుపు తీసుకుంది. విప్లవ రచయితల సంఘం చాలా క్రియాశీలకంగా పని చేసింది. శివసాగర్ (కే.జి. సత్యమూర్తి) వంటివారెందరో విప్లవకారులుగా ఉంటూనే భాష బతికినంతకాలం చిరస్థాయిగా ఉండే గుండెలు రగిల్చే కవిత్వం రాశారు. రాడికల్ యూత్ లీగ్, రాడికల్ విద్యార్థి సంఘం, చాలా పెద్దఎత్తున నిర్మాణమయ్యాయి. విప్లవ రచయితల సంఘం, జననాట్యమండలి వంటి సంస్థలు సాంస్కృతిక రంగంలో పనిచేస్తూ ప్రజల్లో గొప్ప ప్రభావం చూపాయి. ఈ సమయంలోనే ఇంద్రవెల్లి ఘటన జరిగింది. ఉట్నూర్ ఏజన్సీ ప్రాంతంలో 1981 ఏప్రియల్ 20వ తేదీన పీపుల్స్ వార్ భారీగా రైతుకూలీ మహాసభ తలపెట్టింది. సభకు వచ్చిన వేలాది జనంపై పోలీసులు తుపాకీ కాల్పులు జరిపారు. ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో పోలీసులపై తిరగబడ్డారు. దాంతో పోలీసులు మరింత విచక్షణా రహితంగా గిరిజనులపై తూటాలు పేల్చారు. ఆ కాల్పుల్లో చనిపోయిన వారి సంఖ్య తక్షణం ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పదమూడు మంది కాగా, నిజనిర్ధారణ కమిటీ, పౌరహక్కులసంఘం క్షేత్రస్థాయి పర్యటనలో వందలమంది పోలీసుకాల్పుల్లో మరణించారని తెలిసింది. ఈ సంఘటన పీపుల్స్ వార్ మరింత బలపడడానికి ఆలంబన అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఊరూరా దీన్ని ఖండిస్తూ బహిరంగ సభలు జరిపారు. డా॥ గురుకుల మిత్ర చైనా నుంచీ వస్తూ తెచ్చిన 'హైషియ' అనే విప్లవ చిత్రాన్ని ఇంద్రవెల్లి మృతుల సహాయార్థం బెనిఫిట్ షో కింద ప్రదర్శించి, అనేక బహిరంగ సభలు జరిపారు. ఈ దశలోనే చారిత్రాత్మక ఉత్తర తెలంగాణకు విప్లవోద్యమం విస్తరించింది.

తెలంగాణ సాయుధ పోరాటం ప్రధానంగా దక్షిణ తెలంగాణలోనే జరగడం వల్ల ఇక్కడి భూస్వామ్యవర్గంలో, దోపిడీ విధానంలో కొంతమార్పు జరిగింది. కానీ ఉత్తర తెలంగాణలో భూస్వామ్య దోపిడీ విధానం యధాతథంగా కొనసాగే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గతంలో పన్ను వసూలు దారులుగా ఉన్న జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, సాగుకు పనికి వచ్చే వందలు, వేల ఎకరాల భూమిని అక్రమమార్గాల ద్వారా తమ అధీనంలో ఉంచుకొని, ప్రజల్ని దోచుకునేవారు. కొద్దోగొప్పో భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల భూముల్ని కూడా అప్పులిచ్చో, మరొక రకంగానో తమ అధీనంలోకి తెచ్చుకునేవారు. వృత్తి కులాలవారు, వ్యవసాయం చేసుకునే సన్నకారు రైతులు,



దళితులు వెట్టి చాకిరీ చేయవలసి రావడం, దారుణమైన కూలీరేట్లు, భరించలేని వ్యవసాయ పన్నులు, ఎదురు తిరిగినవారు వెలి లేదా గ్రామ బహిష్కరణకు గురి కావడం సాధారణంగా మారింది. ప్రతీ దళిత కుటుంబం నుంచీ ఒకరు భూస్వామి ఇంటిపనులు, వ్యవసాయ పనుల కోసం తప్పనిసరిగా వెళ్ళాలి. అవివాహిత కన్యల్ని వారి ఇంటికి దాసీలుగా పంపాలి. ఈ కన్యల్ని వారి సొంతానికే కాకుండా, వారి అతిథుల్ని లైంగికంగా తృప్తిపరిచేందుకు కూడా వాడుకునే వారు. ఏ మనిషికీ కొంచెం కూడా ఆత్మగౌరవం ఉండేందుకు వీలు లేదు. ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఎంఎల్ పార్టీలు బలంగా కుదురుకున్నాయి. విస్తృతిలో పీపుల్స్ వార్ గణనీయంగా వున్నా, జనశక్తి పార్టీ వారుకూడ చాలాచోట్ల ఉద్యమాలు నడిపారు. బీడీ కార్మికుల్లో జనశక్తి గ్రూప్ నుంచీ విస్తృతంగా పనిచేసిన నెల్లూరు నగరానికి చెందిన ఎన్.వి. కృష్ణయ్య సిరిసిల్ల నియోజకవర్గం నుంచీ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యాడు.

ఆట–పాట–మాట

ఇక్కడి పోరాటాల్లో గద్దర్ సారధ్యంలో విస్తరించిన జననాట్యమండలి ప్రజల్ని ఉత్తేజితం చేయడంలో కీలకపాత్ర వహించింది. *"రండిరో కూలన్నా సంగం బెడదాము – సంగతేందో చూద్దాము",' "ఎన్నాళ్ళీ మాదిగ బతుకులు"* వంటి పాటలతో, ముఖ్యంగా దళితకులాల వాడలు, వృత్తి కులాల వారిమధ్య పనిచేసింది. రాడికల్ విద్యార్థి సంఘం, రాడికల్ యువజన సంఘాలు 'గ్రామాలకు తరలండి' కార్యక్రమం

విస్తృతంగా జనసమీకరణకు దోహదపడింది. రైతుకూలి సంఘం ప్రజల విశ్వాసాన్ని చూరగొని, సాపేక్షంగా బలహీన మైన సామాజిక మద్దతు, సామాజిక సంబంధాలు వున్న భూస్వాములపై ప్రాథమికంగా ప్రజానీకాన్ని ఉద్యమీకరింప జేసింది. ముందుగా కూలిరేట్ల పెంపు, దండగ కట్టడం మానడం, వెట్టి నిర్మూలనతో ప్రారంభమైన ఉద్యమం బలపడిన తర్వాత, అప్పటివరకూ భూస్వాములు తమకు ఎదురు తిరిగిన వారిపై ప్రయోగించిన 'సామాజిక బహిష్కరణ'ను తిరిగి వారి పైనే ప్రయోగించారు. దళిత కులాలు, చాకలి, మంగలి వంటి వృత్తిసేవా కులాలవారూ భూస్వాములకు సేవలను తిరస్కరించి వెలి వేశారు. ఈ సామాజిక బహిష్కరణ కేవలం భూస్వాముల ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలిగించడమే కాకుండా, భూస్వాముల రోజువారీ జీవితానికి కూడా తీవ్ర అసౌకర్యం కల్పించడం ద్వారా అద్భుతాలు సృష్టించింది. భూస్వాముల్ని ప్రజల మధ్య విచారించి హెచ్చరించడంతో మొదలై, భూస్వాముల హింసకు వ్యతిరేకంగా 'వర్గ శత్రు నిర్మూలన' పేరిట సాయుధ ఉద్యమం మొదలైంది. ప్రభుత్వం ఈ ఉద్యమాల్ని సామాజిక, రాజకీయ అంశంగా చూడకుండా, భూస్వామ్య వర్గాల కొమ్ముకాసి, ఉత్తర తెలంగాణను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించింది. ఈ ఉద్యమంలో గొప్పగా చెప్పు కోవాల్సింది 'జగిత్యాల జైత్ర యాత్ర'. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా 1978 సెప్టెంబర్ 9న అసంఖ్యాక ప్రజానీకం లక్షల సంఖ్యలో విప్లవ నినాదాలతో కదం తొక్కారు. మావోయిస్టు పార్టీగా 2004లో మారిన తర్వాత, ప్రభుత్వంతో బహిరంగ చర్చలకు హాజరైనప్పుడు అశేష ప్రజానీకం వారికి తమ ఆకాంక్షలను తెలియజేయడం సాధారణ ప్రజానీకంలో వారికున్న ఆదరణను తెలియజేసింది. ఈ చర్చల సందర్భాన్ని మాత్రం ప్రభుత్వం అనేకమంది ఉద్యమకారుల్ని చంపేందుకు ఉపయోగించుకుంది.

వైఫల్యాలు

ఇన్ని దశాబ్దాల పోరాట వైఫ్యల్యాలను అంచనా వేయడంలో ఉద్యమ నాయకత్వం విఫలమైందనే చెప్పాలి. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ వంటి సంస్థలు, కొంతమేర అటవీహక్కుల గుర్తింపు, ఏదొకమేర విద్య వైద్య సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం, తదితరాలు ఉద్యమ ఫలితమే. నేడు వివిధరకాల సామాజిక సహాయ పథకాల కింద పేదప్రజలకు ఇస్తున్న డబ్బు, ఇళ్లవంటివన్నీ కేవలం ఓట్లకోసమే కాకుండా, ప్రజల్లో అసంతృప్తిని అణచివేసేందుకేనని అర్థమవుతోంది. విద్యను

ప్రయివేటీకరించడం వల్ల విద్యార్థుల్లో సామాజిక చింతన తగ్గిపోయింది. వర్తమానంలో వస్తున్న సాంకేతిక పురోభివృద్ధి, ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు, భూవినియోగంలో వ్యవసాయ రంగానికి తగ్గుతున్న ప్రాధాన్యత, అనూహ్యంగా సేవారంగంలో విస్తరిస్తున్న ఉపాధి అవకాశాలు, వ్యవసాయరంగంలో ఉపాధి పొందేవారి శాతం క్షీణత, వంటి అనేక అంశాల్ని పరిగణనలోకి తీసుకొని, వర్తమానంలో పిడివాదంగా మారిన నాగేటి చాళ్ళ సిద్ధాంతాన్ని పునరాలోచించుకుని విశ్లేషించుకోవడంలో ఎం.ఎల్. పార్టీలు వైఫల్యం చెందినట్లు అర్థమౌతుంది. ఈ ఉద్యమాలన్నిటా ప్రధానంగా వివిధ గిరిజన దళిత, ఉత్పత్తి, సేవాకులాలు పరోక్షంగా కొద్దిమేర ప్రయోజనం పొందాయి. ఉద్యమం ఏ రకమైన అంతరాలు లేకుండా పేదకులాల్ని ఏకం చేసి, ఐకమత్యాన్ని నెలకొల్పింది. ఐతే, కులసమస్యను ఎం.ఎల్. పార్టీలు ఏ రకమైన సిద్ధాంతపర ప్రాముఖ్యం ఉన్న అంశంగా చూడలేదు. అనంతర కాలాల్లో ఈ లోపం కూడా ఉద్యమంపై వ్యతిరేక ప్రభావం చూపింది.



7

ప్రజాస్వామ్యం- కులవ్యవస్థ

భారత ఉపఖండం మొత్తం భాష, రంగు, ప్రాంతంతో సంబంధం లేకుండా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్ని శాసిస్తున్న అంశాలలో కులం ప్రధాన పాత్రవహిస్తూ ఉంది. వర్గం స్థానంలో ఉండి, ప్రజానీకాన్ని అనేకవందల వర్గాలుగా విభజించి, మారుతున్న వివిధ రాజకీయ పరిణామాల్లో కూడా వేల ఏళ్లుగా తన ఉనికిని కాపాడుకుంటూ నిలబడి ఉంది. సాయుధ విప్లవ పోరాటాలు, నక్సల్బరీ ఉద్యమాలూ, పాలకులు ప్రజల కనీస సౌకర్యాల పట్ల శ్రద్ధ వహించడానికి, వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా ఎక్కువమంది ప్రజానీకం ఆకలి కోరలకు బలికాకుండా నివారించే చర్యలు తీసుకోవడానికి దోహదపడ్డాయి. కానీ అవి మాత్రమే విప్లవోద్యమానికి ప్రతిబంధకంగా మారలేదు. వాటికంటే ముందు కుల అస్తిత్వవాదం బలంగా ముందుకు వచ్చి విప్లవోద్యమాలను నీరుగార్చే ప్రక్రియ మొదలైంది.

కులవ్యవస్థపై అధ్యయనాలు జరిపి, కిందికులాల రాజకీయ అధికారాన్ని గురించి విస్తృతంగా కృషిచేసిన 'రాం మనోహర్ లోహియా' వంటి సోషలిష్టులు గతంలో ఉన్నా, బలహీన వర్గాల కులాల ప్రజల్ని కులరూపంలో సంఘటితం చేసి, రాజకీయాధికారానికై ప్రయత్నం చేసిన కమ్యూనిష్టు ఉద్యమకార్లలో ముఖ్యంగా తెలుగునేల మీద డా॥ గురుకుల మిత్రాను మొట్టమొదటివానిగా చెప్పుకోవచ్చు. అప్పటికే, సమసంగం, తెలుగుస్తాన్ పార్టీల ద్వారా కొన్ని ప్రయోగాలు చేసిన ఆయన 1985 ప్రాంతాల్లో 'బలహీనవర్గాల పార్టీ' స్థాపించి తెలుగు నేల అన్ని ప్రాంతాలకు వెళ్ళాడు. ఉత్తరాంధ్ర నుంచి భూపతి నారాయణమూర్తి, హజరత్ అలి, జానా నాగేశ్వరరావు, మెదక్ నుంచి పామయ్యగారి కుమార్, నెల్లూరు ప్రాంతం నుంచి ఇరగనబోయిన శ్రీనివాసరావు, గుంటూరు నుంచి ఆకురాతి మురళీకృష్ణ, గమనం, డా॥ కె. జయకుమార్, గూడూరు



కోవెన, ముత్యాల శ్రీనివాసరావు, చిట్యాల నుంచి ఏనుగు నరసింహారెడ్డి, గంజి సత్తయ్య, పలనాడు నుంచి అంబటి నరసింహారావు, చిత్తూరు నుంచి యమలా సుదర్శనం వంటివారు ఎందరో ఇందులో పాలుపంచుకున్నారు. ఈ అంశంపై సిద్ధాంత పత్రాలు, రచనలు, కవిత్వ సంపుటాలు వెలువడ్డాయి. అనేక సభలు కూడా జరిపారు. అనంతరం కొద్దికాలానికే కారంచేడులో దళితులపై అగ్రకుల భూస్వాములు దాడిచేసి అనేకమందిని పొట్టన పెట్టుకున్న అంశం ప్రకంపనలు సృష్టించింది. అదే సమయంలో బలహీన వర్గాలకు రాజ్యాధికారం అనే భావనతో కాన్షీరామ్ స్థాపించిన బహుజన సమాజ పార్టీ ఉత్తరాదిన అనేక చోట్ల గట్టి పట్టు సంపాదించి, సంచలనం సృష్టించింది.

ప్రాతిపదికగా కులసంఘాలు

తర్వాతి కాలంలో ఇదే అంశంపై చాలా మంది విప్లవకమ్యూనిష్టు పార్టీలతో విభేదించి, కులసంఘాల ప్రాతిపదికన పనిచేయడానికి బయటకు వచ్చారు. కె.జి. సత్యమూర్తి, మారోజు వీరన్న, ఉ. సాంబశివరావు, బొజ్జా తారకం, బి.ఎస్. రాములు వంటి వారెందరో వీరిలో ఉన్నారు. ఇందులో అత్యంత వెనుకబడ్డ బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహించిన ఉ.సా., సత్యమూర్తిగార్లు కలిసి, "ఎదురీత" అనే మాసపత్రిక కూడా కొన్నాళ్ళు నడిపారు. మారోజు వీరన్న బ్రహ్మాండమైన బహిరంగ సభలు నిర్వహించాడు. వాస్తవానికి ఆచరణలో ఇవేవీ మౌలిక సామాజిక మార్పు దిశగా ప్రభావం చూపే విషయంలో విజయవంతం కాలేదని చెప్పుకోవచ్చు. వీరనుకున్న కులప్రాతిపదికన ప్రజల్ని ఐక్యం చేయడంలో వైఫల్యం చెందడానికి మూలకారణాలు దాని వ్యవస్థీకరణలోనే ఉన్నాయి. ఈ విషయాల్ని అర్థం చేసుకోడానికి కులవ్యవస్థ చారిత్రిక దశల్ని గురించి అవగాహన చేసుకోవాల్సిన అవసరముంది.

కుల వ్యవస్థ చరిత్ర

కుల వ్యవస్థ ఏ చారిత్రిక దశలో ఏర్పడి వర్తమాన రూపంలో స్థిరీకృతమైందన్న అంశంపై స్పష్టమైన ఆధారాలు లేకపోయినా, స్థానిక సింధులోయ నాగరికత విధ్వంసం తర్వాత, వర్తమాన శకానికి సుమారుగా రెండువేల ఏళ్ల క్రితం వైదిక ఆర్యులు భారత ఉపఖండం లోకి వలసలు రావడం ప్రారంభమైన తర్వాత కులవ్యవస్థకు తొలిరూపమైన వర్ణవ్యవస్థ ఏర్పడినట్లు లభిస్తున్న ఆధారాలని బట్టి అర్థమవుతుంది. ఆర్యులు తాము అత్యున్నత జాతిగా భావించి ప్రజల్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. వారి

సాహిత్యమైన వేదాలలో దీన్ని పొందుపరిచారు. ఋగ్వేదంలోని పురుషసూక్తంలో వెయ్యి తలలు, వెయ్యి పాదాలు ఉన్న అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన విశ్వపురుషుడిని వర్ణిస్తూ వర్ణ వ్యవస్థను గురించి విశదీకరించారు. ఇందులోని వివరణ ప్రకారం, బ్రాహ్మణులు ముఖం నుంచి, క్షత్రియులు భుజాల నుంచి, వైశ్యులు తొడల నుంచి, శూద్రులు పాదాల నుంచి పుట్టారని పేర్కొన్నారు. దీని ప్రకారం స్థానిక ప్రజలయిన అనార్యుల నందరినీ దశ్యులుగాను, శూద్రులుగానూ, రాక్షసులుగాను అభివర్ణించి, తమకు బానిసలుగా ఊడిగం చేయడమే వారి ధర్మమని స్పష్టపరిచారు. వీరి మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. వీటినే దేవాసుర యుద్ధాలుగా వారి సాహిత్యంలో అభివర్ణించారు. క్రమంగా వందల సంవత్సరాల కాలగమనంలో ఈ ఆర్య తండాలకు, స్థానికులకు మధ్య అనివార్యంగా ఒక సంకర జాతి ఏర్పడింది. ఈ ఆర్య, అనార్య మిశ్రమకూటాల్లో చేరకుండా ఉన్న స్థానిక గిరిజనులు, మూలవాసుల్ని ఆర్యులు, 'అయోగ్యవులు, చండాలురు, నిషాదులు' అని ద్వేషభావంతో చూసేవారు. అనంతర కాలంలో వీరినే పంచములుగా పిలిచారు. స్థానిక శూద్రకులాలు సంఘటితమైతే ఏనాటికైనా తమ ఉనికికి ముప్పు వాటిల్లగలదనే భయంతో వారు శూద్రులలో ఉన్న వృత్తుల్ని బట్టి వారు ఒకరితో ఒకరు కలిసే వీలు లేకుండా, వారిని అంతర్వివాహానికి పరిమితం చేయడం, కులవృత్తి మాత్రమే చేయాలనడం, ఇతరులతో సహపంక్తి భోజన నిషేధం, కులపంచాయితీల పరిష్కారాలు వంటి వివిధరకాల కట్టుబాట్లు విధించారు. కాలక్రమేణా ఇవి ప్రజల నరనరాల్లోనూ జీర్ణించుకుపోయాయి. వీరికి సంబంధించి పౌర చట్టాలు, నేర న్యాయచట్టాలు (సివిల్, క్రిమినల్) కూడా వేరువేరుగా ఉండేవి.

బ్రిటీషు అధికారం కుదురుకున్న తర్వాత వారు వివాహం, విడాకులు, ఆస్తి పంపకాలు, వారసత్వం వంటి చట్టాల్లో పెద్దగా మార్పులు తేలేకపోయినా, భారత ఉపఖండం లోని తమ పాలనాపరిధి ఉన్న భూభాగంలో నేరన్యాయ చట్టాలలో మాత్రం చాలా వరకూ మార్పులు తెచ్చారు. అప్పటివరకూ కొన్ని వందల ఏళ్లుగా అమలవుతున్న ప్రకారం, బ్రాహ్మడు హత్య చేసినా నేరం కాదు. పాలకులకు ఎవరినైనా చంపడానికి అధికారం ఉండేది. బ్రాహ్మడుని హత్య చేస్తే మాత్రం శిక్ష భారీగా ఉంటుంది. స్త్రీలకు ఎటువంటి ఆస్తి హక్కు లేదు. కొన్ని అగ్ర కులాల్లో భర్త మరణిస్తే భార్య సతీ సహగమనం చేయాలి. మగవాడు ఎన్ని పెళ్లిళ్లయినా చేసుకోవచ్చు. దళితుల పరిస్థితులు

చాలా దారుణంగా ఉండేవి. మానవ హక్కుల్ని గురించిన అవగాహన ఎవరికీ లేదు. మొఘలుల పాలనాకాలంలో, కొందరు రాజుల పాలనా కాలంలోనూ ఏవో కొన్నిరకాల తేడాలున్నా, ప్రాథమికంగా మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి వంటి బ్రాహ్మణాధిక్య భావజాలంతో రాసిన అంశాల ప్రకారమే శిక్షలు విధించేవారు. రాజు తర్వాతి న్యాయాధికారులుగా బ్రాహ్మణులు మాత్రమే ఉండేవారు. కొన్ని వందల సంవత్సరాల కాలగమనం ఇట్లాగే సాగిన పరిస్థితులు ఉన్నాయి. అన్ని రంగాలలో ఆధిపత్యం వహించిన ఆర్యవైదిక మతమే ఏలుబడిలో కొనసాగింది.

సామాజిక పీడన, సాధారణ జనంపై అణచివేతలు అమలు జరపడం సాధారణ విషయాలుగా పరిగణించేవారు. మధ్య యుగాలు, అనంతర కాలంలో లిపి ఒక దశకు చేరుకున్నాక రాసుకున్న రచనలలో కూడా కులాధిక్యతను, స్త్రీల అణచివేతనూ సహజమైన అంశాలుగా సాహిత్యంలో చిత్రీకరించేవారు. మంగళకైశికి రాగంలో విష్ణుగీతాలు పాడే మాలదాసరి చావబోయే ముందుకూడా గుడి బయట పాడి వస్తానని చెప్పడం గురించి 'ఆముక్త మాల్యదలో ఒక కథ ఉంది. తమకు ప్రాణనష్టమైనా తన ధర్మం నిర్వర్తించాలనే బోధన ఇందులో ఉంది. అదే విధంగా భారతంలోని ఒక కథలో కౌశికుడనే కోపిష్టి అయిన బ్రాహ్మణోత్తముడు తనపై రెట్టవేసిన కొంగను చూపులతోనే చంపుతాడు. ఒక పతివ్రత ద్వారా అతన్ని ధర్మవ్యాధుడనే మాంసవిక్రేత వద్దకు పంపి, అతనికి 'ప్రతిమనిషీ తన స్వధర్మాన్నీ కులవృత్తినీ పాటిస్తేనే సమాజానికి మంచిదని సనాతన ధర్మ బోధ చేయిస్తారు. సనాతన ధర్మం ప్రకారం, ఆడవారికి పాతివ్రత్య ధర్మాన్నిబోధించే కథలకు ఇక లెక్కే లేదు. సూర్యోదయాన్ని సైతం ఆపగలిగిన పతివ్రత సతీసుమతికి ఆ శక్తి ఎట్లా వచ్చిందంటే, కుష్టు వ్యాధితో బాధపడుతున్న నికృష్టపు మొగుడు ఒక వేశ్య పొందు కోరితే, వాడిని వేశ్యకు తార్చడం వల్లనే అని ఉపదేశిస్తారు. ఇవన్నీ అణచివేతకు, దోపిడీకి గురవుతున్న వారిచేతనే అవి సరైనవిగా, గొప్పవిగా వాళ్ళమెదళ్లలో ఇంకించడానికి చేసే ప్రయత్నాలు. ఇటువంటి ప్రయత్నాలు మత గ్రంథాలు, పురాణాల ద్వారా నిరాటంకంగా విజయవంతంగా కొనసాగాయి.

సామాజిక మార్పుల శతాబ్దం

20వ శతాబ్దంలో ఒక్కసారిగా చాలామార్పులు చోటుచేసుకున్నాయి.

బానిసభావం నుంచి ప్రజలు చైతన్యవంతం కావడం ప్రారంభించారు. బ్రిటీషువారు వారి ఆదాయం కోసమే అయినా పరిమిత స్థాయిలోనైనా భూమిపై యాజమాన్య హక్కులు కలగజేసిన ఫలితంగా, అప్పటివరకూ శూద్రులుగా తక్కువస్థాయి వారిగా ఉన్న రెడ్డి, కమ్మ వంటి వ్యవసాయ కులాలవారు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలగడంతో బ్రాహ్మణాధిక్యతను ముందుగా ఎదిరించారు. బ్రిటీషు పాలకులు ప్రజలందరికీ వర్తించే కొన్ని ఉప యోగకరమైన చట్టాలు చేశారు. నేరం చేసిన వారిపట్ల కులం, సామాజిక స్థాయితో పని లేకుండా అందరికీ ఒకే శిక్ష విధించే పద్ధతి, సతీ సహగమన నిషేధం, శిశుహత్య నిషేధం, నరబలి నిర్మూలన, బాల్య వివాహ నిషేధ చట్టం, రెడ్డి, కమ్మ, కాపులతో సహా శూద్రులందరికీ ఆస్తి కలిగి ఉండడానికి చట్టం, మనుస్మృతి ప్రకారం ఉన్న శూద్రుల చదువుపై నిషేధం ఎత్తివేత, వంటి ప్రజాస్వామిక చట్టాలు చేశారు. మధ్యయుగాల చరిత్రలో రెడ్డి, కమ్మ, కాపు కులాలవంటి వారు రాజ్యాల్ని పాలించిన చరిత్ర ఉన్నా ఇవేవీ బ్రిటీషు చట్టాలంత శక్తివంతంగా ఆయా కులాలకు చెందిన సాధారణ జనాల సామాజిక అంతస్తులో గణనీయమైన పెరుగుదలకు దోహదం చేసిన దాఖలాలు కనబడడం లేదు. పైగా, ఆ వ్యక్తి ఏ సామాజిక విభాగం నుంచి వచ్చాడనే అంశంతో సంబంధం లేకుండా, పదిమందిని పోగేసుకుని నలుగుర్ని ఆక్రమించి రాజుగా ప్రకటించుకునే ప్రతి ఒక్కడికీ తమ స్వార్థ ప్రయోజనాల కోసం బ్రాహ్మణ వర్గం సూర్యవంశమో, చంద్రవంశమో ఆపాదించడం జరిగింది. అలానే వ్యవసాయ ఆధిపత్య కులాల రాజులు కూడా కొందరు కనిపిస్తారు. అరుదుగానైనా సర్వాయి పాపన్న, కాటమరాజు వంటివారు కనుపించినా వీటిని ఆయా కులాల గతిశీలతకు ప్రమాణాలుగా చూడలేము. చాకలి, మంగలి వంటి సేవకకులాలు, సాలీలు, కమ్మరి, కుమ్మరి వంటి వృత్తి కులాల వారిలో ఉన్నట్లు వ్యవసాయ ఆధిపత్య కులాల్లో కులవిభజన పందొమ్మిదో శతాబ్ద ప్రారంభం వరకూ కూడా స్పష్టంగా లేదు. మద్రాసు ప్రెసిడెన్సీలో కమ్మ-కాపులు ఒక సంఘంగా ఉన్న దాఖలాలు ఉన్నాయి. ఇరవయ్యో శతాబ్దం మధ్యవరకూ, నేడు రెడ్డి కులంగా ఉంటున్న వారిలో అత్యధికులకు పేరు చివర రెడ్డి పదం ఉండేది కాదు. అంతా తాము కాపు కులానికి చెందినవారుగా చెప్పుకునేవారు. వారిలో నేటికీ అనేకమంది కులం అన్న చోట కాపు అని రాసుకోవడం ఆనవాయితీగా ఉంది. పందొమ్మిదో శతాబ్ది మలిభాగం నుంచి ఆధునిక విద్య కొంతమందికైనా



అందుబాటులోకి రావడం, నూతన ప్రజాస్వామిక భావనలు ఇక్కడి సామాజిక చింతనాపరుల్లో బ్రహ్మణాధిక్య సమాజాన్ని ధిక్కరించి, విద్య, సామాజిక ఆర్థిక సాంస్కృతిక రంగాలలో గతిశీలతకై ఉద్యమించడానికి దోహదకారకమైంది.

ఇట్లా ఉద్యమించిన వారిలో అనేకమంది మతపరమైన అంశాల ప్రాతిపదికతో సహా భిన్న మార్గాలలో పాటు పడ్డారు. కేరళలో నారాయణ గురు, తమిళనాట పెరియార్ రామస్వామి, మహారాష్ట్రలో జ్యోతీరావ్ పులే, సావిత్రీ బాయి, త్రిపురనేని రామస్వామి, సాహూ మహారాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి వారెందరో ఉన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పదవుల్లో, ఉద్యోగాల్లో బ్రాహ్మణేతరుల సంఖ్య పెరగడం కోసం దక్షిణాదిన సౌత్ ఇండియన్ ఫెడరేషన్ స్థాపించారు. ఇది 1916 లో 'జస్టిస్ పార్టీ' పేరిట రాజకీయ పార్టీగా అవతరించి, మాంటేగ్ చేమ్స్‌ఫర్డ్ సంస్కరణల ఫలితంగా ఏర్పడ్డ ప్రభుత్వంలో ఎన్నికలలో గెలిచి, అధికారం కైవసం చేసుకుంది. దీంతో దళితులు, వెనుకబడిన కులాల్లో సామాజిక, విద్య, ఆర్థిక గతిశీలత పట్ల ఆకాంక్షలు పెరిగాయి. పందొమ్మిదో శతాబ్దం చివరిలో బ్రిటీషు పాలకుల ప్రోత్సాహంతో కొల్లాపూర్ సంస్థానానికి చెందిన రాజు ఛత్రపతి సాహు, మైసూర్లో కృష్ణస్వామి వడయార్ వంటివారు బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్ల కల్పనకై పాటుబడ్డారు. వాడొకందుకు పోస్తే, వీడొకందుకు తాగాడన్నట్లు, కులాల మధ్య విభజన తమ పాలనకు పనికి వస్తుందనే ఉద్దేశ్యంతో, బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు కల్పించడాన్ని బ్రిటీషు పాలకులు పరోక్షంగా ప్రోత్సహించినా అది ప్రజలకు మేలే చేసిందని చెప్పుకోవచ్చు.

కులం - రిజర్వేషన్లు

బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి వల్ల భారత రాజ్యాంగంలో దళితులకు, గిరిజనులకు అధికారికంగా రిజర్వేషన్లు కల్పించారు. దీనిపై మిగతా వెనుకబడిన కులాల వారికి కూడా విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలనే ఆకాంక్షలు తీవ్రమయాయి. భారత రాజ్యాంగం లోని అధికరణం–15 కింది క్లాజుల ప్రకారం భారత సమాఖ్యలోని రాష్ట్రాలు తమ భూభాగం పరిధిలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలకోసం విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఈ అంశంపై పార్లమెంటులో పెద్ద చర్చ జరిగింది. దీనిపై నాటి ప్రధాని నెహ్రూ 1951 జనవరి 29న **కాకా కాలేల్కర్** అధ్యక్షతన పదకొండుమంది సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ 1955లో 2399 వెనుకబడిన కులాల జాబితాతో నివేదిక సమర్పించింది. రిజర్వేషన్లకు సామాజిక వెనుకబాటుతనాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతూ, బీసీలను వెనుకబడిన కులాలు, అత్యంత వెనుకబడిన కులాలుగా వర్గీకరించింది. కమిటీ సూచనల్లో భిన్నాభిప్రాయలు ఉన్నాయనే నెపంతో ఆ నివేదిక అమలు చేయలేదు. **బీసీ రిజర్వేషన్ల అమలు అంశంపై నిర్ణయాధికారాన్ని కేంద్రం రాష్ట్రాలకే వదిలివేసింది.** దీని ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశలో **1963లో అనంతరామన్ కమిటీ** వేసి, 1970 నుంచీ ఇరవై ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారు. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో, **1982లో మురళీధరరావు కమిషన్** ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సూచన మేరకు అనంతరం అధికారంలోకి వచ్చిన ఎన్.టి. రామారావు ప్రభుత్వం నలభై నాలుగు శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తూ ఉత్తరువులు జారీచేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్ట్‌ను ఆశ్రయించగా ఆ ఉత్తరువుల్ని కొట్టివేశారు. దీనిపై రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళకుండా పక్కన పడేయడం జరిగింది. కొన్ని రాష్ట్రాలలో బీసీ రిజర్వేషన్లు అమలు జరిపినా చాలా రాష్ట్రాల్లో ఈ అంశంపై ఏ చర్యలూ తీసుకోలేదు. కేంద్రంపై ఉన్న ఒత్తిడుల కారణంగా జనతా ప్రభుత్వ హయాంలో ప్రధాని మురార్జీ దేశాయ్ 1978 డిసెంబర్‌లో బి.పి. మండల్ అధ్యక్షతన ఒక కమిషన్


బి.పి. మండల్

వేసింది. **మండల్ కమిషన్** 1980లోనే నివేదిక ఇచ్చినా అది మూలకు పడేశారు. తిరిగి 1989లో జనతాదళ్ అధికారం లోకి వచ్చిన తర్వాత దీన్ని అమలు చేస్తామని ప్రకటించడంతో రిజర్వేషన్ అనుకూల వ్యతిరేక వర్గాలమధ్య ఆందోళనలు తలెత్తాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా జనతాదళ్ పార్టీకి మద్దతు ఇచ్చిన బిజెపి పార్టీ మండల్ కమిషన్ ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని వ్యతిరేకించింది. రిజర్వేషన్ వివాదానికంటే బలంగా బాబ్రీ మసీదు గొడవను ముందుకు తెచ్చింది. భారత రత్న పురస్కారానికి 2024లో ఎంపికైన అద్వానీ నాయకత్వంలోని బిజెపి మద్దతు ఉప సంహరించుకోవడంతో, రిజర్వేషన్లు ఇద్దామను కున్న కేంద్రంలో అధికారంలో ఉన్న వి.పి. సింగ్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం కూలిపోయింది.

ఈ అంశంపై అనేక గొడవలు జరిగినా వర్తమానం లో అనేక తేడాలతో, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఇడబ్ల్యూసీ అనే నాలుగు రకాల రిజర్వేషన్లు వివిధ రాష్ట్రాలలో భిన్న శాతాలుగా అమలవు తున్నాయి. చట్టసభలు, పంచాయితీలు కొన్ని స్థానాల్ని రిజర్వేషన్కు అర్హులైనవారికి కేటాయిస్తున్నాయి. మహిళలు అందర్నీ బీసీలుగా గుర్తించమనే డిమాండ్ ఉన్నా అది అమలుకు నోచుకోలేదు. తెలుగు రాష్ట్రాలలో మాత్రం మహిళలకు ఆయా రిజర్వేషన్ కోటాలో అంతర్గతంగా మూడోవంతు రిజర్వేషన్ అమలులో ఉంది. అంటే రిజర్వేషన్ పొందే ఒక కుల విభాగంలో తొమ్మిది ఉద్యోగాల్లో మూడు ఉద్యోగాలు మహిళలకు కేటాయిస్తారు. అదే విధంగా రిజర్వేషన్ లేని అందరికీ వర్తించే ఉద్యోగాల్లో కూడా మూడోవంతు స్త్రీలకు ప్రత్యేకిస్తారు. లోక్ సభ, రాష్ట్ర శాసన సభల్లో మహిళలకు మూడోవంతు స్థానాలు కేటాయిస్తూ 2023 సెప్టెంబర్లో రాజ్యాంగానికి 128వ సవరణ తెచ్చారు. ఇది 2029 సంవత్సరం నుంచి అమలులోకి వస్తుందన్నారు. ప్రయివేటు రంగం, ముఖ్యంగా సేవరంగం వేగంగా విస్తరిస్తూ, ఉద్యోగ కల్పనలో ముఖ్యస్థానాన్ని ఆక్రమిస్తున్న వర్తమానంలో, ప్రయివేటు రంగంలోకూడా రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ ఉన్నా బలహీనంగానే ఉంది. ఇక రిజర్వేషన్ల అమలు తీరును, ఇన్నేళ్ల అమలులో వచ్చిన ఫలితాల్లో బడుగు బలహీన వర్గాలకు ఒనగూడిన లాభనష్టాలు, సామాజిక గతిశీలతలో మెరుగైన అంతస్తు కోసం ఆయావర్గాలు చేసిన ప్రయత్నాలు, వాటి ఫలితాల్ని గురించి ఒకసారి ఆలోచించాల్సిన అవసరముంది.



ఎన్.టి. రామారావు

కుల నిచ్చెనమెట్ల పైకి...


భారత ఉపఖండంలో 20వ శతాబ్దపు రెండో అర్థభాగంలో అనేక కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. జమిందారీ విధానం రద్దు, భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణంద్వారా వ్యవసాయ అభివృద్ధి, సహకార సంఘాలద్వార రుణసౌకర్యం, పంచాయతీరాజ్ వ్యవస్థల ద్వారా కొద్దిమేరకైనా అధికార వికేంద్రీకరణ వంటి వాటివల్ల కొన్ని వ్యవసాయ కులాలు ఆర్థికంగా బాగాబలపడ్డాయి. రెడ్డి, కమ్మ, వెలమ వంటి ఆధిపత్య కులాలు కొత్త భూస్వామ్య కులాలుగా ఎదిగాయి. వ్యవసాయ సంపాదనలో మిగులు ధనాన్ని ఆనాటికి కొత్తగా నిలదొక్కుకుంటున్న చిన్న తరహా పరిశ్రమలు, లారీ రవాణా, హెూటల్, సినిమా రంగాల్లో పెట్టుబడులుగా మార్చడంతో రెడ్డి, కమ్మకులాల వారిలో అధిక సంఖ్యాకులు ధనవంతులై, ఆధిపత్య కులాలుగా మారారు. ఆర్థిక పరిపుష్టితోబాటు సామాజిక అంతస్తులో కూడా పెరుగుదల రాజకీయ ఆధిపత్యానికి, మరోకొత్త ఆధిపత్య వర్గం ఏర్పాటుకూ దారితీసింది. ముందుగా పంచాయితీ ఎన్నికలలో మహిళలకు, వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం కల్పించినా, ఆర్థిక బలహీనత, సామాజిక అంతస్తులో స్థాయి లేకపోవడం వలన దాదాపుగా వీరందరూ ఆధిపత్య కులాల చెప్పుచేతల్లో కీలుబొమ్మలుగా ఉండే పరిస్థితి ఉండింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశలో తెలుగుదేశం పార్టీ రంగప్రవేశం చేసే కాలం వరకూ కాంగ్రెస్ పార్టీలో ప్రధానంగా రెడ్డి కులస్తుల ప్రాధాన్యమే నడిచింది. రాజకీయ అధికారం అందించిన అవకాశాలతో ఆ కులంలోని వారే కొందరు సంపన్నులుగా ఎదిగారు. ఇక కమ్మ కులానికి సంబంధించి చూస్తే, ఆ కులంలో సంస్కరణాభిలాష బలంగా ఉండింది. త్రిపురనేని రామస్వామి వంటివారు వివాహాది క్రతువులకు కమ్మ బ్రాహ్మలను ఏర్పాటు చేయడం, హేతువాద భావాలను వ్యాప్తి చేయడం వంటి కార్యక్రమాల ప్రభావం వీరి మీద ఉండింది. అందువల్ల ఉత్పత్తి సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని అవగాహన చేసుకుని ఆధునిక వ్యవసాయం, హెూటళ్లు, లారీ, సినిమా వంటి రంగాల్లో నిలదొక్కుకున్నారు. వీరిలో ఎక్కువశాతం

మంది ఉభయ కమ్యూనిష్టు పార్టీల్లో ఉండేవారు. ఎన్.టి. రామారావు తెలుగుదేశం వచ్చిన తర్వాత వీరిలో దాదాపు అంతా అటు చేరడంతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తెలుగునాట నామమాత్రంగా మిగిలాయి. ఈ మార్పుల్ని ఆయా కులాల్లోని ప్రజలందరికీ పూర్తిగా ఆపాదించలేము. వీరి సామాజిక అంతస్తు మిగతా పేదకులాల వారికంటే ఎక్కువగానే ఉంటుంది. వీరిలో కూడా నిరుపేదలు, రెక్కాడితేగానీ డొక్కాడనివారూ గణనీయంగానే ఉన్నారు. ఇటువంటి వారు కూడ రాజకీయంగా తమ కులాల రాజకీయ ఆధిపత్యానికే మద్దతుగా నిలవడం కనబడుతోంది. రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండడం వల్ల ఈ కులాల్లోని ప్రజాపక్ష మేధావులు, అభ్యుదయ విప్లవోద్యమాల్లో సైతం త్యాగాలు చేసిన వారున్నారు. ఇక్కడ చెప్పుకోవాల్సిన చిత్రమైన విషయమేమంటే విప్లవకర మేధావుల్లో కూడా క్షేత్ర స్థాయిలో పనిచేసేవారు ఇతర కులాలవారు ఎక్కువగా ఉంటే, సిద్ధాంత పరంగా బయట ఉండి కృషి చేసే మేధావుల్లో అత్యధికులు బ్రాహ్మణ కులాల పునాదులు ఉన్నవారే కనిపిస్తారు. వీరి త్యాగాన్నీ ఔన్నత్యాన్నీ ఏమాత్రం తక్కువ చేయలేము, కానీ పీడిత ప్రజలపక్షమే అయినా మేధోపర వారసత్వ భావజాలపు కొనసాగింపు ఇక్కడ కనబడుతోంది. ఇక నామమాత్రంగా మిగిలిన రెండు కమ్యూనిష్టు పార్టీల్లోనూ వారి పార్టీ సిద్ధాంతం పట్ల, మానవహక్కుల పట్ల ఏమాత్రం నిబద్ధత, అవగాహన లేనివాళ్లే వారసత్వంగా నాయకత్వ స్థానాల్ని పట్టుకు పాకులాడుతున్నారు గానీ, పీడిత కులాలవారి నాయకత్వం పెరిగే పరిస్థితులు లేవు. గుడులు, స్వామీజీల వెంట తిరగడం వంటి చేష్టలు, దిశ కేసులో అనుమానితుల్ని ఎన్కౌంటర్ చేసి చంపడాన్ని సమర్థిస్తూ ప్రకటనలు ఇవ్వడం వంటి చర్యలు వీరి స్థాయిని తెలియజేస్తున్నాయి. ఇక కింది కులాల్లో ఎటువంటి సాంస్కృతిక మార్పులు చోటుచేసుకుంటున్నాయో చూద్దాం.

సామాజిక అంతస్తులు

పురాతన కాలం నుంచీ వ్యవసాయంతో సహా సమాజం బ్రతకడానికి అత్యవసరమైన సంపద సృష్టించే వివిధ వృత్తులు అవలంభించే వృత్తి కులాల్ని నీచంగా చూస్తూ, పరాన్న భుక్కులుగా బతికే వైదిక పూజారి, నియోగ మంత్రాంగ కులాల్ని ఉన్నతమైనవిగానూ భావించే సమాజ సంస్కృతి అందరిలోనూ స్థిరీకృతంగా పాతుకుపోయింది. ఈ స్థితిలో కిందికులాల వారి సామాజిక అంతస్తుల్లో మార్పుకు

అవకాశాలు మూసుకుపోయి ఉన్నాయి. నిచ్చెనమెట్ల వంటి అంతరాల కారణంగా కింది కులాలవారిని తక్కువగా చూడడం, పైకులం వారిపట్ల విధేయత చూపడం నరనరాన ఇక్కడి సంస్కృతిలో జీర్ణించుకుపోయి, వీరిమధ్య ఐక్యతకు అవసరమైన ప్రాథమిక అవగాహన పెరగడానికి కూడా అడ్డంకిగా మారింది. కులమనేది ఏవ్యక్తి ఇష్టాయిష్టాలతోగానీ, వ్యక్తిగత సామర్థ్యంతోగానీ పనిలేకుండా పుట్టుకతో నిర్ణయమై, మార్పు లేకుండా జీవితాంతం కొనసాగుతుంది. ఇది వ్యక్తి జీవనాన్ని, జీవికను, వృత్తిని, పెళ్లి, చావు, ఇతర సంస్కారాలు, వేడుకలు బంధుత్వ అనుబంధాలనీ, వివిధ అవసరాలు తీరడాన్నీ నిర్దేశిస్తుంది. ముఖ్యంగా వ్యక్తుల సామాజిక స్థాయి అంతస్తులను కూడా అదే నిర్దేశిస్తుంది. ఈ పరిస్థితుల నుంచి తమ సామాజిక అంతస్తు పెంచుకోవడానికి చాలామంది దళిత, వృత్తి కులాలవారు తమ మూలాల్ని వైదిక ఆర్య పురాణాలలో వెదకడం ప్రారంభించి, తమ కులాల పేర్లను కూడా మార్చుకున్నారు. మాదిగ కులస్తులు జాంబవంతుని వారసులుగానూ, సతీ అరుంధతి సంతానంగా చెప్పుకుంటారు. మేదర కులస్తులు మహేంద్రుని వారసులుగా, గొల్లకుర్మలు యదు వంశస్తులుగా భావిస్తారు. కంసాలి వారు విశ్వబ్రాహ్మలుగా, చాకలివారు రజకులుగా, సాలె వారు పద్మవంశీయులుగా, గొల్లవారు, కుర్మవారు యాదవులుగా, మంగళివారు నాయీ బ్రాహ్మణులుగా, కుమ్మరి వారు శాలివాహనులుగా, కల్లుగీత కులం వారు శ్రీశయనులుగా కులం పేర్లు మార్చుకొని అంతస్తులో పురోగతిని ఆశించారు. ఇట్లా పేర్లు మార్చుకున్న వారిలో కొన్ని కులాలవారు మాంసాహారం మాని, జంధ్యాలు ధరించడం, ఉప నయనాది క్రతువులు చేయడం ప్రారంభించారు. అయినా వాస్తవానికి వారి కుల సామాజిక అంతస్తు గతిశీలతకు లోనయిన దాఖలాలు కనబడలేదు.



సంస్కృతీకరణ

ముఖ్యంగా గత కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ వృత్తి కులాలవారిలో ఆర్యబ్రాహ్మణ మతసంస్కృతిని అనుకరించే పద్ధతి పెరుగుతోంది. దీన్ని ఎం.ఎన్. శ్రీనివాస్ అనే సామాజిక శాస్త్రవేత్త సంస్కృతీకరణ (sanskritization) గా అభివర్ణించాడు.

ఈ ప్రక్రియ ప్రకారం కిందికులాల వారు తమ అసలు సంస్కృతిని వదిలి, ఆధిపత్య సంస్కృతివైపు మొగ్గడం క్రమంగా పెరుగుతోంది. బొడ్రాయిలు, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, అంకాలమ్మ వంటి గ్రామదేవతల ఆరాధన, బలులివ్వడాలు, జాతరలు చేయడం వంటివి మాని, వైష్ణవ దేవాలయాలు సందర్శిస్తున్నారు. అష్టోత్తర నామావళి, విష్ణుసహస్ర నామావళి, పూజలు, హోమాలు క్రతువుల వంటి ఆరాధనా పద్ధతుల్ని, వైదిక కర్మకాండను ఆచరిస్తున్నారు. ఇక ఆర్యేతర దైవమైన శివుడిని దేవతల జాబితా నుంచి తొలగించడానికి చరిత్రలో ఎంతో ప్రయత్నం జరిగింది. శైవులకు వైష్ణవులకు జరిగిన యుద్ధాల్లో రక్తం ఏరులై పారింది. లెక్కలేనంతమంది జనం మరణించారు. ప్రస్తుతం శైవాన్ని ఆర్యదేవతల సమూహంలో కలిపేసుకున్నారు. అయినా వాటి ఆలయాల పోషణలో వివక్ష నేటికీ కొనసాగుతున్న పరిస్థితులున్నాయి. వైష్ణవాలయాలు సిరిసంపదలతో వైభవోపేతంగా విలసిల్లుతుండగా శివాలయాలు మాత్రం ఎక్కడ చూసినా వెలవెలబోతుంటాయి. వైష్ణవాలయాల్లో ప్రసాదాల సంగతి చెప్పే పనేలేదు. మత వ్యవస్థకు, కులవ్యవస్థకు అసమానతలే పునాది. కులంలో ఉన్న ముఖ్యాంశం అన్ని కులాల వారికీ తమ కులం నెత్తిన కాలు పెట్టే పెద్దకులంతోబాటు తాముకాలు పెట్టడానికి వీలుగా తమకింద మరో కులం ఉంటుంది. ఈ కారణం చేతనే ఐకమత్యానికి, వర్గస్పృహ పెరగడానికీ జరిగిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. ప్రజాస్వామిక ప్రక్రియకు అడ్డుగోడలుగా మిగిలాయి. ముఖ్యంగా శతాబ్దాల తరబడి ఆకలి, అవిద్య, అవమానాలకు గురవుతూ సమాజపు నేలమాళిగలలో అల్లాడిన బడుగు బలహీన వర్గాలు కనీసం ఊపిరి పీల్చుకోవడానికి ఉద్దేశించిన రిజర్వేషన్లు వారి మధ్య అనైక్యతను మరింతగా పెంచిపోషిస్తూ, పీడితులంతా ఒకటే అనే భావనకు విఘాతం కలిగిస్తున్నాయి. ఈ విధమైన వ్యతిరేకభావం రిజర్వేషన్ లేని కులాలకూ ఉన్న కులాలకూ మధ్యనే కాకుండా, రిజర్వేషన్ పొందుతున్న కులాలమధ్య కూడా తీవ్రంగా ఉంది. ఎస్.సి., ఎస్.టి. వర్గీకరణకై జరిగే ఉద్యమాలు, బీసీల్లో కేటగిరీ మార్చాలనే డిమాండ్లు ఇందుకు ఉదాహరణ. ఈ అనైక్యత ఆధిపత్య రాజకీయాలు చేసేవారికి మాత్రమే ఉపయోగపడుతూ వుంది.

దళితక్రైస్తవులు

ఇక దళిత క్రైస్తవులు, ముస్లింల పరిస్థితిలో కూడా పెద్దమార్పేమీ లేదు. ఇతరదేశాల్లో పరిస్థితులకు భిన్నంగా ఇక్కడి ముస్లిం మతస్తుల్లో కూడా కులవివక్ష

పురుడు పోసుకుంది. తమకూ మనుషల్లాగా ఒక గుర్తింపు సామాజిక అంతస్తు పెరుగుదల, ఆశించి క్రైస్తవమతం పుచ్చుకున్న చాలామందికి ఆపాదిత కులహోదా తప్ప, మతమార్పిడి వలన సాధించినట్లు భావించిన సామాజిక అంతస్తులో పెరుగుదల వాస్తవంలో మిధ్యగా మారింది. అధికశాతం పల్లెల్లో దళిత వాడలు ఊరికి కడగా విడిగా కొనసాగడమే ఇందుకు ముఖ్య కారణం. ప్రజాస్వామ్యం పేరిట ఇన్నేళ్ళు పాలన సాగించిన ఏ ప్రభుత్వాలయినా ప్రభుత్వ గృహానిర్మాణ పథకాల్లో కూడా దళిత పల్లెల నివాసాలు విడిగా ఉంచే పద్ధతినే అవలంభించాయి గానీ, అందరినీ కలిపి ఉంచే ప్రయత్నాలు చేయలేదు. ఇక క్రైస్తవం పుచ్చుకున్న దళితేతర కులాలవాళు ్ళ కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నా, వివాహం, ఇతర సామాజికఅంశాల్లో కులాన్నే ఎంచుకుంటున్నారు. క్రైస్తవం స్వీకరించిన దళితులలోకూడా తాళిబొట్టు, మెట్టెలు వంటి ఆచారాలు కూడా పోలేదు. ఇక గిరిజన సముదాయాలకున్న మతస్వేచ్ఛ దళిత కులాలవారికి లేదు. క్రైస్తవమతం పుచ్చుకోవడం వల్ల దళితుల సామాజిక ఆర్థిక స్థాయిలో ఏమార్పూ రాలేదని కాలేల్కర్ కమిటీ, మండల్ కమిషన్ వంటి కమిటీలు వెల్లడించాయి. షెడ్యూల్ జాతుల్లోని ఏ కులం వారైనా తమ ఇష్టం వచ్చిన ఏమతాన్ని స్వీకరించినా వారికి ఉన్న రిజర్వేషన్ రద్దుకాదు. కానీ షెడ్యూల్డ్ కులాల వారు మతం మారితే మాత్రం వారి రిజర్వేషన్ రద్దవుతుంది. దళిత క్రైస్తవులకు 'బి.సి.–సి' కింద ఒకశాతం ఇచ్చినా ఏ ఉద్యోగ విభాగానికైనా ఆస్థానం దాకా చేరడం ఆచరణలో దాదాపు అసాధ్యం. ఇది రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛకు భంగం కలిగించే అంశంగా ఉంది. దీనివల్ల రిజర్వేషన్ కోసం కొందరు తిరిగి ధార్మిక సంస్థల ద్వార పేర్లు మార్చుకొని హిందూమతంలోకి మారడం వల్ల కొన్ని కుటుంబాల్లో ఘర్షణలు చోటుచేసుకున్న ఉదంతాలు కూడా కనబడు తున్నాయి. క్రైస్తవ మతంలోకి మారడాన్ని మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టి, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం కనబడుతోంది.

ఇక కులవ్యవస్థ నిర్మూలనకు కులాంతర వివాహాలు ఒక్కటే శరణ్యమని నమ్మేవారు, ఆ దిశగా ప్రయత్నాలు చేసేవారు, చాలామందే ఉన్నారు. ఇది ఆచరణలో ఫలవంతమైనదిగా కనబడ్డంలేదు. స్త్రీపురుషుల మధ్య ఆకర్షణ సహజం. అనాదికాలం నుంచీ అనులోమ, ప్రతిలోమ వివాహాలపేరిట కులాంతర వర్ణాంతర పెళ్ళిళ్ళుకూడా ఉన్నట్లు తెలుస్తోంది. సమాజంలో నూటికో కోటికో అన్నట్లు సాధారణ కులాంతర

వివాహాలు జరుగుతూనే ఉంటాయి. ఈనాడు ఆర్థిక స్థోమత, సామాజిక స్థాయి వంటి సరిపోయే చాలా అంశాలని బట్టి ఆధునిక కాలంలో అవసరాల ప్రాతిపదికన కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. ఆదర్శ భావాలతో, పరస్పర అవగాహనతో జరిగే వివాహల్లోని దంపతులు మాత్రమే కులాంతర వివాహం చేసుకున్న వారుగా ప్రత్యేక ఆస్తిత్వంతో సమాజానికి మార్గదర్శకంగా కనబడుతున్నారు కానీ, అత్యధికంగా జరిగే మిగతా కులాంతర వివాహం చేసుకున్న జంటలు తాము నివాసముంటున్న సమూహాపు కులంలోనో, లేదా పురుషునికి సంబంధించిన కులంలోనో మమేకమై తమ పిల్లలకు అదే కులాన్ని ఆపాదించడం జరుగుతుందనేది చేదు వాస్తవంగా కళ్ళముందు కనబడుతోంది.

8


భాష - ప్రజాస్వామ్యం

ఒక ప్రజాసమూహానికి భాష ప్రాణం వంటిది. అన్నిసామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలకూ అతిముఖ్యమైన సమాచార వినిమయం వారి స్వంత భాషలోనే జరుగుతుంది. వారి ప్రత్యేక సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ఉత్పత్తి విధానం, వ్యాపార వ్యవహారాలన్నీ ఆ సమూహపు భాషలోనే జరుగుతాయి. భాష ఆ సమూహపు అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. అందువల్లనే ప్రపంచవ్యాప్తంగా మానవశాస్త్రాల పండితులు, జాతిని నిర్వచించడానికి భాషనే ప్రధాన కొలమానంగా తీసుకున్నారు. అందువల్ల జాతి అంటే ప్రధానంగా భాషాజాతిగానే పరిగణించాల్సి ఉంది.

ఒకటికి మించిన ప్రాబల్య భాషలున్నదేశాలలో, ప్రభుత్వం ఒక భాషాజాతికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వేరొక భాషాజాతి ప్రయోజనాలు దెబ్బతీయడం అసహనాన్ని రేపుతుంది. భాష ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అధిక సంఖ్యాకుల ఆధిపత్యానికి, అల్పసంఖ్యాకుల అణచివేతకు ఉపకరణంగామారి, ప్రపంచంలో అనేకచోట్ల తీవ్ర ఉద్యమాలకు, ఘర్షణలకు, అంతర్యుద్ధాలకు కూడా కారణం కావడం మనకు చరిత్రలో కనబడుతోంది.

ప్రపంచంలోని అనేక దేశాలలో అభివృద్ధి చెందిన భాషాజాతుల వారు ఇతర భూభాగాల్ని ఆక్రమించుకున్న క్రమంలో ఆయా వలసదేశాలు, ప్రాంతాల్లో తమ భాషా సంస్కృతుల ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రయత్నంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఐరోపా ఖండానికి చెందిన స్పానిష్, ఫ్రెంచ్, పోర్చుగీసు, ఆంగ్ల భాషా జాతులు ఇందుకు ఒడిగట్టాయి. పాఠశాలల్లో వారి మాతృభాషలకు వీలు కల్పించ లేదు. బలవంతాన వలసవాదులభాషను వారి నెత్తిన రుద్దడంతో అనేక చిన్నచిన్న భాషలు అంతరించాయి. ఈ ఘర్షణలకు సంబంధించి ఐరోపాదేశాలవారి మధ్య కూడా మినహాయిపు లేదు. అప్పటికే విస్తృత జనాభా, సాహిత్యసంపద ఉన్న కొన్ని భాషలవారు మాత్రం తమ అస్తిత్వాన్ని నిలుపుకోగలిగారు.

బెల్జియం దేశంలో ఫిన్నిష్ భాష మాట్లాడే డచ్ వారికీ, ఫ్రెంచ్ వారికీ ఘర్షణలు జరిగాయి. నాటి పాకిస్తాన్లో భాగంగా ఉన్న బంగ్లాదేశీయులు తమ వంగభాష




అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం, వంగభాషను తమ తూర్పు పాకిస్తాన్లో అధికార భాషగా చేయాలని, పోరాడి అనేకమంది ప్రాణత్యాగం చేశారు. ఆ త్యాగానికి గుర్తుగా ఐక్యరాజ్యసమితికి చెందిన విద్యా, శాస్త్ర, సాంస్కృతిక విభాగం 2000 సం॥ నుంచీ, సభ్యదేశాల్లో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం పాటించేందుకు నిర్ణయించింది. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోవడానికి కారణమైన యుద్ధం 1971లో భాషా వివక్షతోనే మొదలైంది. శ్రీలంకలో తమిళ, సింహాళ భాషీయులమధ్య మొదలైన భాషావివాదం సుమారుగా పాతికేళ్లపాటు కొనసాగింది. దాదాపు లక్షమంది హతులయారు. ప్రపంచ చరిత్రలో భాషా అస్తిత్వం కోసం జరిగిన అనేక ఉద్యమాలు మనకు కనిపిస్తాయి. వివిధ భాషాజాతులకు నిలయమైన భారతదేశం సంగతి చూద్దాం.

జనాభా లెక్కలు

జనాభా లెక్కల కమీషన్ వెల్లడించిన 2011 నివేదిక ప్రకారం, మాండలిక భేదాలతో కలిపి చెప్పిన లెక్కల్ని బట్టి భారత ఉపఖండంలో దాదాపు 2000 భాషల వరకూ వుండగా, పదివేలకుపైగా జనం మాట్లాడుకునే భాషలు 121 ఉన్నాయి. ఇంకా అనేక భాషలు నమోదు కానివి ఉన్నాయి. 'పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' అనే సంస్థ 2010–2011 సం॥ మధ్య జరిపిన సర్వేక్షణలో అనేక చిన్నచిన్న భాషలు పూర్తిగా అంతరించినట్లు తెలిసింది. హిందీ, బెంగాలీ, మరాఠీ, తెలుగు, గుజరాతీ, ఉర్దూ, కన్నడ, ఒడియా, మలయాళ భాషలు దేశంలో అత్యధికంగా మాట్లాడే భాషలుగా గుర్తించారు. వీటిలో హిందీ, గుజరాతీ, బెంగాలీ, మరాఠీ ఇండో ఆర్యన్ భాషాకుటుంబాలకు చెందిన భాషలు కాగా, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలు స్థానిక ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవాటిలో ప్రధానమైనవి.

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ భాషా ఆధిపత్యం మీద అనేక చర్చలు నడిచాయి. జాతీయవాదం పేరిట హిందీనే ప్రధాన భాషగా చేయాలని ఉత్తరాది నాయకులు కోరారు. సావర్కార్ **'ఇండియాలో వుండాలంటే, అల్పసంఖ్యాక సమూహాలు తమ అస్తిత్వాన్ని కోల్పోయి అధిక సంఖ్యాకుల అధీనంలో ఉండాల'**న్నాడు. **'అధిక సంఖ్యాకులే**

జాతి' అని హిందూ మహాసభ అధ్యక్షుడి ప్రకటనను యం.యన్. రాయ్ తీవ్రంగా విమర్శించాడు. సామ్రాజ్యవాద పాలనను పారద్రోలి దాని స్థానంలో తీవ్ర జాతీయ వాద పాలన పేరిట అధిక సంఖ్యాకులు అల్పసంఖ్యాకులపై పెత్తనం చేయడాన్ని ఆయన ఖండించాడు. తీవ్రజాతీయవాదం చాలాప్రమాదకరమని, అది నియంతృత్వానికి దారి తీస్తుందని యం.యన్.రాయ్ చాలా స్పష్టంగా చెప్పాడు. ఇండియా ఎంతో వైవిధ్య భరితమైన దేశం. భిన్నత్వాన్ని మనం గౌరవించాలని కోరాడు.



తమిళ తిరుగుబాటు గళం

గత శతాబ్దిలో, అనేక చిన్నచిన్న ఇండో ఆర్యన్ భాషలైన, ఖడిబౌలి, బుందేలి, హర్యానీ, అవధి, బగేలి వంటి అనేకభాషల్ని కలిపి ఏకరూపత తెచ్చి, దేవనాగరి లిపిని అనువర్తించి తయారుచేసినా, మొత్తం భూభాగంలో పాతిక శాతం కూడా లేనిభాషను భారత ఉపఖండం మొత్తంపై రుద్దే చర్యలకు పాల్పడ్డారు. దక్షిణ భారతదేశంలో హిందీ ఆధిపత్యానికి ఎదురుతిరిగిన తొలి ప్రజా నాయకుడు పెరియార్ రామస్వామి. మద్రాసు ప్రెసిడెన్సీలో సి. రాజగోపాలాచారి ఆధ్వర్యంలోని ప్రభుత్వం నాలుగో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకూ హిందీని తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఆయన గళం విప్పాడు. ఇందుకు మహిళల మద్దతు కూడా తోడయింది. నీలాంబికా అమ్మయ్యార్ నాయకత్వం లో, తమిళనాడు విమన్స్ కాన్ఫరెన్స్, హిందీని రుద్దాడాన్ని వ్యతిరేకిస్తూ, 1938 నవంబర్ 13న ఒక చారిత్రాత్మక బహిరంగ సభ నిర్వహించింది. ఆ సభలో రామస్వామి మాట్లాడుతూ, **"తమిళనాడు తమిళులకు చెందింది. ఈ మాట భాషా అహంకారంతోనో, సంకుచిత ధోరణితోనో అనడంలేదు. కేవలం ఆధిపత్య ధోరణితో, కొత్త రకమైన ఆధీనపరచుకునే వలసవాద పోకడలతో భాషను రుద్దాడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా"**మని ప్రకటించాడు. ఈ సభలోనే ఆయనకు 'పెరియార్' అనే గౌరవ బిరుదు ప్రదానం చేశారు. ఆ ఉత్తరువులను ఉపసంహరించే వరకూ వీరి పోరాటం కొనసాగింది.

స్వాతంత్ర్యానంతరం కూడా దక్షిణాది రాష్ట్రాలలో హిందీని బలవంతాన రుద్దాలని ప్రయత్నించినపుడు తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలోసైతం పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు జరిగాయి. ప్రధాని నెహ్రూ 1964లో చనిపోయిన తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన లాల్ బహదూర్ శాస్త్రి అధికార భాషా చట్టాన్ని అమలుచేయాలనుకున్నప్పుడు తమిళనాడులో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. తిరుచ్చి రైల్వేస్టేషన్లో, తల్లి దండ్రులకు ఏకైక సంతానమైన చిన్నసామి తమిళభాషా నినాదాలిస్తూ ఆత్మాహుతి చేసుకున్నాడు. తను చనిపోడానికి నిర్ణయించుకున్నట్లు రాసిన లేఖలో **"తమిళ్ వాజవేండం ఎన్రునాన్ సాగిరెన్" (తమిళాన్ని బతికించుకోవడం కోసం నేను మరణిస్తున్నాను)** అని రాసాడు. ఆ ఆత్మాహుతి తర్వాత తమిళనాడు అల్లకల్లోలమైంది. లభ్యమవుతున్న ఆధారాల్ని బట్టి ఈ సంఘటన తర్వాత జరిగిన ఉద్యమంలో 500 మంది తమ ప్రాణాలర్పించారు. ఇది ఒక్క భాషకు మాత్రమే పరిమితమై లేదు. వలసవచ్చి, ఉత్తరాదిన స్థిరపడిన ఆర్యులు, వారి భాషాసంస్కృతుల్ని, మతాన్ని, ద్రావిడులపై రుద్దడం ద్వారా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవాలనే ప్రయత్నానికి కూడా వ్యతిరేకంగా కూడా ఈ ఉద్యమాలు సాగాయి. ఈ ఉద్యమాల సందర్భంగా వివిధ ఆందోళనా కార్యక్రమాలతోబాటు, రైల్వేస్టేషన్‌లలో నామ ఫలకాలు, రహదారులపై ఉండే కిలోమీటర్ రాళ్లపై ఉండే హిందీ అక్షరాలపై తారు పూయడం వంటి కార్యక్రమాలు కూడా చేపట్టారు. అనంతర కాలంలో రాజీవ్‌గాంధీ హయాంలో హిందీని తప్పనిసరి చేస్తూ, దేశ వ్యాపితంగా 'నవోదయ విద్యాలయాల్ని ఏర్పాటు చేసినపుడు, ఏ.ఐ.డి.ఎం.కె. ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. ఫలితంగా నవోదయ విద్యాలయాలు లేని ఏకైక రాష్ట్రంగా తమిళనాడు మిగిలిపోయింది. పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అనే సంస్థ 2013లో క్షేత్రస్థాయిలో జరిపిన సర్వేక్షణలో, గడచిన యాభైయ్యేళ్ళ కాలంలో దాదాపు 250 భాషలు అంతరించి పోయినట్లు తెలుస్తోంది. భిన్న భాషలున్న భారతదేశంలో భిన్నభాషల్ని అణగదొక్కే విధానం భాషల వునికికే ముప్పు తెస్తుందని ఈ సర్వేక్షణ రుజువు చేసింది.

రాజ్యాంగ పరంగా...

రాజ్యాంగాన్ని రాసేటపుడు భాషా సమస్యపై కూడా చర్చ జరిగింది. అంబేద్కర్ జాతీయవాది కావడంచేత, ఎంతో పోరాటం తర్వాత సాధించుకున్న ఏకీకృత

భారతదేశం భాషా ప్రాతిపదికన ముక్కలు చెక్కలు కాదని నమ్మాడు. ఆయన కేంద్ర ప్రభుత్వం అధికార కార్యకలాపాలకు హిందీని ఉపయో గించడానికి (అధికరణం 343) అంగీకరించాడు. అయితే ప్రజల సర్వతోముఖాభివృద్ధికి భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించాలనీ, అలాజరక్కపోతే భాషాపరమైన సంఘర్షణలకు తావిచ్చినట్లు అవుతుందని ఆయన భావించాడు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీని అధికార భాషగా ఉంచడానికి అంగీకరించినా, ఆయన హిందీని జాతీయ భాషగా ప్రకటించలేదు. రాజ్యాంగంలో ఎక్కడా 'జాతీయ భాష' అనే పదం లేకుండా ఆయన జాగ్రత్త పడ్డాడు. ఇక్కడ **జాతీయ భాషకు, అధికార భాషకు ఉన్న తేడాల్ని గుర్తించాల్సిన అవసరముంది. జాతీయ భాష అంటే ఆ దేశ ప్రజలంతా తప్పని సరిగా మాట్లాడాల్సిన, కార్యకలాపాలు నిర్వర్తించాల్సిన భాష అని, అధికార భాష అంటే ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు మాత్రమే ఉపయోగించే భాష అని అర్థం.** రాజ్యాంగపు ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలకూ సమాన అధికార హోదా ప్రకటించారు. అధికరణం 351 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వంత భాషలో పాలన జరిపే స్వేచ్ఛను కల్పించారు. రాజ్యాంగంలో తొలుతగా 14 భాషల్ని పేర్కొని, వాటికి ఆంగ్లంతోబాటు అధికారిక హోదా కల్పించారు. అనంతర కాలంలో ఇతర భాషా జాతుల డిమాండ్లకు తలవొగ్గి మరికొన్ని భాషల్ని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చడంతో, ప్రస్తుతం మొత్తం 22 భాషలు అధికార భాషలుగా గుర్తింపు పొంది ఉన్నాయి. అవి...

అస్సామీ,	బెంగాలీ,	బోడో,	డోగ్రి (డోంగ్రీ),
గుజరాతీ,	హిందీ,	కన్నడ,	కాశ్మీరీ,
కొంకణి,	మథిలి (మైథిలి),	మలయాళం,	మణిపురి,
మరాఠీ,	నేపాలీ,	ఒరియా,	పంజాబీ,
సంస్కృతం,	సంతాలి,	సింధీ,	తమిళం
తెలుగు,	ఉర్దూ.		

ప్రస్తుతం మరో ముప్పైకి పైగా భాషలవారు తమ భాషల్ని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చమని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎనిమిదో షెడ్యూల్ లోని భాషలకు అధికార హోదా ఉన్నప్పటికీ సర్వోన్నత న్యాయస్థానంలో మాత్రం ఆంగ్లం, హిందీ భాషల్లోనే అన్ని పనులూ జరుగుతాయి. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాల్లో స్థానిక భాష ఉపయోగించుకునే వెసులుబాటు ఉన్నా ఆచరణలో ఆంగ్లభాషే రాజ్యమేలుతోంది.

భాషాప్రయుక్తం

'ఒకజాతికి ఒక భాష- ఒకభాషకు ఒక రాష్ట్రం' అనేది ఒక ప్రజాస్వామిక భావన. బ్రిటీషు వాళ్ళు అత్యధిక భూభాగాన్ని తమ ఏలుబడిలోకి తెచ్చుకునే వరకూ, భారత ఉపఖండంలో భారతజాతి, భారతమాత అనే పదాలు ఎప్పుడూ ప్రాచుర్యంలో లేవు. భారత ఉపఖండం మొత్తం ఎప్పుడూ ఒకే ఏలుబడి కింద లేదు. అంగ, వంగ, కళింగ, కాశ్మీర, చేర, చోళ వంటి చప్పన్న (56) దేశాలు ఉండేవి. బలమున్న వాడిదే రాజ్యం అన్న నానుడి ప్రకారం, ఎవరే ప్రాంతాన్ని ఆక్రమిస్తే అదే వారి రాజ్యంగా వుండేది. ఇక్కడ రాజ్యపు ఎల్లలకు, భాష మాట్లాడే ప్రజాసమూహానికీ సంబంధం లేదు. ఒకే రాజు లేదా సామంతుడి ఏలుబడిలో అనేక భాషా వ్యవహర్తలు నివసించే భూములుండేవి.

బ్రిటీషు పాలనా కాలంలో మొదటి సారిగా ఒరిస్సా (నేటి ఒడిషా) మేధావులు తమ భాషా సంస్కృతుల కోసం ఉద్యమించారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన మధుసూదన్ దాస్ కృషి ఫలించి, **1936 సం॥ భారత ఉప ఖండంలో తొలి భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంగా ఒరిస్సా అవతరించింది.** అంతకు ముందు తెలుగు మాట్లాడే భూభాగంలో కొంత నైజాంరాజు పాలనలో ఉండగా, అత్యధిక ప్రాంతం మద్రాసుప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. నిడదవోలులో 1912లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేశాడు. ఆ మరుసటి ఏడాది బాపట్లలో భారీ ఎత్తున ఆంధ్ర మహాసభ సమావేశమై ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని కోరింది. భారతదేశం స్వదేశీయుల పాలనలోకి వచ్చిన అనంతరం, 1952 అక్టోబర్ 19న మొదలైన అమరజీవి పొట్టిశ్రీరాములు చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహారదీక్ష భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో మైలురాయివంటి ఘట్టంగా చెప్పుకోవచ్చు. చెన్నపట్నం రాజధానిగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే నినాదంతో ఆయన తీవ్ర నిరాహారదీక్షను మొదలు పెట్టాడు. అమరజీవి పొట్టిశ్రీరాములు 1952 డిసెంబర్ 15న కన్నుమూయడంతో, రాష్ట్రవ్యాపితంగా తీవ్ర హింసాందోళనలు చెలరేగాయి. దాంతో, నాటి ప్రధాని నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాడు. కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్రంలో చెన్నపట్నాన్ని ఇవ్వకపోగా, తెలుగు భాషా ప్రాంతాలైన బళ్ళారి, బరంపురం వంటి ప్రాంతాలు ఆంధ్ర రాష్ట్రంలో

కలపలేదు. ఫజల్ అలీ కమిషన్ సిఫార్సుల మేరకు, నెహ్రూ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఏడవ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాష్ట్రాల్ని భాషాప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించి, పధ్నాలుగు రాష్ట్రాలు ఆరు కేంద్ర పాలిత ప్రాంతాల్ని ఏర్పాటు చేసింది. భారత యూనియన్ సైన్యం నిజాం రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత తెలుగువారందరినీ ఒకే రాష్ట్రంలో చేర్చాలనే నినాదం ఊపందుకుంది. సుందరయ్య రాసిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే పుస్తకం బహుళ ప్రజాదరణ పొందింది. హైదరాబాదు శాసనసభలో విశాలాంధ్రపై చర్చ జరిగినపుడు 103 మంది సభ్యులు విశాలాంధ్రకు ఓటువేయగా, 29 మంది మాత్రమే వ్యతిరేకించారు. పదిహేనుమంది సభ్యులు ఎటూ చెప్పలేదు. ప్రజాభీష్టం మేరకు 1956 నవంబర్ ఒకటో తేదీన 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడింది.


తెలంగాణ ప్రాంతం నిరాదరణకు గురవుతందనే భావనతో 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైంది. అదే సమయంలో 'ప్రత్యేకాంధ్ర ఉద్యమం' మొదలైంది. దాంతో రాష్ట్రపతి ఉత్వర్వులు, జోనల్ వ్యవస్థ, స్థానిక రిజర్వేషన్లు వచ్చాయి. కొంతకాలం సద్దుమణిగినా 2000 నుండి మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. చివరికి 2014 జూన్ 2న భారతదేశపు 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది.

అనుసంధాన భాష

భాష మానవ కార్యకలాపాలన్నిటికీ కేంద్రం. ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధికి భాషే ఆలంబనం. ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త 'నోం చోమ్స్కీ' చెప్పినట్లు, 'భాష ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యానికి, జాతి పురోగతికి, విముక్తికీ కూడా ఉప కరణం. ఈ రకంగా చూసినపుడు అనేక భాషలున్న దేశంలో ప్రతిభాషనూ స్వేచ్ఛగా ఎదగనిస్తూ, వారికి అనుకూలమైన అనుసంధాన భాషను అవసరమైన మేరకు ఉప యోగించు కోగలిగే వెసులుబాటు ఉండడమే ప్రజాస్వామ్య పద్ధతి. భిన్న భాషలున్న అమెరికా దేశ రాజ్యాంగంలో అధికార భాషకానీ జాతీయ భాషకానీ లేదు. కాని తొలి నుంచీ భారత దేశంలోని మిగతా భాషలపై హిందీ భాష ఆధిపత్యాన్ని నెరిపే చర్యలు కొనసాగిస్తోంది. సామ్రాజ్యవాద అవశేషంగా మిగిలిన ఆంగ్ల భాష ఇప్పటికే మన నరనరాల్లో జీర్ణించుకుపోయి, విద్యాధికుల్లో ఎక్కువమంది అలవాటు పడిన భాషగా నెత్తిన కూర్చుని వుంటే, దానికితోడు హిందీని నెత్తిన రుద్దే చర్యలు

ఎక్కువయ్యాయి. విద్యార్థులు మాత్రం, శాస్త్ర సాంకేతిక రంగాలు, వైద్యం, శాస్త్రీయ ఆవిష్కరణలకు సంబంధించి ఆంగ్లంలో తప్ప మరే భాషలోనూ విస్తృతమైన సమాచారం దొరకదు కాబట్టి, దాన్నే పట్టుకు వేళ్ళాడుతానంటుంటే, సాధారణ ప్రజలు మాత్రం స్వంతభాషలో అన్నీ కావాలని కోరుతున్నారు. భాషా ఆధిపత్య ధోరణి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా ఎక్కువైంది.

ఒకేదేశం, ఒకే భాష అంటూ మిగతా భాషా జాతులన్నీటిపై బలవంతాన హిందీ భాషను రుద్దే చర్యలు తీవ్రతరమయ్యాయి. రాజ్యాంగపు 343, 351 అధికరణాలు ఇచ్చిన ప్రత్యేక హోదా కాకుండా హిందీ భాషాభివృద్ధి కోసం ప్రత్యేకంగా విపరీతంగా నిధులు కేటాయించారు. ఓ పక్క ప్రపంచీకరణ వేగమౌతున్న వర్తమానంలో బయటి ప్రపంచంలో ఉపయోగపడే ఫ్రెంచ్, స్పానిష్ వంటి భాషలు నేర్చుకునే అవకాశం లేకుండా సి.బి.యస్.ఇ. పాఠశాలల్లో ఎవరూ మాట్లాడని, మతపరమైన చారిత్రక అంశాలకే పరిమితమైన మనువాద భాష సంస్కృతాన్ని తప్పనిసరి చేయడం జరిగింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ముద్రించిన మరింత పెద్ద నోట్లపై దేవనాగరిలిపి ముద్రించారు. దేశవ్యాప్తంగా పనిచేసే, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, రైల్వే, విమానాశ్రయాల వంటి అనేక చోట్ల హిందీ తప్ప వేరొక స్థానిక భాషకు స్థానం లేకుండా చేశారు. దాంతో హిందీ రాని వారెవరూ సక్రమంగా అర్థం చేసుకుని పనులు నెరవేర్చుకునే అవకాశం లేకుండా చేశారు. పాత ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ రద్దు చేశారు. వాటి స్థానంలో 2024 జులై 1 నుంచీ అమలులోకి వచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలకు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ్ నాగరిక్ సూరక్షా సంహిత్, భారతీయ సాక్ష్య అధినియం అని హిందీ పేర్లు పెట్టారు. రాజ్యాంగం అధికార భాషలకు సమాన హోదా ఇవ్వగా, మిగతా భాషల్ని అణగ దొక్కే చర్యలకు పూనుకొంటున్నారు. ఫలితంగా అనేక భాషలు ఉనికిలో లేకుండా పోతున్నాయి. కొన్ని భాషలు జీవన్మరణ సంధిలో ఉన్నాయి. ఒక యాభై ఏళ్ల క్రితం దేశంలో అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషలలో తెలుగు రెండో స్థానంలో ఉండగా ప్రస్తుతం నాలుగో స్థానానికి దిగజారింది. సెప్టెంబర్ 2023 తొమ్మిదో తేదిన కేంద్రమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని అధికార భాషా సంఘం తయారు చేసి, రాష్ట్రపతికి సమర్పించిన నివేదిక మరింతగా హిందీభాషేతర ప్రజానీకంపై అణచివేతకు పాల్పడే విధంగా ఉన్నట్లు చాలా స్పష్టంగా అర్థమౌతున్నది. అధికారికంగా ప్రకటించకపోయినా,



ఉద్యోగ భారతంలో మనం చాలా వీక్!

కేంద్రంలోని వివిధ మంత్రిత్వ విభాగాల్లోని ఖాళీలను నింపటానికి స్టాఫ్ సెలక్షన్ కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్‌బోర్డు, ఐబీపీఎస్ వంటి సంస్థలు పరీక్షలు నిర్వహిస్తున్నాయి.

2013 నుంచి ఇప్పటి వరకు

4.72 లక్షల ఖాళీలను ఆయా సంస్థలు పోటీపరీక్షలు నిర్వహించి భర్తీ చేశాయి. వీటిలో దక్షిణ రీజియన్ వాటా చాలా తక్కువ.

ఇవీ గణాంకాలు

2011
1,472 కానిస్టేబుల్ జనరల్ డ్యూటీ (జీడీ) ఖాళీలను భర్తీచేశారు.
దక్షిణ రీజియన్ నుంచి **17** మంది – **1.15%**
నార్తర్న్, సెంట్రల్ రీజియన్ నుంచి **1,076** మంది (**73.09%** శాతం) ఎంపికయ్యారు.

2014
కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ పరీక్ష ద్వారా 2,575 ఖాళీలను భర్తీ చేసింది.
దక్షిణ రీజియన్ నుంచి ఎంపికయ్యింది: **45** మంది – **2.24%**
నార్తర్న్ రీజియన్‌లో **1,019** మంది ఎంపికయ్యారు.
ఇది మొత్తం ఉద్యోగాల్లో **39.05%**.

2,118 జూనియర్ ఇంజినీర్స్ (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, క్వాంటిటేటివ్, సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్స్) భర్తీ చేయగా.
దక్షిణ రీజియన్ నుంచి **242** మంది – **11.4%** ఎంపికయ్యారు.
ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఉద్యోగ నియామక సంస్థలు భర్తీ చేస్తున్న ఖాళీల్లోనూ దక్షిణ రీజియన్ పరిస్థితి ఇలాగే ఉన్నది.

2015
ఎస్సై ఇన్ ఢిల్లీ పోలీస్, సీఆర్పీఎఫ్, ఏఎస్సై ఇన్ సీఐఎస్ఎఫ్‌లో 2,892 ఖాళీలను భర్తీ చేస్తే..
దక్షిణ రీజియన్ వాటా కేవలం **65** మంది – **2.24%** మాత్రమే.
నార్తర్న్ రీజియన్‌లో **1,781** మంది (**61.05%**)ఎంపికయ్యారు.

2015-16
స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వార్షిక నివేదిక ప్రకారం 24,604 ఉద్యోగాలు భర్తీచేసింది.
దక్షిణ రీజియన్ **1098** మందికి ఉద్యోగాలు. – **4.46%**
నార్తర్న్, సెంట్రల్ రీజియన్‌లో **18,730** మందికి ఉద్యోగాలు వచ్చాయి.

మన యువత వెనుకబాటుకు కారణాలివి:

కేంద్రస్థాయిలో ఉద్యోగాలను భర్తీచేసే సంస్థలు ఉన్నాయనే విషయం తెలంగాణ నిరుద్యోగులకు తెలియకపోవడం.

కొద్దిమందికి అవగాహన ఉన్నప్పటికీ, కోచింగ్ కోసం వేలకువేలు ఖర్చుపెట్టే తాహతు లేకపోవడం.

మనచుట్టూ ఉన్న కోచింగ్ సెంటర్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకే ప్రచారాన్ని కల్పించడం

సోర్స్: 2017 నవంబర్ 19: నమస్తే తెలంగాణ దినపత్రిక మొదటి పుట

వెల్లడైన ప్రకారం, పాలనా భాషగా దేశవ్యాపితంగా హిందీనే ఉండాలని, అన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాల్లో తీర్పుల నమోదులు హిందీలో జరిపి భద్రపరచాలని, హిందీ మాట్లాడడం రాని కేంద్ర ఉద్యోగులపై చర్యలు తీసుకొవాలని, వారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్లు ఇవ్వకూడదని, అన్ని ఉద్యోగ పోటీ పరీక్షల బహుళ ఐచ్ఛిక ప్రశ్నపత్రాలతో సహా ప్రశ్నపత్రాలన్నీ హిందీలోనే ఉండాలని, ఉద్యోగులందరికీ హిందీభాష వచ్చి తీరాలనీ, అనేక ప్రతిపాదన లకు చట్టరూపం తేబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రైల్వేతో సహా అనేక కేంద్రప్రభుత్వ ఉద్యోగాలలో నూటికి తొంభై మంది హిందీభాషా జాతులవారే ఉన్నారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం హిందీయేతర ప్రాంతాలవారికి ఒక్క ఉద్యోగం కూడా దొర్కకూడదని కేంద్రం స్పష్టంగా నిర్దేశించబూనుకుందని అర్థమౌతోంది.

ఉద్యోగాలు-భాష

రైల్వే, బ్యాంకు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు జరిపే వేలాది ఉద్యోగాల్లో 95% హిందీ భాషాజాతుల వారికే వెళుతున్నాయి. బహుళ ఐచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలు ఆంగ్లంతోబాటు హిందీలో ఉండడంవల్ల వారు తేలికగా సమాధానాలు గుర్తించి ఉద్యోగాలు పొందడం జరుగుతోంది. డిసెంబరు 2017న ఇచ్చిన ప్రకటన నుంచి జెఈఈ పరీక్షకు గుజరాతీ భాషలో కూడా ప్రశ్నాపత్రం ఇవ్వడం మొదలు పెట్టారు. కనీసం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యుల్ లో చేర్చిన ప్రధాన భాషలన్నిటా ప్రశ్నాపత్రం ఇవ్వాలని ప్రజాస్వామిక వాదులు ఎంతపోరినా చెవిటివాని ముందు శంఖం ఊదిన చందాన తయారైంది. ఈ పద్ధతి మారాలంటే, నియామకాల్లో ప్రజాస్వామిక విధానం రావాలంటే, ప్రతి రాష్ట్రానికీ ఆ రాష్ట్ర జనాభాను బట్టి నియామకాల్లో రిజర్వేషన్ కల్పించాలని చాలామంది డిమాండ్ చేస్తున్నారు. అఖిల భారత సర్వీసుల నుంచి, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలతో సహా అన్నిటా ఈ విధానం అమలు పరచాలనే డిమాండ్ వుంది. అదే విధంగా మెడికల్ ఇంజనీరింగ్ తదితర విద్యా ప్రవేశ పరీక్షలను అఖిలభారతస్థాయిలో జరిపినా, జనాభా దామాషాను బట్టి ఆయా రాష్ట్రాల అభ్యర్థులకు రిజర్వేషన్ వాటా కల్పించాలి లేదా ఆయా రాష్ట్రాలకే నియామక పరీక్షలు జరుపుకునే విధానం పునరుద్ధరించాలని కోరుతున్నారు.



భాషాధిపత్యం

భాషా ఆధిపత్య ధోరణులు సినిమా రంగాన్ని కూడా విడిచిపెట్టలేదు. భారతీయ సినిమా అంటే బాలీవుడ్ మాత్రమే అని, పురస్కారాలన్నీ వారికే అనే ప్రవర్తనతో విసిగిపోయిన దక్షిణాది సినిమారంగం వారు సైమా (సౌత్ ఇండియన్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అనే పేరుతో వేరుకుంపటి పెట్టుకొని ప్రతియేటా అవార్డుల వేడుక నిర్వహించు కొంటున్నారు. బాలీవుడ్ నటుడు అజయదేవ్ గన్ హిందీయేతర భాషా చిత్రాల్ని కించపరుస్తూ హిందీలో చెప్పినందుకు, కన్నడ నటుడు కిచ్చా సుదీప్ ఘాటుగా స్పందించాడు. ఆంగ్లంలో కాకుండా తననుద్దేశించి హిందీలో రాసినందుకు తాను కన్నడంలో సమాధాన మిస్తే ఎట్లా ఉంటుందన్నాడు. పాన్ ఇండియా చిత్రాలని దక్షిణాది చిత్రాలనే ఎందుకని అనాలని, హిందీ సినిమాల్ని పాన్ ఇండియా సినిమాలని ఎందుకు సంబోధించకూడదనీ ప్రస్తావిస్తూ, ప్రాంతీయ అనే పదమే సరయింది కాదని ధీటుగా సమాధాన మిచ్చాడు. ఇక 2024 మార్చిలో, ఆహ్వానంపై అంబానీ ఇంట పెళ్ళికి వెళ్ళిన ప్రముఖ తెలుగు నటుడు రాంచరణ్‌ను 'ఏయ్! ఇడ్లీ సాంబార్!' అని ఒక హిందీ నటుడు సంబోధించి అవమాన పరచినట్లుగా, 'తన కొడుకును పిలిచి అవమానిస్తారా?' అంటూ చిరంజీవి మాట్లాడిన యూట్యూబ్ వీడియోలు ప్రసార మౌతున్నాయి. పేరు ప్రఖ్యాతులున్న వారి పరిస్థితే ఇట్లా వుంటే, డిల్లీ వీధుల్లో మామూలు వాళ్ళ పరిస్థితి ఎట్లా వుంటుందో ఊహించలేము. అక్కడ దక్షిణాది వారిని రెండోస్థాయి పౌరులుగానే చూస్తారు. న్యాయస్థానాల్లోను, ప్రభుత్వ కార్యకలాపాల్లోనూ ఇంగ్లీషు వాడుతుంటే బలి పశువులా నోరు వెళ్ళబెట్టుకుని చూడడం తప్ప తమ న్యాయవాది ఏమంటున్నాడో, జడ్జీ ఏమంటున్నాడో తెలీక కక్షిదారులు బలిపశువుల్లా చూస్తున్నారు. విస్పష్టంగా ఒక దళారీవర్గం ప్రయోజనాలే కానీ అక్కడ

ప్రజలకు ఒరిగిందేమీ లేదు. తమ సొంతభాషలో పాలనకు, అధికార సంబంధ వ్యవహారాలకు నోచుకోని జాతి ఇంకా బానిసత్వంలోనే ఉన్నట్లుగా భావించాల్సి వుంటుంది.

బలవంతపు రుద్దుడు

అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల వంటి సంస్థల్లో హిందీ తప్పనిసరి చేసి, ఆ భాషా పరీక్షలు ఉత్తీర్ణులైనవారికి పదోన్నతులతో సహా అనేక ప్రోత్సాహాలు ఇస్తున్నారు. ఎక్కువమంది హిందీ అధికారులు ఉండే కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అరకొరగా ఉండే ఇతర భాషలకు చెందిన ఉద్యోగులు అనుభవించే వేధింపులు వారికే తెలుసు. రోజుకో పదం అని హిందీని వారి సిబ్బందితోబాటు ఖాతాదారులకూ మప్పుతున్నారు "అటల్ పెన్షన్ యోజన", "దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల యోజన", "ప్రధాన్ మంత్రి భీమ్ సురక్ష యోజన", "జన్‌ధన్ యోజన" అంటూ కేంద్ర పథకాలు అన్నిటికీ హిందీ పేర్లే పెడు తున్నారు. దేశం మొత్తం రహదారులు, రైల్వేస్టేషన్లు, ఊళ్ళ పేర్లూ వంటివన్నీ హిందీలో ఉండడం వల్ల హిందీ భాష మాట్లాడేవారు ఎక్కడైనా తమ వ్యాపార వ్యవహారాలు చక్కబరుచుకునే వెసులు బాటు ఉంది.

హిందీలో అన్ని ప్రభుత్వ సంబంధ పట్టికలు, ప్రోఫార్మాలు ఉంటాయి. మిగతా అధికార హోదా ఉన్న భాషలలో ఉండవు. పైగా ప్రభుత్వ సంస్థలు రోజుకో పదం అంటూ హిందీ నేర్పటం, హిందీ భాషా ప్రావీణ్యం సంపాదించినవారికి ప్రమోషన్లు ఇవ్వడం చేస్తుంటారు. రైల్వేస్టేషన్‌లు, రహదారులపై కిలోమీటర్లు, ఉళ్ళ పేర్లూ అన్నీ హిందీలో ఉంటాయి కాబట్టి వాళ్ళు ఎక్కడైనా వ్యాపార వ్యవహారాలు చక్కబెట్టుకోగలరు. మిగతా భాషాజాతులవారికి ఆ వెసులుబాటు లేదు. కానీ మన మేధావుల్లో చాలామంది భాషకు ప్రజల ఆర్థిక సమస్యలకూ సంబంధం లేదని భావిస్తుంటారు. ఒక భాషా జాతి సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక సామాజిక మేధోస్థాయిలో పురోగతి సాధించడానికీ, ఆధిపత్యం వహించక పోయినా, కనీసం రెండోస్థాయి వారిలాగానో, బానిసలుగానో బ్రతక గూడదనుకుంటే, భాషాభివృద్ధి, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, ప్రభుత్వ, న్యాయస్థాన కార్యకలాపాలూ ప్రజలభాషలో ఉండాలి.

ప్రజా చైతన్యం, చట్టపరంగా ఉన్న హక్కులు తెలుసుకొని అమలుకోసం

కృషి చేయడానికి భాష అడ్డంకిగా ఉన్నందున హక్కులు కోల్పోతున్నారు. ఉదాహరణకు నేను అనువాదం చేసిన కేంద్ర ప్రభుత్వపు భూసేకరణ విధానాన్ని గురించిన చట్టంలోనూ, యస్సీ,ఎస్టీల అత్యాచార నిరోధక చట్టం లోనూ ప్రజలకు ఎంతోమేలుచేసే అద్భుతమైన అంశాలున్నాయి. భూసేకరణ చట్టం సరిగా అమలు చేయకపోగా, అరకొర అమలు చేస్తూ, ఆ మేళ్ళన్నీ తామేదో ఉదారంగా చేస్తున్నట్లు మన పాలకులు ఫోజు కొడుతున్నారు. ఉద్యమ కార్యక్రమాలు చేసే కార్యకర్తలకు కూడా వాటిల్లో ఏముందో తెలియక పోవడానికి కారణం వారికి ఆ భాష రాకపోవడమే. కనీసం అధికార హెూదా పొందిన భాషల్లో నయినా చట్టాలు ప్రచురించడం చాలా సులువైన పని. అయినా భాషా ఆధిపత్యం ప్రజాస్వామ్యా నికి దోహదం చేసే ఈ పనికి అడ్డం పడుతోంది.

భాషల సమాఖ్య


భిన్నత్వంలో ఏకత్వమే భారత సమాఖ్య ముఖ్య లక్షణంగా అంతా ఎంతోకాలంగా అందరూ చెప్పే అంశం. భారత రాజ్యాంగం **'ఇండియా అంటే భారత్– ఇది రాష్ట్రాల సమాఖ్యగా ఉంటుంది**' అనే వాక్యంతో ప్రారంభం అవుతుంది. కానీ ఆచరణలో సమాఖ్య రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఏకకేంద్ర రాజ్యంగా తయారుచేసే ప్రక్రియ ఎక్కువైంది. రాష్ట్రాల హక్కులు హరించి, గుజరాతీ, మార్వాడీ ఆధిపత్యం కిందికి తెచ్చే ప్రక్రియలో భాగంగా, **'దేశమంతా ఒకే భాష, ఒకే సంస్కృతి'** అనే నినాదంతో హిందీ భాషా సంస్కృతుల్ని మిగతా భాషా జాతులపై రుద్దే ప్రయత్నం బిజెపి పాలన వచ్చాక మరింతగా తీవ్రతరమైంది. ఇది పైకి భాషకు సంబంధించిన విషయంగా కనబడినా, వాస్తవానికి ఆధిపత్య స్థాపనకై అధికారాన్ని దుర్వినియోగం చేసే చర్యగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ భాషా ఆధిపత్యం దేశీయంగా, ఇతర భాషా జాతుల ప్రజల ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాలవంటి ఆర్థిక జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకే దేవుడు, ఒకే మతం, ఒకే ఆహారం, ఒకే సంస్కృతి, అంటూ అన్నిరకాల అల్ప సంఖ్యాక మత, ఆచార సంస్కృతుల్నీ ధ్వంసం చేసి, తమకు అనుకూలమైన ఆర్యమత సంస్కృతుల్ని మిగతావారిపై రుద్ది, ఆధిపత్యం నెరిపే విధానం తయారైంది. ఇందుకు తీవ్ర జాతీయవాదం, మతం వారికి ఆయుధాలు అవుతున్నాయి. వీటన్నిటినీ ఎదుర్కొని ప్రజాస్వామిక పద్ధతులు, విధానాలు పెరిగేందుకు ప్రజలు తమ హక్కులపట్ల మరింత చైతన్యం కావలసిన అవసరముంది.

9

ఎన్నికలు - ప్రజాస్వామ్యం

ఆధునిక ప్రభుత్వాల్లో ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల వ్యవస్థగా గుర్తింపు పొందింది. ఏ రూపంలో ఐనా ప్రజలు తమ ప్రతినిధుల్ని పాలనకై చట్టసభలకు పంపడానికై ఎన్నుకోవడాన్నే ప్రజాస్వామ్యంగా గుర్తిస్తున్నారు. ఈ విషయాన్ని మరింత లోతుగా తెలుసుకుందాం!

ఈ ఎన్నుకునే పద్ధతి ప్రపంచ వ్యాపితంగా ఏకరూపంలో లేదు. ఒకరికి మించిన ప్రతినిధుల్ని ఎన్నుకోవాల్సిన విధానం ఉన్నచోట్ల ఓటువేసే వ్యక్తి ఎంతమందిని ఎన్నుకోవాలో అన్ని ఓట్లు వేసే అవకాశం ఉంది. కొన్ని దేశాలలో పార్టీకి ఓటు వేసే పద్ధతి ఉంది. ఈ పద్ధతిలో పోటీలో వున్న అభ్యర్థుల ప్రసక్తి లేకుండా పోటీలో ఉన్న పార్టీకి ఓటువేయడం జరుగుతుంది. ఈ పద్ధతిలో ఎక్కువ ఓట్లు పొందిన పార్టీ పూర్తిగా అధికారం లోకి వస్తుంది. ఇక్కడ ప్రతిపక్షాలకు తావులేదు. వీటినే దామాషా ఎన్నికలు అని అంటారు. మరొకటి, రెండుసార్లు లెక్కించే విధానం. ఈ విధానంలో ఓటువేసే వ్యక్తి ప్రాధాన్యతాక్రమంలో నచ్చిన అభ్యర్థుల్ని సూచించాల్సి వుంది. మొదటి లెక్కింపులో ఏ అభ్యర్థికీ స్పష్టమైన ఆధిక్యత రాకపోతే, రెండోసారి ప్రాధాన్యతా ఓట్లను లెక్కించి, ఎవరు గెలిచిందీ నిర్ణయిస్తారు. సాధారణంగా మొదటి లెక్కింపులో ఎక్కువ ఓట్లు సాధించిన ఇద్దరు అభ్యర్థులకు వచ్చిన ఓట్ల ప్రాతిపదికన ఇద్దర్ని మాత్రమే రెండో లెక్కింపుకు పరిగణనలోకి తీసుకుంటారు. ప్రపంచంలో దాదాపు 88 దేశాలలో దేశాధ్యక్షుని ఎన్నికకు ఇదే విధానాన్ని అవలంభిస్తున్నారు. కొన్ని దేశాలలో దీన్ని కొద్ది మార్పులతో అనుసరిస్తున్నారు. వేసిన ఓట్లలో దాదాపు 40% ఓట్లు సంపాదించి, తన ప్రత్యర్థికంటే సుమారుగా పదిశాతం ఎక్కువ ఓట్లు పొందినవారిని గెలిచినట్లు పరిగణిస్తున్నారు. ఇదికాక, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పద్ధతి ప్రకారం, ఒకే ఓటు బదిలీ పద్ధతిలో ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకునేవారు.



భారతదేశంలో 250 రాజ్యసభ స్థానాలకు ఇదే ప్రాతిపదికన ఎన్నికలు జరుపుతారు. రాష్ట్ర శాసన సభ సభ్యులు, కేంద్ర పాలిత ప్రాంత ప్రతినిధులు రాజ్యసభ సభ్యులను ఎన్నుకుంటారు. ఇక్కడ రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండదు. రాష్ట్ర జనాభా నిష్పత్తిని బట్టి ఆ రాష్ట్ర శాసన సభ్యుని ఓటు విలువ లెక్కించడం జరుగుతుంది.

ఎన్నికల చరిత్ర

భారత రాజ్యాంగం అమలులోకి రాక ముందు చాలా కొద్దిమందికి మాత్రమే ఓటుహక్కు ఉండేది. తొలిసారిగా బ్రిటీషు హయాంలో, వారి అధీనంలో ఉన్న ప్రాంతాల్లో 1920లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ (కేంద్రం), ప్రొవెన్షియల్ (రాష్ట్రాలు) శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన వారికి ఎలాంటి నిజమైన అధికారాలూ లేకపోయినా, ముఖ్యంగా సలహాపూర్వక విధులే ఉన్నా, ఓటు వేసే హక్కు మాత్రం చాలా తక్కువ మందికి మాత్రమే వుండేది. ముఖ్యంగా ఆంగ్లేయులు, పెద్ద వ్యాపారస్తులు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ పద్ధతి మారింది. వలస పాలన నుంచి విముక్తికోసం జరిపిన ఉద్యమాల్లో ప్రజలందర్నీ కలుపుకోవలసిన అవసరం వల్ల సర్వమానవ సమానత్వ భావన ఊపిరి పోసుకుంది. అందువల్ల స్త్రీ పురుష వివక్ష, కుల, మత, ప్రాంతీయ విచక్షణ, ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా 21 ఏళ్ల వయసు నిండిన వయోజనులందరికీ సార్వత్రిక ఓటుహక్కు కల్పించడం జరిగింది. ఈ ప్రాతిపదికన ఆ నాటికి భారతసమాఖ్యలో ఉన్న ప్రాంతానికి 1951 అక్టోబర్ 25 నుంచి, 1952 ఫిబ్రవరి 21 వరకూ ఎన్నికలు జరిగాయి. ఆనాడున్న పరిస్థితుల్లో ఓటుహక్కు ప్రాధాన్యత, దాని విలువను గురించి అత్యధిక సాధారణ ప్రజానీకానికి సరయిన అవగాహన లేదు. అప్పటికి అధికారం, ధనం, విద్య ఎవరి చేతుల్లో ఉన్నాయో ఆ ప్రభావిత వర్గాలవారు మాత్రమే ఎన్నికల్లో నిలబడి, జనాల్ని బతిమాలో, బామాలో ఓటువేసే చోటికి తీసుకు వచ్చేవారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 488 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికలలో, ఓటర్లుగా నమోదైనవారిలో కేవలం సగానికంటే తక్కువ మాత్రమే (45.7%) ఓటు వేశారు. ఒకవేళ రిగ్గింగు, ఎన్నికల ప్రాంతాల్ని ఆక్రమించడం వంటివి జరిగి ఉంటే వాటితోసహా ఈ లెక్కలోనే చేరతాయి. ఈ శాతం నిదానంగా పెరుగుతూ, 1967 నాటికి 61.3 శాతానికి చేరుకుంది. బ్యాలెట్ ఓటింగులో ఇదే సగటున ఎక్కువగా కనబడుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన

2004 ఎన్నికలలో 58.07% కాగా 2009 లో 58.19% గాను, పూర్తి ఏవీయం మిషన్లతో రెండోసారి జరిగిన 2014 ఎన్నికల్లో 65.5% కి చేరుకుంది. ఎన్నికల్లో అక్రమాలు, ఏయే వర్గాలు ఎందుకు? ఎట్లా ఓటు వేస్తుందీ? ఎవరెవరు ఎందుకు ఓట్లు వేయడంలేదో చర్చించే ముందు భారతదేశ ఎన్నికల వ్యవస్థను గురించి తెలుసుకోవాలి.

ఎన్నికల సంఘం ఏర్పాటు


భారత రాజ్యాంగ నిర్మాణ సారథి అంబేద్కర్ ఆధ్వర్యంలో రూపొందిన రాజ్యాంగంలో 21 ఏళ్ల వయసు నిండిన పౌరులందరికీ (61వ రాజ్యాంగ సవరణ ద్వారా 16 అక్టోబర్ 1989న, ఓటింగ్ వయస్సు 18 సంవత్సరాలకు తగ్గించారు) ఓటుహక్కు కల్పించారు. అంతే కాకుండా ఈ ఎన్నికల నిర్వహణ వ్యవస్థను పాలకులకు వదిలివేస్తే రాగల అనర్థాలను ఆనాడే గుర్తించి, ఒక స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న వ్యవస్థకు రూపకల్పన చేశారు. రాజ్యాంగంలోని 15వ భాగంలో 324-329 వరకు గల ప్రకరణాల్లో ఎన్నికల సంఘాన్ని గురించి తెలియజేశారు. రాజ్యాంగంలో మొదట కేంద్రానికీ, రాష్ట్రాలకూ వేరువేరు ఎన్నికల సంఘాలను ప్రతిపాదించినా, చర్చల అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాసనసభ్యుల ఎన్నికలను నిర్వర్తించడానికి కేంద్రీకృత అధికారాలున్న ఒక స్వతంత్ర ఎన్నికల కమిషనర్‌ను ఏర్పాటు చేశారు. తిరిగి, రాజ్యాంగ అధికరణం 324కు సవరణ చేసి, 1993 అక్టోబర్ 1వ తేదీ నుంచీ దీన్ని ముగ్గురు సభ్యుల కమిషన్‌గా మార్చారు. ఈ ముగ్గురు సభ్యులకూ పదవీ నిబంధనలు, చెల్లింపులూ, ఇతర షరతులూ, సర్వోన్నత న్యాయస్థానపు న్యాయమూర్తికి వర్తించే విధంగా ఉంటాయి.

లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకూ వయోజన ఓటుహక్కు ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతాయి. పిచ్చి, నేరాలు చేయడం, దివాలా తీయడం, అవినీతి, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడడం వంటివి ఓటు వేయడానికి అనర్హతగా నిర్ణయించారు.

ఎన్నికలసంఘం విధులు

కేంద్ర, రాష్ట్ర శాసనసభలు, శాసనమండళ్ల ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల నిర్వహణ, ఓటర్ల

నమోదు, జాబితా తయారు చేయడం, ఎస్.సి, ఎస్.టి, రిజర్వేషన్ అమలు, పార్లమెంటు సభ్యుల అనర్హత, తొలగింపు వంటి అంశాలపై రాష్ట్రపతికి, రాష్ట్ర శాసనసభ సభ్యుల అనర్హత, తొలగింపు వంటి అంశాలపై గవర్నరుకు సలాహా ఇవ్వడం ఎన్నికలసంఘం అధికార పరిధిలో ఉన్నాయి. రాజకీయ పార్టీలకు జాతీయ లేదా రాష్ట్రస్థాయి పార్టీలుగా గుర్తింపు, ఎన్నికల గుర్తులు కేటాయించడం, ఎన్నికల సక్రమ నిర్వహణ, ఎన్నికలలో రాజకీయ పార్టీలు,


టి.ఎన్.శేషన్

అభ్యర్థులకు ప్రవర్తనా నియమావళి రూపొందించడం, ఖర్చు పరిమితి విధించి పర్యవేక్షించడం, ఎన్నికల వివాదాలను విచారించడం, అక్రమాలు జరిగితే ఎన్నిక లేదా ఎన్నికలను రద్దు చేయడం ఎన్నికల సంఘం విధులు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, అన్ని రకాల సాధారణ పాలనా వ్యవహారాలు, అధికారుల బదిలీ, ఉద్యోగ విధుల నుంచి తప్పించడం వంటి అంశాలతో సహా ఎన్నికల ప్రకటన విడుదల అయిన తర్వాత పాలన ఎన్నికల సంఘం చేతుల్లోకి వెళ్ళిపోతుంది. రాజ్యాంగం 329 ప్రకరణం ప్రకారం, ఎన్నికల చిహ్నాల వివాదాలపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోగూడదు. ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థ అయినప్పటికీ, నియామకాధికారం మాత్రం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చేతుల్లో ఉంటుంది కాబట్టి, తమ అడుగులకు మడుగులొత్తే వారినే నియమించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది. కాబట్టి వాళ్ళు ఈ వెసులు బాటును చక్కగా సద్వినియోగం చేసుకోవడం పరిపాటి అయింది. అయినప్పటికీ, టి.ఎన్. శేషన్ వంటి ముక్కుసూటిగా నడుచుకునే అధికారులు తారసపడితే, వారికి ముకుతాళ్ళు వేసే వెసులుబాటు కూడా అధికారంలో ఉన్న వాళ్ళకు ఉంటుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే 1989 అక్టోబర్లో ప్రభుత్వం శేషన్‌కు కళ్ళెం వేయడానికై, ఏకసభ్య ఎన్నికల కమిషన్‌ను రద్దుచేసి, ముగ్గురు సభ్యులుండే విధంగా ఎన్నికలసంఘాన్ని పునర్వ్యవస్థీకరించారు.

టి.ఎన్.శేషన్ కొన్ని ఎన్నికల సంస్కరణలు తేవడమే ఇందుకు ముఖ్య కారణం. ఆయన తెచ్చిన సంస్కరణల్లో ముఖ్యమైనవి:

1. ఒక అభ్యర్థి రెండుచోట్లకు మించి పోటీ చేయకూడదు.
2. ఏ నేరం కింద అయినా రెండేళ్ళు జైలు శిక్ష అనుభవిస్తే కనీసం ఆరేళ్ళపాటు

ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించాలి.

3. ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థి చనిపోతే ఎన్నికను వాయిదా వేయాలి కానీ రద్దు చేయకూడదు.

4. పోలింగు పూర్తి అయిన తర్వాత 48 గంటల వరకూ మద్యం అమ్మకం, పంపిణీ చేయడం శిక్షార్హమైన నేరం.

5. అన్నిటికంటే ముఖ్యంగా దొంగ ఓట్ల నిరోధానికి ఓటరు గుర్తింపు కార్డులు ప్రవేశ పెట్టడం.

ఇంత చిన్నపాటి సంస్కరణలు తేవడమే ఆయన చేసిన తప్పిదంగా భావించి, ఇంకేం మార్పులు తెస్తాడో అనే భయంతో, తన అధికారాలు కత్తిరించడానికే రాజీవ్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ముగ్గురు సభ్యుల కమిషన్‌గా మార్చింది. వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్న నేషనల్ ఫ్రంట్ అధికారంలోకి రాగానే, తిరిగి ఏకసభ్య కమిషన్‌ను పునరుద్ధరించినా, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, 1993లో తిరిగి ముగ్గురు సభ్యుల కమిషన్‌ను ఏర్పరిచింది. ఎన్నికల కమిషనర్ల ఎంపికలో పారదర్శకత కోసం ప్రధానితో బాటు ఒక మంత్రివర్గ సభ్యుడు, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండేట్లు చూడాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఐతే, అధికారంలో ఉన్నవారు తమకు అనుకూలంగా పనిచేయమని ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తేవడం జరుగుతుందనే విమర్శలు కూడా ఉన్నాయి. లోక్‌సభ, కొన్ని రాష్ట్ర శాసనసభలకు 2024 సంవత్సరపు ఎన్నికల కార్యక్రమ ప్రణాళిక ప్రకటించడానికి కేవలం ఒకరోజు ముందుగా మార్చి 8వ తేదీన ఆకస్మికంగా ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. రాజీనామా లేఖలో తన ఆరోగ్య సమస్యల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నా, బయటకు చెప్పలేని కారణాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్థానిక ఎన్నికలు - ప్రభుత్వాల కితకితలు

రాజ్యాంగానికి 1992లో జరిగిన 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతీ రాష్ట్రమూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటుకు చర్యలు చేపట్టేందుకు అధికారం ఇచ్చింది. రాజ్యాంగబద్ధంగా ప్రతిరాష్ట్రంలో కూడా ఒక ఎన్నికల సంఘం ఏర్పాటయింది. ఆ ప్రకారం ఏర్పడ్డ రాష్ట్ర ఎన్నికల సంఘం

మునిసిపాలిటీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయితీల ఎన్నికలకు బాధ్యత వహిస్తుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీస్థితులు, జీతభత్యాలు, తదితరాలన్నీ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తు లతో సమానంగా ఉంటాయి. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పదవిలో పనిచేసి ఉన్న అధికారిని ఈ పదవిలో నియమిస్తారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సహాయకులుగా ఒక ఐఏఎస్ అధికారి కార్యదర్శిగా, జిల్లా న్యాయమూర్తి హెూదా ఉన్న వ్యక్తిని న్యాయ సలహాదారుగా నియమిస్తారు. వివిధ రకాల స్థాయిలలో జరిగే, ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వర్తిస్తుంది. గ్రామీణ స్థానిక సంస్థలలోని (జెడ్పిటిసి) సభ్యులు, (ఎంపిటిసి) సభ్యులు, గ్రామ పంచాయితీ, సర్పంచు, వార్డు సభ్యులు, నగర, పట్టణ కార్పొరేటర్లు / నగర్ పంచాయతీ కౌన్సిలర్లు, వార్డ్ సభ్యులు, ప్రత్యక్ష ఎన్నికలద్వారా ఎన్నికౌతారు. ప్రత్యక్ష ఎన్నికలు ముగిసి, వారు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిన తేదీల్లో గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, మునిసిపాలిటీలకు, మునిసిపల్ కార్పొరేషన్లకు సంబంధించి, ఛైర్ పర్సన్, వైస్ ఛైర్ పర్సన్ వంటి పదవులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వాలకూ ఘర్షణ చోటు చేసుకున్న అంశాలు కూడా కొన్ని జరిగాయి.

నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అనే పదవీ విరమణ చేసిన ఐఎఎస్ అధికారి 2016 సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారిగా నియామక మయ్యాడు. ప్రభుత్వం, వివిధ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమైంది. జెడ్పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యుల నామినేషన్లు పూర్తయిన తర్వాత రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉన్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్ కోవిడ్ వ్యాప్తి కారణంగా, ప్రజారోగ్యం కాపాడే దృష్ట్యా ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. దీనిపై ఆగ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి పదవీకాలాన్ని మూడు సంవత్సరాలకు కుదిస్తూ ఆర్డినెన్స్ జారీచేసింది. వెంటనే తమిళనాడుకు చెందిన పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి కనగరాజ్‌ను నిమ్మగడ్డ స్థానంలో నియమించి, ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. అయితే వెంటనే దీనిపై ఉన్నత న్యాయస్థానంలో, సర్వోన్నత న్యాయస్థానంలోనూ వ్యాజ్యం నడిచింది. ఉన్నత

న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు నిమ్మగడ్డ రమేష్ కుమార్ తిరిగి పదవిలో చేరి, తన పూర్తి పదవీకాలం, 2021 మార్చి నెలాఖరు వరకూ పదవిలో కొనసాగాడు. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారి జీతభత్యాలు, పదవీకాలంతో సహా దేన్నీ పదవీ కాలంలో వారికి ప్రతికూలంగా మార్చకూడదనే రాజ్యాంగ నిబంధన పట్ల అవగాహన లేకపోవడం, ఎంతోమంది సలహాదారులున్నా ఎవరూ దీన్ని గురించి మాట్లాడకపోవడం, వ్యవస్థల లోపానికి నిదర్శనంగా నిలిచింది.

బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అన్ని విషయాల్లోనూ భారతదేశ సమాఖ్య విధానాన్ని ఏకకేంద్రక విధానంగా మార్చడానికి అనేక విధాలుగా తీవ్రంగా ప్రయత్నం సాగిస్తోంది. ఒకే దేశం, ఒకే పన్ను పేరిట జీఎస్టీని కేంద్రమే లాక్కుంది. వివిధ భాషాసాంస్కృతిక వైవిధ్యాల్ని రద్దుచేసి, హిందీ భాషను, గుజరాతీ, మార్వాడీ ఆధిపత్యాన్ని నెలకొల్పడంలో భాగంగానే ఇదంతా జరుగుతున్నట్లు కనబడుతోంది. అందులో భాగంగానే జమిలి ఎన్నికల విధానం అనే కొత్త అంశానికి తెర లేపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా అధికారంలో కొనసాగిన 1967 సం॥ వరకూ కేంద్ర రాష్ట్ర ఎన్నికలు ఒకేసారి జరిగేవి. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పాటు కావడం, అవి ముందుగానే రద్దుకావడంతో, వాటికి ఆర్నెల్ల లోపల ఎన్నికలు జరపాల్సిన పరిస్థితుల్లో ఆ విధానం రద్దయింది.

జమిలి ఎన్నికల జుమ్లా

జమిలి ఎన్నికలు జరపడం వల్ల ఎన్నికల ఖర్చు గణనీయంగా తగ్గుతుందని, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొనే సమయం ఆదా కావడం వల్ల, పాలన, అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడకుండా ఉంటాయనీ, ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడం వల్ల కొత్త పథకాలు, సంక్షేమ కార్యాలూ ప్రారంభించడం కుదరదని, ఎన్నికలలో పాల్గొనేవారి శాతం పెరుగుతుందనీ కుంటిసాకులు వల్లెవేస్తున్నారు. వాస్తవానికి ఇదంతా పసలేని వాదనగానే కనబడుతుంది. ఐదేళ్లపాటు ప్రజల జీవితాల్ని శాసించబోయే



లేదా అంతకంటే దీర్ఘకాలం ప్రభావం చూపే చర్యలు చేపట్టే ప్రభుత్వాల ఎన్నికలకు ఈ మాత్రం ఖర్చు భరించక తప్పదు. 'ఐ.డి.ఎస్.సి.' అనే సంస్థ 2015లో ఓటర్ల ప్రవర్తనాశైలిపై ఒక అధ్యయనం జరిపింది. ఆ ప్రకారం, కేంద్రరాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరిపేట్లయితే, ఓటువేసే వారిలో 77% మంది పార్లమెంటుకు పోటీ చేసే పార్టీకే రాష్ట్రంలోనూ ఓటు వేస్తారని వెల్లడైంది. అదే మరో ఆర్నెల్ల తేడాతో ఎన్నికలు జరిపే పక్షంలో కేవలం 61% మంది మాత్రమే ఆదే పార్టీకి ఓటువేస్తారని తేలింది. జమిలి ఎన్నికలలో జాతీయ సమస్యలకు పోటీగా రాష్ట్ర సమస్యలను ముందుకు తేవడంలో రాష్ట్రాలకు పరిమితమైన పార్టీలకు చాలా కష్టం అవుతుంది. అంతే కాకుండా, ఖర్చులు, ఎన్నికల వ్యూహాల్లో దేశవ్యాప్త పార్టీలతో పోటీపడడం స్థానిక పార్టీలకు చాలా కష్టమౌతుంది. ఇక కేంద్రంతోపాటు ఒకేసారి ఎన్నికలు జరపాలంటే, ఇంకా గడువు ఉన్న కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయాల్సి వస్తుంది లేదా కేంద్ర శాసనసభకు ఎన్నికలు జరిగే సమయం దాకా రద్దయిన లేదా గడువు తీరిన రాష్ట్రాలలో గవర్నర్ పాలన విధించడంద్వారా కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర పాలనను నేరుగా చేతుల్లోకి తీసుకోవచ్చు. ఏ రాష్ట్రంలోనైనా రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విఫలమైతే తప్ప, కేవలం జమిలి ఎన్నికల కోసం ఏ రాష్ట్ర ప్రభుత్వాన్నీ రద్దుచేసే అధికారం కేంద్రప్రభుత్వానికి లేదు. దీని వలన, జమిలి ఎన్నికలను సమర్థించే వారన్నట్లు ఎన్నికలు జరిగే కొద్దిపాటి సమయంలోనే కాక, పాలన, అభివృద్ధి కార్యక్రమాలు దీర్ఘకాలం కుంటుపడతాయి. ఆర్నెల్లకు మించిన కాలంపాటు ఒక రాష్ట్రంలో గవర్నర్ పాలన సాగాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. ఇట్లా చేయడానికి మించిన అప్రజాస్వామిక చర్య మరొక టుండదు. మరీ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది కేంద్రానికి ప్రత్యేక భూభాగం అంటూ ఉండదు. వాస్తవంలో ప్రభుత్వం అంటే రాష్ట్రాల సమాఖ్య తప్ప మరేమీ కాదు. రాజ్యాంగ ప్రారంభవాక్యమే **"భారతదేశం అంటే ఇండియా రాష్ట్రాల సమాఖ్యగా ఉంటుంది" (ఇండియా దటీజ్ భారత్ షల్ బి ద యూనియన్ ఆఫ్ స్టేట్స్)** అనేది. ఈ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా జమిలి ఎన్నికల విధానం తెస్తే ఆ చర్య నియంతృత్వ పోకడలకు, అధ్యక్ష తరహా పాలనకు దారితీసి, భారతదేశంలో ప్రజాస్వామ్యానికి నిలువుపాతర వేసెట్లుగానే భావించాలి.

ఈవీఎంల విధానం - లాభనష్టాలు

భారత ఉపఖండం మొత్తంగా 2004 నుంచి పూర్తిగా ఎన్నికలలో ఎలక్ట్రానిక్


ఓటింగ్ మిషన్లనే వాడడం ప్రారంభించింది. ఓటు వేసే వ్యక్తి తను ఎంచుకున్న అభ్యర్థి గుర్తు ఎదురుగా ఉన్న మీట నొక్కితే, ఆ అభ్యర్థికి ఆ ఓటు పడుతుంది. వెంటనే ఆ ఓటు అక్కడి కంట్రోల్ యూనిట్‌లో నమోదై నిల్వ ఉంటుంది. ఒక్కో ఇవిఎంలో సుమారుగా రెండువేల ఓట్ల వరకూ నమోదు చేయవచ్చు. ఇవి విద్యుత్తు అవసరం లేకుండా బ్యాటరీల శక్తితో పని చేస్తాయి. వీటివల్ల ఓట్ల లెక్కింపులో చాలా సమయం ఆదా అవుతుందనీ, బ్యాలెట్ ముద్రించే కాగితాలు, సిరా ఖర్చు తగ్గుతుందనీ, చెల్లని ఓట్లు ఉండే అవకాశం ఉండదనీ, వీటిని సమర్థించేవారు చెబుతున్నారు. ఈ విధానంలో ఓటు వేసిన వారికి తమ ఓటు ఎవరికి పడిందీ తెలుసుకునే అవకాశం లేదు. దానిపై జరిగిన ఒక వ్యాజ్యం (సుబ్రహ్మణ్యస్వామి వెర్సస్ కేంద్ర ఎన్నికల సంఘం)లో ఓటు ఎవరికి పడిందీ చూపించే విధంగా వీవిపాట్ (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) విధానాన్ని అమలు చేయాలని 2013లో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన దరిమిలా వీవిపాట్ విధానాన్ని అమలుచేయడం మొదలు పెట్టారు. ఈ విధానంలో ఓటువేసే మీట నొక్కిన అనంతరం, తను ఏ గుర్తుకు ఓటువేస్తే ఆ గుర్తు పక్కనే ఉన్న యంత్రంలో ముద్రితమై ఏడు సెకన్లపాటు కనిపించి, ఆ యంత్రంలోపల పడిపోతుంది. వీటిని ఓట్ల లెక్కింపుకు పరిగణనలోకి తీసుకోవడం జరగదు. ఈ వీవిపాట్ చిట్టీల్ని కూడా సంపూర్ణంగా లెక్కిస్తేనే ఈవీఎంలపై విశ్వసనీయత పెరుగుతుందనీ, ఆ విధంగా ఆదేశాలు ఇవ్వమనీ కోరుతూ 2019 నుంచీ సర్వోన్నత న్యాయస్థానంలో అనేక వినతులు దాఖలయ్యాయి. ఈ విషయమై దాఖలైన అన్ని వినతులనూ కలిపి విచారించిన సర్వోన్నత న్యాయస్థానపు ద్విసభ్య ధర్మాసనం నూరుశాతం వి.వి.పాట్‌లు లెక్కించడం కుదరదని తీర్పు చెప్పింది.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పనితీరుపై, విశ్వసనీయతపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ మెషీన్లను ప్రభుత్వరంగ సంస్థలైన బి.హెచ్.ఇ.ఎల్., ఈసీఐఎల్ కంపెనీలు తయారు చేస్తున్నాయి. మనోరంజన్ రాయ్ అనే ఒక సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద అనేకసార్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తయారీ సంస్థలకు, ఎన్నికల సంఘానికీ దరఖాస్తులు చేసుకొని అధికారికంగా పొందిన సమాచారం ప్రకారం, 2019 నాటికి, ఈ సంస్థలు తయారు చేసిన ఈవీఎంలలో దాదాపుగా సగం ఎటుపోయాయో కూడా తెలియని పరిస్థితి ఉందని, దీనిపై విచారణ కోరుతూ ముంబై ఉన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు

చేశాడు. ఈ వ్యాజ్యం తర్వాత, మనోరంజన్ సమాచారహక్కు చట్టం ద్వార పొందిన సమాధానాల ప్రాతిపదికన, 2019 మే 8న హిందూ పత్రిక యాజమాన్యానికి చెందిన ఫ్రంట్‌లైన్ అనే పత్రిక 'మిస్సింగ్ ఈవీఎమ్స్' పేరుతో. ఇరవై లక్షల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు కనబడకుండా పోయినట్లు సంచలనాత్మక వార్త ప్రచురించింది.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఈఎఎస్ శర్మ అనే పదవీ విరమణ చేసిన, నిజాయితీపరుడిగా పేరుపొందిన ఐఎఎస్ అధికారి ఎన్నికల కమిషనర్లకు ఒక లేఖ రాశాడు. ఆ లేఖలో ఈవీఎంలు తయారుచేసే బి.హెచ్.ఇ.ఎల్. కంపెనీలో ఆరుగురు స్వతంత్ర డైరెక్టర్లలో నలుగురు బిజేపి నాయకుల్ని ఎట్లా ఉంచారని లేఖ రాశాడు. ఎంతో ముఖ్యమైన, సున్నితమైన ఈ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పర్యవేక్షణలో వారిని ఉంచడాన్ని గురించి ప్రశ్నించాడు. ఇక వీటిని అంతర్జాలం ద్వారా నియంత్రించడం సాధ్యం కాదని ఎన్నికల కమిషన్ ఎంతచెప్పినా వాటిని నియంత్రించడం సాధ్యమేనని కొందరు చేసి చూపిస్తున్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో సహా 120 దేశాలలో ఈవిఎంలకు బదులు కాగితపు బ్యాలెట్లనే వాడుతున్నారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలలో ఈవిఎంలను నిషేధించారు. జర్మనీ సుప్రీం కోర్ట్ 2009లో ఈవిఎంల వినియోగం రాజ్యాంగ వ్యతిరేకమని తీర్పు ఇచ్చింది. గతంలో, 2019 ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష పార్టీలు ఈవిఎంలను నిషేధించాలని ఉద్యమించాయి. డిల్లీ జంతర్‌మంతర్లో 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈవీఎంలను నిషేధించాలంటూ న్యాయవాదుల ఆధ్వర్యంలో వేలాదిమందితో భారీ ఊరేగింపు జరిగింది. ఎన్నికలలో డబ్బు పాత్ర పెంచుతున్న అధికార పార్టీలవారు కోట్లు కొల్లగొట్టడానికి కొత్తదారులు కనిపెట్టారు.


ఎన్నికల బాండ్ల మాయాజాలం



ఎన్నికల బాండ్ల పేరిట ఎవరైనా రాజకీయ పార్టీలకు ఎంతైనా విరాళాలు ఇవ్వొచ్చని బిజేపి ప్రభుత్వం 2018లో ఒక చట్టం చేసింది. ఒక కంపెనీ గత 3 సం॥ లాభంలో ఏడున్నర శాతానికి మించకుండా విరాళాలు ఇవ్వొచ్చనే నిబంధన రద్దుచేసి, ఎంతైనా ఇవ్వడానికి వీలు కల్పించింది. దీని ప్రకారం

ప్రామిసరీ నోటువంటి బాండ్లను ఏ వ్యక్తి లేదా సంస్థ ఎన్నయినా కొనుగోలు చేయవచ్చు. ఏ విదేశీ కంపెనీ అయినా తన స్వదేశీ భాగస్వామ్యమున్న కంపెనీ ద్వారా ఎన్ని కోట్ల నిధులైనా పొందవచ్చు. ఇది వాస్తవంగా మనీలాండరింగ్ అనే తీవ్ర నేరం కిందికి వస్తుంది. ప్రభుత్వరంగ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మాత్రమే వీటిని తీసుకోవచ్చు. ఇవి ఒక్కొక్కటీ వెయ్యి రూపాయలు, పదివేలు, లక్ష, కోటి విలువగల పత్రాల రూపంలో కొనుక్కోవచ్చు. ఏ వ్యక్తి లేదా సంస్థ ఐనా పరిమితి లేకుండా ఎన్ని కోట్ల రూపాయాలకైనా కొనుగోలు చేయవచ్చు. ఈ విధంగా కొనడానికి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే వివరాలు కూడా తెలియపరచాల్సిన అవసరం లేదు. ఈ సొమ్ముకు ఆదాయపు పన్ను మినహాయింపు కూడా ఉంటుంది. కొనుగోలుదారుల వివరాలను బ్యాంక్ తీసు కుంటుంది కానీ వాటిని బహిర్గతం చేయకూడదు. వాటిని అందుకున్న రాజకీయపార్టీ వాటిని పదిహేను రోజుల్లోగా తమ ఖాతాలో జమచేసుకోవాలి. అయితే, ఏ కంపెనీ ఎంత విలువ ఉన్న బాండ్లను ఎప్పుడు కొనుగోలు చేసిందీ, ఏ రాజకీయ పార్టీ ఎంత విలువ ఉన్న ఏయే బాండ్లను ఎప్పుడు మార్చుకుందీ అనే విషయాలు అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే తెలిసే వీలుంది. ప్రతిపక్షాలకు ఆ అవకాశం లేదు.

ఈ ఎన్నికల బాండ్ల విధానం అవినీతికి దారితీస్తుందని అనేక ప్రజాసంఘాలు గళమెత్తాయి. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే సంస్థతోబాటు, సిపిఎం, కాంగ్రెస్ పార్టీకి చెందినవారి వ్యాజ్యంపై సర్వోన్నత న్యాయస్థానం 2024 ఫిబ్రవరి 15న ఒక చారిత్రాత్మ తీర్పు ఇచ్చింది. **ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ఇది సమాచార హక్కును ఉల్లంఘించడమే కాకుండా, రాజ్యాంగపు అధికరణం 19(1)ఎ కింద పేర్కొన్న భావ ప్రకటన స్వేచ్ఛకు కూడా విరుద్ధమని, ఈ రకంగా అక్రమంగా సొమ్ము స్వీకరించడం పరస్పరం ఇచ్చి పుచ్చుకునే (క్విడ్ ప్రో కో) కిందికి వస్తుందనీ పేర్కొంది.** ఇది ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడానికి అవరోధం కల్పిస్తుందని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల కింద ఏయే కంపెనీలు ఎంతెంత సొమ్ముకు బాండ్లు కొన్నదీ వెంటనే ఎన్నికల కమిషన్‌కు అందజేయాలనీ, ఆదేశాలిచ్చింది. అనంతరం ఎస్.బి.ఐ. ఆ వివరాలు వెల్లడించడానికి తనకు సమయం కావాలని, వాటిని 2024 జూన్ నెల (అప్పటికి ఎన్నికలు



ముగుస్తాయి)లో ఇస్తానని చెప్పింది. ఇందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని 2024 మార్చ్ 12న బహిరంగ పరిచింది. అందులోని వివరాలు చాలా దిగ్భ్రాంతి కలిగించేట్లు ఉన్నాయి. ఈవిధంగా చేతులు మారిన వేలకోట్ల సొమ్ములో నూటికి తొంభై పాళ్ళు అధికారంలో ఉన్న బిజేపి పార్టీ ఖాతాలోకే వెళ్ళాయి. అలాగని మిగతాపార్టీలు మడికట్టుకు కూర్చోలేదు. చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే దక్కుదల అన్నట్లు ఎవరికి వీలైనంత వాళ్ళు వసూలు చేసుకున్నారు. వీటిలో హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా, మెఘా ఇంజనీరింగ్ నిర్మాణ సంస్థ, మైహోం, హెటిరో డ్రగ్స్, నవయుగ, యశోదా హాస్పిటల్స్, దివిస్, రహేజా, రెడ్డి లాబ్స్ వంటి కంపెనీలు భారీగా ముట్టజెప్పాయి. బిజేపి పార్టీకి అందిన నిధులలో అధిక భాగం ఆయా సంస్థలపై ఇడి, ఆదాయపన్ను, సిబిఐ వంటి ప్రభుత్వ శాఖల దాడుల తర్వాతేనని వెల్లడవుతోంది. ప్రభుత్వ శాఖలను ఉపయోగించుకొని బెదిరించి సొమ్ము వసూలు చేసుకోవడం అవినీతే అవుతుంది. బాండ్ల రూపంలో తమకు నిధులు అందజేసిన కొన్ని కంపెనీలకు అనేక రాయితీలు, లాభాలు చేకూరే ప్రభుత్వ నిర్ణయాలు కూడా జరగడం సహజం. వ్యాపార సంస్థలు తమకు లాభం చేకూరడం కోసం లేదా తమ అక్రమాలను కప్పిపుచ్చు కోవడం కోసం మాత్రమే విరాళాలు ఇస్తాయనేది సాధారణంగా అందరికీ తెలిసిన నిజం. తమకు వందలకోట్లు ఎన్నికల విరాళంగా ఇచ్చిన వ్యాపార సంస్థకు ఏదోలా లబ్ది చేయడం అధికార పార్టీలకు తప్పనిసరి. కనీసం పదికోట్లు కూడా ఆదాయం లేని కంపెనీలు వందల కోట్లు విరాళాలు ఇవ్వడం, అసలు లావాదేవీలే లేని భోగస్ డొల్ల(షెల్) కంపెనీలు కూడా కోటానుకోట్లు విరాళాలివ్వడం జరిగింది. ఈ విధంగా అధికారం ఉన్నవాడే దోచుకునే విధానం పోవాలంటే, పారదర్శకంగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికల నిధి ఒకటి ఏర్పాటు చేసి, అభ్యర్థుల ఖర్చులకు ఎన్నికలసంఘమే నిధులు కేటాయించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఈ అక్రమ పద్ధతిలో ఎన్నికల బాండ్లను కొన్న కంపెనీల లావాదేవీల వివరాలు, అందుకుగానూ ఆయా కంపెనీలు పొందిన లాభాలని గురించి, లోతైన విచారణ జరగాలి. దొంగే విచారించే వ్యవస్థలో అట్లా నిష్పక్షపాతంగా విచారణజరిగే అవకాశం

లేదనేది ఒక చేదు నిజం. ఇందుకు **చైతన్యవంతమైన ప్రజలు సక్రమంగా ఎన్నికలలో తమ ఓటుహక్కు వినియోగించుకోవడం మినహా మరో మార్గం కనబడడం లేదు.**

ఎన్నికల వ్యవస్థ – ఓటరు చైతన్యం

ఎన్నికల వ్యవస్థలో సవరించు కోవాల్సిన ఎన్నో లోపాలున్నాయి. స్వాతంత్ర్య పోరాటపు సంస్కరణల భావాలున్న వారు తొలినాళ్ళలో ఒకరూ అరా రాజకీయాల్లోకి వచ్చినా, ఎన్నికలలో పోటీ చేయడానికి కావలసిన ధనం, ప్రాబల్యం ఉన్నవారికే అవకాశాలుండే ఈ పద్ధతి వలన, వ్యవస్థలో యధాతథ స్థితిని నిలబెట్టే సాంప్రదాయిక ధనస్వాములకే ఎన్నికలలో నిలబడే వీలు కలిగింది. అందుకే స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటీషు వారికి తొత్తులుగా ఉన్నవారు, భూస్వాములుగా, ప్రజాకంటకులుగా, పీడకులుగా ఉన్నవారు, అధికార మార్పిడి అయిన తక్షణం ఖద్దరు చొక్కా ధరించి, తెల్లటోపీ పెట్టుకుని కాంగ్రెసు తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా ఎక్కువగా గుండాలు, రౌడీలు, బందిపోట్లపై ఆధారపడి, ప్రజాపక్షంగా నిలబడే పార్టీలు, వ్యక్తులూ గెలవకుండా చేసారు. రిగ్గింగులు, పోలింగు బూత్‌ల ఆక్రమణ, ఓటు వేయరనుకున్న బడుగు బలహీనవర్గాల జనాల్ని భయపెట్టో, ప్రలోభాలకు గురిచేసో, లారీల్లో దూరప్రాంతాలకు తరలించడం వంటి కార్యక్రమాలు చాలా మామూలు విషయాలుగా ఉండేవి. కొన్నిసార్లు ఎన్నికలు జరుగుతుంటే, మారణాయుధాలు, తుపాకులు ధరించిన అధికారవర్గాల హంగుదార్లు (చంబల్ లోయ వంటిచోట్ల బందిపోట్లు, లేకపోతే, కిరాయి గుండాలో, ఫ్యాక్షనిష్టు మూకలో) ఊరిలో తిరుగుతూ, “ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే ఎవరూ ఇళ్ళలోనుంచీ బయటకు రావద్దు” అని ప్రచారం చేసేవాళ్ళు. అనంతరం వ్యాపార, పారిశ్రామిక శక్తులు ఈ గుండాలనే ప్రోత్సహించ డంతో నేరుగా వాళ్ళే రాజకీయ నాయకులుగా మారిన పరిస్థితులు తయారయ్యాయి.

ప్రభుత్వ తాయిలాలు

మరికొంత కాలం గడిచేప్పటికీ, కార్పోరేట్ శక్తులు రాజకీయాలను శాసించే పరిస్థితులు వచ్చాయి. భాషలోకి కొత్తగా క్రోనీ కేపిటలిజం అనే పదం చేరింది. రాజకీయాల్లో ఉన్నవాళ్ళు ప్రతీ స్థాయిలోనూ వ్యాపార పెట్టుబడిదార్లకు కోటానుకోట్లు దక్కే విధంగా విధానపర నిర్ణయాలు తీసుకోవడం, ఈ చర్యలవల్ల కునారిల్లే ప్రజలను

నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా అణచివేస్తూ, చట్టబద్ధంగా అవినీతిని ప్రోత్సహిస్తు న్నారు. ఇక్కడి రాజకీయులు ఈ చట్టబద్ధమైన అవినీతికి రెండింతలుగా చట్టవ్యతిరేకమైన అవినీతికి కొమ్ముగాస్తూ, వందల వేలకోట్లు వెనకేసుకుంటూ, రాజకీయాన్ని ఒక వ్యాపారంగా మార్చివేశారు. గతంలో ఎన్నికల సమయంలో మాత్రమే, అదీ స్వంత సొమ్మును ఖర్చుపెట్టి, ఓటర్లకు డబ్బు కానీ, వస్తువులు కానీ పంపిణీ చేసేవాళ్ళు. కానీ ఒక శతాబ్దం పైగా ఈ పద్ధతి మార్చి, ప్రభుత్వ సొమ్మునే వివిధ పథకాల రూపంలో ప్రజలకు స్వంత సొమ్ము ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటూ అందజేస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లోకే నేరుగా సొమ్ము పథకాలు కూడా ప్రవేశ పెట్టారు. ఇవన్నీ తమ సొంత జేబుల్లోంచీ ఇస్తున్నట్లుగా, తమ సొమ్ము తిన్నందుకు తప్పనిసరిగా తమకే ఓటు వేయాలనే కృతజ్ఞతా భావాన్ని ప్రజల మెదళ్ళలో పాతుకుపోయేట్లు చేయడంలో చాలావరకు విజయం సాధించారు. వర్తమానంలో ఏకపక్షంగా చట్టాలు చేయడం జరుగు తోంది. ముఖ్యంగా చట్టాలు చేసేటప్పుడు గరిష్ఠ అనుమతితో చేసిన చట్టాలకు విలువ ఉంటుంది. చట్టసభల్లో ఉన్న కొద్దిపాటి ఆధిక్యతతో ఒక చట్టం చేయడం, మరోపార్టీ అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేయడం జరగ కూడదనుకుంటే, చట్టాలు రూపొందించేప్పుడు ప్రజల్లో చర్చకు పెట్టడం, ప్రతిపక్ష నాయకులతో చర్చించి ఏకాభిప్రాయానికి రావడం జరిగేట్లయితే ప్రజాస్వామ్యం బలోపేతమౌతుంది

ఈ విషయాల్లో ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన ప్రచార, ప్రసార



మాధ్యమాలు ప్రకటనలు, డబ్బుకు వార్తలు (పెయిడ్ న్యూస్) కోసం అమ్ముడయ్యే పరిస్థితులున్నాయి. గతంలో పత్రికలు ముద్రించి అమ్ముకునే పద్ధతి నుంచి ప్రస్తుతం అమ్ముకున్న తర్వాత ముద్రించే పద్ధతి తయారైంది. ఈ పరిస్థితుల్లో ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు, చిన్న పత్రికలు, స్వతంత్ర పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యప్రియులైన మేధావులు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి తమ గళాన్ని వినిపించడం మరింత విస్తృతం కావాలి.

10

ప్రజాస్వామ్యం - న్యాయవ్యవస్థ

ప్రజాస్వామ్యంలో న్యాయ భావన చాలా కీలకమైంది. 'న్యాయం' అనే పదానికి చాలా విస్తృతమైన అర్థం ఉంది. న్యాయ ప్రక్రియలో రాజ్యం కీలక పాత్ర వహిస్తుంది. ఆధునిక కాలంలో ఏ దేశంలోనైనా రాజ్యవ్యవస్థ బూర్జువా వ్యవహారాల నిర్వర్తనకు సంబంధించిన ఒక కార్యనిర్వాహక వ్యవస్థగా మాత్రమే పనిచేస్తోంది. ముఖ్యంగా వివిధ రకాల ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమున్న ఈ వ్యవస్థల్లో న్యాయానికి పక్షపాత ధోరణి కనబడుతోంది.

ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాలు పరస్పరం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. వీటిమధ్య తీవ్రమైన అంతరాలు న్యాయాన్ని అమలు జరపడంలో అడ్డుపడు తున్నాయి. మానవ హక్కులు, చట్ట సమానత్వం వంటి ప్రధాన ప్రజాస్వామిక అంశాల అమలుకు కూడా ప్రతిబంధకంగా మారాయి. వనరులు, సంపద, అవకాశాలు సమానంగా ప్రజలందరికీ అందాలనే ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాన్ని అవహేళన చేస్తూ నానాటికీ అసమ సమాజం వికృతంగా విస్తరిస్తున్నది.

ఆర్థిక ప్రజాస్వామ్యం అంటే అందరికీ తమతమ అర్హతలు, సామర్థ్యాన్ని బట్టి పని కల్పించడం, వారి పనికి తగిన ప్రతిఫలం అందించడం, ప్రతి ఒక్కరికీ, వారికి కావలసిన అవసరాల మేరకు వనరులు సమకూర్చడంగా చెప్పుకోవచ్చు. ఈ ప్రకారం మనుషులందరూ జీవనోపాధి పొందడానికి, స్త్రీ పురుష వివక్ష లేకుండా, సమాన పనికి సరైన సమాన వేతనం పొందడానికి హక్కు వుంది. ఈ వేతనం వారి



అన్ని ప్రాథమిక సాధారణ అవసరాలనూ తీర్చేట్టు ఉండడమే కాకుండా క్రమానుగత పెరుగుదల చూపేదిలా కూడా ఉండాలి. వృద్ధాప్యం, అనారోగ్యం, అసహాయ స్థితుల్లో ఉన్నవారి బాధ్యత పూర్తిగా, ఖచ్చితంగా రాజ్యం వహించాలి.

ఆర్థిక ప్రజాస్వామ్యం

రాజకీయ ప్రజాస్వామ్యం అంటే అందరికీ సమాన రాజకీయ హక్కులు, అవకాశాలతోబాటు పాలనా వ్యవహారాలలో భాగస్వామ్యం పొందేదిగా ఉండాలి. మతం, కులం, వర్ణం, ప్రాంతం, ఆడామగా తేడా, ఆర్థిక సామాజిక హెూదా వంటి వాటితో సహా ఏ రకమైన వివక్షా లేకుండా జనసామాన్యానికి అందరికీ ఇవి అందాలి. డా॥ అంబేద్కర్ చెప్పినట్లు ఆర్థిక ప్రజాస్వామ్యం లేని రాజకీయ ప్రజాస్వామ్యం ఉన్నా లేనట్టుగానే చెప్పుకోవాలి. ఆర్థిక అంతరాలు రాజ్యాంగంలోని ఉన్నత భావనల అమలుకు అడ్డంకిగా ఉన్నాయి. న్యాయానికి సంబంధించి, అత్యంత ప్రాముఖ్యత ఉన్న భావనల్లో సామాజిక న్యాయం కూడా ఒకటి. మనుషులందరి వ్యక్తిత్వాన్ని, వ్యక్తి మానవ గౌరవాన్ని కాపాడి అన్ని రకాల వివక్షలకూ సమాజాన్ని దూరంగా ఉంచి, ప్రతి వ్యక్తికీ ఈ అవకాశాల్ని, వనరులనీ సమానంగా అందుబాటు లోకి తెచ్చేందుకు కృషి చేయడం ఈ భావన ప్రధాన అంశం. వర్గ, కుల వ్యవస్థకు కొమ్ముకాస్తున్న రాజ్యాంగ వ్యవస్థ, పాలనలో ఉన్న పార్టీస్వామ్యాలు, వ్యక్తి ఆత్మాభిమానానికి ప్రతిబంధకంగా మారి, ఈ సమానత్వ భావనలు, హక్కుల్ని నీరుగారుస్తున్నాయి.

భారతదేశానికి సంబంధించి బ్రిటీషు చట్టాలు అనువర్తింప జేయటం, ప్రత్యేక నేరన్యాయ చట్టాలని అమలులోకి తెచ్చేకాలం వరకూ కులాధిక్య చట్టాలే అమలులో ఉండేవి. విచారణా పద్ధతుల్లోనూ, శిక్షా పరిమాణంలోనూ తీవ్రమైన వివక్ష కొనసాగేది. ఇది ముఖ్యంగా ఆర్య బ్రాహ్మణ పక్షపాతిగా ఉండేది. అయితే ఆంగ్ల పాలకులు ఇక్కడి పౌరచట్టాల జోలికి పోకుండా నేర చట్టాల వరకే పరిమితమయ్యారు. వివాహం, విడాకులు, ఆస్తి పంపకాలు, దత్తత వంటి అంశాలలో, మితాక్షర, దయాభాగ వంటివి ఉండేవి. ఇవి వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉండేవి. ఈ పౌర చట్టాలన్నీ పాత విధంగానే చాలాకాలం కొనసాగాయి. వ్యక్తిగత ఆచార వ్యవహారాలలో జోక్యం చేసుకుంటే తీవ్ర జనాగ్రహానికి గురి కావలసి వస్తుందనే భయంతో వీటిని మార్చేందుకు వారు జంకారు. నేర చట్టాలకు సంబంధించి మాత్రం, ఏ మినహాయింపులూ లేకుండా ఒకే నేరానికి ఎవరికైనా ఒకేరకం శిక్ష అమలులోకి రావడం గొప్పమార్పుగా చెప్పుకోవచ్చు. వర్తమాన పాలకులు ఉమ్మడి పౌరస్మృతి పేరిట, మనుస్మృతిని భిన్న సంస్కృతి, మతాచారాలను పాటించే భాషాజాతుల వారందరిపై రుద్దడం జరుగుతోంది.

భారత రాజ్యాంగం అమలు ఇక్కడ ప్రజాస్వామిక ఆకాంక్షలను రేకెత్తించడంలోను, చట్ట సమత్వం, మానవ హక్కులకు సంబంధించిన అంశాలతోబాటు, న్యాయపరమైన చట్టాల విషయంలోనూ గుణాత్మక పరిణామానికి పునాది వేసింది. ఇంకా కొన్ని ఆధునిక పాశ్చాత్య దేశాలకంటే ముందుగా ఓటు హక్కు విషయంలోనూ, ప్రాథమిక హక్కులకు, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు సంబంధించి, ఎంతో అభ్యుదయంగా రూపొందింది. వాస్తవానికి రాజ్యాంగసభ ప్రజలతో కాకపోయినా, అందరూ ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధు లతో కూడింది కాదు. మొత్తం సభ్యులు 389, కాగా వారిలో 93 మంది రాజరిక ప్రతినిధులు. 292 మంది ప్రాంతీయ ప్రతినిధులు, ముస్లిం, సిక్కు ప్రతినిధులతో సహా ఉన్నారు. ఈ ప్రాంతీయ ప్రతినిధులు కూడా సార్వజనిక ఓటుహక్కు ద్వారా ఎన్నికైనవారు కారు. వారిలో, భారత రాజ్యాంగాన్ని పాకిస్తాన్ మాదిరి మతరాజ్యంగా చేయాలన్న వారితోసహా అనేకమంది ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో లౌకిక ప్రజాస్వామ్య భావాలున్న జవహర్‌లాల్ నెహ్రూ దీన్ని ప్రజాస్వామికంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నాడు. అందువల్లనే కాంగ్రెస్ పార్టీ వ్యక్తి కాకపోయినా, ఆ కాలానికి అసమాన మేధావి, పీడితజన పక్షపాతి, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ను రాజ్యాంగ రచనా కమిటీ ఛైర్మన్‌గా నియమించి, సమానత్వానికి దారితీసే అవకాశంవున్న లౌకిక రాజ్యాంగానికై పాటుపడి, ఇన్ని దశాబ్దాల స్థిరత్వానికి పునాదులు వేశాడు. రాజ్యాంగ చట్టంలో ఉన్న ప్రజాస్వామిక భావనలు అంబేద్కర్ సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు.


రాజ్యాంగ విమర్శ – అంబేద్కర్ విమర్శ

ఈ వేళ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను గుడ్డిగా అనుసరించే చాలామంది, రాజ్యాంగాన్ని విమర్శించడం అంటే అంబేద్కర్‌ను విమర్శించడంగా తప్పుగా అర్థం చేసుకుంటు న్నారు. ఇది చాలా తప్పుడు ఆలోచన. అంబేద్కర్ తన దృక్పథానికి అనుగుణంగా, పీడిత జన విముక్తికి, స్త్రీల అభ్యుదయానికి, సామ్యవాద స్థాపనకు ఉద్దేశించి చేసిన అనేక ప్రతిపాదనలు ఆమోదం పొందకుండా వీగిపోయాయి. రాజ్య సామ్యవాదం (స్టేట్ సోషలిజం) పేరిట మొత్తం భూములతో సహా ఉత్పత్తి సాధనాలన్నీ ప్రజాపరం కావాలనే ప్రతిపాదనతో సహా అనేకం వీగిపోగా, కొన్నిటిని మాత్రం రాజ్యానికి తాను చేయాల్సిన పనులుగా సూచించే ఆదేశిక సూత్రాలుగా, అమలు చేయించుకునే శక్తిలేని రూపంలో మిగిలిపోయాయి. ఐతే, ప్రాథమిక హక్కులు, స్త్రీపురుష సమానత్వానికి

సంబంధించిన అంశాలు, రిజర్వేషన్ లతో సహా రాజ్యాంగంలో పొందుపరిచిన అనేక సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన ప్రజాస్వామిక అంశాలు మాత్రం అంబేద్కర్ సాధించినవిగానే చెప్పుకోవచ్చు. తన అసాధారణ మేధో పటిమతోనే కాక, అనర్గళ వాదనతో రాజ్యాంగంలో ప్రజాపక్ష అంశాలు చాలావరకూ చేర్చడం తన వల్లనే సాధ్యమైంది. రాజ్యాంగం ప్రధాన చోదకశక్తిగా ఉండే న్యాయవ్యవస్థకు మూడు ప్రధాన ఆధారాలున్నాయి. ఉమ్మడి న్యాయ చట్టాలు, మతపర న్యాయ చట్టాలు, పౌరస్మృతి అనేవి. న్యాయస్థానాలను స్వతంత్ర ప్రతిపత్తితో, రాజకీయ అధికారానికి లోబడకుండా పనిచేసే రీతిలో రాజ్యాంగంలో పొందుపరిచారు. న్యాయవ్యవస్థే కాకుండా స్వతంత్ర ఎన్నికల కమిషన్, స్వతంత్ర లెక్కల తనిఖీ వ్యవస్థ, సర్వీస్ కమిషన్, మానవ హక్కుల కమిషన్, సమాచార కమిషన్ వంటి అనేక సంస్థలకు రాజ్యాంగంలో చోటు కల్పించారు. ఈ సంస్థల ఆశయాలు ఎట్లా ఉన్నా, ఆచరణలో తమ అడుగులకు మడుగులొత్తే వారినే నియమించుకోవడం ద్వారా అనేక స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థల పనితీరు ప్రజా కంటకంగా తయారైనట్లు కనబడుతోంది.

అధికార విభజన

న్యాయ వ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు వేరువేరుగా స్వతంత్రంగా ఉంటేనే ప్రజల ప్రజాస్వామిక హక్కుల అమలు, న్యాయమూ సక్రమ అమలుకు నోచుకుంటాయనేది 18వ శతాబ్దిలో ప్రాచుర్యం పొందింది. మాంటెస్క్యూ అనే ఫ్రెంచ్ రాజకీయ తత్వవేత్త, 1748లో ముద్రితమైన 'ది స్పిరిటాఫ్ లాస్' అనే గ్రంథంలో ఈ భావనను తొలిసారిగా విశదీకరించాడు. అతి ముఖ్యమైన ఈ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేస్తూనే, తప్పులు జరగకుండా, ఒకదానిపై ఒకటి నియంత్రణ నెరపుతూ ఉండాలనేది ఈ సిద్ధాంతం ముఖ్య సూత్రం. ఈ విధమైన విభజన అమెరికా



రాజ్యాంగంలో వుంది గానీ, భారత రాజ్యాంగంలో లేదు. అక్కడ ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పదవి పొందిన అధ్యక్షుడు ప్రధాన కార్య నిర్వాహకునిగా ఉండగా, శాసనసభ వేరుగా పని చేస్తుంది. భారతదేశం బ్రిటీషు నమూనా ప్రజాస్వామ్యాన్ని స్వీకరించింది కాబట్టి ఇక్కడ దేశాధ్యక్షత వహించే వ్యక్తి పాత్ర చాలాపరిమితంగా ఉంటుంది. శాసన సభ్యత్వమున్న వ్యక్తిగా శాసనాలు చేయడంలో కీలక పాత్ర వహించే వ్యక్తి, తన శాఖకు మంత్రిగా ప్రధాన కార్యనిర్వాహకునిగా కూడా రెండు పాత్రలు పోషించడం జరుగుతోంది. అందువల్ల మిగతా స్వతంత్ర వ్యవస్థలపై, ముఖ్యంగా న్యాయవ్యవస్థపై ఉండాల్సిన శాసన, కార్యనిర్వాహక నియంత్రణాధికారాలు రెండూ ఒకేచోటఉండడం భారతదేశ న్యాయవ్యవస్థ స్వతంత్రప్రతిపత్తికి విఘాతంగా తయారయిందని చెప్పుకోవచ్చు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల ఎంపిక విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అసాధారణ అధికారాలు నెరపుతోంది. అందువల్ల న్యాయమూర్తులు ప్రభుత్వ విధేయులుగా మసులుకొనే పరిస్థితులున్నాయి.


భారతదేశంలో సర్వోన్నత న్యాయ స్థానం, రాష్ట్రకోర్టు, జిల్లా న్యాయస్థానాలు, మేజిస్ట్రేట్ కోర్టులు, వివిధ ప్రత్యేక, పరిపాలనా న్యాయస్థానాలు... ఇట్లా వివిధ భాగాలుగా వివిధ స్థాయిలలో పనిచేస్తున్నాయి. ప్రతి కిందిస్థాయి న్యాయస్థానానికీ అధికార పరిధులు నిర్ణీతంగా ఉన్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టులకు రాజ్యాంగ సమీక్షాధికారం, రాజ్యాంగ పరిహారపు హక్కులపై విచారణాధికార పరిధి ఉంది. పార్లమెంటు, శాసనసభ లేదా ఒక రాజ్యాంగ సంస్థ చేసిన చట్టాలు లేదా చర్యలు, రాజ్యాంగానికి అనుకూలంగా ఉన్నదీ లేనిదీ సమీక్షించి, ఒకవేళ అవి రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నట్లు భావిస్తే వాటిని రద్దు చేయడం జరుగుతుంది. భారతదేశంలో అనేకసార్లు రాజకీయ అధికారానికి తలవొగ్గిన న్యాయస్థానపు తీర్పులు అనేకం కనిపించినా, కొన్ని ముఖ్యమైన అంశాలలో భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ఔన్నత్యాన్నీ కాపాడడంలో ఇక్కడి న్యాయస్థానాలు సమర్థవంతమైన పాత్ర పోషించాయి.

రాజ్యాంగ మౌలికచట్రం

ఇందిరాగాంధీ ప్రభుత్వం సామాజిక ఆర్థిక న్యాయం జరపడం కోసం అంటూ, ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా తొలగించే హక్కు కల్పించుకుంటూ రాజ్యాంగ సవరణ చేసింది. ఈ విషయమై **పంజాబ్‌కు <u>చెందిన గోలక్‌నాథ్ వేసిన కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఒక చారిత్రాత్మక తీర్పు</u>**

ఇచ్చింది. ఈ కేసులో ఇచ్చిన తీర్పులో, రాజ్యాంగంలో ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసివేయడానికి లేదా తొలగించడానికి పార్లమెంటుకు హక్కు లేదని చెప్పింది. అదేవిధంగా కేరళకు సంబంధించిన మఠాధిపతి కేశవానంద భారతికి చెందిన వ్యాజ్యంలో రాజ్యాంగాన్ని సమీక్షించే అధికారం న్యాయస్థానానిదేనని ధర్మాసనం స్పష్టపరిచింది. రాజ్యాంగాన్ని సవరించడానికి పార్లమెంటుకు ఉన్న హక్కును అంగీకరిస్తూ, రాజ్యాంగానికి ఆత్మవంటి ప్రవేశికతో సహా ప్రాథమిక హక్కులు, సమాఖ్య స్ఫూర్తి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వంటి ముఖ్య అంశాలను మార్చడానికి వీలు లేదని చెప్పింది. ఈ తీర్పులు భారతదేశ రాజ్యాంగపు ఔన్నత్యాన్ని, స్థిరత్వాన్ని నిలబెట్టాయి. దాంతోబాటు అనేకసార్లు నిష్క్రియాపరత్వం ప్రదర్శించడం ద్వారా, ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక చట్టాలని సమర్ధించడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తికి గండికొట్టిన సందర్భాలూ కొల్లగా ఉన్నాయి.

బిజేపి ప్రభుత్వం రాజ్యాంగానికి ఆత్మ వంటి ప్రవేశికతో సహా ప్రాథమిక హక్కులు, సమాఖ్య స్ఫూర్తి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన వంటి అంశాలన్నిటినీ చాపకింద నీరులా దురాక్రమణ చేస్తున్నా, అదేమని అడిగే సాహసం చేయలేక పోతున్నారు. ప్రశ్నించేందుకు గొంతెత్తిన ప్రతివారిపై ఏ మాత్రం జంకు లేకుండా సిబిఐ, ఇడి దాడులు, దేశద్రోహం వంటి నల్లచట్టాలు ప్రయోగించి, ఎమర్జెన్సీ కాలమే నయమనే స్థితికి తెచ్చారు. రాజకీయంగా భిన్న అభిప్రాయాలున్న వారిపై, కనీసం బెయిలుకు కూడా దరఖాస్తు చేసుకోడానికి అవకాశం లేని మీసా, నాసా, ఎస్మా వంటి చట్టాల్ని, ఇవేవీ కాకపోతే దేశద్రోహ చట్టాన్ని విచ్చలవిడిగా ప్రయోగిస్తుంటే, రాజ్యాంగ పరిరక్షణకు బాధ్యత వహించి, న్యాయాన్ని కాపాడాల్సిన న్యాయస్థానాలు మిన్న కుండడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా భావించాల్సివుంది. సరైన తిండీబట్టా కూడా లేకుండా, కనీసం కాళ్ళకు చెప్పులుకూడా లేకుండా తిరిగే వాళ్ళపై కేవలం అధికార



పార్టీని విమర్శించి నందుకు, 'చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్ర' పన్నినట్లు అభియోగం మోపి, దేశద్రోహ నేరం మోపి, ఆ చట్టం కింద నిర్బంధించడం వంటి సంఘటనలు మన కళ్ళముందు కనబడుతున్నాయి. ఆదివాసీలకు సేవ చేసే స్టాన్‌స్వామిని జైల్లో హింసించి మరణానికి కారణమైన సంగతి చూశాం. దేశద్రోహ చట్టంకింద అరెస్టు చేసిన వరవరరావు, ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, కుర్చీకి పరిమితమైన శారీరక వికలాంగుడు సాయిబాబా విషయంలోనూ ఇదే జరిగింది. ఇప్పుడతణ్ణి నిర్దోషిగా విడుదల చేసినా, ఆ వికలాంగునిపై జరిగిన ఇన్నాళ్ళ హింసకు న్యాయస్థానాలే జవాబుదారీ వహించాల్సి వుంటుంది.



విమర్శ – ప్రజాస్వామ్యం

విమర్శ ప్రజాస్వామ్యానికి ప్రాణం వంటిది. వ్యక్తులు, సంస్థలు, రాజకీయ పక్షాలు విమర్శను స్వీకరించి, తన లోపాల్ని సవరించుకోడానికి, మరింత ప్రజాస్వామ్యయుతంగా తీర్చి దిద్దుకోడానికీ దోహదపడాలి. నియంతృత్వంలో విమర్శకు తావులేదు. నియంతృత్వం మాత్రమే విమర్శను సహించలేదు. స్వేచ్ఛగా తన భావాల్ని వ్యక్తపరిచే అవకాశం లేనిచోట ప్రజాస్వామ్యం లేనట్లుగానే భావించాలి. బిజెపి పాలనలోని గడిచిన పదేళ్ళలో తీవ్ర జాతీయవాదం పేరిట, మతం పేరిట, వాక్ స్వాతంత్ర్యాన్ని నిరాకరిస్తూ, ప్రశ్నించే గొంతుల్ని అణచివేయడం జరిగింది. తమకున్న నిరంకుశ రాజకీయ అధికారాన్ని ఉపయోగించి, వివిధ రాజ్యాంగ సంస్థలు, పార్టీలు, ప్రసార, ప్రచురణ మాధ్యమాలతో సహా ప్రలోభానికి గురిచేసో, బెదిరించో తమకు అనుకూలంగా మార్చుకోవడం జరిగింది. న్యాయవ్యవస్థ కూడా ఇందుకు భిన్నంగా లేదు.

'క్విడ్ ప్రో కో'


న్యాయమూర్తుల్ని ప్రభుత్వం ఎట్లా అనుకూలంగా తిప్పుకొంటున్నది, చెప్పినట్లు వినని వాళ్ళ గతి ఏమౌతోందీ కావాలంటే, బీజెపి అధ్యక్షుడు అమిత్ షా ముద్దాయిగా ఉన్న కేసును విచారించిన స్పెషల్ సిబిఐ జడ్జ్ బి. హెచ్. లోయా మరణంపై వచ్చిన వార్తలు చూస్తే తెలుస్తుంది. అవి న్యాయ మూర్తుల్ని సైతం భయపెట్టేవిగా ఉన్నాయి. న్యాయమూర్తుల్ని ప్రలోభాలతో కొనేసి తమకు అనుకూలంగా మార్చుకునే సంఘటనలు

అనేకం తెలియవస్తున్నాయి. ఇదొకరకమైన 'క్విడ్ ప్రో కో' గా కొనసాగుతోంది. తాము చెప్పినట్లుగా, తమకు అనుకూలంగా తీర్పులిచ్చిన న్యాయమూర్తులకు పదవీ విరమణ అనంతరం రాజ్యసభ సభ్యత్వమో, గవర్నర్ పదవో, మరో రాజ్యాంగబద్ధ పీఠమో అప్పగించడం జరుగుతోంది. ఇవి ఇచ్చిపుచ్చుకునే అవినీతిగా ప్రధాన స్రవంతి వార్తా ఛానళ్లలో గానీ, పత్రికల్లో గానీ మనకి కనబడకుండా దాగి ఉంటాయి. *(న్యాయవ్యవస్థలో నాకిది, నీకది అని ఇచ్చిపుచ్చుకునే ధోరణి (క్విడ్ ప్రోకో) ఎంతలా వేళ్ళూనుకుందీ తెలుసుకోవాలంటే 'వీక్షణం' ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ నడిపే 'మహువా మీడియా', తులసి చందు ఛానల్, ధృవ్ రాఠీ వంటి వాళ్ళ తెలుగు యూట్యూబ్ ఛానల్స్‌లో వివరంగా తెలుసుకోవచ్చు.)*

సుప్రీంకోర్టు, హైకోర్ట్‌లలో పనిచేసే న్యాయమూర్తి పదవీకాలం 65 సం॥లు. దేశవ్యాప్తంగా తీసుకుంటే, ఇది సాధారణ ఉద్యోగి పదవీకాలం కంటే దాదాపు ఐదేళ్ళు ఎక్కువ. పదవిలో ఉండగా వారి జీతభత్యాలు పెన్షన్లు పెంచడం తప్ప, వారికి కొద్దిపాటి నష్టం కలిగించేలా కూడా పార్లమెంటు, ప్రభుత్వమూ ఏ చర్యలూ తీసుకోకూడదనేది రాజ్యాంగ నిబంధన. **65 ఏళ్ల వయసు దాకా సకల లాంఛనాలూ అనుభవించి, లక్షల్లో పెన్షన్ వస్తున్నా, అదీ చాలక ఇంకా అధికార పదవుల కోసం వెంపర్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని నిలువుగోతిలో పాతి పెడుతున్నారు. ఈ రకమైన వెంపర్లాట రాజకీయ నాయకుల్లో సహజంగానే చూస్తూ వుంటాం. కానీ, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, చట్ట సమానత్వాన్నీ కాపాడాల్సిన న్యాయమూర్తులే ఇందుకు పాల్పడడం దేశ ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు వంటిది.** ఈ రకమైన తప్పుడు లావాదేవీల్ని కొంతవరకైనా అడ్డుకోవాలంటే, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు, ఒక్క న్యాయ సంబంధమైన సలహాసంఘాల్లో తప్ప వేరే ఏ పదవీ చేపట్టే వీలు లేకుండా నిరోధిస్తూ రాజ్యాంగ సవరణ చట్టం చేయడం అత్యావశ్యకం. దీనిపై ప్రజాస్వామ్యవాదులు, మేధావులూ ఎంత గొంతు చించుకున్నా ప్రయోజనం ఉండడం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఇదే పద్ధతిలో తనకు అనుకూలమైన తీర్పులు పొందాలని చూడడం వల్ల, ఇంత స్పష్టమైన ప్రజాస్వామిక అంశానికి అనుకూలంగా ఏ పార్టీ కూడా తమ గళం వినిపించికపోవడం అధికార రాజకీయ పార్టీల దొంగ బుద్ధికి ఋజువుగా కనబడుతోంది.

మతరాజ్యంవైపుగా...


ఇక బిజేపి మతాన్ని రాజకీయాల కోసం ఉప యోగించుకోవడంలో పాకిస్తాన్ వంటి మతరాజ్యాల్ని కూడా మించిపోయింది. అన్ని సమస్యలకూ దేవుడిని వేడుకోవడం ఒక్కటే పరిష్కారంగా చూపుతూ, తనకే బాధ్యతా లేనట్టు అయోధ్య రామాలయం వంక చూపుతోంది. ఇదే ధోరణికి అనుకూలంగా న్యాయస్థానాలు తమ తీర్పుల్లో ఆర్య బ్రాహ్మణ మతానుకూల ధోరణులను చూపడం బిజేపి పాలనలో మరింత ఎక్కువైంది. అంతర్జాలం ద్వారా అందే సర్వోన్నత న్యాయస్థాన నివేదిక, 'ఇండియా కానూన్' అందించే సమాచారం ప్రకారం– భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటినుంచి 2019 వరకూ ఉన్నత న్యాయస్థానాలు, సర్వోన్నత న్యాయస్థానం తమ తీర్పుల్లో అనేక సార్లు మనుస్మృతిని వల్లెవేయడం, ఉటంకించడం జరిగింది. భారత ఉపఖండంలో తీవ్ర హిందుత్వవాదం పెచ్చరిల్లిన కాలం నుంచి 2019సం॥ల మధ్యనే అత్యధిక భాగం (సుమారు 70శాతం) ఈ విధమైన 38 ఉటంకింపులు జరిగాయి. సర్వోన్నత న్యాయస్థానం తన న్యాయ నిర్ణయాల్ని ప్రకటించే సమయంలో మొత్తం ఏడు సార్లు మనుస్మృతిలోని అంశాల్ని ఉపయోగించుకుంది. బాంబే, మద్రాస్, అలహాబాదు వంటి అధికారిక ఉన్నత న్యాయస్థానాలు అనేక తీర్పులలో మనుస్మృతిని ఉటం కించాయి. సాధారణ న్యాయచట్టం హిందూ కుటుంబం, ఆస్తులకు సంబంధించిన అంశంపై ఏమీ చెప్పకుండా ఉన్న సందర్భంలో, న్యాయస్థానాలు దాని స్థానంలో దయాభాగ లేదా మితాక్షర సూత్రాలను వర్తింప జేయకూడదని లేదా మీమాంస సూత్రాల్ని అనువర్తించడం తగదని మనం వాదించడం లేదు. ఐతే, **చివరకు మితాక్షర లేదా మీమాంస సూత్రాల్ని అనువర్తింప జేయడానికి సైతం మనుస్మృతిని, అందులో ఇచ్చిన ఆదేశాలను, శ్లోకాలనూ వాడడం తక్కువ ప్రమాదకరమైన విషయమేమీ కాదు. ఎందువల్లనంటే, తద్వారా పైకి స్పష్టంగా తెలియకుండానే మనుస్మృతికి న్యాయపరమైన హోదా సిద్ధిస్తుంది.**



అండర్ ట్రయల్స్

ఇక నేరాలకు సంబంధించి నేర విచారణలో ప్రధాన పాత్ర వహించే పోలీసు వ్యవస్థ రాజకీయ అధికారం చేతుల్లో పావులుగా పని

చేయడం, అత్యధిక శాతం మంది, తామేదో సామంతరాజుల్లా ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే మిడిసిపాటుతో అనేక సివిల్ వివాదాల్లో సైతం వేలుపెట్టి అందినకాడికి దండుకొంటున్న వార్తలు అనేకం మనకు కనబడుతున్నాయి. ఇక్కడ మానవహక్కులు, చట్ట సమానత్వం అనే పదాలకు చాలామంది పోలీసు శాఖ వారికి అర్థం కూడా తెలియని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రాజకీయ పలుకుబడి, డబ్బు, కులం ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు వీటి ప్రాతిపదిక పైననే వారికి దొరికే మర్యాద, అమర్యాదలు ఆధారపడి ఉంటాయి. రాజకీయ ప్రయోజనాల కోసం జరిగే ఎన్కౌంటర్‌లలో అతిసామాన్యులే ఎప్పుడూ బలవుతుంటారు. రాజకీయబాసుల ప్రయోజనాల కోసం జరిపే ఈ ఎన్కౌంటర్లలో వీరు పెద్దహీరోలుగా చలామణి అవుతూ, హతులు అసలు నేరస్తులా? కాదా? అనే సరైన విచారణ లేకుండానే వారిని హేయమైన క్రూరులుగా ముద్ర వేస్తున్నారు. న్యాయవ్యవస్థకు సంబంధం లేకుండా తామే నేర నిర్ణయం చేసి, శిక్షలు విధిస్తున్నారు. ప్రసార ప్రచార మాధ్యమాల్లో వీరు చెప్పే కట్టుకథలకు తప్ప నిష్పక్షపాతంగా నిజం తెలుసుకునే ప్రయత్నాలు సక్రమంగా లేకపోవడం వల్ల పోలీసులకు ప్రజల నుంచి కూడా ఊహించని మద్దతు లభిస్తుండడంతో అసహాయులకు న్యాయం అందని పరిస్థితి ఉంది. ఇక డబ్బు, పలుకుబడి ఉన్నవాళ్ళు సత్వరం బెయిలుపై వచ్చే వీలుండగా, న్యాయస్థానాలకు హాజరు పరచని కారణంగా విచారణకు కూడా నోచుకోకుండా



సోర్స్: ఈనాడు దినపత్రిక తేది: 29-8-2024

అనేకమంది అసహాయులు జైళ్ళలో మగ్గిపోతున్నారు. ఈ ముద్దాయిలకు నేరం రుజువైన పక్షంలో నెలో, రెండు నెలలో శిక్ష మాత్రమే పడే అవకాశమున్న చిన్న చిన్న నేరాలకు కూడా ఏళ్ల తరబడి విచారణా ఖైదీలుగా జైళ్ళలో మగ్గేవారి సంఖ్య వేలల్లో లేదా లక్షల్లో ఉండవచ్చని అంచనా. ఒక నేరారోపణపై అదుపులోకి తీసుకున్న వ్యక్తిని ఆ నేరం ఋజువైతే పడే గరిష్ఠ శిక్షాకాలానికి మించి జైల్లో ఉంచ కూడదనే నిబంధన కూడా న్యాయవ్యవస్థ నుంచి అమలు కాకపోవడం న్యాయవ్యవస్థ బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుంది. 'న్యాయం జరగడం ఆలస్యమైతే న్యాయాన్ని నిరాకరించినట్లే' అనే ప్రాథమిక న్యాయసూత్రం కూడా ఉల్లంఘనకు గురవుతున్నట్లు ఇక్కడ మనకు స్పష్టంగా అర్థమౌతోంది. ఇందుకు ప్రధాన కారణం సరిపడా న్యాయాధికారుల్ని నియమించలేక పోవడమేనని కేంద్రమంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నాడు. ఇందుకు న్యాయప్రక్రియలో జరిగే ఆలస్యమే ప్రధాన కారణంగా బయటకు చెబుతున్నా, అది ప్రధాన కారణం కాదని అర్థమౌతోంది.

డబ్బు, అధికారం, పలుకుబడి, న్యాయాన్ని కొనుక్కో గలిగే స్థోమత ఉన్న వారు నేరస్తులుగా ఉన్న కేసుల్లో, ప్రాథమిక విచారణా పరిధి ఉన్న న్యాయస్థానం నుంచి, అప్పీలు మీద అప్పీలుగా వాయిదాల మీద వాయిదాలుగా దశాబ్దాల తరబడి, ఒక్కోసారి వాళ్ళు మరణించే దాకా ఆ కేసులు అట్లానే కొనసాగుతూ ఉంటాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే పార్లమెంటు సభ్యుల్లో సగానికి పైగా నమోదైన ముద్దాయిలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక నమోదు కాకుండా వుండే వారెందరో మనకు తెలియదు. అదే అనామకుల కేసుల్లో విచారణ, శిక్షలు త్వరితంగా జరిగిపోతాయి. ప్రజాస్వామ్య యుతంగా చట్టసమానత్వం ప్రాతిపదికన మానవహక్కులు కాపాడే విధంగా న్యాయం జరగాలంటే న్యాయవ్యవస్థ సంపూర్ణంగా ప్రక్షాళన కావాల్సి ఉంది.




11

మతం - ప్రజాస్వామ్యం

మానవ పరిణామక్రమంలో మానవజాతి గుంపులుగా ఏర్పడి వేటపై ఆధారపడి జీవిస్తున్న దశల్లోనే భిన్నరకాలుగా అతీంద్రియ శక్తులు, మతభావనలకు సంబంధించిన పునాదులు ఏర్పడ్డాయి. మెరుపులు, పిడుగులు, తుఫాన్లు, కార్చిచ్చులు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, భూకంపాలు, కలరా, ప్లేగు, మశూచి వంటి వ్యాధులు, ఉత్పాతాలకు కారణాలు తెలియక భయపడేవారు. వీటికి కారణం మానవాతీత శక్తులని భావించి, వాటిని బలులు, క్రతువుల ద్వారా సంతృప్తిపరిచి, ఆరాధించడంతో మతం పాత్ర మొదలయింది.

వ్యవసాయం, పశుపోషణ మొదలై, మానవ సమూహాలు స్థిర నివాసం ఏర్పరచుకునే క్రమంలో చిన్నచిన్న తండా పాలన మొదలైన నాటినుంచి పౌరోహిత వర్గం ఒకటి ఆవిర్భవించి, ప్రాబల్యం పొందింది. ఈ వర్గం క్రమంగా రాజ్యాలు ఏర్పడే దశతోబాటు పెరుగుతూ, రాజు పాలనను బలపరుస్తూ, ప్రజలను నియంత్రించడానికి ఉపయోగపడింది. ఇందుకై భిన్నప్రాంతాల్లో భిన్నరకాలుగా ఆచారాలు, ఉత్సవాలు, సాంప్రదాయాలు, వంటివి ఏర్పరిచారు. విశ్వాసం, విధేయత, సాగిలబడి మొక్కడం నేర్పి, ఎదురు ప్రశ్నించే తత్వాన్ని తలెత్తకుండా చేశారు. ఈ లోకం ఆశాశ్వితమైందని, పరలోక జీవనమే ముఖ్యమని ప్రచారం చేశారు. ఈ పురోహిత వర్గం సామాజిక ఆధిపత్యంతోపాటు రాజకీయ ఆధిపత్యం కూడా నెరిపింది. ముఖ్యంగా భారత ఉపఖండం బయట ఈ వర్గాలనుంచే యూదు, క్రైస్తవ మతాలతోబాటు వర్తమాన శకం ఆరవ శతాబ్దంలో ఇస్లాం మతం వరకూ వ్యాపించాయి. అయితే ఈ మతాలేవీ జనాలకు మూఢవిశ్వాసాల్ని తప్ప జ్ఞానాన్ని పంచిన దాఖలాలు లేవు. మతాచార్యులు రాజులు కలిసి అధికారం పంచుకున్నారు. రాజుని దైవాంశ సంభూతుడిని చేశారు. ప్రజలకు చదువుకొనేందుకు అవకాశం ఇస్తే, వారిలో ప్రశ్నించేతత్వం పెరిగితే విశ్వాసాలు తగ్గి అధికార వ్యవస్థలకు ఆటంకంగా మారవచ్చని సాధారణ ప్రజలకు చదువును నిషేధించారు. వాస్తవ అంశాలతో పనిలేకుండా అన్నిటికీ దైవమే కారణమని, విశ్వాసులకు, యధాతథ స్థితిని గౌరవించే వారికి



మాత్రమే స్వర్గంలో చోటు ఉంటుందని నమ్మించారు. ఆ కాలంలో పాలనలో మతం ముఖ్యపాత్ర వహించింది.

వివిధ దేశాల రాజకీయ, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థలలో మతం కీలక పాత్ర వహించేది. రాజును దైవాంశ సంభూతునిగా చేశారు. నైతిక నియమావళి, ఆచార సంప్రదాయాల పేరిట, చట్టాల రూపకల్పన, అమలుకు సంబంధించి మతం కీలకపాత్ర వహించేది. దేవాలయాలు, మతపర ప్రదేశాలు, రాజకీయ ఆధిపత్యాన్ని కలిగి ఉండేవి. మతగురువులు, రాజులు కుమ్మక్కై కేవలం విశ్వాసం, విధేయతల మీద ఆధారపడ్డ వ్యవస్థను సృష్టించి, రాజకీయ ఆధిపత్యానికి స్థిరత్వం కలిగేట్లుచేశారు. ప్రపంచ చరిత్రలో మతం రాజ్యాధికారాన్ని కూడా ధిక్కరించి, రాజుల్ని తమ చెప్పుచేతలకింద ఉంచుకున్న సందర్భాలు కూడా కొల్లలుగా ఉన్నాయి. మతమే అలిఖిత రాజ్యాంగంగా చెల్లుబాటయ్యేది. అది మానవుల ఆధ్యాత్మికత తోబాటు నీతిని, సామాజిక విలువలను కూడా నిర్ణయించేది. సమాజ మనుగడకు అవసరమైన వ్యవసాయం ఇతర ఉత్పత్తి, చేతివృత్తులలోనున్న వారందరినీ హీనంగాచూస్తూ, మతాధికారులు, పీఠాధిపతులనే ఉన్నతులుగా చూపడం సర్వత్రా అమలులో ఉండింది.

మతాధారిత రాజ్యాలు

ప్రజాస్వామిక భావనలు వెల్లివిరిసే ఈ 21వ శతాబ్దంలో కూడా భూగోళంపై ఇంకా మతాధారిత రాజ్యాలు అనేకం ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఇస్లాం మతానికి సంబంధించినవే ఎక్కువగా వున్నాయి. సౌదీ అరేబియాదేశం ఇస్లాంలోని వహాబీ సున్నీ పద్ధతుల ప్రకారం పాలన జరుపుతున్నది. న్యాయ వ్యవస్థలో షరియా చట్టాలను కఠినంగా అమలు పరుస్తున్నది. 1979 లో ఇరాన్ చివరి రాజయిన మహమ్మద్ రిజా పహ్లవీ పాలనను తిరుగుబాటు ద్వారా కూలదోసిన మతనాయకుడు ఆయతొల్లాహ్ ఖొమైనీ ఇరాన్‌ను ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మార్చాడు. మతాధిపతే రాజ్యాధిపతిగా బతికి ఉన్నంత కాలం శాశ్వత అధినేతగా కొనసాగాడు. ఈ దేశంలో



న్యాయ, పాలనా వ్యవస్థలన్నీ మత చట్టాల పరిధిలోనే కొనసాగు తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో మధ్యలో అధికారం మారి, ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నా, తిరిగి 2021 నుంచీ తాలిబాన్ సాయుధ ఉగ్ర వాద ముఠా తుపాకుల నీడన, ఇస్లామిక్ చట్టాల పేరిట పాశవికంగా, వారు చెప్పిందే శాసనంగా కఠిన శిక్షలు, స్త్రీలపై అణచివేత అమలవుతున్నాయి. రష్యా, చైనా, పాకిస్తాన్‌లు తమ స్వార్థ ప్రయోజనాలకోసం, అక్కడి ఖనిజ సంపద కొల్లగొట్టడం కోసం, అమెరికాను కాదని తమ ఆధిపత్యం చెల్లుబాటు అవడం కోసం, తాలిబాన్‌లకు మద్దతు ఇవ్వడం వల్లనే ఇట్లా జరిగిందని చెప్పవచ్చు. మాల్దీవులు, మౌరిటేనియా, యెమెన్, సోమాలియా, పాకిస్తాన్‌లు ఇస్లామిక్ రిపబ్లిక్‌లుగా కొనసాగు తున్నాయి. అంత కఠినంగా కాకపోయినా మలేషియా, బంగ్లాదేశ్ వంటిచోట్ల కూడా షరియత్ ఆధారిత పాలన కొనసాగుతోంది. మయాన్మార్, భూటాన్ దేశాలు ప్రాథమికంగా లౌకిక రాజ్యాలైనా, ఇక్కడి పాలన, న్యాయ వ్యవస్థలపై బౌద్ధం గణనీయమైన ప్రభావం కలిగి ఉంది. ఇజ్రాయెల్ దేశంలో యూదుమతం ప్రభుత్వ విధానాలు, న్యాయ పాలనా వ్యవస్థలకు ఆధారంగా ఉంది. కేథలిక్ చర్చి సార్వభౌమరాజ్యమైన వాటికన్ సిటీకి పోప్ అధిపతిగా ఉన్నాడు. నేపాల్ 2007 వరకూ ప్రపంచంలోని ఏకైక హిందూమత రాజ్యంగా కొనసాగింది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమున్న మిగతా పెట్టుబడిదారీ దేశాలు సైతం లౌకిక రాజ్యాలుగా చెప్పుకుంటున్నా, పరోక్షంగానైనా ఎంతోకొంత మత ప్రభావం లేకపోలేదు.

ఇక నాస్తికులు, హేతువాదుల విషయాన్ని గురించి కూడా తెలుసుకుందాం. 'గేలప్ ఇంటర్నేషనల్' అనే లండన్ కు చెందిన సంస్థ 2023 సంవత్సరంలో నిర్వహించి, విడుదల చేసిన ఫలితాల ప్రకారం, దేవుడిని నమ్మని దేశాలలో స్వీడన్ మొదటి స్థానంలో ఉంది. చైనాలో 91% మంది, జపాన్‌లో 86% మంది, చెక్ రిపబ్లిక్ లో 75% మంది, బ్రిటన్, బెల్జియం, ఎస్టోనియా దేశాలలో 72% మంది, నార్వేలో 70% మంది, ఆస్ట్రేలియాలో 69% మంది ఏ మతాన్ని అనుసరించని వాళ్ళున్నారు. ఈ దేశాల పాలనా రంగంలో ఎన్ని లోటుపాట్లున్నా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో

పాలనా నిర్వహణ, న్యాయ పాలనలో మతరాహిత్య అంశాల్ని అనుసరించక తప్పదు. ఇదే సర్వే ప్రకారం భారత దేశంలో 18% మంది దేవుడిని నమ్మడం లేదు. అంటే రెండు కోట్లకు పైగా జనాభా ఉందని చెప్పుకోవచ్చు.

భారత ఉపఖండం

భారత ఉపఖంధంలో మతం భిన్న పరిస్థితుల్లో పరిణామం చెందడాన్ని గమనించవచ్చు. చరిత్రకారుల అంచనాల ప్రకారం, వర్తమాన శకానికి ఐదున్నర శతాబ్దాల క్రితం ఈ గడ్డపై గౌతమ బుద్ధుడు ప్రపంచానికి గొప్ప తాత్విక చింతనను అందించాడు. అతీతశక్తుల్ని తృప్తిపరచడానికి చేసే తతంగాలు, జంతుబలుల్ని వ్యతిరేకించాడు. దైవభావనను గురించి, దేవుడిని పూజించడాన్ని గురించి చెప్పలేదు. తన బోధనలలో ఇహలోక జీవితం, సామాజిక అంశాలకే ప్రాధాన్యత ఇచ్చాడు. మౌర్య సామ్రాజ్యం వంటి బలమైన సామ్రాజ్యాన్ని జయించిన అశోక చక్రవర్తి కళింగ యుద్ధం తర్వాత బౌద్ధమతం స్వీకరించి, రాజ్య అధికారిక మతంగా చేశాడు. బౌద్ధాన్ని ఉపఖండపు ఎల్లలు దాటించి, దేశ విదేశాలకు విస్తరింపజేశాడు. అయితే అసలు బౌద్ధాన్ని హీనయానంగా కించపరిచి, మహాయానం పేరిట బౌద్ధంలోకి ఆర్య సంస్కృతిని చొప్పించారు. స్థానిక సింధులోయ నాగరికత పతనం తర్వాత సంచార జీవులైన ఆర్యులు ఇరాన్ ప్రాంతం నుంచి భారత ఉప ఖండానికి వలస వచ్చి వైదికమతాన్ని స్థాపించారు. వారు బౌద్ధమతాన్ని తమ వైదిక మతంలో కలుపుకోడానికి విఫల ప్రయత్నం చేశారు. అహింసను అసలు ఆచరించేది తామే అన్నట్లు వైదిక వర్గం మాంసాహారం మాని శాకాహారానికి పట్టం కట్టారు. అనంతరం భారత ఉప ఖంధంలోని ఉత్తర ప్రాంతంలో ఆధిపత్యం సంపాదించారు. క్రమంగా బౌద్ధాన్ని ఈ దేశపు ఎల్లలు దాటించారు. వందల సంవత్సరాల కాలగమనంలో చెప్పుకోదగిన స్థాయిలో దక్షిణ భాగానికి కూడా విస్తరించారు. ఆర్యుల ఆధిపత్యాన్ని స్థిరపరుచుకోవడంలో భాగంగా వారి భాష, సంస్కృతుల్ని మిగతా ప్రాతాలపై రుద్దారు. క్రమంగా ఇక్కడి అమ్మతల్లులు, శివుడు వంటి స్థానిక దేవతల్ని తమ ఆర్యమతంలో భాగంగా కలుపుకున్నారు.

వర్తమాన శకం పదమూడో శతాబ్దం ప్రారంభంలో మొదలైన ఢిల్లీ సుల్తాన్ల పాలన ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మొదలై అనంతర ఉపఖంధంలోని భిన్న ప్రాంతాల్లో

విస్తరించింది. వీరంతా ఇస్లాం మత ధర్మాల ప్రకారమే పాలన సాగించినా, స్థానిక మతాచారాలు, సంస్కృతి కూడా ఉనికిలో ఉండేవి. కొందరు రాజులు హిందూ దేవాలయాలపై దాడిచేసి ధ్వంసం చేయడం, మసీదులు, ఇస్లాం బోధించే విద్యాసంస్థలను పోషించి, ముస్లిమేతరులపై జిజియా, ఖరాజ్ వంటి పన్నులు విధించారు. అక్కడక్కడా స్థానిక పాటింపులు, ఆచారాల వంటి వాటిని గౌరవించినా, ప్రధానంగా ఇస్లాం నిర్దేశించిన విధంగానే న్యాయపాలన, చట్టాలు, శిక్షలు ఉండేవి. ఒక పక్క మత విధానాలు అమలవుతున్నా, అధికారం నిలబెట్టుకొనే అవసరాల కనుగుణంగా వాటికి మినహాయింపులు కూడా వుండేవి. ముస్లిం రాజులు పాలకులుగా ఉన్న సమయంలో సామాన్య జనం, వ్యవసాయ వృత్తికులాలవారు తమ మత, సాంస్కృతిక అస్తిత్వాన్ని నిలుపుకోగా, అగ్రకులాలవారు, ముఖ్యంగా బ్రాహ్మణులు, తమ స్వార్థం కోసం ఇస్లాం స్వీకరించినట్లు చరిత్రలో అనేక ఆధారాలు కనబడుతున్నాయి. ఇక రాజులు, రాజపుత్రులైతే, అనేకమంది తమ ప్రాబల్యం నిలుపుకోవడం కోసం ముస్లిం రాజులకు తమ కుమార్తెలనిచ్చి వియ్యమందారు.

పాశ్చాత్యుల పాలన

అనంతర కాలాల్లో ఈ గడ్డపై వ్యాపార ఆధిపత్యానికి జరిగిన పోరులో బ్రిటన్ వాసులు ఆధిపత్యం సంపాదించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. వారు ప్రజల్ని విభజించి పాలించే కుటిల నీతిని బాగా ఉపయోగించుకున్నారు. అవకాశం ఉన్న చోటల్లా ముస్లిం మతస్తులకు ఇతరులతో కలహాలు ఎగేసేవారు. దళితులకు తమ మతంలో చోటు ఇచ్చి, పెద్ద సంఖ్యలో తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అప్పటికీ ఆర్థికంగానే కాక, విద్యారంగంలోకూడా ఏకఛత్రాధిపత్యంగా ఉన్న బ్రాహ్మణులకే ఉద్యోగాల్లోను, ఇతర ప్రాధాన్యత రంగాల్లోనూ పెద్దపీట వేశారు. వారు చేసిన కొన్ని పాలనాపరమైన, విద్యాపరమైన సంస్కరణలు మిగతా కులాలవారి ఆకాంక్షలను పెంచాయి. దాంతో వారు భిన్న ప్రదేశాలలో, భిన్న రూపాలలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు లేవనెత్తారు. మహారాష్ట్రలో జ్యోతీరావు పూలే ఆధ్వర్యంలో 'సత్యశోధక్ సమాజ్', దక్షిణాదిన పెరియార్ ఇ.వి. రామస్వామి స్వాభిమాన ఉద్యమం, వైకోం దేవాలయ ప్రవేశ ఉద్యమం, త్రిపురనేని రామస్వామి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం వంటి ఉద్యమాలు, ఆర్థిక, సామాజిక సమానత్వ ఆకాంక్షలకు ప్రతీకగా మాత్రమే కాకుండా, మతపరమైన ఆధిక్యత, పాలనారంగంలో ఆధిపత్య

ధోరణులకు, ఉత్తరాది ఆర్య బ్రాహ్మణ భాషా, మతాధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా బలంగా ఉద్యమించి, ద్రవిడజాతి భావనను ముందుకు తెచ్చాయి. ఇక్కడి ఆందోళనల ఫలితంగా, ప్రాతినిధ్య ఎన్నికల విధానంలో మార్పు తేవడం, శూద్రకులాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం, మత దురహంకార వివక్షను నిర్మూలించే, సాంఘిక సమానత్వానికి దారితీసే చట్టాలకోసం ఉద్యమించడం వంటి కార్యక్రమంతో జస్టిస్ పార్టీ, ద్రవిడ మున్నేట్ర కజగం వంటి పార్టీలు ఏర్పాటైనాయి. జస్టిస్ పార్టీ ఉనికిలో లేకుండా పోయినా, డిఎంకె పార్టీ అనేక చీలికలు, ఒడిదుడుకులు ఎదుర్కొన్నా, ఇప్పటికీ తమిళనాట పాలనాధికారం కొనసాగిస్తోంది.

బ్రిటీషర్లు తమ ఆధీనంలోని భారత భూభాగాన్ని వదలివెళ్ళే సమయంలో మత ప్రాతిపదికన రెండుగా విభజించారు. రెండు మతాల్లోని మతఛాందసవాదులు, ఉగ్ర వాదుల కారణంగా అల్లర్లు చెలరేగాయి. అనేక గ్రామాలు, పట్టణాలు మంటల్లో కాలిపోయాయి. వేలాదిమంది స్త్రీలు లైంగిక దాడికి గురయారు. అధికారిక లెక్కల ప్రకారమే రెండు లక్షలకు పైగా ప్రజానీకం ఈ అల్లర్లలో హత్యలకు గురయ్యారు. ఇంకెన్నో లక్షలమంది తమ స్థిరచరాస్తులు వదిలి కట్టుబట్టలతో తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌లకు, ఆ ప్రాంతాల నుంచి భారత సమాఖ్యకు మతప్రాతిపదికన వలస పోయారు. విభజనను వ్యతిరేకించి, హిందూముస్లిం భాయ్ భాయ్ అన్న కారణంగా ఇక్కడ అతివాద హిందూసంస్థలు గాంధీని హత్య చేశాయి. ఎన్ని దశాబ్దాలు గడుస్తున్నా, తరాలు మారుతున్నా ఈ ప్రభావం, విద్వేషాలు నేటికీ సమసిపోని స్థితి నెలకొనివుంది.

రాజ్యాంగంలో...

భారత రాజ్యాంగ రచనా సమయంలో కొందరు రాజ్యాంగసభ సభ్యులు భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని వాదించినా, అంబేద్కర్, నెహ్రూలు వ్యతిరేకించి నెగ్గుకువచ్చారు. మతంతో సంబంధం లేని రాజ్యంగా రూపొందించాలని భావించి, అందుకు అనుగుణమైన అంశాల్ని రాజ్యాంగంలో చేర్చారు. అధికరణం–25 ప్రకారం, ప్రతిమనిషికీ తనకు నచ్చిన మతాన్ని అనుసరించడానికి లేదా మతరహిత భావనలు కలిగి ఉండడానికీ స్వేచ్ఛ ఉంది. అధికరణం–26 ప్రకారం ఏమతానికి చెందినవారైనా తమ స్వంత మతపు వ్యవహారాలను ప్రభుత్వజోక్యం లేకుండా తామే నిర్వహించుకోవడానికి, స్వంతగా విద్యాలయాలు నిర్వహించు కోవడానికీ స్వేచ్ఛ ఉ

ంది. అధికరణం–27 ప్రకారం రాజ్యం ఏ మతానికీ కొమ్ముకాయకూడదు. ఏ మతానికి సంబంధించిన కార్యకలాపాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ నిధుల్ని వినియోగించడం నిషేధం. ప్రభుత్వ సహాయం పొందే ఏ విద్యాసంస్థా విద్యార్థులను మతప్రార్థనల్లో పాల్గొనమనడం, వారి మతాచారాల్ని పాటించమనడం నిషేధించారు. అధికరణం–27 ప్రకారం ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును ఏ మత ప్రయోజనాలకోసం వాడకూడదు. ప్రజాప్రాతినిధ్య చట్టం– 1951 ప్రకారం ఎన్నికలలో కులం, భాష వంటి వాటితోబాటు మతాన్ని ఉపయోగించి ఓట్లు అభ్యర్థించడం శిక్షార్హమైన నేరం. ఈ ప్రకారం ఒక మతాన్ని వెనకేసుకొస్తూ మాట్లాడడం విద్వేషాన్ని రెచ్చగొట్టడం కిందికి వస్తుంది. భారత రాజ్యాంగానికి 1976లో జరిగిన సవరణ ప్రకారం రాజ్యాంగ ప్రవేశికలో 'సెక్యులర్' అనే పదాన్ని ప్రత్యేకంగా చేర్చడమైంది. కానీ అంతకుముందే యూనియన్ ప్రభుత్వానికి, ఎస్.ఆర్.బొమ్మైకి జరిగిన వ్యాజ్యంలో, 'భారత రాజ్యాంగంలో **సెక్యులర్** అనే పదం స్పష్టంగా ఇమిడి ఉందని, ప్రభుత్వ వ్యవహారాలలో మతానికి చోటు ఉండ కూడదని, సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పింది. ఇవన్నీ మొదటి నుంచీ ఉల్లంఘనలకు గురవుతూనే ఉన్నాయి. గిరిజనులకు మతంతో సంబంధం లేకుండా రిజర్వేషన్లను వర్తింపజేసి, దళితులకు మాత్రం మతంతో ముడిపెట్టారు. బిజేపి ప్రభుత్వం బాహాటంగా రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది.

హిందూత్వ

పార్లమెంటులో 1984లో కేవలం రెండు స్థానాలు మాత్రమే గెలుపొందిన బిజేపి మతాన్ని ఉపయోగించుకుని క్రమానుగత పెరుగుదల చూపింది. లాల్ కృష్ణ అద్వానీ అయోధ్యలో రామజన్మభూమి అంశాన్ని నెత్తిన వేసుకుని 1990, 1991 సంవత్సరాలలో నిర్వహించిన రథయాత్ర మతపరమైన విద్వేషాలు సృష్టించడమే కాకుండా అత్యధికశాతం ఉన్న స్థానిక ప్రజల మద్దతు కూడగట్టకుంది.



అనంతరం 1992 డిసెంబర్ 6న బాబ్రీమసీదు ధ్వంసం ఘటనలో బిజేపి పార్టీకి మద్దతు ఇచ్చే హిందూమత సంస్థలు పాల్గొనేట్లు చేయడంలో సఫలీకృతమైంది. ఈ సంఘటనతో జరిగిన అల్లర్లు, ఘర్షణలవల్ల మత విద్వేషపు ఉద్రిక్తతలు పెరిగి బిజేపికి లాభం తెచ్చిపెట్టాయి. క్రమంగా తన ప్రాబల్యం పెంచుకుంటూ 2014లో 282 లోక్‌సభ స్థానాలు గెలుచుకొని, ప్రభుత్వం ఏర్పాటు చేసి, వరుసగా కొనసాగుతూ, 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం అన్ని పార్టీలకంటే ఎక్కువ స్థానాలు సంపాదించి, ఎన్.డి.ఎ. మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మూడుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మతాన్ని వాడుకునేందుకు అనేక విధానాలు అవలంభించింది.

గుజరాత్‌లో చట్టవిరుద్ధంగా జరిగిన అమానుష మారణహోమం తర్వాత ఆర్.ఎస్.ఎస్. తదితర అనుబంధ సంఘాలవారు తమ ఎజండాని అమలుపరచడానికి, అన్నింటా దూకుడుగా వ్యవహరించే మోడీనే ప్రధానమంత్రిని చేసి, అప్పటివరకూ తమ సిద్ధాంతాలను జనంలోకి తీసుకువెళ్ళిన అద్వానీని వెనక్కు నెట్టేశారు. మోడీ ఓ పక్క కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూనే, రాజ్యాంగబద్ధంగా పని చేయాల్సిన ఇ.డి., సి.బి.ఐ., ఎన్.ఐ.ఏ., ఆదాయపు పన్ను శాఖ వంటి సంస్థలని తన చెప్పుచేతల్లోకి తెచ్చుకొని పార్టీకోసం వేలకోట్లరూపాయల సొమ్ము పోగేయడమే కాకుండా, ప్రత్యర్థుల్ని వేధించి దారికి తెచ్చు కోవడానికి కూడా ఉపయోగించు కున్నాడు. పార్టీ ఒక సమాచార సాంకేతిక విభాగాన్ని ఏర్పాటు చేసుకొని, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా మత పరమైన అంశాల ప్రచారంతో హిందూ మతస్తులుగా ముద్రవేసిన జనాల్లో అభద్రతా భావాన్ని, మతవిద్వేషాలను రెచ్చగొట్టి, బిజేపి తప్ప దిక్కులేదనే



తప్పుడు అభిప్రాయాన్ని వ్యాపింప జేస్తున్నారు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం సమానత్వం, అనే అంశాల్ని వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వీరు అధికారంలోకి వచ్చిన కొత్తలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చిన ప్రకటనలో రాజ్యాంగ ప్రవేశికలోని 'సోషలిస్ట్, సెక్యులర్' అనే పదాల్ని పూర్తిగా తొలగించారు. ఇటీవల ఆ పార్టీకి చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యస్వామితో సహా కొందరు రాజ్యాంగ ప్రవేశికలోని 'సోషలిస్ట్, సెక్యులర్' అనే పదాల్ని పూర్తిగా తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానాన్నికూడా ఆశ్రయించారు. రిజర్వేషన్‌లకు సంబంధించి కూడా వ్యతిరేకంగా బాహాటంగా మాట్లాడుతుంటారు. వీరిదృష్టిలో మనుధర్మ శాస్త్రమే ప్రామాణికం. నాలుగు అంచెల కులవ్యవస్థను కొత్తరూపంలో అయినా తిరిగి ప్రవేశపెట్టాలనే ధ్యేయంతో పనిచేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

హిందూ జాతీయత పేరుతో హిందీ భాషను, ఉత్తరాది వారి సంస్కృతిని కూడా ఇతర భాషాజాతులవారిపై బలవంతాన రుద్దే ప్రయత్నాలు మరింతగా జరిగాయి. దక్షిణాది రాష్ట్రాలలో, ముఖ్యంగా కేరళలో ఆవుమాంసం తినడం సాధారణం. అక్కడ మామూలు హొటళ్లలో కూడా మెనూకార్డులో అది ఉంటుంది. ఆర్యవైదిక మతం ప్రకారం ఆవుని పూజించాలి, కాబట్టి నిషేధం అన్నారు. వారి ప్రాంతాల్లో ఆవుమాంసం తిన్నందుకు కొందర్ని హత్య చేసిన ఘటనలు కూడా జరిగినట్లు వార్తలు చూస్తున్నాం. ఇక్కడ మరో ముఖ్య విషయాన్ని గురించి కూడా తెలుసుకోవాలి. ఆవుల్ని మాత్రమే పూజించి, గేదెలని మాత్రం చంపమనడంలో, తెల్లతోలు ఉండడాన్ని గొప్పగా చూపి, తెల్లజాతివారి ఆధిపత్యాన్ని నిలబెట్టి, ద్రవిడుల్ని తక్కువగా చూపే కుట్రకోణం కూడా దాగివుంది. వివిధ భాషాజాతుల భిన్న ఆచార వ్యవహారాల్ని తొలగించి, మనుధర్మాన్ని, వైదిక ఆర్య సంప్రదాయాల్ని అందరిమీదా రుద్దడానికే ఏకీకృత పౌరస్మృతిని రూపొందించారు. మతం బూచి చూపి అనేక ప్రభుత్వేతర సంస్థలకు విదేశాలనుంచి వచ్చే నిధులను నిషేధించారు.

మతప్రాతిపదికన వివక్ష చూపుతూ, 2019లో పౌరసత్వ సవరణ చట్టం ఆమోదించారు. ఈ చట్టంకింద 2014 డిసెంబర్ 31లోగా ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలనుంచి శరణార్థులుగా భారతదేశానికి వచ్చిన ముస్లిమేతరులకు మాత్రమే భారత పౌరసత్వం లభిస్తుంది. ఈ రకంగా మతప్రాతిపదికన వివక్ష చూపడం భారత రాజ్యాంగానికి వ్యతిరేకం. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా ఆందోళనలు,

నిరసనలు జరిగాయి. ఈ చట్టం అస్సాంలో అమలు చేశారు. ఇక్కడ పందొమ్మిది లక్షలమందిని అక్రమ వలసదారులుగా గుర్తించారు. ఒక్క అస్సాంలోనే 2020 నాటికి ఆరు నిర్బంధ శిబిరాలు ఉన్నాయి. వీటిలో వెయ్యిమందికంటే ఎక్కువ మందిని నిర్బంధించినట్లు తెలుస్తోంది. ఈ శిబిరాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ప్రాథమిక సౌకర్యాలు కూడా సరిగా లేవని మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి.

మతవివక్ష అమలుకు సంబంధించి జాతీయ పౌర నమోదు అంటూ మరో ముఖ్యమైన చట్టం 2019 డిసెంబర్ 12న రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రధానంగా పాకిస్తాన్, బంగ్లా, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలనుంచి అక్రమ వలసదారులుగా వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇవ్వడాన్ని సులభతరం చేయడమే కాకుండా, మత వివక్షతతో ముస్లింలను, గిరిజన, దళిత వర్గాలను వేధించే ఉద్దేశంతో తయారు చేసినట్లు తెలుస్తోంది. ఈ చట్ట ప్రకారం 1971కి ముందు తాము ఈ దేశంలోనే నివసిస్తున్నట్లుగా తమసొంత లేదా తండ్రి తాతలకు సంబంధించిన భూమిహక్కు పత్రాలు, జనన ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత పత్రాలు, పాస్‌పోర్టు వంటివి చూపించి, తాము ఈ దేశపౌరులమేనని రుజువు చేసుకోవాలి. ముఖ్యంగా ఆదివాసీలు, దళితులు, సంచార జాతుల వంటివారు, మిగతా పేదలు యాబయ్యేళ్ళకు పూర్వం ఈ పత్రాలు కలిగి ఉండడం, ఒకవేళ ఉన్నా, వాటిని ఇప్పటి వరకూ దాచి ఉంచుకోవడం జరగని పని. కులీనులకు తప్ప అత్యధిక శాతం ప్రజానీకానికి ఇది సాధ్యం కాదు. అస్సాం, బెంగాల్ వంటిచోట్ల, అక్కడకూడా ఒక్కశాతం కూడా లేని శరణార్థులను కనిపెట్టడమనే సాకుతో ఈ చట్టం తెచ్చారు. ఈ చట్టం పేరిట మొత్తం దేశప్రజల్ని వేధించకుండా శరణార్థులను కనిపెట్టడానికి అనేక ఇతరమార్గాలున్నాయి. **అధికశాతం ప్రజలు తన స్వంతదేశంలో పౌరసత్వం లేనివారుగా, ఓటుహక్కు కూడా లేకుండా రెండోస్థాయి మనుషులుగా బతకాల్సి వస్తుందని, ఇది ఆధునికకాలంలో చాతుర్వర్ణ్య వ్యవస్థను మరొక రూపంలో వ్యవస్థీకరించ డానికేనని స్పష్టంగా అర్థమవుతోంది.** అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేయడానికి నిరాకరించాయి. రాష్ట్రాలలో ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తీవ్ర నిరసనోద్యమాలు జరిగాయి.

ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన ప్రభుత్వం స్వయంగా రామమందిర నిర్మాణ కార్యక్రమం పూర్తి చేసి, అది తమ ఘనతేనని బహిరంగంగా చెప్పుకోవడమే కాకుండా, స్వయంగా దేశ ప్రధానే హాజరై విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ తంతు చేయడం

దేశ రాజ్యాంగ లౌకిక భావనకు, ప్రజాస్వామిక విలువలకూ వెన్నుపోటు పొడవడమే అవుతుంది. ప్రజాసమస్యల పరిష్కారంలో రాజ్యవ్యవస్థ విఫలమైనప్పుడు మతం ఆ స్థానాన్ని ఆక్రమిస్తుంది. తమ ఆర్థిక, సామాజిక సమస్యలకు కారణం భగవంతుడి దయలేకపోవడం లేదా పూర్వజన్మ కర్మ అని ప్రజలు భ్రమించేట్లు చేస్తుంది. అన్నిటికీ దేవుడిని వేడుకోమని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకోవడానికి ఆస్కారం కల్పిస్తుంది. గతంలో లోక్‌సభలో బిజేపికి పూర్తి ఆధిక్యత ఉన్నప్పుడు కనీసం సభలో ముసాయిదా చట్టంపై చర్చకూడా లేకుండా శాసనరూపం దాల్చేవి. ఐతే, ఈ పద్దెనిమిదో లోక్‌సభలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం (చంద్రబాబు), బీహార్‌కు చెందిన జెడియు (నితీశ్ కుమార్) లతోబాటు ఇతర లౌకిక పార్టీల మద్దతు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని దశలో ప్రభుత్వం ఉంది. ఈ పరిస్థితితో దూకుడు తగ్గవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

12

ప్రభుత్వ యంత్రాంగం - ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్య ప్రభుత్వమయినా, మరే ఇతర తరహా ప్రభుత్వమయినా, ప్రజల కళ్ళముందుండే ప్రభుత్వం మాత్రం దాని ఉద్యోగులే. ప్రభుత్వానికి కళ్ళు, కాళ్ళు, చేతులూ ప్రభుత్వ ఉద్యోగులే. ప్రభుత్వ వ్యవహారాలన్నిటా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి ప్రభుత్వ చట్టాలు, నిబంధనలు, ఉత్తర్వులు అమలు చేసేది వీరే. వీరి నిర్వర్తనలను బట్టే ఆ ప్రభుత్వం పనిచేసే తీరు బాహాటంగా వ్యక్తమవుతుంది. ప్రజాస్వామ్యంలో వీరి పాత్ర చాలా కీలకం. అఖిల భారతీయ సర్వీసు నుంచి గ్రామస్థాయి ఉద్యోగి దాకా వివిధ శాఖల ఉద్యోగులంతా ప్రభుత్వం కింద పరిగణనలోకి వస్తారు. నిర్వర్తనలన్నీ వీరిచేతుల్లోనే ఉంటాయి కాబట్టి, వీరే ఆచరణాత్మక ప్రభుత్వం.

వీరంతా నిష్పాక్షికంగా తమ విధులు నిర్వర్తిస్తుంటేనే పాలన నిష్పక్షపాతంగా సాగుతుంది. అందువల్లనే వీరికి కార్మిక హక్కులు (ట్రేడ్ యూనియన్ రైట్స్) నిరాకరించారు. టీచర్లు, వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లోని ఉద్యోగులకు ఉన్నట్లు వీరికి ఏ రాజకీయ పార్టీ అనుబంధ సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉండడానికి గానీ, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనడానికి గానీ చట్టం అనుమతి లేదు. ఇట్లా నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు తొత్తుల్లా పనిచేయడం క్రమంగా పెరిగిపోతోంది. వివిధ స్థాయిలలోని రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తే క్రమంలో నైతికంగా దిగజారడమే కాకుండా, సమన్యాయం లేదా చట్టసమానత్వం పాటించక పోవడం, లంచగొండితనం, అవినీతులు విపరీతంగా పెరిగిపోవడం మనం చూస్తున్నాం.

అవినీతిలో స్థానం

'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అనే సంస్థ, 2023వ సంవత్సరంలో 180 దేశాలలో అవినీతికి సంబంధించి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఒక నివేదిక రూపొందించింది. ఈ నివేదికలో ఆయాదేశాలలో ఉన్న ఆవినీతిని బట్టి వివిధ స్థానాలు కేటాయించారు. అవినీతి వ్యతిరేక సూచీలో డెన్మార్క్, ఫిన్లాండ్ దేశాలు వరుసగా మొదటి, రెండు స్థానాలు పొంది, అవినీతి లేని దేశాలుగా

నిలవగా, ఇండియా మాత్రం 2022 కంటె మరో ఎనిమిది స్థానాలు దిగజారి, తొంభైమూడో స్థానానికి పడిపోయింది. ఒక్క ఏడాదిలోనే ఎనిమిది స్థానాలు దిగజారడమంటే, అవినీతి ఎంతలా పెరిగిపోతోందో



మనకు అర్థమవుతోంది. అన్నిటినీ మనం చెప్పుకోలేం కానీ ఉదాహరణకు మన కళ్ళముందు జరిగిన ఒకటి రెండు సంఘటనలు చూద్దాం...

ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, పొద్దుటూరులో ప్రభాకర్ అనే రైతు సెల్ఫీ వీడియో తీసుకుని, 2024 జులై 2న, పురుగుల మందు తాగి చనిపోయాడు. తనకున్న కొద్దిపాటి భూమిని స్థానిక నాయకులు కబ్జాచేసి, జెసిబీతో గుంతలుతవ్వి మట్టి తరలిస్తున్నారని, ఇదేమని అడిగితే, తన్నడానికి వచ్చారని అన్నాడు. తను ఎమ్మార్వోను కలిసినా పట్టించుకోలేదని, కలెక్టర్‌ను కలుద్దామని ప్రయత్నం చేస్తే కనీసం కలవడానికి కూడా అనుమతి దొరకలేదనీ ఆ వీడియోలో వాపోయాడు. ఈ సంఘటన మన ప్రభుత్వ యంత్రాంగపు బాధ్యతా రాహిత్యానికి మచ్చుతునకగా నిలుస్తోంది. అనేకమంది వివిధ స్థాయిలలోని ప్రజాప్రతినిధులు అక్కడి ఉద్యోగులపై అధికారం చెలాయిస్తూ, వారి సాయంతో భూముల క్రయవిక్రయాలు జరిపినా, చివరికి ఇల్లు కట్టుకున్నా, వీరికి భారీగా లంచం ముట్టజెప్పాల్సిందే. లేకపోతే, సంబంధిత ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా వారిని నానా ఇబ్బందులకు గురిచేయడం సర్వత్రా చెలామణీ అవుతోంది. ఇక ఉద్యోగులలో కూడా చాలామంది 'తిలాపాపం తలాపిడికెడు' అన్నట్లు పనిలో పనిగా తామూ ఎంతోకొంత సొమ్ము చేసుకునే పరిస్థితి నెలకొని ఉంది. ఇటువంటి దుష్కృత్యాలకు మరో ముఖ్య ఉదాహరణ నయీం అనే నరరూప రాక్షసుడి నిర్వాకాలు.

కొన్నాళ్ళు నక్సలైటు ఉద్యమంలో పనిచేసి, పోలీసులకు కోవర్టుగామారి, ముందుదశలో అనేకమంది ఉద్యమకారుల్ని చంపించడంలో పావుగా ఉపయోగపడ్డాడు. రాజ్యవ్యవస్థలోని డొల్లతనాన్ని అనుకూలంగా మార్చుకొని, పోలీసు అధికారుల సాయంతో పంచాయితీలు, సెటిల్మెంట్లు, కిరాయి హత్యలతో మొదలుపెట్టి, విచ్చలవిడిగా భూకబ్జాలకు పాల్పడి, ఉన్నతస్థాయి రాజకీయ నాయకులు, బడా

పోలీసు అధికారుల ప్రాపకం సంపాదించి, చివరకు ప్రాథమిక దశలో తనను కోవర్టుగా వాడుకున్న పోలీసు యంత్రాంగాన్ని సైతం శాసించే దశకు చేరుకున్నాడు. ఎక్కడ బలహీనులు కనబడ్డా వాళ్ళ పొలాన్ని కబ్జా పెట్టడం, ఇచ్చినంత పుచ్చుకొని సలాం చేసి వెళ్లకపోతే వాళ్ళను నిర్దాక్షిణ్యంగా హత్య చేసి, ప్రజల్లో భయం సృష్టించి, యథేచ్ఛగా తన కబ్జాల పర్వం కొనసాగించాడు. పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల ఉద్యోగులను నయానో, భయానో మచ్చిక చేసుకోవడం వల్లనే ఇదంతా సాధ్యమైందనేది బహిరంగ రహస్యం. ఈ విధంగా వందలకోట్లు కొల్లగొట్టిన తర్వాత, రాజకీయ పలుకుబడి తోబాటు వేలకొట్ల డబ్బున్న వారిని సైతం, వందల కోట్ల కప్పం చెల్లించమని బెదిరించేదాకా వెళ్లడంతో, రాజకీయ నిర్ణయంతో అతడిని ఎన్కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయి. నయీం ఎన్కౌంటర్ తర్వాత బాధితుల్లో చాలామంది బహిరంగంగా బయటకు వచ్చి తమగోడు వెళ్లబోసుకున్నారు. ఎకరం, రెండెకరాల పొలం ఉన్నవాళ్ళని కూడా, పిల్లలనో మరొకరినో చంపుతానని బెదిరించి భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటనలు, కొద్దిపాటి భూమికోసం కూడా హత్యలకు పాల్పడ్డ సంగతులూ వెలుగులోకి వచ్చాయి. తన ముఠాతో ఈ రకమైన అక్రమ చర్యలు విజయవంతంగా కొనసాగించడానికి రాజకీయ నాయకులతోబాటు, పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సిబ్బంది సహకారమే కారణం. నయీంను ఎన్కౌంటర్ చేసి చంపిన తర్వాత పత్రికల్లో వచ్చిన వార్తలు చూస్తే పెద్ద భూకంపం వచ్చేట్లు కనుపించింది.

అనేకమంది అధికార ప్రతిపక్ష నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతోబాటు వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు నయీంతో అంట కాగినట్టు, ఉద్యోగస్వామ్య వ్యవస్థ అంతా తల్లకిందులవుతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే నాలుగు రోజుల్లో అంతా సద్దుమణిగింది. ఏనుగు పిత్తులా, గప్చుప్ సాంబార్ బుడ్డి అన్నట్లు ఏ చర్యలూ లేవు. కొద్దిమంది ప్రజాసంఘాలవారు, సామాజిక కార్యకర్తలు తప్ప, సమాజం కోసం, జనం కోసం అనే ప్రధాన స్రవంతి ప్రచురణ, ప్రసార మాధ్యమాలతో సహా ఎవరూ అనంతర కాలంలో కనీసం ఆ కేసులోని అంశాల్ని ప్రస్తావనకు కూడా తేలేదు. నయీం అకృత్యాలకు బలైన అసహాయుల హాహాకారాలు గాలిలో కలిసిపోయాయి.

"పల్లెటూరి పీపుల్ లెక్చర్లకి అన్ఫిట్. మొన్న మనం వొచ్చిన బండి వాడికి

నేషనల్ కాంగ్రెస్ విషయమై రెండు గంటలు లెక్చరు యిచ్చేసరికి ఆ గాడిద కొడుకు, 'వాళ్ళ వూరు హెడ్‌కానిష్టేబిల్ని కాంగ్రెసు వారు యెప్పుడు బదిలీ చేస్తార'ని అడిగాడు" ఇది కన్యాశుల్కం నాటకంలో గిరీశం వాక్యాలు. అంటే పల్లెటూరి వ్యక్తి దృష్టిలో అక్కడ పోలీసే ప్రభుత్వం. ఈ రోజులకి కూడా ఇందులో పెద్దగా మార్పు ఉన్నట్లు చెప్పుకోలేము. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా 2020లో ఇచ్చిన నివేదిక ప్రకారం, భారతదేశంలోని 10 మందిలో 5 మంది ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. భారతదేశంలో అత్యధికంగా లంచం తీసుకునే విభాగం పోలీసు శాఖ.

పోలీసు వ్యవస్థ - అవసరమైన చెడు



ప్రమాదం, కష్టాలు, హింస చోటు చేసుకునే పరిస్థితుల్లో ప్రజలకు తక్షణం గుర్తొచ్చేది, తాము చేరుకోగలదిగా ఉండే ప్రభుత్వం అంటే, పోలీసు మాత్రమే. ఏ సమాజంలోనైనా ప్రజలకు తక్షణం అందుబాటులో ఉండి, అండగా నిలబడాల్సింది పోలీసులే. 'పోలీసు వ్యవస్థ సమాజానికి అవసరమైన చెడు' (నెసిసరీ ఇవిల్) అన్నాడో బుద్ధిమంతుడు. ఈ వ్యవస్థలో పనిచేసే వ్యక్తులు, అధికారులకు చిత్తశుద్ధి, నైతికబలం, చట్టసమానత్వం మీది గౌరవం ఎంతో అవసరం. అయితే ఎంతో ఉన్నతంగా ఆలోచించి బాధ్యతగా ప్రవర్తించాల్సిన వీరు చాలా అహంకార పూరిత ఆధిపత్య ధోరణితో అమానవీయంగా ప్రవర్తించడం, తమకున్న అధికారాన్ని వివిధ రకాల సెటిల్మెంట్లకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం కనబడుతున్నాయి. తాము ఏమి చేసినా చెల్లుతుందనే భావన వీరిలో ఉంది.

పోలీసు వ్యవస్థ అధికార రాజకీయనాయకుల ఆర్థిక, రాజకీయ లబ్దికోసం, వారి అడుగులకు మడుగులొత్తుతూ, తామూ కొంత వెనకేసుకోవడానికి నిస్సిగ్గుగా చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ముంబై నటిని అక్రమంగా నిర్బంధించి, నలభై రోజులు జైల్లో ఉంచి, హింసించిన ఘటన ప్రసార ప్రచురణ మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారంపొందింది. ఆ ప్రకారం, ముంబైకి చెందిన బడా పారిశ్రామికవేత్త, కడపలో స్టీలు ఫ్యాక్టరీకొసం కొన్ని వేలకోట్ల రుపాయల పెట్టుబడి పెట్టాడు. 'జిందాల్' అనే ఆ పారిశ్రామికవేత్తకూ, ఆ నటికీ మధ్య గోడవలున్నాయి. ఆ బడా

పారిశ్రామికవేత్తపై అక్కడి పోలీస్‌స్టేషన్లో పిర్యాదు తీసుకోలేదు. ఆమె న్యాయస్థానంలో పిర్యాదు చేయడంతో అతనిపై లైంగిక హింస కేసు నమోదయింది. ముంబైలో ఆ గొడవ అట్లా ఉండగా, ఏపిలో విజయవాడ దగ్గర ఒక కుగ్రామంలో ఒక వ్యక్తి దగ్గర కొన్ని లక్షల రూపాయలకు పొలం కొన్నట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి, వేరొకరికి దాన్ని అమ్మడానికి, ఆ నటి డబ్బు తీసుకుని అగ్రిమెంట్‌పై సంతకాలు పెట్టిందని, చోటమోటా వైసీపీ నాయకుడు ఒకడు పోలీసులకు పిర్యాదు చేశాడు. సరిగ్గా రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు ముంచుకు వస్తున్న సమయంలో 2024 ఫిబ్రవరి రెండో తేదీన ఉదయం ఏడున్నరకు పోలీసులకు ఫిర్యాదు అందితే క్షణాలమీద కేసుకట్టి, మధ్యాహ్నానికల్లా మేజిస్ట్రేటు అనుమతి పొంది, సాయంత్రానికల్లా ఒక ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో పోలీసు బృందం హుటాహుటిన విమానంలో ముంబై వెళ్ళి, ఎవరికీ సమాచారం ఇచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా, ఆమె తల్లిదండ్రులతో సహా ఆ నటిని విజయవాడకు తెచ్చి, ఒక రహస్య ప్రదేశంలో మూడు రోజులపాటు నిర్బంధించి, హింసించి, రిమాండ్ చేసి, ఆమె వద్ద బలవంతాన తెల్లకాయితాలపై సంతకాలు తీసుకున్నారు. ఆ కాగితాల ఆధారంగా ఈమె జైల్లో ఉండగానే అక్కడ పారిశ్రామికవేత్తపై పెట్టిన కేసు ఈమే స్వయంగా ఉపసంహరించుకున్నట్లు కేసు ఎత్తేశారని తెలిసింది.

ఈ కేసులో అసలు ఆమె సంతకం ఫోర్జరీయా కాదా? అనే విషయం ఫోరెన్సిక్ లాబ్‌కు పంపకుండా నిర్ణయించారు. భారతీయ నౌకాకాదళంలో ఉన్నతోద్యోగిగా రిటైరైన ఆమె తండ్రి, కాలేజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆమె తల్లి, డాక్టరేట్ పట్టాపొందిన ఆ నటి ఎక్కడో విజయవాడ దగ్గరి కుగ్రామంలో ఉన్న వ్యక్తిని మోసం చేయడానికి ప్రయత్నించడమనేది ఎవరికీ అంతుపట్టని విషయం. ఈ కేసులో గంటల వ్యవధిలోనే పోలీసు బృందం విమానంలో బయలుదేరి పట్టి తేవడం ఇంకా విచిత్రంగా ఉంది. పైగా ఈ ఫోర్జరీ లావాదేవీ 2018లో జరిగినట్లు పేర్కొంటూ, ఆ అగ్రిమెంటు పత్రాల్లో నటి చిరునామా కూడా పేర్కొన్నారు. ఆ చిరునామాలో ఉన్న ఇల్లు తాము 2021లో కొన్నట్లు ఆనాటి రిజిస్ట్రేషన్ దస్తావేజులు కూడా చూపింది. పబ్లిసిటీ కోసం ప్రసార మాధ్యమాల ముందు మేకప్పుతో కూర్చుని ఫోన్ ద్వారానే అన్ని సమస్యలూ పరిష్కరిస్తున్నట్లు ప్రచారం చేసుకునే ఈ ఐపీఎస్ అధికారులకు ఏ రచయిత సాయం లేకుండా సొంతగా కట్టుకథలల్లడం కూడా రాదని రుజువైంది. ఆంధ్రప్రదేశ్‌లో

ప్రభుత్వం మారడం వల్ల ఆ నటి 2024 ఆగస్ట్ చివర ఆ పోలీసు అధికారులపై పిర్యాదు చేసి, బహిరంగంగా మీడియా ముందుకు రావడం వల్ల ఈ విషయం బైట పడింది. ఎక్కడో ముంబైలో ఉన్న వారినే అట్లా వేధించిన ఈ పోలీసుబాసులు, ఏమైనా లాభం వచ్చేట్టైతే ఇక్కడున్న సామాన్యులని తేలిగ్గా ఎన్కౌంటర్ చేయడంతోసహా ఏమైనా చేయగలరనీ, చట్ట సమానత్వం పట్ల వీరికి ఏమాత్రం గౌరవంలేదనీ స్పష్టంగా అర్థమవుతుంది. అపరాధి ఎంతటివాడైనా చట్టప్రకారం కఠినంగా శిక్షించడం ప్రజాస్వామ్యస్థితికి దోహదమవుతుంది.

రాజకీయ అధికారం ప్రాపుతో, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల ఆశతో విచక్షణారహితంగా నక్సలైట్ల పేరిట సాధారణ ప్రజలపై ఎన్కౌంటర్లకు పాల్పడ్డ సంఘటనలు అనేకం కనబడుతున్నాయి. గతంలో చిత్తూరు జిల్లాలో కిక్కిరిసిన బస్సులో వెళుతున్న ఇరవైమంది ఎర్రచందనం కూలీలని "స్మగ్లర్ల" పేరిట 2015లో ఎన్కౌంటర్ చేసి చంపారు. స్మగ్లర్లంతా కిక్కిరిసిన బస్సులో ప్రయాణిస్తుంటే, కూలీలంతా ఏసీ రూముల్లో తొంగున్నారా? అని ఎవరూ అడిగిన పాపాన పోలేదు. ఇక దిశ హత్యకేసు వంటి సందర్భాల్లో జనాగ్రహం కట్టలు తెంచుకొంటోంది. వాస్తవాలు విచారించి తెలుసు కోకుండా పోలీసులు చెప్పిందాన్నే నమ్మి, వాళ్ళను ఎన్కౌంటర్ చేయాలనే అనుచిత ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. ఇటువంటి కేసుల్లో, కులబలం, డబ్బు, రాజకీయ ప్రాపకంలేని అమాయక బలహీనులు దొరికేట్లయితే జనాగ్రహం చల్లార్చడానికి వాళ్ళను వెంటనే ఎన్కౌంటర్ చేస్తున్నారు. పోలీసులు చెప్పేదంతా నిజమని జనాలు నమ్మడం వలన, పోలీసు బాసులకు చట్టం మీద గౌరవం లేకపోవడం వలన ఇట్లాంటి అధికారిక నేరాలు జరుగుతున్నాయి.

అనంతర కాలంలో వెలుగు చూసిన, ఇదే విధమైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రకంగా వివరాలు చెప్పుకుంటూ పోతే చాలా వున్నాయి. నేరస్థుల్ని శిక్షించవద్దని కాదు. నేరస్థుల్ని తప్పనిసరిగా శిక్షించాలి. అయితే ఆ శిక్షించాల్సింది ఎవరనేదే ఇక్కడ అసలు విషయం. 'అత్యాచారాలకు పాల్పడిన వారిని పోలీసులే కాల్చి చంపాలి' అంటే, ఇప్పటికే ఉన్న అధికారాలు చాలవన్నట్టు న్యాయస్థానాలతో పనిలేకుండా పోలీసు ఉద్యోగులకు అపరిమిత అధికారాలు ఇవ్వాలని, ఇట్లా వాదించేవాళ్లు కోరుకుంటున్నట్లు అర్థమవుతుంది. ఈ అపరిమిత అధికారాలతో వాళ్లు రాజ్యాంగేతర శక్తులుగా మారరని, వారంతా బుద్ధిమంతులనే హామీ ఏమీలేదు.



సత్యంబాబు కేసులో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలిసిందే. ఈ హత్యతో అతనిక సంబంధం లేదని స్వయానా హత్యకు గురయిన ఆయేషా తల్లిదండ్రులే మొత్తుకున్నా, అధికార పదవుల్లో ఉన్నవాళ్ళని కాపాడడం కోసం, నేరం ఒప్పుకోమంటూ సంవత్సరాల తరబడి జైల్లో దారుణంగా హింసించి, ఎన్కౌంటర్ యత్నం కూడా చేసి, ఆధారాలు లేకపోవడం వల్ల నిర్దోషిగా విడిచి పెట్టారు. ఇన్నేళ్ల నిర్బంధంలో అతని యవ్వన జీవితం కటకటాల్లో ముగిసిపోవడమే కాకుండా అంగవైకల్యంతో విడుదల అయ్యాడు.

అట్లానే 2021లో హైదరాబాద్‌లో ఒక అమ్మాయి 'తనను ఆటోడ్రైవర్ కిడ్నాప్ చేసినట్లు, వాళ్ళ నుంచి ఎలాగోలా తప్పించుకు పారిపోయి వచ్చినట్లు' చెప్పింది. అప్పుడు కూడా ఆ ఆటోడ్రైవర్లను ఎన్కౌంటర్ చేయాలని ప్రజలు, సామాజిక మాధ్యమాల్లో హోరెత్తించారు. తరువాత విచారణలో తెలిందేమంటే, ఆ అమ్మాయి కొద్దిరోజులు తన ప్రియుడితో పారిపోయి, ఇంట్లోవారికి భయపడి, కిడ్నాప్ కట్టుకథ అల్లినట్లు వెల్లడైంది. ఈ లోగా పోలీసులు అనుమానితులైన ఆటోడ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఆ అమ్మాయి మాటలు నమ్మి వాళ్ళను ఎన్కౌంటర్ చేసి వుంటే, వాళ్ళ కుటుంబాల పరిస్థితి ఏమై వుండేది? పోలీస్ చెప్పేదంతా నమ్మాలనే వాళ్లను ఏమనాలి? ఇలాంటివి ఎన్నో. అధికారం, డబ్బు, అంగబలం లేని పేదలు, దళిత బలహీన వర్గాలకు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో చట్టబద్ధ పాలనను అనువర్తించారు. ఆచరణలో అందుకు పూర్తి భిన్నంగా అన్నిరకాలుగా వాళ్ళే బలవుతున్న పరిస్థితులు కళ్ళముందు కనబడుతున్నాయి. సిర్పూర్కర్ కమిషన్ దిశ హత్యకేసులో ఎన్కౌంటర్ పోలీసు హత్యే అని తేల్చింది. తర్వాత పోలీసుబాసుకు ప్రమోషన్ ఇచ్చి, సామాన్య పోలీసులపై చర్యలు తీసుకున్నారు. అంటే, వాళ్లపై ఒత్తిడి తెచ్చిన ఉన్నతస్థాయి వారు మాత్రం దోషులు కాదట. ఎన్కౌంటర్ అయినవాళ్ళు నిజంగా దోషులో కాదో స్పష్టత లేదు. ఎప్పుడూ బలయ్యేది కిందిస్థాయి వాళ్ళే!

ఎన్కౌంటర్లో పాల్గొనే అధికారులతో సహా పోలీసులు అందరిపై, ఎన్కౌంటర్


జరిగిన ప్రతిసారీ హత్యానేరం నమోదుచేసి, సక్రమ విచారణ జరిపితే, పోలీసు సిబ్బంది ఒత్తిడులకు, ప్రలోభాలకూ లొంగి ఎన్కౌంటర్లకు పాల్పడడం తగ్గుతుంది. ముఖ్యంగా తన్ని, చిత్ర హింసలుపెట్టి, చెప్పినట్టు ఒప్పుకుంటే శారీరక హింస తగ్గుతుందనే భయం కల్పించి నేరం ఒప్పించే, సీన్ రీకనస్ట్రక్షన్ అంటూ వారికి శిక్షణ ఇచ్చి నాటకమాడించి న్యాయస్థానంలో నిలబెట్టడం వంటి ఆటవిక పద్ధతులు పూర్తిగా ఆపివేయాలి. ఈ అనాగరిక మోటు పద్ధతులకు బదులు, ఆధునిక సాంకేతికత, ఫోరెన్సిక్ విజ్ఞానం వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించుకొనే నేర విచారణ పద్ధతులను అమలు చేయాలనే జ్ఞానం లోపించింది. వర్తమానంలో పోలీసు వ్యవస్థ అధికారం, సంపద పోగేసుకున్నవారు ఆడమన్నట్లల్లా ఆడేవిధంగా తయారయింది. రాజకీయం, పెట్టుబడి, చెట్టాపట్టాలు వేసుకుని, ఎన్నికల తతంగాన్ని నడుపుతున్న వర్తమానంలో ఇది మరింత ప్రమాదకరంగా తయారయింది. అతి ముఖ్యమైన 'చట్ట సమానత్వం' అనే అంశాన్ని తుంగలో తొక్కుతున్నారు. పోలీసు వ్యవస్థలో అధిక భాగానికి చట్ట సమానత్వం' అనేది ఒకటుందనే అంశం కూడా నిజమైన అర్థంలో తెలియని పరిస్థితులున్నాయి. ఇది ప్రాథమిక మానవహక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది'. పోలీసు వ్యవస్థలో తెచ్చే మార్పులతోబాటు వారికి మిగతావారిలాగా వారంలో ఒక రోజు విశ్రాంతి పొందే సౌకర్యం, కనీసం డిఎస్పీ స్థాయిదాకా నేరుగా నియామకాల్ని రద్దు చేసి, కిందిస్థాయి పోలీసులకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వార భర్తీ చేయాలి. ఇక ముఖ్యంగా హెూమ్‌గార్డుల వ్యవస్థ గురించి చెప్పుకోవాలంటే, అది ఏర్పాటు చేసిన ఉద్దేశ్యం ఏమయినా ఇప్పుడది ఉపాధి మార్గంగా ఉంది. కడుపు నింపుకోవడానికి చాలీచాలని జీతం వల్ల వారిలో కొందరు అవినీతి అధికారుల తరపున వసూళ్లకు పాల్పడుతున్న వార్తలు వింటున్నాం. కాబట్టి హెూమ్‌గార్డుల వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, వారికి కొన్ని రాయితీలు, మినహాయింపులూ ఇచ్చి పూర్తికాలపు పోలీసు ఉద్యోగాల్లో భర్తీ చేయాలి.

అవినీతి శాఖలు

ఇక ప్రజలకు కనబడేవి రెవెన్యూ, మున్సిపల్, పౌరసరఫరాలశాఖ వంటివి అవినీతికి ప్రధాన ఆలవాలంగా ఉన్నాయి. ఇవి చెప్పలేనంత అవినీతిలో కూరుకుపోయాయి. ఈ కార్యాలయాలన్నిట్లో బయట దళారులు సిద్ధంగా ఉంటారు. ప్రతిపనికీ ఒక నిర్ణీత ధర ముందుగానే నిర్ణయమై ఉంటుంది. ఇక ప్రభుత్వాసుపత్రుల

విషయానికివస్తే, అన్ని చోట్లా తీవ్రమైన సిబ్బంది కొరత ఉంటుంది. చాలాచోట్ల కోట్లు ఖర్చుపెట్టి సమాకూర్చిన యంత్రాలకు సరయిన సాంకేతిక నిపుణుల్ని నియమించకపోవడం వల్ల అవి నిరుపయోగంగా ఉన్న స్థితి కనబడుతోంది. ప్రభుత్వాలే ఆస్పత్రుల నిర్వహణను పట్టించుకోకుండా ప్రయివేటు వైద్యశాలలవైపు మొగ్గుచూపి, పేదలకు అందించే వివిధ ఆరోగ్యశ్రీ వంటి పథకాలద్వారా ప్రయివేటు ఆస్పత్రులను ప్రోత్సహించి, వందలకోట్ల రూపాయలను కార్పొరేట్ వైద్యశాలల యజమానులకు అప్పజెప్పడం జరుగుతోంది. అదే సొమ్మును ప్రభుత్వ వైద్యశాలలకు వెచ్చించేట్లయితే, అందరికీ మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంది. ఏపీ, తెలంగాణాల్లో విద్యాశాఖపరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. కార్పొరేట్ కాలేజీలకు ఫీజుల రూపంలో సొమ్ము చెల్లిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం కనబడుతోంది. పెద్దపెద్ద డ్యాములు, నిర్మాణాలు, ప్రాజెక్టుల విషయంలో డెబ్బై శాతం డబ్బు పైనుంచి కింది దాకా లంచాల రూపంలోనే ఖర్చవుతున్నట్లు, పావలావంతు సొమ్ము మాత్రమే నిజంగా ఖర్చవుతున్నట్లూ విమర్శలున్నాయి.

కిందిస్థాయి ఉద్యోగులే కాకుండా లక్షల్లో జీతం తీసుకునే ఐఎఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు ఉద్యోగుల్లో కూడా ఈ ధోరణి బాగా పెరిగిపోయింది. ఎస్.ఆర్. శంకరన్ వంటి అధికారులు వర్తమానంలో ఎంత వెతికినా కనబడడంలేదు. దొరికినకాడికి దండుకొని వందలకోట్లు వెనకేసుకునేవారు ఎక్కువయారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో సమీర్ విష్ణో అనే ఐఎఎస్ అధికారి ఖనిజాల రవాణాలో అక్రమాలకు పాల్పడి, కేవలం 16 నెలల్లో 500 కోట్లు లంచంగా తీసుకున్న ఆరోపణపై అరెస్టయ్యాడు. ఇంతే కాకుండా, ఇండియాటుడే పత్రిక ప్రకారం, 2016-2019 సంవత్సరాల మధ్య 86 మంది వివిధ కేడర్ల అఖిల భారత సర్వీసు ఉద్యోగుల్ని నిధుల దుర్వినియోగం, లంచగొండితనం ఆరోపణలపై సిబిఐ కేసులు నమోదు



చేసింది. గత కొద్ది సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అనేక కేసులు నమోదయ్యాయి. వీటిలో కొన్ని రాజకీయ కక్ష్య సాధింపులో భాగంగా జరుగుతున్నట్లుగా కూడా విమర్శలున్నాయి. రాజ్యాంగ చట్టాలు, అనుబంధ చట్టాలకు మించి, రాజకీయ బాసుల్ని తృప్తిపరిచి, సందులో సడేమియాలాగా తామూ కొంత వెనుకేసుకోవడానికి చాలామంది అధికారులు ప్రయత్నిస్తున్నారు. కొత్తపార్టీ అధికారంలోకి వస్తే, వీరికీ అరెస్టులు తప్పడం లేదు. తెలంగాణలో ఫోన్ టాపింగ్ కేసులో కొందరు ఐపీఎస్ అధికారులతో సహా పోలీసు అధికారులు అరెస్టు కావడం దీనికి ఒక మచ్చుతునక. ఇక రాజకీయ బాసులు చెప్పినట్టల్లా విని జైలుకు వెళ్ళిన అధికారుల్లో శ్రీలక్ష్మి కేసును ఉదాహరణగా చెప్పుకోవచ్చు. రాజకీయ బాసుల మాట వినకపోతే ఇంకోచోటికి బదిలీ చేస్తారు, గానీ వారిని ఉద్యోగం నుంచీ తొలగించలేరు. స్వార్ధ చింతనతో కోట్లు వెనకేసుకుందామనే భావనే వీళ్ళు అవినీతికి పాల్పడేట్లు చేస్తుంది.

ఇది ఒక విషవలయం. ఫక్తు వ్యాపారంగా మారిన ఎన్నికల వ్యవస్థలో రాజకీయ నాయకులనుంచి పైస్థాయి, కింది స్థాయి ఉద్యోగుల దాకా ఒకర్ని చూసి మరొకరు, ఒకరి కారణంగా మరొకరు అవినీతికి పాల్పడుతున్నారు. ఈ విధంగా చేయడానికి మరో ముఖ్యకారణం శాశ్వత ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు, పొరుగుసేవల (ఔట్ సోర్సింగ్) నియామకాలు జరపడం. అరకొర జీతం, తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి అశాశ్వతమైన ఉద్యోగం కారణంగా వీరిలో అనేకమంది, దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఉద్దేశంతో ఆబగా లంచాలు మెక్కుతున్నారు. ఇక శాశ్వత ఉద్యోగులకు కూడా 2003 సం॥ం నుంచి పెన్షన్ పొందే హక్కు తొలగించారు. రిటైర్మెంట్ తర్వాత జీవితానికి భరోసా ఇచ్చే పెన్షన్ సౌకర్యం రద్దు చేయడంవల్ల, చాలామంది నిర్భయంగా లంచాలకు తెగబడడం జరుగుతూ ఉంది.

'యూత్ ఫర్ యాంటీ కరప్షన్' అనే సంస్థ 2020 సం॥లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అవినీతిని గురించి ఒక సర్వే నిర్వహించింది. వివిధ వర్గాల ప్రజలతో, తెలుగు రాష్ట్రాలలో అవినీతి ఎట్లా ఉంది? సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళినప్పుడు అధికారుల ప్రవర్తన ఎట్లా ఉంటుంది? అవినీతికి ముఖ్య కారకులు ఎవరు? వంటి ప్రశ్నలతో 20,200 మందికి పైగా స్త్రీలు, పురుషులు, కార్మికులు, చిరుద్యోగులు, వ్యవసాయదార్ల వంటి భిన్న రకాల వ్యక్తుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సర్వే ఫలితాల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి బాగా ఉ

ందని 94% మంది చెప్పినట్లు పేర్కొన్నారు. అధికారుల పనితీరు బాగాలేదని 84% మంది తెలిపారు. ఏ పని కావాలన్నా మధ్య బ్రోకర్ల ద్వారానే నెరవేరుతుందని, ఈ బ్రోకర్ల వ్యవస్థే అవినీతి పెరగడానికి ప్రధాన కారణమని అత్యధికులు చెప్పారు. నిజాయితీగా పనిచేసే అధికారులు నూటికి 20 మంది మాత్రమే ఉన్నట్లుగా ప్రజలు అభిప్రాయ పడుతున్నట్లు సర్వేద్వారా తెలిసింది.

వేతన జీవుల నుంచి ఆదాయపన్నును ముక్కుపిండి వసూలు చేస్తారు. ఇదే కాకుండా, పెట్రోలు, పొగాకు ఉత్పత్తులు, ఉప్పు, పప్పు, బెల్లం కొనే సగటు బడుగుజీవి కేవలం జీవించడానికి మాత్రమే కొనే వస్తువుల కోసం ఖర్చుపెట్టే ప్రతి రూపాయలోనూ, సగటున పావలా వంతు పన్ను రూపంలో నేరుగా ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. ఈ సొమ్ముకు పారదర్శకంగా జవాబుదారీగా ఉండాల్సిన యంత్రాంగం స్వంత సొమ్ములాగా ఖర్చు పెట్టడమవుతోంది. ప్రభుత్వ ఉత్తరువులన్నీ బహిరంగంగా ఉండాలి. ముఖ్యంగా గోప్యంగా ఉంచాల్సిన పరీక్ష ప్రశ్నాపత్రాల ముద్రణ వంటి ఒకటి రెండు అంశాలు తప్ప ప్రభుత్వ ఖర్చులు, మిగతా విషయాలన్నిటికీ సంబంధించి ఉత్తరువులన్నీ బహిరంగంగా పారదర్శకంగా ఉండాలి. కానీ, గత కొన్నేళ్ళుగా ఉత్తరువుల సంఖ్య మాత్రం ఇచ్చి, అవి రహస్యం (కాన్ఫిడెన్షియల్) అంటూ ఆయా జీవోల్ని ప్రభుత్వ వెబ్సైట్లో అందుబాటులో ఉంచడం లేదు. వీటిని సమాచార హక్కు చట్టం కింద కూడా అడగడానికి వీలులేదు. కాబట్టి ముందుగా ప్రభుత్వ పనితీరులో పారదర్శకత పెరగాలి. పారదర్శకత పెరగడం మొదలైతే సహజంగా జవాబుదారీతనం కూడా పెరుగుతుంది. అందుకై కొన్ని చర్యలకోసం డిమాండ్ చేయాల్సిన అవసరముంది.

ఈ గవర్నెన్స్-గుడ్ గవర్నెన్స్

ఇక్కడ మనం ఒక్క ప్రభుత్వ ఉద్యోగుల్లో మాత్రమే అవినీతి ఉందని చెప్పుకోవడం లేదు. మామూలు జనంలో ఉన్నట్లే ఇక్కడ కూడా మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు, స్వార్థపరులు, త్యాగధనులు, అత్యధిక ప్రజానీకంలా మామూలువాళ్ళు అత్యధికంగా ఉంటారు. అందుకై వ్యక్తుల మంచిచెడు ప్రాతిపదికమీద కాకుండా వ్యవస్థాగత ఏర్పాట్ల ద్వారా, అవినీతికి తావులేని పద్ధతుల ఏర్పాట్ల ద్వారా లంచగొండితనాన్ని, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి, సమర్ధవంతమైన, బాధ్యతాయుత పాలనకు బాటలు వేయవచ్చు. ముఖ్యంగా పారదర్శకత కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి. ప్రభత్వ ఖర్చులు, పథకాలు, ఆయా శాఖలకు సంబంధించినవి

ఎప్పటికప్పుడు నవీకరించి, సమాచారాన్ని సంబంధిత వెబ్‌సైట్లో ఆంగ్లంతోబాటు, స్థానిక బాషలో అందుబాటులో ఉంచాలి. సదరు వెబ్సైట్‌లో ఆ శాఖకు సంబంధించి ఏ సమాచారం అడిగినా కనీసం రెండు రోజుల లోపల బహిరంగంగా ఉంచే ఏర్పాట్లు చేయాలి. ఉద్యోగ స్వామ్యానికి సంబంధించి ఏవైనా నిర్దిష్ట అవినీతి ఆరోపణలు, ఋజువులు ఉన్న పక్షంలో, వాటిని ఈ బహిరంగ పోర్టల్‌లో నమోదు చేసే అవకాశం కల్పించాలి. అట్లా నమోదు చేసే వ్యక్తులు తమ రక్షణ కోసం తమ వివరాలు బహిర్గతం కాకూడదని భావించేట్లయితే, ఆ వ్యక్తి ఎవరో తెలియకుండా వెబ్సైట్లో నమోదు చేయడానికి అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లోనే అవకాశం కలిపించాలి. వీటిని సవరించేందుకు గానీ, తొలగించేందుకుగానీ వీలులేని విధంగా ఏర్పాటు చేయాలి. ఒకవేళ అటువంటి వాటిలో నిరాధార ఆరోపణలు ఎక్కువగా వస్తున్నట్లు భావిస్తే, వాటిని పూర్తిగా తొలగించడం కాకుండా ఆ వెబ్సైట్లో చెత్త (ట్రాష్) అనే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, తేదీల వారీగా అందులోకి బదిలీ చేసి, బహిరంగంగా అందరికీ అందుబాటులో ఉంచాలి. దీనివల్ల అధికారులు తమ యిష్టం వచ్చినట్లు వెబ్సైట్‌లోని సమాచారం తొలగించే అవకాశం ఉండదు. సమాచారహక్కు చట్టం కింద అడిగే ప్రశ్నలకు కూడా ఇందులో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి.

వివిధ ప్రభుత్వ పథకాలు, నిర్మాణ పనుల్లో స్థానిక ప్రజలందరికీ పారదర్శకంగా వివరాలు తెలియజేస్తూ, వారి సలహా సంప్రదింపులు, భాగస్వామ్యం ఉండేవిధంగా చర్యలు తీసుకోవడంవల్ల అవినీతిని నిర్మూలించి పనిలో సమర్థత పెరిగేందుకు దోహదమవుతుంది. భూముల పట్టాల వివరాలు, మార్పిడిల గురించి ఎప్పటికప్పుడు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ విభాగాలు తాజా సమాచారాన్ని, జిల్లా, మండలాల వారీగా వివరాలతో ప్రత్యేకంగా ఏర్పరచిన తమ వెబ్‌సైట్లో ఉంచాలి. న్యాయవివాదాల్లో ఉన్నవాటిని ప్రత్యేకంగా పేర్కొని, వివాద స్వభావాన్ని తాజాస్థితితో సహా అందుబాటులో ఉంచాలి.

ఇళ్ల రిజిస్ట్రేషను, ఇళ్ళు, భూముల తాకట్టు, మ్యూటేషన్ల సమాచారం, దరఖాస్తులు, ఆన్‌లైన్లో అందుబాటులో ఉంచాలి. దరఖాస్తు ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేయకుండా పరిష్కారానికి, అభ్యంతరాలకు నిర్దిష్ట గడువు విధించి, అమలు చేయని అధికారులకు పెనాల్టీ వేసే విధానం అమలు చేయాలి. ఇవన్నీ కాకపోయినా అరకొరగా ఇట్లాంటి ఏర్పాట్లన్నా, అవి ఏమాత్రం అమలుకాని స్థితి చూస్తున్నాము.

తెల్ల రేషన్ కార్డులు, వివిధ సామాజిక పథకాల కింద అందజేసే పింఛన్ల విషయంలో అధికారంలో ఉన్న పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు మాత్రమే అందజేసి, కొంతమందికి తొంటి చెయ్యి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ పథకాల కింద నిరంతరం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడమే కాకుండా వెబ్‌సైట్లలో ఈ వివరాలన్నీ ఉంచి, కార్యాలయ నోటీసు బోర్డుల్లో కూడా ఉంచి, అర్హత లేకుండా లబ్ధి పొందుతున్నవారు ఎవరైనా ఉంటే, వారి వివరాలు తెలియజేయడానికి అవకాశం ఇవ్వాలి. తద్వారా వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి, అనర్హులని తొలగించి, ప్రభుత్వ ధనం ఆదాయ చేయడానికి వీలవుతుంది. ప్రభుత్వ పనులకు కాంట్రాక్టర్ల నుంచి పిలిచే టెండర్లకు ఇదే విధానం అవలబించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇక జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, కులనిర్ధారణ పత్రాలు, ఆదాయ పత్రాల వంటి వాటికి కూడా ఆన్‌లైన్ విధానం అవలంబించాలి. దరఖాస్తుదారుల ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించి, వారు ఉన్నప్పుడే క్షేత్రస్థాయి విచారణలు జరిపే విధానం అవలబించి లేదా నిర్దిష్ట నివాస సముదాయంలోని వారికి ముందుగా తెలిపి, అక్కడికి వెళ్ళడం ద్వారా అధికారుల సమయం ఆదా అయ్యే విధానం అవలంబించవచ్చు. ప్రతి దరఖాస్తుకీ, దరఖాస్తుతోపాటు సమర్పించాల్సిన వివరాలు, జతచేయాల్సిన పత్రాల్ని గురించి దరఖాస్తు చేయాల్సిన చోట పొందుపరిచి, ముఖ్య అవసరమైన వివరాలు ఉంటేనే కంప్యూటర్లో దరఖాస్తు ఆమోదించేట్లుగానూ, అవసరమైన రుసుములు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించేట్లుగా సాఫ్ట్‌వేర్ రూపొందించడం ద్వారా సమయం వృథా కాకుండా పనులు జరగడానికి, అలక్ష్యం, అవినీతి, లంచగొండితనం లేని సమర్థ పాలనకూ అవకాశాలు పెరుగుతాయి.

ఇక ముఖ్యంగా కనీసం 3 నెలలకొకసారైనా, పోలీసుశాఖతోసహా ప్రతిశాఖా తన ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి, తమ పనితీరు, మరింత పారదర్శకంగా, ప్రజోపయోగకరంగా పని చేయడానికి తీసుకోవలసిన చర్యలు, కార్యాలయాలకు వచ్చే ప్రజల ఆర్థిక, రాజకీయ సామాజిక హోదాలతో పనిలేకుండా, అందరితో ఒకే విధమైన మర్యాదతో వ్యవహరించాల్సిన అవసరాన్ని గురించి, పాత్రికేయులు, మేధావులు, విశ్వవిద్యాలయాల టీచర్లు, ప్రజాసంఘాల నాయకుల వంటి వారితో ఉపన్యాసాలు, చర్చాగోష్టులు నిర్వహించడం ద్వారా వారిలో బాధ్యతాయుత ప్రవర్తనను కొంతమేరకైనా పెంచే అవకాశం ఉంది.

13

వర్తమానంలో ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలుగా నిలవాల్సిన ప్రచార ప్రసార మాధ్యమాలు నేడు నైతిక పతనానికి గురయిన సందర్భం మనకళ్ళముందే కనబడుతోంది. గతంలో వార్తల్ని ప్రచురించిన తర్వాత అమ్ముకునేవారు. కానీ వర్తమానంలో వార్తల్ని అమ్ముకున్న తర్వాత ప్రచురిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ వ్యాపారం ఇంకాజోరుగా సాగుతోంది.

కొందరు ప్రచురణ ప్రసార మాధ్యమాల వాళ్ళు ఈ వ్యాపారం కోసం తమకు వార్తలు అందించేవారు, స్ట్రింగర్ల వంటివారిపై విపరీతంగా ఒత్తిడి పెడుతున్నారు. తమకు జీతాలు ఇవ్వడం కుదరదని, తాము సంపాదించుకొని, సంస్థకూ ఆదాయం చేకూర్చాలని ఒత్తిడి పెట్టే ప్రచురణ, ప్రసార మాధ్యమసంస్థలు చాలనే ఉన్నాయి. దీంతో జర్నలిజం కాస్తా ఎర్నలిజంగా మారి, జర్నలిష్టులు కనుమరుగై "ఎర్నలిష్టులు" మాత్రమే మిగిలే పరిస్థితి వచ్చింది. ఈ పెయిడ్ జర్నలిజం పద్ధతిలో ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వార్తల్ని వండి, ఆకట్టుకునే విధంగా ప్రజలకు అందించడం, వ్యాపార ఉత్పత్తుల గొప్పదనాన్ని ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ పొగడడం, ఒక బాబా, స్వామి మహిమలు ప్రచారం చేయడం, ధార్మిక, మతసంస్థ నిర్వర్తించే కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడం వంటివి ఉన్నాయి.

వీటికి విరుగుడుగా, ఎక్కడబడితే అక్కడ తమ సెల్‌ఫోన్లలో చూసుకునే విధంగా అంతర్జాల ఆధారిత ప్రత్యామ్నాయ మాధ్యమాలు అనేకం వచ్చాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటివే కాక, ముఖ్యంగా యూట్యూబ్‌లో వస్తున్న వీడియోలు అనేక అంశాలలో ప్రజలను ప్రభావితం చేసే విధంగా, విస్తృతంగా ప్రజల ముందు పెడుతున్నాయి.



ఎక్కడ ఏ అఘాయిత్యం జరిగినా, బహిరంగంగా పోలీసు, రెవెన్యూ వంటి రాజ్యయంత్రాంగం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినా, వీలున్న చోట్లల్లా సామాన్యులే వాటిని స్మార్ట్ ఫోన్‌లలో వీడియోలు తీసి, తిరుగులేని సాక్ష్యంగా

అందించడం ద్వారా న్యాయం అందేందుకు కొంతైనా దోహదపడడం మనం చూస్తున్నాం. తులసి చందు, మహువా చానల్, ధృవ్‌రాఠీ వంటి అనేక ఛానళ్ళు నిర్భయంగా పనిచేస్తున్నాయి. ప్రజల్ని ప్రభావితం చేసే అంశాలలో చిన్న పత్రికలు కూడా స్థానిక అంశాలపై విస్తృతంగా ప్రజలకు వాస్తవాల్ని అందిస్తున్నాయి.

ప్రజలు - ప్రజాస్వామ్యం

ఇప్పటివరకూ వివిధ ప్రజాస్వామ్య రూపాలు, భారతదేశంలో ప్రజాస్వామ్య పరిణామం, వివిధ రకాల సామాజిక రాజకీయ వ్యవస్థలతో ప్రజాస్వామ్యానికున్న అనులోమ, విలోమ సంబంధాల్ని గురించి చర్చించాం. ఇక ప్రజాస్వామ్యం అంటే సామూహికంగా ప్రజలే అంతిమ నిర్ణేతలు కాబట్టి, ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్ర అన్నిటికంటే ముఖ్యమైనది కాబట్టి, ప్రజాస్వామ్యానికీ, ప్రజలకూ ఉన్న సంబంధాల్ని గురించి వివరించాల్సి వుంది.

సవరించుకోవలసిన అంశాలు ఎన్ని ఉన్నా, వర్తమాన ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా ఇండియాను చెప్పుకోవచ్చు. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలుగా పేర్కొనే అనేక పాశ్చాత్య దేశాల్లో 20వ శతాబ్దం వరకు మహిళలకు ఓటుహక్కు లేదు. స్విట్జర్లాండ్లో 1980 దశకం దాకా స్త్రీలకు ఓటుహక్కు లేదు. ప్రపంచంలోనే మొట్టమొదటి రాజ్యాంగబద్ధ ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థగా చెప్పుకునే అమెరికాలో సైతం, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ , జేమ్స్ బెవెల్ వంటి పౌరహక్కుల ఉద్యమకారుల తీవ్ర ఆందోళనోద్యమాల ఫలితంగా జాతివివక్షలేని 'సార్వత్రిక ఓటు హక్కు' ఆలస్యంగా లభించింది. కానీ లౌకిక, ప్రజాస్వామ్య భావాలున్న జవహర్ లాల్ నెహ్రూ, బాబాసాహెబ్ అంబేద్కర్ల కృషి వల్ల ఇండియాలో 1950 నాటికే, కులం, మతం, ప్రాంతం, ఆస్తి, ఆడ మగ తేడా వంటి సకల వివక్షల్నీ రద్దు చేసి, ప్రపంచంలోనే మొదటిసారిగా సకల జనులకూ ఓటుహక్కు కల్పించారు. ప్రజాస్వామ్యం పట్ల, ఓటుహక్కు పట్ల, సరయిన అవగాహన కల్పించకుండా ఆకస్మికంగా వచ్చిన ఈ పరిమిత హక్కును వినియోగించుకోవడంలో కావలసినంత పరిణతి ఇంకా ఇప్పటికీ పూర్తిగా రాలేదనే చెప్పుకోవచ్చు. ప్రజాస్వామ్యం అంటే "By the People, For the People, Of the People" అని అమెరికా అధ్యక్షుడిగా చేసిన అబ్రహాం లింకన్ నూటయాభై ఏళ్లక్రితం చెప్పాడు. కానీ అదిప్పుడు Buy the People (జనాల్ని కొనడం), Far the People (జనాలకు దూరంగా), Off the People

(జనం లేకుండా) తయారైందని కొందరు మేధావులు భాష్యం చెప్పుకునేట్లుగా తయారైంది. భారత రాజ్యాంగం ప్రజలకు ఆర్థిక సమానత్వాన్ని ఇవ్వకుండా, రాజకీయ సమానత్వాన్ని మాత్రమే ఇచ్చింది. ఈ రాజకీయ హక్కులు అనుభవించాలంటే, వాటి అమలు సాకారం కావాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం, సంపద సమాన పంపిణీ ఉన్నప్పుడే అది సాధ్యమౌతుంది. రాజ్యాంగంలో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేసి, విఫలమైన అంబేద్కర్ రాజ్యాంగాన్ని సమర్పిస్తూ, 1949 నవంబర్‌లో ఇట్లా అన్నాడు....

"రాజకీయంగా ఒక మనిషికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ ఉంటాయి, కానీ మన ఆర్థిక రాజకీయ వ్యవస్థ మూలంగా, ఈ సామాజిక ఆర్థిక జీవనంలో మనం 'ప్రతి ఒక మనిషికి ఒకే విలువ' అన్న సూత్రాన్ని నిరాకరిస్తూనే వుంటాం. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకపోతే, అసమానత, వివక్షలకు గురౌతున్నవారు, ఎంతో శ్రమపడి కట్టుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ఒక్కసారిగా కూలదోస్తారు"

ప్రజాస్వామ్యంలో వ్యక్తి పూజకు ఆస్కారం లేదు. కానీ ఇక్కడ అన్ని సామాజిక వ్యవస్థలలోనూ ఇదే ప్రధాన పాత్ర పోషిస్తూ వుంది. కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ, ప్రధానిగా కానీ, ముఖ్యమంత్రిగా కానీ ఎవరు అధికారంలో ఉంటే వారిపట్ల ఆ పార్టీకి సంబంధించినవారు విధేయతతో, వ్యక్తి ఆరాధనాభావంతో మెలగాల్సిందే. ప్రజాప్రతినిధులతో సహా ఎవరూ స్వంత విచక్షణను ఉపయోగించి విధానాల రూపకల్పన, అమలు వంటి అంశాలపై స్వతంత్రంగా ఒక్కమాట కూడా మాట్లాడే వీలులేదు. శాసనసభలో చేయి ఎత్తడం లేదా ప్రతిపక్షంలో ఉన్నవారిని తిడుతూ, తమ నాయకుడిని పొగడడానికి తప్ప వేరెందుకూ పనికిరానివారుగా తయారయ్యారు. రాజకీయం వ్యాపారంగా తయారయిన వర్తమానంలో, అనేకమంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలో చేసే అక్రమార్జన చర్యల్ని కూడా సాధారణ ప్రజలు మామూలు విషయంగా భావించి, ప్రశ్నించడం మానేసిన స్థితి ఉంది. చట్టసభలో



జైకొట్టే ఎమ్మెల్యేలు తన నియోజకవర్గ పరిధిలో అదే విధంగా జైకొట్టించుకునే పరిస్థితిలో ఉన్నారు. చాలామంది అక్రమార్జనకు పాల్పడుతూ, తమ కులం, పార్టీకి సంబంధించిన విధేయుల పనులు

మాత్రం చక్కబెడుతుంటారు. వీటన్నిటికీ ప్రభుత్వాధికారుల అండదండలు అవసరమవుతాయి. సాధారణంగా అధికారులెవరూ ఎదురు చెప్పరు. ఎవరైనా మాట వినక నిబంధనల ప్రకారం నడుచుకుంటామంటే వారిని బదిలీ చేయించి, విధేయులని తెచ్చిపెట్టుకొనేందుకు మాత్రం పార్టీ అధిష్టానం ఎప్పుడూ ఎమ్మెల్యేలకు అండగా ఉంటోంది. కాలానుగుణంగా ప్రజలు కూడా ఇది సాధారణ అంశంగా చూసే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఇక వివిధ రకాల సామాజిక సంస్థలు, సంఘాల్లో కూడా ఇదేవిధంగా నాయకుడికి జైకొట్టే స్థితి నెలకొని ఉంది. ప్రజాస్వామ్యస్ఫూర్తి ప్రజల్లో కొరవడిందని చెప్పడానికి ఏమాత్రం సందేహించనక్కర్లేదు. కుటుంబ వ్యవస్థ మొదలుకొని అన్నిచోట్లా ఆధిపత్య ధోరణులే రాజ్యమేలుతున్నాయి. జీవశాస్త్ర పరంగా ప్రతిజీవీ ఆధిపత్యం వహించడం, తన జన్యుపర సంతానోత్పత్తిని పెంచుకునే స్వార్థంతోబాటు అవకాశవాదంతో పరిస్థితు లకు అనుగుణంగా మార్పుకు గురవడం జరుగుతోంది. మనిషి కూడా ఇందుకు భిన్నం కాదు. ఐతే, ఇక్కడ మనం చేస్తున్న కృషి మానవజాతికి మాత్రమే పరిమితమైంది. అలా కాకుండా, మానవజాతితో సహజీవనం చేస్తున్న మిగతా జీవులు, (డెంగ్యూ, కోవిడ్ వైరస్‌ల వంటివి తప్ప) వన్యప్రాణులు, వృక్షాలవంటి వాటి పరిరక్షణకు కూడా కృషి చేయాల్సి వుంది. మిగతా జీవుల కంటే మేధోపరంగా ఉన్నత స్థాయిలో ఉన్న మనుషులు సర్వజనాలకు, తమ ముందుతరాల వారికి కూడా ఉపయుక్తమయ్యే విధంగా, ఆర్థికరంగంతో సహా, పర్యావరణం మిగతా జీవుల భద్రత వంటి అన్ని రంగాలలో సమత్వం కోసం చైతన్యవంతమై కృషి చేయాల్సిన అవసరముంది.

పాలనలో ప్రజల భాగస్వామ్యం

పాలనలో ప్రజలు భాగస్వామ్యం వహించడం ద్వారా ప్రభుత్వాన్ని మరింత సమర్థవంతంగా పనిచేసేట్లు చూడవచ్చు. ఇందుకు గ్రామ, మండల, జిల్లాస్థాయి స్థానిక సంస్థలు ప్రజల భాగస్వామ్యానికి పునాదిగా ఉండేవి. ఈ వ్యవస్థలన్నీ పూర్తిగా నిర్వీర్యం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరిపిన వాలంటీర్ వ్యవస్థ అధికార కేంద్రీకరణకు ఉపయుక్తంగా, ప్రజల భాగస్వామ్యానికి తూట్లు పొడిచేదిగా తయారైంది. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, గ్రామసభల్లో జిల్లా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించి కూడా ఏ విషయాన్నయినా చర్చించి తీర్మానించే పద్ధతి రావాలి. దీనివల్ల ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని కిందిస్థాయి వరకూ తేవచ్చు. ప్రజల భాగస్వామ్యం

కావాలంటే వారికి సరయిన సమాచారం అందాలి. ఇందుకై ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు సమాచారహక్కు చట్టాన్ని ఉపయోగించుకొని, తద్వారా పొందిన సమాచారం ప్రాతిపదికన మెరుగైన సూచనలు ఇవ్వవచ్చు. అలాగే విధాన రూపకల్పనకు సంబంధించిన అంశాల గురించి కూడా ప్రజాభిప్రాయాన్ని చెప్పవచ్చు. వివిధ స్థాయిలలో స్థానిక ప్రజలకు ఉపయోగపడే పథకాలు, పనుల నిర్వర్తనను గురించి, అందులోని లోటుపాట్లను గురించి తనిఖీ చేసి సూచనలను అందించే వీలు కల్పించాలి. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నిరంతరం ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే బాధ్యత ఉండాలి. ప్రజాజీవితాల్ని గణనీయంగా ప్రభావితం చేసే ముఖ్యమైన విధాన నిర్ణయాలు, చట్టాలు, ప్రణాళికల వంటి వాటి విషయంలో 'తూతూ మంత్రం'లా కాకుండా ప్రజల సలహాలు, సూచనలు అభిప్రాయాలను ఆహ్వానించడం అవసరం. వీటన్నిటినీ ప్రజలందరికీ అందుబాటులో ఉండేట్లుగా కూడా చూడాలి. ముఖ్యంగా ప్రభావితమయ్యే ప్రాంతాలు, వర్గాల సూచనలను, సలహాలను స్వీకరించి, విశ్లేషించడం ద్వారా వాటిని మరింత మెరుగుపరుచుకోవడానికి, నష్టంచేసే అంశాల్ని తొలగించుకోవడానికీ వివిధ స్థాయిలలోని ప్రభుత్వాలు కృషి చేయాలి. ఇందుకై ప్రజావాణిని వినడంకోసం బహిరంగంగా ప్రజల సమస్యలు వినే వేదికలు, సర్వేలు, ప్రజాభిప్రాయ సేకరణ వంటి మార్గాలు అనుసరించవచ్చు. ఢిల్లీలో 2000 సం॥లో భాగీదారి గ్రూపుల పేరిట ఏర్పడ్డ ఇటువంటి సమూహాలు ఏడెనిమిదేళ్లలో పెద్ద ఉద్యమాలుగా మారి పనిచేస్తున్నాయి. వివిధ ప్రభుత్వ సేవలు పథకాల్ని గురించి బెంగళూరులో సిటిజెన్ రిపోర్ట్‌కార్డ్స్ పేరిట సర్వే నిర్వహించారు. ఇటువంటి సంస్థలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించి ప్రభుత్వాన్ని ఏదో ఒకమేర ప్రభావితం చేస్తున్నాయి.

కొత్త సీసాలో పాత సారా – జంపుజిలానీలదే హవా

వర్తమానంలో నానాటికీ ప్రజల భాగస్వామ్యం నామమాత్రంగా తయారవుతున్న పరిస్థితులు కనబడుతున్నాయి. మన ప్రజాస్వామ్య పార్టీ వ్యవస్థలలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ప్రజలు ఎవర్ని ఎన్నుకున్నా, ఆర్థికబలం, అంగబలంతో స్వార్థ ప్రయోజనాల్ని నెరవేర్చుకునే పార్టీ ఫిరాయింపుదార్ల చేతుల్లోకే అధికారం వెళుతోంది. ప్రతీ నియోజకవర్గం లేదా నగర, పట్టణ స్థాయిలలో మిగతా చిన్నా చితకా పార్టీలతోబాటు, అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రధానంగా ఉంటాయి.

అధికారపార్టీకి సంబంధించినవారు తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, శాసన సభ్యులు గాను, స్థానిక ప్రభుత్వాలు, ఇతర సంస్థల్లో అధికార పదవులు అనుభవించి, తామున్న పార్టీ అధికారం కోల్పోగానే ప్రతిపక్షంగా మారేవారు. దీనికి కొద్దోగొప్పో మినహాయింపు ఉన్నా, క్రమంగా ఈ పద్ధతి పూర్తిగా కనుమరుగైపోయే స్థితి వచ్చింది. నిన్నటిదాకా అధికారపార్టీలో ఉండి, అన్ని భోగాలూ అనుభవించి, తమ పార్టీ ఓడిపోగానే ఒక్క సారిగా గెలిచిన పార్టీలోకి దూకి తిరిగి యథాతథంగా అధికార పదవులు అనుభవిస్తున్నారు. గెలిచి, అధికారంలోకి వచ్చిన పార్టీ కూడా కొత్తగా తమ పార్టీలోకి చేరే ప్రత్యర్థి పార్టీ వారిని కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. నిన్నటి దాకా తిట్టిన పార్టీ అధికారంలోకి రాగానే, వీరుకూడా స్తోత్ర పాఠాలు వల్లిస్తూ నిస్సిగ్గుగా అధికార పార్టీ కండువా కప్పుకుంటున్నారు. కొత్తగా చేరినవారికున్న ఆర్థిక, అంగబలాల్ని బట్టి, వారికి మంత్రిపదవులతోసహా దక్కుతున్నాయి. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండగా తెచ్చిన పార్టీ ఫిరాయింపుల నిషేధచట్టం ఆచరణలో ఉల్లంఘనలకు గురవుతోంది. న్యాయస్థానాలకు ఈ విషయమై అధికారం లేదంటూ, పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవాల్సిన స్పీకర్ రాజకీయ అధినేత ఆదేశాల ప్రకారం ఏ నిర్ణయమూ తీసుకోకుండా సంవత్సరాల తరబడి దాటవేసిన సందర్భాలు కొల్లలుగా కనబడుతున్నాయి. ఈ చట్టం రాజ్యాంగంలోభాగం కాబట్టి, రాజ్యాంగ సమీక్షాధికారాన్ని ఉపయోగించుకొని, స్పీకర్‌కు నిర్దిష్ట గడువు విధించే విధంగా చట్టం చేయమని కేంద్రాన్ని ఆదేశించే అవకాశాన్ని కూడా సర్వోన్నత న్యాయస్థానం వాడుకోలేదు. పార్టీలు మాత్రం తాము అధికారంలో ఉన్నప్పుడు అవసరాలకోసం ప్రత్యర్థుల్ని తమ పార్టీలో చేర్చుకోవడం, తాము ఓడిపోగానే, తమపార్టీనుంచీ 'అధికార పార్టీ కండువా కప్పుకునే వారిని చేర్చుకోవడం అప్రజాస్వామికం' అంటూ నిస్సిగ్గుగా గొంతు చించుకొని అరుస్తుంటారు. అప్పటివరకు ప్రతిపక్షంగా పనిచేసి, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తమకు ఏ విధమైన ప్రాతినిధ్యం లేకుండా పార్టీ ఫిరాయింపుదార్లకు పెద్దపీట వేయడం పార్టీలో పనిచేసినవారికి మింగుడు పడని పరిస్థితి నెలకొని వుంది. ఏదేమైనా ఇక్కడ ప్రజల నిర్ణయాన్ని ఉద్దేశ్యపూర్వకంగా కాలరాచి. ప్రజలు తిరస్కరించినవారిని ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అన్ని పార్టీలూ తమ పార్టీలో చేర్చుకుని పదవులు కట్టబెడుతున్నాయి.

వర్తమాన వ్యవస్థ స్వరూపం

నేటిసామాజిక వ్యవస్థ అనేకమంది కమ్యూనిస్టులు, సామాజిక ఉద్యమ కారులు ఇంకా భావిస్తున్నట్లుగా అర్థ వలస, అర్ధ భూస్వామ్య దేశంగా లేదు. చరిత్రను, చరిత్ర గమనాన్నీ గతితార్కిక భౌతికవాదమనే గొప్ప శాస్త్రీయ తాత్విక దృక్పథంతో కాకుండా, అప్పటి కాలానికి పరిమితమైన చారిత్రిక భౌతికవాద విశ్లేషణకే పరిమితమౌతున్నారు. చారిత్రిక భౌతికవాదాన్ని గురించి మార్క్స్ సూత్రీకరణ ప్రకారం ఆదిమ సమాజం నుంచి భూస్వామ్య సమాజం, దాన్నుంచి పెట్టుబడిదారీ సమాజం, తర్వాత కార్మిక నియంతృత్వం ద్వారా సోషలిష్టు సమాజం నుంచి కమ్యూనిష్టు సమాజం దిశకు, ఒక వరుసక్రమంలో జరిగే పరిణామాల్ని, తర్వాత రాజ్యం అంతమయ్యే స్థితిని గురించి ఊహించాడు. అనంతరకాల పరిణామాల మార్పును అధ్యయనం చేసిన లెనిన్ సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ సమాజపు అత్యున్నత దశగా సూత్రీకరించాడు. అయితే సామ్రాజ్యవాదం లెనిన్ సూత్రీకరించినట్లుగా కూడా పరిణమించలేదు. ప్రపంచవ్యాప్తంగా అనూహ్యమైన మార్పులు నిరంతరం చోటు చేసుకుంటూనే వున్నాయి. కార్మికవర్గం పెరుగుదల స్వభావం అనుకున్నట్లుగా లేదు. కార్మికవర్గ నియంతృత్వ స్థాపనకు అవకాశాలు కనుచూపు మేరలో కనబడడం లేదు. లెనిన్ కాలంలోనే చైనాలో రైతాంగ విప్లవం సాకారమైంది. అనంతర పరిణామాల్లో, కమ్యూనిజం కాదుగదా, కనీసం సామ్యవాద దేశాలుగానైనా రష్యా చైనా, దేశాలు సైతం నిలదొక్కు కోలేకపోయాయి. అవికూడా సామ్రాజ్యవాద స్వభావాన్ని సంతరించుకోవడం కళ్ళకు కనబడుతూనే వుంది. పెట్టుబడిదారీ దేశాలన్నీ ముందుగానే మేల్కొని సంక్షేమరాజ్య భావనను ముందుకుతెచ్చి, ప్రజల మౌలిక అవసరాల వరకూ





తీర్చడం ద్వారా తమ దేశాలలో విప్లవాలు రాకుండా అడ్డుకట్ట వేశాయి. దాదాపు అన్ని సామ్యవాద పార్టీలు, సంస్థలు, వర్తమాన పరిస్థితుల్ని గతితార్కిక భౌతికవాద వెలుగులో విశ్లేషించే ప్రయత్నం చేయకుండా, చాలా వరకూ పాత సిద్ధాంతాల్నే వల్లెవేస్తూ పిడివాదపు చాదస్తులుగా మిగిలిన పరిస్థితులు నెలకొన్నాయి. దీని వల్లనే వర్గాల సమూహాల ఆర్థిక ప్రయోజనా లతో ముడిపడి ఉన్న సమస్యలకు సంబంధించిన వైరుధ్యాలు మతం, ప్రాంతం, కులం వంటి అనేక రూపాల్లో ఆందోళనోద్యమాలుగా రూపం తీసుకుంటు న్నాయి. నిన్నటివరకూ ఉపరితల అంశాలుగా చూసిన కులం, మతం వంటి అంశాలు నేడు ప్రధాన వైరుధ్యాలుగా కళ్ళముందు నిలుస్తున్నాయి. ఈ వేళ ఈ వైరుధ్యాల్ని అర్థం చేసుకొని వాటికి నాయకత్వం వహించి, సరైన దారిలో నడపాల్సిన సామ్యవాద సంస్థలు, పార్టీలు, ధనికస్వాముల చేతుల్లోని కొన్ని ఉద్యమాలకు మద్దతు తెలిపి, పరోక్షంగా వారికి ఉపయోగపడుతున్నారు తప్ప సామ్యవాద గమనం దిశగా సాధించిందేమీ లేకపోగా ప్రజానీకానికి మరింత దూరమౌతున్నారనేది మనకళ్ళముందు కనడుతున్న చరిత్ర.

ఇక ఇక్కడ కొన్ని విప్లవ పార్టీలు ఇంకా అర్ధశతాబ్దానికి పూర్వమున్న నాగేటి చాళ్ళకే పరిమితమయ్యాయి. నిరంతరం సిద్ధాంతాన్నీ ఆచరణనూ సమీక్షించుకుంటూ కొత్తపద్ధతులు, పోరాటరూపాలు అనువర్తించుకునే ఊసే లేకుండా పోయింది.

రోజురోజుకీ కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలకవర్గాలు సమర్ధవంతంగా వాడుకొని ఎందరో త్యాగధనుల జీవితాల్ని ఏమాత్రం విలువ లేకుండా బలి తీసుకుంటున్న వర్తమానంలో కూడా, ఇంకా కొందరు సాయుధ పోరాట మార్గం ద్వారా అర్ధ భూస్వామ్య వ్యవస్థనుంచి విముక్తి అంటూ వల్లె వేస్తున్నారు.

భూమికి విలువ పెరగడం తగ్గలేదు గానీ, దాని వినిమయ స్వభావంలో తీవ్రమార్పు వచ్చింది. వ్యవసాయానికి, తద్వారా కుటుంబ పోషణకు పనికి వచ్చేదిగా చిన్న చిన్న కమతాల స్వభావం నేడు లేదు. చాలావరకూ వ్యాపార స్వభావం వచ్చింది. ఒకనాడు ఇక్కడి ప్రజానీకంలో నూటికి ఎనభైమంది వ్యవసాయం, సంబంధిత వృత్తులలో జీవించేవారు. నేడది ముప్పై శాతానికి పడిపోయింది. ఒకప్పుడు 20 శాతానికి మించని సేవారంగం వాటా 70 శాతం దాటింది. విప్లవోద్యమాల ఫలితంగా పట్టణాలకు వలసవచ్చిన భూస్వాములు ఇక్కడ రియల్టర్లుగా, పారిశ్రామికులుగా కొత్త అవతారాలెత్తి, ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కూడా మరింత బలోపేతమయ్యారు. ఈ ప్రక్రియ తొంబై దశకాల్లో ప్రారంభమై, క్రమంగా కుదురుకుంది. దోపిడి రూపంలోనూ, స్వభావంలోనూ తీవ్రమైన మార్పు వచ్చింది వెట్టి, జీతగాళ్లు, అధిక వడ్డీలు. దండుగలు వంటివన్నీ గత శతాబ్దాంతానికే పూర్తిగా నశించాయి. డెబ్బయ్యో దశకంలో ప్రతీగ్రామంలోనూ అసంఖ్యాకంగా వ్యవసాయ జీతగాళ్లు ఉండేవారు. సాంకేతికాభివృద్ధివల్ల ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జీతగాళ్ళే లేనప్పుడు వారు సమ్మె చేసే అవకాశమే లేదు. ఆకలి చావులున్నాయనే స్థితి ఎక్కడా కనబడడంలేదు. గతంలో తమ వ్యవసాయ ఉత్పత్తుల్ని స్థానికంగా అమ్మక తప్పని పరిస్థితులు ఉండేవి. రోడ్లు, రహదారుల సౌకర్యం పెరుగుదల, రవాణా సాధనాలు, సమాచార సాంకేతికత పెరుగుదలతో మార్కెట్ రంగం వృద్ధి చెందింది. ఫలితంగా తమ ఉత్పత్తుల్ని రైతు మార్కెట్ వరకూ తీసుకెళ్ళే అవకాశం లభించింది. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వచ్చిందంటేనే భూస్వామ్య వ్యవస్థ పతనమైందని అర్థం అవుతుంది. ఒకప్పుడు మహిళలపై హింస తీవ్రంగా ఉండేది. మహిళలు బయట విడిగా తిరిగే పరిస్థితులు చాలా తక్కువ. ప్రస్తుతం ఉన్న ఉచిత ప్రయాణం అవకాశం రాకముందే బస్సుల్లో తిరిగే స్త్రీల శాతం నలబైకి పెరిగింది. ఇప్పుడది మరింత పెరిగింది. అన్ని ఉద్యోగ, ఉత్పాదక, సేవారంగాల్లో స్త్రీలపాత్ర గణనీయంగా పెరిగింది. ఇవన్నీ క్రమానుగత అభివృద్ధిలో భాగంగానూ, ఫ్యూడల్ వ్యవస్థ కనుమారుగు

అవుతోందనడానికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

గతంలో కర్రపెత్తనపు అణచివేతతో ఆధిపత్య రాజకీయాలు నడిచిన స్థానంలో ఇప్పుడు కొనుగోలు రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయమంటే నోట్లుజల్లి ఓట్లు కొనుగోలు చేయడంగా స్థిరీకృతమైంది. కొన్ని చోట్ల ప్రజలు డబ్బు పంచలేదని ఆందోళనకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇది కూడా భూస్వామ్య వ్యవస్థ ఉనికిని కోల్పోయిందని చెప్పడానికి మరో ఉదాహరణ. పెరుగుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, దాదాపు అందరూ బ్యాంక్ ఖాతాదారులుగా మారడం, పండ్లదుకాణం వారితో సహా అందరూ డిజిటల్ లావాదేవీల ద్వారా అమ్మకాలు, కొనుగోళ్లు జరపడం వంటి మార్పులు భూస్వామ్య వ్యవస్థ పతనమైందనడానికి నిదర్శనాలు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు వీటిని నియంత్రించడం జరుగుతోంది. సమాజపు ఉత్పత్తి విధానంలో వచ్చిన మార్పులు అధ్యయనం చేయకుండా పాతపద్ధతుల్లోని రాజకీయపంథా అవలంబించడం నిష్ప్రయోజనమని అర్థమౌతోంది. ప్రజల్ని, 'పోరాడండి! పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్ళు తప్ప' అనేదే చెప్పడం జరిగింది. అయితే చారిత్రిక గమనమనేది చారిత్రిక భౌతికవాదంలో చెప్పిన క్రమానుగత మార్పులకు భిన్నంగా జరిగింది. కమ్యూనిష్టు తాత్విక దృక్పథాన్ని, పోరాట స్వభావాన్నీ అణచివేయడానికి ప్రపంచ వ్యాపితంగా దోపిడీ శక్తులు సంక్షేమరాజ్య నినాదాన్ని ముందుకు తెచ్చాయి. వీటి వలన సమానత్వ భావనకు ఒరిగిందేమీ లేదు. అంతరాలు గణనీయంగానే పెరుగుతూ ఉన్నాయి. ఈ ఉచిత సంక్షేమ కార్యక్రమాలకు పెట్టే ఖర్చు ఆర్థికవ్యవస్థ మొత్తంలో ఐదారు శాతానికి మించదు. దీనివలన దోపిడి శక్తులకు పోయేదేమీలేదు. కూర్చుని నాలుగువేళ్ళూ లోనికిపోయేస్థితి ఉండటంతో ఎవరూ ఉద్యమాల్లోకీ వచ్చే పరిస్థితి లేకుండా చేయగలిగారు. చారిత్రిక భౌతికవాద క్రమానుగత పరిణామంలో ఇవన్నీ ఊహించినవి కావు.

పనికి ఆహార పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలు మార్పు చెందాయి. నగదు బదిలీలు, ఆరోగ్య బీమా, బియ్యం, గోధుమల వంటి ఆహార ఉత్పత్తులు నుంచి కలర్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, సైకిళ్ళు, గాస్ సిలండర్లు, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నారు. ఇవన్నీ మార్కెట్ శక్తుల ఆధిపత్య నియంత్రణలోనే నడుస్తున్నాయి. వీటిపై రాజకీయ పార్టీలు ఒకరిని మించి మరొకరు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉంది. ఇక్కడ ఉచితాలు, సంక్షేమ

పథకాలకు ఉన్న విభజన రేఖ తొలగిపోయింది. ఏదొక పథకం పేరుతో కూటికి లోటు లేకుండా జరిగిపోతున్న వర్తమానం మన కళ్ళముందు కనబడుతోంది. ఈ పరిస్థితుల్లో ఉద్యమాలు, పోరాటాలు, విప్లవ కార్యాచరణకు ఒక్కరు కూడా కదిలే అవకాశం కనబడడంలేదు. ఈ పథకాలు మంచివి కావని అనలేరు గానీ, ప్రజలు తమ శాయశక్తులా సామాజిక ఉత్పత్తిలో పాలుపంచుకోవడం ద్వారా వచ్చే సంపాదనతో, ఆత్మగౌరవంతో జీవించే స్థితినుంచి బిచ్చగాళ్లలా ఉచితాల కోసం అర్రులు సాచే పరిస్థితి కల్పించారు. ఈ పరిస్థితి ప్రజల ఆలోచనను చంపి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చునేలా చేస్తోంది. ఉచిత పథకాల ద్వారా ప్రజానీకానికి నేరుగా సొమ్ము అందించడం వల్ల తమ ఓటుబ్యాంక్ పెరుగుతుందని అధికారంలో ఉన్న పార్టీలు బలంగా నమ్ముతున్నాయి. కానీ ఈ వ్యవహారాన్ని ప్రజలు భిన్నంగా చూస్తున్నారనేది ఇటీవల రెండు తెలుగురాష్ట్రాలలో జరిగిన ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. ఓటు వేయడం ద్వారా ప్రభుత్వాలు మారవచ్చుగానీ, అందువల్ల ఆర్థిక సమానత్వదిశగా గానీ, నిజమైన చట్టసమానత్వ దిశగా గానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, దోపిడీ వ్యవస్థ యథాతథంగా కొనసాగడంలో చిన్నమెత్తు మార్పుకూడా లేదనీ స్పష్టంగా అర్థమౌతొంది. ఓటు వేయడం ఒక్కటే ప్రజాస్వామ్యానికి గుర్తు కాదు. చైతన్యవంతమైన ప్రజలు పాలనలో భాగస్వామ్య వహించాల్సిన అవసరం ఉంది. తద్వారా వ్యవస్థల్లోని దోపిడీ అసంగతత్వాల్ని అర్థం చేసుకునేందుకు అవకాశం దొరుకుతుంది. నిజమైన సామ్యవాద సమాజం కోసం కలలుగనే క్రియాశీలురందరూ నూతన పరిణామాల నేపథ్యంలోంచీ వర్తమాన వ్యవస్థను అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేసి, సరయిన కొత్త పంథా రూపొందించుకునే కృషి జరగకపోతే వ్యవస్థాత్మక మార్పులకు ఏమాత్రం దోహదం చేయలేరు.

ప్రజాస్వామ్య నిఘంటువు

బలమైన పునాదులే బలమైన భవనాన్ని నిలబెట్టగలవు. గత చరిత్ర పునాదులపైనే నేటి వర్తమానం ఆధారపడుతుంది. అయితే ఆ గతాన్ని అందరూ మరచిపోతుంటారు. ఎప్పుడో ఎక్కడో ఒకరు తవ్వితీసి మనకళ్లు తెరిపిస్తుంటారు. అలా తవ్వబట్టే మహోన్నత సింధూనాగరికత వారసులుగా డబ్బాలు కొట్టుకోగలుగుతున్నాం. అశోకుడి శిలాశాసనాలు తవ్వి తీయబట్టే బుద్ధుడిని, బౌద్ధతత్వాన్ని ఇంతగా తెలుసుకోగలుగుతున్నాం.

కేవలం చరిత్రను తెలుసుకుంటే సరిపోదు. చారిత్రక గమనాన్ని, దానికీ వర్తమానానికి ఉన్న లింకును తెలుసుకోవాలి. అలా మనకి చెప్పాలంటే చరిత్రతోపాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భాషా అంశాలు తెలిసిన విశ్లేషకులు కావాలి. సరైన విశ్లేషణ మాత్రమే సరైన దారిని చూపించగలదు. ఒక్కోసారి ఎక్కడెక్కడో పురావస్తు తవ్వకాల్లో దొరికిన ఆధారాలతో చరిత్రను పేర్చి వ్యాఖ్యానిస్తాం. మన కళ్లముందు జరిగిపోయిన అంశాల్ని ఇట్టే మరిచిపోతాం. దేనిని కీలక అంశంగా చూడాలి? దేనిని మామూలు విషయంగా పరిగణించాలి? అన్న విచక్షణ తోడైతేనే చరిత్రను సరైన దారిలో విశ్లేషించగలం. అలా విశ్లేషించగల అతికొద్దిమందిలో అనిసెట్టి శాయికుమార్ ఒకరు.

నాటి ఆదిమానవుడు నేటి ఆధునిక మానవుడిగా సౌకర్యాలతో జీవించడానికి ఎంతటి సాంకేతిక విప్లవం కారణమైందో ఎన్నో పుస్తకాలు వచ్చాయి. కాని, సమూహ జీవనంలో ఒకరి ఆలోచనలను మరొకరు చర్చిస్తూ, సమూహం మొత్తం ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడమనేదే విప్లవాత్మక మార్పు. కండబలాన్ని దాటి మనిషి మేధస్సుకు గుర్తింపును ఇచ్చే స్వేచ్ఛ ఆ ఉమ్మడి నిర్ణయాలనుండే వచ్చింది. అదే ప్రజాస్వామ్యానికి పునాదిగా మారింది. అక్కడి నుండి ప్రజాస్వామ్యం ఎన్ని దశల్లో ఎన్ని రకాలుగా రూపాంతరం చెందుతూ నేటి దశకు చేరిందో తెలియాలంటే మీరు ఈ పుస్తకాన్ని మళ్లీ మళ్లీ చదవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్య భావన ఆవిర్భావం నుండి నేటి వరకు పూర్తి ప్రస్థానాన్ని పూసగుచ్చినట్టు చక్కగా అందించారు రచయిత. ఈ శీర్షికలతో ఈ అంశాన్ని ఇన్ని కోణాల్లో విశ్లేషించిన పుస్తకం మరొకటి లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

జీవం పుట్టుక దగ్గర నుండి మొదలై, గుంపు జీవనం, సమాజాల ఆవిర్భావం, రాజరికాలు, రాజ్యాలు, పాలనలు, పోరాటాలు, సమానత్వ భావనలు, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పోరాటాలు.... ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పోరాటాలు, అవి భారతదేశంపై ఎలా ప్రతిఫలించాయి. ఇక్కడ స్థానికంగా ఉన్న ప్రత్యేక పరిస్థితులు,

కులం, మతం, భాష, అవినీతి, ఎన్నికలు... ఇలా ప్రజాస్వామ్యానికి అనుసంధానమైన ప్రతి పోగును కలిపి సంపూర్ణ ప్రజాస్వామ్య ప్రస్థానాన్ని అందించారు రచయిత.

ఇవన్నీ 'స్వేచ్ఛాలోచన' మాసపత్రికలో వ్యాసాలుగా ఇదే వరుస క్రమంలో వెలువడ్డాయి. పాఠకుల కోరిక మేరకు వీటిని ఒక పుస్తకంగా తీసుకు రావడం జరిగింది. ప్రజాస్వామ్య ప్రియులకు, సామాజిక ఉద్యమకారులకు ఇది ఒక చక్కటి రిఫరెన్స్ బుక్.

ఒరిజినాలిటీతో కూడిన రచయిత విశ్లేషణ చాలా విషయాల్లో మన కళ్లు తెరిపిస్తుంది. కొన్నిసార్లు మన వీపుమీద కొరడాతో ఒక్కచరుపు చరిచి నిద్రనుండి మేల్కొలిపినట్లు, ఇప్పటి వరకు గుడ్డిగా మనం వల్లెవేస్తున్న కాలంచెల్లిన పదాలు, భావనలను తెలుసుకోమని హెచ్చరించారు. ఈ మాటలు రాయాలంటే గుండెధైర్యం కావాలి, ఆలోచన ఉండాలి, సైద్ధాంతిక అవగాహన కావాలి, అనుభవ జ్ఞానం కావాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్నాయి కాబట్టే అనిసెట్టి శాయికుమార్ గారు ఈ పుస్తకాన్ని రాయగలిగారు. ఇంకో విషయం చెప్పాలంటే తెలుగునేల మీద జరిగిన ఎన్నో రకాల సాంఘిక, ఆర్థిక పరిణామాల కీలక మలుపుల్లో కరపత్ర రచయితగానో, సిద్ధాంత చర్చలోనో, అనువాదాలు చేయడంలోనో, ఏదో ఒక స్థానంలో నాలుగు దశాబ్దాలుగా ఆయన కృషి చేశాడు. సీనియర్ ఉద్యమ నాయకుల్ని ఎవర్ని కదిలించినా అనిసెట్టి శాయికుమార్ నిజాయితీ, నిబద్ధతలను చెబుతారు. చరిత్రని, పోరాటాల్ని, ఇంత పక్కాగా, ఎటువంటి పక్షపాతి ధోరణి లేకుండా రాయగలగడం మరొకరికి సాధ్యం కాదేమో!

ఈ 13 అధ్యాయాలు చదివిన తరువాత మీకు– “ఈనాడు మనం ఇంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నామంటే మన ముందుతరాలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతగా కృషి చేశారో!” అని అనిపించక మానదు.

భాష, భావం, చారిత్రక ఆధారాలు, నిష్పాక్షిక ధోరణి, పరిపక్వ ఆలోచనలు నిండిన రచయిత కలం నుండి వెలువడిన ఈ రచన తప్పక మేధోజీవులను ఆలోచింప చేస్తుందని, తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. రచయిత అనిశెట్టి శాయికుమార్ కలం నుండి ఇలాంటి మరెన్నో రచనలు వెలువడాలని కోరుకుంటున్నాను.

– డి. హనుమంతరావు,

అసోసియేట్ ఎడిటర్, స్వేచ్ఛాలోచన మాసపత్రిక